గురువారం 24-8-2023


సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 14+4 వెల: ₹ 5.50

సంపుటి: 16
సంచిక: 154



'గ్రామాల్లో సంపద పెరగాలి. పెరిగిన సంపద గ్రామీణ ప్రజలకే చెందాలి'

అర్హులై ఉండి ఏ కారణం చేతనైనా లబ్ధి అందని వారికి మరో అవకాశం కూడా ఇచ్చి మరీ అందిస్తున్న లబ్ధి..



..డిసెంబర్, 2022 నుండి జూలై, 2023 వరకు అమలైన వివిధ సంక్షేమ పథకాలకు సంబంధించి ఏ కారణంచేతైనా లబ్ధి అందని 2,62,169 మంది అర్హులకు రూ. 216.34 కోట్లను నేడు బటన్ నొక్కి వారి ఖాతాల్లో జమ చేయనున్న గౌరవ ముఖ్యమంత్రి శ్రీ. వై. ఎస్. జగన్ మోహన్ రెడ్డి..

SIMULTANEOUSLY PRINTED AT VIJAYAWADA | CHENNAI | DELHI | BANGALORE | HYDERABAD | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL

అర్హత ఉన్న ప్రతి ఒక్కరికి సంక్షేమ ఫలాలు అందాలన్న కృత నిశ్చయం!
అర్హులై ఉన్న ఎవరూ ఏ కారణం చేతనైనా లబ్ధి అందకుండా ఉండిపోరాదన్న ధృడ సంకల్పం !!

అర్హులై ఉండి ఏ కారణం చేతనైనా లబ్ధి అందని వారికి మరో అవకాశం కూడా ఇచ్చి మరీ అందిస్తున్న లబ్ధి..

..ఇలా ఏటా రెండు పర్యాయాలు



..డిసెంబర్, 2022 నుండి జూలై, 2023 వరకు అమలైన వివిధ సంక్షేమ పథకాలకు సంబంధించి ఏ కారణంచేతైనా లబ్ధి అందని **2,62,169** మంది అర్హులకు రూ. **216.34** కోట్లను నేడు బటన్ నొక్కి వారి ఖాతాల్లో జమ చేయనున్న గౌరవ ముఖ్యమంత్రి శ్రీ. వై. ఎస్. జగన్ మోహన్ రెడ్డి..



అర్హులై ఉండి సంక్షేమ పథకాల లబ్ధి అందని వారు, ఆయా పథకాల లబ్ధి అందించిన నెలలోపు గ్రామ/వార్డు సచివాలయాల్లో దరఖాస్తు చేసుకోవాలి.. వెరిఫికేషన్ అనంతరం ఆరు నెలలకోసారి ఆ ఆరు నెలల్లో అమలు చేసిన సంక్షేమ పథకాలకు అలా అర్హులై ఉండి ఏ కారణంచేతనైనా లబ్ధి అందని వారికి కూడా లబ్ధి అందిస్తున్న జగనన్న ప్రభుత్వం..



ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి
శ్రీ. వై.ఎస్. జగన్ మోహన్ రెడ్డి

దేశంలో ఎక్కడా లేని విధంగా - సోషల్ ఆడిట్ కోసం గ్రామ/వార్డు సచివాలయాల్లో లబ్ధిదారుల జాబితాలు ప్రదర్శించి, పారదర్శకతతో లంచాలకు, కుల, మత, వర్గ, పార్టీల వివక్షకు తావులేకుండా, అర్హులందరికీ నూటికి నూరు శాతం సంతృప్త స్థాయిలో పథకాల లబ్ధి అందిస్తున్న ఏకైక ప్రభుత్వం మనదే..

నేడు అందిస్తున్న లబ్ధితో కలిపి పథకం అమలు తేదీ (డిసెంబర్, 2021) నుండి ఇప్పటి వరకూ 4 పర్యాయాల్లో అర్హులై ఉండి ఏ కారణం చేతనైనా లబ్ధి పొందని వారికి అందించిన మొత్తం లబ్ధి రూ. **1,647** కోట్లు...

ఏ కారణం చేతనైనా సంక్షేమ పథకాల లబ్ధి అందుకోలేకపోయిన అర్హులకు జగనన్న ప్రభుత్వం నేడు అందిస్తున్న నగదు లబ్ధి వివరాలు..

పథకం పేరు	లబ్ధిదారుల సంఖ్య	అందిస్తున్న నగదు లబ్ధి (రూ. లలో)
జగనన్న చేదోడు	43,131	43,13,10,000
వైఎస్సార్ ఈబీసీ నేస్తం	8,753	13,12,95,000
వైఎస్సార్ నేతన్న నేస్తం	267	64,08,000
వైఎస్సార్ మత్స్యకార భరోసా	207	20,70,000
జగనన్న అమ్మ ఒడి	14,836	22,25,40,000
జగనన్న విద్యా దీవెన	32,770	26,66,00,000
జగనన్న వసతి దీవెన	36,898	32,13,00,000
వైఎస్సార్ సున్నా వడ్డీ పంటరుణాలు మరియు ఇన్‌పుట్ సబ్సిడీ	1,08,590	42,16,94,000
వైఎస్సార్ ఆసరా	16,717	36,01,56,051
మొత్తం	2,62,169	216,33,73,051

జగనన్న సురక్ష

జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా ప్రతి ఇంటిని జల్లెడపట్టి అవసరమైన వారికి **94,62,184** సర్టిఫికెట్ల జారీతో పాటు కొత్తగా మరో **12,405** మంది లబ్ధిదారులను గుర్తించి వారికి కూడా నేడు లబ్ధి అందిస్తున్న జగనన్న ప్రభుత్వం..

జగనన్నకు చెబుదాం 1902

జగనన్నకు చెబుదాం కార్యక్రమం ద్వారా స్వీకరించిన అర్జీలను పరిశీలించడం ద్వారా కొత్తగా అర్హులైన **1,630** మందికి కూడా వివిధ పథకాల ద్వారా నేడు లబ్ధి అందిస్తున్న జగనన్న ప్రభుత్వం.

వీటితోపాటు క్రొత్తగా (డిసెంబర్ 2022 - జూలై 2023 వరకు) అర్హులైన మరో **1,49,875** మందికి పెన్షన్లు, **4,327** మందికి ఆరోగ్యశ్రీ కార్డులు, **2,00,312** మందికి రేషన్ కార్డులు, **12,069** మందికి ఇళ్ల పట్టాలను కూడా నేడు అందిస్తున్న జగనన్న ప్రభుత్వం..

జగనన్న ప్రభుత్వం అధికారం లోకి వచ్చిన **50** నెలల్లోనే వివిధ సంక్షేమ పథకాల ద్వారా లంచాలకు, వివక్షకు తావు లేకుండా లబ్ధిదారులకు నేరుగా (DBT రూపంలో) అందించిన ఆర్థిక సాయం అక్షరాలా రూ. **2.33** లక్షల కోట్లు..

సంక్షేమ పథకాల అమలులో తేడా గమనించండి..!!

గతంలో ..

- జన్మభూమి కమిటీలు, అస్మదీయులకు మాత్రమే సంక్షేమ ఫలాలు.. పథకాల అమలులో లంచాలు, వివక్ష. వీలైనంత మందికి లబ్ధి ఎలా ఎగ్గొట్టాలా అన్న కుతంత్రాలు.. గ్రామానికి ఇంతమందికే లబ్ధి అనే కోటాలు, కోతలు.. ఎవరైనా చనిపోతేనే కొత్త వారికి అవకాశం..
- తమ వర్గం, తమ పార్టీ, తమ వారికే లబ్ధి.. పైగా లంచాలు తీసుకుని అందించే పక్షపాత జన్మభూమి కమిటీలు.. ఇచ్చిందే అరకొర లబ్ధి.. అందులో సగానికి సగం జన్మభూమి కమిటీల లంచాలకే సరి.. పెన్షన్ కావాలన్నా, ఇళ్లు కావాలన్నా, సబ్సిడీలు కావాలన్నా, బీమా కావాలన్నా, రైతుకు ట్రాక్టర్ ఇవ్వాలన్నా, చివరకు మరుగు దొడ్లు కావాలన్నా లంచాలే..
- అసలు ఇన్ని పథకాలు లేవు, ఆ ఉన్న అరకొరలో కూడా లబ్ధిదారుల ఎంపికలో కాలయాపన, పథకాల లబ్ధిని ఎప్పుడు అందిస్తారో, ఎంత అందిస్తారో తెలియని అనిశ్చితి..
- సంక్షేమ పథకాల లబ్ధి కోసం ఆత్మాభిమానాన్ని చంపుకుని వృద్ధులు, దివ్యాంగులు, అక్కచెల్లెమ్మలు కాళ్లరిగేలా జన్మభూమి కమిటీల చుట్టూ తిరిగి మోకరిల్లాల్సిన దీనస్థితి.. వృద్ధులు, వికలాంగులు అన్న కనికరం కూడా లేకుండా వారి పెన్షన్లలో సైతం వాటా కొట్టేసిన వైనం..

మరి మన జగనన్న ప్రభుత్వంలో..

- నేడు కుల, మత, వర్గ, పార్టీలకు అతీతంగా.. లంచాలు, వివక్ష, ఆశ్రిత పక్షపాతానికి తావు లేకుండా, అర్హులందరికీ సంతృప్త స్థాయిలో సంక్షేమ పథకాలు.. అర్హులై ఉండి ఒకవేళ ఏ కారణం చేతనైనా సంక్షేమ పథకాల లబ్ధి అందని వారికి మరో అవకాశాన్ని కూడా ఇస్తూ, ప్రతి ఏటా రెండు పర్యాయాలలో లబ్ధి అందజేత..
- సంక్షేమ పథకాల లబ్ధి కోసం మధ్య దళారీలు, పైరవీకారుల చుట్టూ తిరగాల్సిన అవసరం లేదు.. ఎవరికీ లంచాలు ఇవ్వాల్సిన పనిలేకుండా గ్రామ/వార్డు సచివాలయాల్లో లబ్ధిదారుల జాబితాలు ప్రదర్శించి మరీ, సోషల్ ఆడిట్ ద్వారా పారదర్శకంగా లబ్ధిదారుల ఎంపిక.. నేరుగా లబ్ధిదారుల ఖాతాలకు నగదు జమ..
- సంక్షేమ క్యాలెండర్‌ను ముందుగానే ప్రకటించి, నిర్దిష్ట సమయంలోనే ఠంచన్‌గా లబ్ధి పంపిణీ..
- వాలంటీర్, సచివాలయ సిబ్బంది సేవలు..! తమ పరిధిలోని అవ్వాతాతలు, అన్నదమ్ములు, అక్కచెల్లెమ్మలకు చేదోడు వాదోడుగా ఉంటూ.. లబ్ధిదారుల ఆత్మాభిమానం నిలబడేలా సేవలు..!!

డా॥ ఆదిమూలపు సురేష్, పురపాలక, పట్టణాభివృద్ధి శాఖామాత్యులు


శ్రీ. బూడి ముత్యాల నాయుడు, ఉప ముఖ్యమంత్రి, పంచాయితీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖామాత్యులు

గమనిక: రాష్ట్ర ముఖ్యమంత్రి శ్రీ. వై.ఎస్. జగన్ మోహన్ రెడ్డి "అర్హులై ఉండి లబ్ధి అందని వారికి అందిస్తున్న లబ్ధి"ని 24 ఆగష్టు, 2023 ఉదయం 11 గంటలకు సీఎం క్యాంపు కార్యాలయంలో బటన్ నొక్కి లబ్ధిదారుల ఖాతాల్లో జమ చేస్తారు. ఈ కార్యక్రమాన్ని అన్ని ప్రముఖ న్యూస్ ఛానెళ్లలో లైవ్ లో వీక్షించవచ్చు.

జారీచేసినవారు: కమిషనర్, సమాచార, పౌర సంబంధాల శాఖ, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం


PAN BAHAR
ఇస్రో చేసి నిరూపించింది
చందమామపై భారత చంద్రయాన్‌ను చేర్చింది
దేశ శాస్త్రజ్ఞులు భారతదేశం
సగర్వంగా తలెత్తుకునేలా చేసారు
NEW PACK
PAN BAHAR
THE HERITAGE
ELAICHI
NEW PACK
PAN BAHAR
THE HERITAGE
ELAICHI
This contains sodium saccharin (INS 954), sucralose (INS 955) and Neotame (INS 961)
Not recommended for children. No sugar added in the product.
CONTAINS ARTIFICIAL SWEETENER AND FOR CALORIE CONSCIOUS
PAN BAHAR
THE HERITAGE ELAICHI
PEHCHAN KAMYABI KI
Toll Free No.: 1800 257 2258

సత్యమేవ జయతే
సాక్షి
సంపుటి: 16
సంచిక: 154
పేజీలు: 14+4 వెల: ₹ 5.50
గురువారం 24-8-2023
SIMULTANEOUSLY PRINTED AT VIJAYAWADA | CHENNAI | DELHI | BANGALORE | HYDERABAD | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLIGUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL


'ప్రతిభకు పేదరికం అడ్డు కాకూడదు. పేదింట్లో పుట్టిన ప్రతి ప్రతిభావం తుదు ఉన్నత చదువులు చదవాలి.'


" బ్రిక్స్ సదస్సు కోసం నేను దక్షిణాఫ్రికాలో ఉన్నా.. నా మనసు, ఆత్మ భారత్‌లోనే ఉన్నాయి.ఇప్పుడు చంద్రుడిపై భారత్ అడుగు పెట్టింది. భూగోళంపై మనం తీసుకున్న సంకల్పం చందమామపై నెరవేరింది. అమృతకాలంలో ఇది మొదటి విజయం."

భూమిపై సంకల్పం.. జాబిల్లిపై సాకారం

- 6లో

ఉత్కంఠ: కోల్‌కతాలో ఆసక్తిగా తిలకిస్తున్న విద్యార్థులు



ఉత్సాహం: ఇస్రోలో సైంటిస్టుల విజయోత్సాహం



సంబరం: లక్నోలో విద్యార్థుల ఆనందం



చంద్రుడి గుట్టు తెలుసుకునేలా..

- వివరాలు 7లో

భారతీయుల మేనమామ.. మన చందమామ.. చిన్నప్పుడు చందమామ కావాలని బాలరాముడు మారాం చేస్తే.. అందిరాని చందమామను అద్దంలో చూపించి ఊరుకోబెట్టిందట తల్లి. ఇక, అన్నమయ్య.. 'చందమామ రావే.. జాబిల్లి రావే..' అంటూ ఆలపించినా నెలరాజు దిగిరాలేదు. చివరకు ఇస్రో 'విక్రమ' యత్నంతో.. భారత్ విజయవంతంగా నెలరేడుపై అడుగుపెట్టింది.

రష్యా ల్యాండర్ లూనా–25 విఫలమైన చోటే భారత్ విజయపతాక ఎగురవేసింది. భూమి నుంచి చంద్రుడి దిశగా 41 రోజులపాటు సాగించిన తన ప్రయాణాన్ని చంద్రయాన్–3 మిషన్ ఘనంగా ముగించింది. ఈ ప్రయోగంలో అంతర్భాగమైన ల్యాండర్ మాడ్యూల్ 'విక్రమ్' బుధవారం సాయంత్రం 6.04 గంటలకు చందమామను సున్నితంగా ముద్దాడింది. ల్యాండింగ్ పూర్తయిన 4 గంటల అనంతరం రోవర్ 'ప్రజ్ఞాన్' ఆరు చక్రాల సాయంతో ల్యాండర్ నుంచి సురక్షితంగా బయటకు అడుగుపెట్టి.. తన కార్యాచరణ ప్రారంభించింది. ఇది రెండు వారాల పాటు జాబిల్లి ఉపరితలంపై సంచరిస్తూ విలువైన సమాచారాన్ని భూమిపైకి చేరవేయనుంది.

ముచ్చెన్నెల చంద్రహాసం 6 లో



దొరికాడు నెలరేడు



అంతరిక్ష ప్రయోగాల్లో చరిత్ర సృష్టించిన భారత్ ప్రతిష్టాత్మక చంద్రయాన్-3 మిషన్ ఘన విజయం

- సాయంత్రం 6.04 గంటలకు జాబిల్లిపై దిగిన ల్యాండర్..
- రాత్రి 10.04 సమయంలో ల్యాండర్ నుంచి బయటకు వచ్చిన రోవర్ 'ప్రజ్ఞాన్'
- చంద్రుడి దక్షిణధ్రువంపై అడుగుపెట్టిన మొదటి దేశంగా భారత్ రికార్డు
- చందమామపై ల్యాండర్‌ను భద్రంగా దించిన నాలుగో దేశంగా ఘనత
- దేశ ప్రజల్లో ఆనందోత్సాహాలు..
- ఇస్రో శాస్త్రవేత్తలపై ప్రశంసల జల్లు

చంద్రయాన్-3 తరువాత? 7 లో



ప్రయాణం సాగిందిలా ..

2008లో మొట్టమొదటి మిషన్ చంద్రయాన్-1 నుంచి చంద్రయాన్-3 వరకు ఇస్రో ప్రయాణంపై కథనం

6 లో

ఈ విజయం వెనుక ఎందరెందరో...



ఇక అంగారకుడిపైకి అడుగు!

ఇస్రో ఛైర్మన్ సోమనాథ్ వెల్లడి

- భవిష్యత్తులో శుక్రుడితోపాటు ఇతర గ్రహాలపైకీ వెళ్తాం
- చంద్రయాన్-3 విజయం ఎంతో స్ఫూర్తినిచ్చింది
- దీనికోసం ఎంతగానో శ్రమించాం.. శాస్త్రవేత్తల కృషి ఫలించింది
- ఇది పూర్తిగా మేడిన్ ఇండియా మిషన్

6 లో



గర్జించిన సింహాలు

జాబిల్లిపై మన జాతీయ చిహ్నం 6 లో

చంద్రుని ఉపరితలంపై విక్రమ్ ల్యాండర్ దిగిన ప్రదేశం

రష్యాలో విమాన ప్రమాదం..

వాగ్నర్ చీఫ్ ప్రిగోజిన్ మృతి?



- రష్యాలో బుధవారం జరిగిన ఘోర విమాన ప్రమాదంలో 10 మంది దుర్మరణం పాలయ్యారు. రష్యాపై తిరుగుబాటు చేసిన కిరాయి సైనిక ముఠా వాగ్నర్ గ్రూప్ చీఫ్ ప్రిగోజిన్ కూడా వారిలో ఉన్నట్టు అనుమానిస్తున్నారు. ప్రయాణికుల జాబితాలో ఆయన పేరు ఉన్నట్టు అధికారులు ధ్రువీకరించారు. అయితే ప్రిగోజిన్ విమానం ఎక్కిందీ లేనిదీ తెలడం లేదు.

- వివరాలు 7లో

విజేత తేలేది టై బ్రేక్స్‌లోనే



- ప్రపంచకప్ చెస్ టోర్నీలో చాంపియన్ ఎవరో టైబ్రేక్స్ ద్వారా తేలనుంది. భారత యువ గ్రాండ్‌మాస్టర్ ప్రజ్ఞానంద, వరల్డ్ నంబర్‌వన్ కార్ల్‌సన్ మధ్య ఫైనల్లో రెండో గేమ్ 30 ఎత్తుల్లో 'డ్రా'గా ముగిసింది.

- వివరాలు 10లో


ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సమక్షంలో ఒప్పంద పత్రాలతో ఎన్‌హెచ్‌పీసీ ప్రతినిధులు, ఏపీజెన్‌కో అధికారులు

'పవర్' ఫుల్

పునరుత్పాదక ఇంధన రంగంలో 3 కీలక ప్రాజెక్టులు

నంద్యాల జిల్లాలో రూ.25,850 కోట్లతో ఏర్పాటు

- సోలార్, విండ్ ప్రాజెక్టులకు సీఎం జగన్ భూమి పూజ
- యాగంటి, కమలపాడులో రెండు పంప్డ్ స్టోరేజీ ప్రాజెక్టులు..
- ముఖ్యమంత్రి సమక్షంలో ఏపీజెన్‌కో, ఎన్‌హెచ్‌పీసీ మధ్య కుదిరిన ఒప్పందం
- గ్రీన్ హైడ్రోజన్ రంగంలో పెట్టుబడుల అవకాశాలపై శ్వేతపత్రం విడుదల
- కార్యరూపం దాల్చుతున్న విశాఖ గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్ ఒప్పందాలు

2 లో

3 ప్రాజెక్టులకు శంకుస్థాపన.. విశాఖ ఒప్పందాలు సాకారం

- రూ.10,350 కోట్ల పెట్టుబడి, 2,300 మెగావాట్ల సామర్థ్యంతో గ్రీన్‌కో కంపెనీ నిర్మించే సౌర విద్యుత్ ప్రాజెక్టుకు సీఎం జగన్ శంకుస్థాపన. దీనిద్వారా 2,300 మందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు.
- 1,014 మెగావాట్లతో ఆర్సెలర్ మిట్టల్ గ్రీన్ ఎనర్జీ కంపెనీ నిర్మించే ప్రాజెక్టుకు శంకుస్థాపన. ఇందులో 700 మెగావాట్లు సోలార్ పవర్ కాగా 314 మెగావాట్లు విండ్ పవర్ ఉత్పత్తి. రూ.4,500 కోట్ల పెట్టుబడితో 1,000 మందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు.
- ఎకోరన్ ఎనర్జీ 2 వేల మెగావాట్ల (1,000 మె.వా. సోలార్, 1,000 మె.వా. విండ్ పవర్) సామర్థ్యంతో నిర్మించనున్న ప్రాజెక్టుకు శంకుస్థాపన. దాదాపు రూ.11 వేల కోట్ల పెట్టుబడితో 2 వేల మందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు.

పంప్డ్ స్టోరేజీ ప్రాజెక్టులు.. ఎన్‌హెచ్‌పీసీతో ఒప్పందం

- 2 వేల మెగావాట్ల సామర్థ్యంతో పంప్డ్ స్టోరేజీ విద్యుదుత్పత్తి ప్రాజెక్టులకు సంబంధించి ఎన్‌హెచ్‌పీసీతో ఒప్పందం. రూ.10 వేల కోట్ల పెట్టుబడులతో యాగంటి, కమలపాడులో ఏర్పాటయ్యే ఈ ప్రాజెక్టుల వల్ల 2 వేల మందికి ఉద్యోగాల కల్పన.
- వీటితో పాటు ఎన్‌హెచ్‌పీసీతో మరో మూడు ప్రాజెక్టుల ఫీజిబిలిటీపై రాష్ట్ర ప్రభుత్వం అధ్యయనం. మరో 2,750 మెగావాట్లకు సంబంధించిన ఈ ప్రాజెక్టులపై కలసి పని చేసేలా అడుగులు.

అర్హులు ఒక్కరూ మిగిలిపోకూడదని..

- మిగిలిపోయిన వివిధ పథకాల అర్హులకు నేడు లబ్ధి

- 2,62,169 మంది ఖాతాల్లోకి రూ.216.34 కోట్లు
- నేడు బటన్ నొక్కి జమ చేయనున్న సీఎం జగన్
- కొత్తగా 1,49,875 మందికి పెన్షన్లు
- 12,069 మందికి ఇళ్ల పట్టాలు

2లో

'బెంగాల్ రామోజీ' బిశ్వప్రియ గిరి అరెస్టు

చిట్‌ఫండ్స్ మోసాల కేసులో అరెస్టు చేసిన ఈడీ

- సొంత సంస్థల్లోకి అక్రమంగా రూ.200 కోట్ల పెట్టుబడులు
- చందాదారుల డబ్బులను అక్రమంగా తరలించిన వైనం
- అదే తరహాలో అంతకంటే భారీ మోసానికి పాల్పడిన రామోజీ
- ఈడీకి ఇప్పటికే ఆధారాలతో సహా నివేదించిన సీఐడీ
- మార్గదర్శి కేసులో తదుపరి పరిణామాలపై సర్వత్రా ఆసక్తి



సాక్షి, అమరావతి: మార్గదర్శి తరహాలో పశ్చిమ బెంగాల్‌లో చిట్‌ఫండ్ కుంభకోణానికి పాల్పడిన 'యూఆర్‌వో చిట్‌ఫండ్స్'పై ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ కొరడా ఝుళిపించింది. రామోజీరావు మాదిరిగానే చందాదారుల నిధులను మళ్లించిన యూఆర్‌వో చిట్‌ఫండ్స్ డైరెక్టర్ బిశ్వప్రియ గిరిని ఈడీ అధికారులు అరెస్టు చేశారు. చందాదారుల డబ్బులను తమకు చెందిన వివిధ వ్యాపార సంస్థలకు మళ్లించిన కేసులో ఆయన్ను అరెస్టు చేసి

మిగతా 3వ పేజీలో ▶

చంద్రబాబు, లోకేశ్ మానసిక రోగులు



- టీడీపీ తెలుగు బూతుల పార్టీగా మారింది
- బూతుల సభకు రూ. 20 కోట్లా?
- లోకేశ్‌కు గుడివాడలో పోటీ చేసి గెలిచే దమ్ముందా?
- లోకేశ్ శుంఠన్నర కాబట్టే బాబు సినిమా స్టార్ వైపు చూస్తున్నాడు
- నానిని చూస్తే బాబు ప్యాంట్ ఎందుకు తడిసిపోతుంది?
- టీడీపీలో ఉన్నప్పుడూ వంశీ పశువుల డాక్టరేగా!
- మాజీ మంత్రి పేర్ని నాని

- వివరాలు 3లో

ప్రముఖ గణిత శాస్త్రవేత్త డాక్టర్ సీఆర్ రావు కన్నుమూత



అనారోగ్యంతో అమెరికాలో తుదిశ్వాస

- గణిత శాస్త్రంలో నోబెల్‌కు సమానమైన అవార్డును అందుకున్న సీఆర్ రావు
- పద్మభూషణ్, పద్మవిభూషణ్‌తో సత్కరించిన భారత ప్రభుత్వం
- ఆంధ్రప్రదేశ్‌తో ఆయనది ప్రత్యేకమైన అనుబంధం

5 లో

క్లుప్తంగా...

టంగుటూరి సేవలు చిరస్మరణీయం

ప్రకాశం పంతులుకు సీఎం జగన్ ఘననివాళి



టంగుటూరి చిత్రపటానికి నమస్కరిస్తున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి

సాక్షి,అమరావతి: స్వాతంత్య్ర సమరయోధుడు, ఆంధ్రరాష్ట్ర తొలి ముఖ్యమంత్రి, ఆంధ్ర కేసరి టంగుటూరి ప్రకాశం పంతులు జయంతి సందర్భంగా సీఎం వైఎస్ జగన్ నివాళులర్పించారు. తాడేపల్లిలోని సీఎం క్యాంప్ కార్యాలయంలో టంగుటూరి చిత్రపటానికి సీఎం పూలమాల వేశారు. మంత్రులు పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, జోగి రమేష్, ప్రభుత్వ విప్ చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి పాల్గొన్నారు.

టంగుటూరి సేవలు చిరస్మరణీయం

స్వాతంత్య్ర సమరయోధుడిగా, ఆంధ్రరాష్ట్ర తొలి ముఖ్యమంత్రిగా టంగుటూరి ప్రకాశం పంతులు రాష్ట్రానికి, దేశానికి అందించిన సేవలు చిరస్మరణీయమని సీఎం జగన్ పేర్కొన్నారు. 'ప్రత్యేకాంధ్ర రాష్ట్ర సాధనలో ఆయన పాత్ర కీలకం. తన జీవితాన్ని ప్రజాసేవకు అంకితం చేసిన మహనీయుడు ప్రకాశం పంతులు జయంతి సందర్భంగా నివాళులు' అంటూ సీఎం బుధవారం ట్వీట్ చేశారు.

వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో ఘనంగా టంగుటూరి జయంతి

గుంటూరు జిల్లా తాడేపల్లిలోని వైఎస్సార్ సీపీ కేంద్ర కార్యాలయంలో కూడా ప్రకాశం పంతులు జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఎమ్మెల్యే మల్లాది విష్ణు, ఎమ్మెల్సీలు లేళ్ల అప్పిరెడ్డి, డొక్కా మాణిక్య వరప్రసాద్ తదితరులు పాల్గొని ప్రకాశం పంతులు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

రేపు, ఎల్లుండి సిటిజన్ ఔట్ రీచ్

సచివాలయాల ఉద్యోగులు, వలంటీర్లు ఇంటింటికీ వెళ్లి సమస్యలపై ఆరా

సాక్షి, అమరావతి: గ్రామ/వార్డు సచివాలయాల ద్వారా ప్రజలకు ప్రభుత్వ కార్యక్రమాలను చేపట్టిన తీరు అందరికీ వివరించడంతోపాటు ఎప్పటికప్పుడు ప్రజా సమస్యలు స్వయంగా వాకబు చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం మరో విడత ఈ నెల 25,26 తేదీల్లో సిటిజన్ ఔట్ రీచ్ కార్యక్రమాన్ని చేపట్టనుంది. గ్రామ/వార్డు సచివాలయాల వారీగా అక్కడ పనిచేసే సిబ్బంది, వలంటీర్లు బృందాలుగా ఏర్పడి ఆ సచివాలయాల పరిధిలో 2 రోజుల పాటు ఇంటింటిని సందర్శించి వారి సమస్యలను తెలుసుకుంటారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతి నెలా ఆఖరి శుక్ర, శనివారాల్లో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తోంది. ఇందులో భాగంగా సచివాలయ సిబ్బంది, వలంటీర్లు ప్రభుత్వ సంక్షేమ, ఇతర కార్యక్రమాల అమల్లో కీలకంగా ఉపయోగించే ప్రభుత్వ డేటా బేస్‌లో ఇప్పటికీ తమ పేర్లు నమోదు చేసుకోని వారి వివరాలను సేకరించి, వాటిని డేటా బేస్‌లో నమోదు చేస్తారు. పెండింగ్‌లో ఉన్న ఈ-కేవైసీ ప్రక్రియనూ పూర్తి చేస్తున్నట్లు చెప్పారు.

నెట్‌వర్క్ ఆస్పత్రులకు రూ.337 కోట్లు విడుదల

వైఎస్సార్ ఆరోగ్యశ్రీ సీఈవో హరేంధిరప్రసాద్

సాక్షి, అమరావతి: డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్యశ్రీ పథకం కింద ప్రజలకు వైద్య సేవలు అందిస్తున్న నెట్‌వర్క్ ఆస్పత్రులకు ప్రభుత్వం రూ.337 కోట్ల బిల్లులను విడుదల చేసినట్టు సీఈవో ఎం.ఎన్ హరేంధిరప్రసాద్ తెలిపారు. రెండు రోజుల్లో ఆస్పత్రులకు క్లైమ్ మొత్తాలు జమ అవుతాయన్నారు. తాజా చెల్లింపులతో ఈ ఆర్థిక సంవత్సరంలో ఇప్పటి వరకూ రూ. 1,747.77 కోట్ల బిల్లులను ప్రభుత్వం విడుదల చేసినట్టైందన్నారు. పథకం కింద పేద, మధ్యతరగతివారికి రూపాయి ఖర్చు లేకుండా ఉచిత వైద్యం అందించడానికి ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందన్నారు. 3,257 ప్రొసీజర్లతో రాష్ట్రంలో, రాష్ట్రం వెలుపల 2,282 నెట్‌వర్క్ ఆస్పత్రుల్లో సేవలు అందిస్తున్నామన్నారు. చికిత్స అనంతరం విశ్రాంత సమయానికి ఆరోగ్య ఆసరా కింద నెలకు గరిష్టంగా రూ.5వేలు వరకూ అందిస్తున్నట్టు తెలిపారు.

విజయ్‌కుమార్‌కు 'స్వామినాథన్'అవార్డు



సాక్షి, అమరావతి: రైతు సాధికార సంస్థ ఎగ్జిక్యూటివ్ వైస్ చైర్మన్ టి.విజయ కుమార్‌కు ప్రతిష్టాత్మక ఎంఎస్ స్వామినాథన్ పర్యావరణ పరిరక్షణ అవార్డు-2023 వరించింది. ప్రపంచ వ్యాప్తంగా పర్యావరణ పరిరక్షణ కోసం కృషి చేస్తున్న వారికి డాక్టర్ ఎంఎస్ స్వామినాథన్ గౌరవార్థం రోటరీ క్లబ్ ఆఫ్ మద్రాస్ ఈస్ట్ ఏటా ఈ అవార్డులను ప్రదానం చేస్తుంది. ఏపీ ప్రభుత్వ ప్రోత్సాహంతో రైతు సాధికార సంస్థ ద్వారా ప్రకృతి వ్యవసాయం ఉద్యమంలా సాగుతోంది. ఈ ఉద్యమంలో తనదైన కృషి చేస్తోన్న విజయకుమార్‌ను ప్రతిష్టాత్మక ఎంఎస్ స్వామినాథన్ పర్యావరణ పరిరక్షణ అవార్డు-2023కు ఎంపికచేశారు. స్వామినాథన్ పుట్టిన రోజైన సెప్టెంబర్ 6న ఈ అవార్డును ఆయన కుమార్తె సౌమ్య స్వామినాథన్ చేతుల మీదుగా చెన్నైలో జరిగే వేడుకల్లో ప్రదానం చేయనున్నారు.

గిరిజనం ముంగిట విద్యావనం

పార్వతీపురం మన్యం జిల్లాలో కేంద్రీయ గిరిజన విశ్వవిద్యాలయం



- 25న కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్, సీఎం వైఎస్ జగన్ చేతుల మీదుగా శంకుస్థాపన
- 561 ఎకరాల భూమి కేటాయింపు.. రూ.23 కోట్లతో మౌలిక సదుపాయాలు
- ప్రతిష్టాత్మకంగా వర్సిటీ నిర్మాణానికి ప్రభుత్వం ఏర్పాట్లు

సాక్షి ప్రతినిధి, విజయనగరం: ఏపీ కేంద్రీయ గిరిజన విశ్వవిద్యాలయం(సీటీయూఏపీ) నిర్మాణానికి సాలూరు అసెంబ్లీ నియోజకవర్గ పరిధి మెంటాడ మండలం చినమేడపల్లి వద్ద ఈ నెల 25న శంకుస్థాపన జరగనుంది. ఈ కార్యక్రమానికి కేంద్ర విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్, సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్య అతిథులుగా హాజరుకానున్నారు. దీనికి సంబంధించిన ఏర్పాట్లు చురుగ్గా జరుగుతున్నాయి. ఆహ్లాదకరమైన వాతావరణంలో, సువిశాల భవనాల్లో ఏపీ కేంద్రీయ గిరిజన విశ్వవిద్యాలయం సాకారం కానుంది. ఏపీ పునర్విభజన చట్టం ప్రకారం 2014లో కేంద్రం మన రాష్ట్రానికి 13 కేంద్రీయ విద్యా సంస్థలను మంజూరు చేసింది. అందులో భాగంగా ఉమ్మడి విజయనగరం జిల్లాకు ఏపీ కేంద్రీయ గిరిజన విశ్వవిద్యాలయం(సీటీయూఏపీ)ను కేటాయించింది. 2019 వరకూ అధికారంలో ఉన్న టీడీపీ ప్రభుత్వం.. దీనిని పట్టించుకోలేదు. విజయనగరం జిల్లా కొత్తవలస మండలం రెల్లి గ్రామం వద్ద భూమి కేటాయించినా అది ఏ మాత్రం భవనాల నిర్మాణానికి అనుకూలంగా లేని పరిస్థితి. పూర్తిగా కొండప్రాంతం. పరిసరాల్లో టీడీపీ నాయకుల స్థిరాస్తి వ్యాపారాన్ని పెంచుకోవడానికి తప్ప మరెందుకూ ఉపయోగపడలేదు. తమ పదవీకాలం ముగిసేవరకూ చంద్రబాబు ప్రభుత్వం తాత్సారం చేసింది. చివరకు సీటీయూఏపీ తరగతులను తప్పనిసరిగా ప్రారంభించాల్సి రావడంతో విజయనగరం పట్టణ శివారు కొండకరకాం వద్దనున్న ఏయూ పీజీ క్యాంపస్ పాత భవనంలోనే 2019 ఆగస్టు 5న తరగతులు ప్రారంభమయ్యాయి.

గిరిజనులకు చేరువగా..

ఏపీ కేంద్రీయ గిరిజన విశ్వవిద్యాలయ లక్ష్యం సార్థకమయ్యేలా గిరిజన ప్రాంతంలోనే దీన్ని ఏర్పాటు చేయాలని వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం సంకల్పించింది. విశాఖపట్నం-రాయగడ జాతీయ రహదారికి సమీపంలో, విశాఖ-హౌరా రైల్వేలైన్‌లోని విజయనగరం, గజపతినగరం, బొబ్బిలి రైల్వేస్టేషన్లకు అందుబాటులో ఉండేలా భూమి కేటాయించింది. భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం కూడా సమీపంలోనే ఉంటుంది. మెంటాడ మండలం చినమేడపల్లి రెవెన్యూ గ్రామ పరిధిలో 224.01 ఎకరాలు, దత్తిరాజేరు మండలం మర్రివలస రెవెన్యూ గ్రామ పరిధిలో 337.87 ఎకరాలు.. మొత్తం 561.88 ఎకరాల భూసేకరణ ప్రక్రియ కొలిక్కి వచ్చింది. దాదాపు 480 మంది రైతులకు పరిహారం ఇవ్వాలని అధికారులు గుర్తించారు. ఇప్పటికే దాదాపు రూ. 30.58 కోట్లను వారి బ్యాంకు ఖాతాల్లో జమ చేశారు. సాంకేతిక కారణాల వల్ల ఆగిన మిగిలినవారికి 2 రోజుల్లో చెల్లింపు ప్రక్రియ పూర్తి చేస్తామని విజయనగరం కలెక్టర్ నాగలక్ష్మి చెప్పారు.

మౌలిక సదుపాయాలకు పెద్దపీట

సీటీయూఏపీకి కేటాయించిన భూమిని గతేడాది కేంద్ర బృందం పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేసింది. వర్సిటీ భవనాల నిర్మాణమంతా కేంద్ర ప్రజా పనుల విభాగం చేపడుతోంది. రాష్ట్ర ప్రభుత్వం మౌలిక వసతులు కల్పిస్తోంది. ఇందుకోసం రూ.23.60 కోట్లను గతేడాది విడుదల చేసింది. విశాఖ-రాయ్‌పూర్ జాతీయ రహదారి నుంచి సీటీయూఏపీ ప్రాంగణం వరకూ రూ.16 కోట్లతో 100 అడుగుల వెడల్పున ఆరు లైన్ల అప్రోచ్ రోడ్డు నిర్మాణ పనులు జరుగుతున్నాయి. తాగునీటి వసతి కల్పనకు రూ.7 కోట్లు, విద్యుత్ సౌకర్యానికి దాదాపు రూ.60 లక్షలను ప్రభుత్వం కేటాయించింది. కాగా, విద్యార్థుల్లో నైపుణ్యాల అభివృద్ధి లక్ష్యంగా ఉపాధి విద్యా కోర్సులను ప్రవేశపెట్టడంలో సీటీయూఏపీ ముందుంది. వారికి ఆసక్తి ఉన్న రంగంలోనే ఉపాధి అవకాశాలను అందిపుచ్చుకునేలా 6 గ్రాడ్యుయేట్(యూజీ), 8 పోస్టు గ్రాడ్యుయేట్(పీజీ) కోర్సుల్లో బోధన జరుగుతోంది. అంతర్జాతీయ మార్కెటింగ్ నైపుణ్యాల కోర్సులను ప్రవేశపెడుతున్నారు. ఇప్పటికే పారిశ్రామిక, వ్యాపార రంగాల్లో ఉన్నవారికి కూడా నైపుణ్యాలను, మెలకువలను అందించేలా సాంకేతిక మాధ్యమాలనూ సీటీయూఏపీ రూపొందిస్తోంది. అందుకు సిలబస్‌ను కూర్పు చేసేందుకు కార్యాచరణ సిద్ధం చేసింది. ఏటా నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ(ఎన్‌టీఏ) పర్యవేక్షణలో ప్రవేశపరీక్షలు నిర్వహించి.. ప్రతిభ ఆధారంగానే సీట్లు కేటాయిస్తున్నారు.

రెండు వైద్య కళాశాలల కోసం 1,412 పోస్టుల సృష్టి

వైద్య శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కృష్ణబాబు ఉత్తర్వులు



సాక్షి, అమరావతి: 2024-25 విద్యా సంవత్సరం నుంచి మదనపల్లె, మార్కాపురం వైద్య కళాశాలలను ప్రారంభించడానికి వీలుగా 1,412 పోస్టులను కొత్తగా ప్రభుత్వం సృష్టించింది. ఈ మేరకు బుధవారం వైద్య, ఆరోగ్య శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎంటీ కృష్ణబాబు ఉత్తర్వులిచ్చారు. రెండు చోట్ల వైద్య కళాశాలలకు 222, బోధనాస్పత్రికి 484 చొప్పున పోస్టులను మంజూరు చేశారు. మూడేళ్ల కాల వ్యవధిలో రాష్ట్రంలో కొత్తగా 17 ప్రభుత్వ వైద్య కళాశాలలను అందుబాటులోకి తేవాలని ప్రభుత్వం నిర్ణయించిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో ఈ విద్యా సంవత్సరం నుంచి నంద్యాల, మచిలీపట్నం, ఏలూరు, రాజమండ్రి, విజయనగరం కళాశాలలను ప్రారంభిస్తున్నారు. వచ్చే విద్యా సంవత్సరం పులివెందుల, పాడేరు, ఆదోని, మార్కాపురం, మదనపల్లె కళాశాలలు ప్రారంభించాలని చర్యలు తీసుకుంటున్నారు. కాగా, పులివెందుల, పాడేరు, ఆదోని కళాశాలలకు ఇప్పటికే ప్రభుత్వం పోస్టులను కొత్తగా మంజూరు చేసింది. 2024-25 విద్యా సంవత్సరానికి కొత్త వైద్య కళాశాలల మంజూరుకు దరఖాస్తులను ఆహ్వానిస్తూ ఇటీవలే నేషనల్ మెడికల్ కమిషన్(ఎన్‌ఎంసీ) నోటిఫికేషన్ ఇచ్చింది. ఈ క్రమంలో ఐదు కళాశాలలకు దరఖాస్తు చేసేందుకు చర్యలు తీసుకోనున్నారు.

కాకినాడ యాంకరేజ్ పోర్టు ఏడాదిలోగా పూర్తి

- డిసెంబర్‌లో రామాయపట్నం పోర్టుకు మొదటి నౌక
- చురుగ్గా నాలుగు పోర్టుల నిర్మాణం
- వాటికి అనుబంధంగా ఫిషింగ్ హార్బర్లు, లాండింగ్ సెంటర్లు
- వీటి ద్వారా లక్ష మందికి ఉపాధి
- రాష్ట్ర పరిశ్రమలు, ఐటీ శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ వెల్లడి
- గ్లోబల్ మారిటైం ఇండియా సమ్మిట్ రోడ్‌షో ప్రారంభించిన మంత్రి
- వర్చువల్‌గా పాల్గొన్న కేంద్ర మంత్రి శర్బానంద సోనోవాల్



రోడ్‌షో ప్రారంభిస్తున్న మంత్రి అమర్‌నాథ్, ఎంపీ జీవీఎల్, పోర్టు చైర్మన్ డా.అంగముత్తు

సాక్షి, విశాఖపట్నం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి రాష్ట్రంలో తీర ప్రాంతాన్ని అభివృద్ధి చేస్తూ, జల రవాణాను మెరుగుపరుస్తూ, పారిశ్రామిక రంగాన్ని పరుగులు పెట్టిస్తున్నారని రాష్ట్ర పరిశ్రమలు, ఐటీ శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ చెప్పారు. అక్టోబర్ 17 నుంచి న్యూఢిల్లీలో జరిగే అంతర్జాతీయ మారిటైం ఇండియా సదస్సు కోసం విశాఖపట్నం పోర్టు ఆధ్వర్యంలో బుధవారం ఇక్కడ రోడ్‌షో నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని మంత్రి అమర్‌నాథ్, రాజ్యసభ సభ్యుడు జీవీఎల్ నరసింహారావు, పోర్టు చైర్మన్ డా.అంగముత్తు ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి అమర్‌నాథ్ రాష్ట్రంలో పోర్టులు, ఫిషింగ్ హార్బర్లు, కారిడార్ల అభివృద్ధిని పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా వివరించారు. రాష్ట్ర ప్రభుత్వం రూ.16 వేల కోట్లతో నాలుగు ఓడ రేవుల్ని అభివృద్ధి చేస్తోందని తెలిపారు. 16 నెలల్లోగా కాకినాడ యాంకరేజ్ పోర్టు అందుబాటులోకి వస్తుందని తెలిపారు. రామాయపట్నం పోర్టుకి ఈ డిసెంబర్‌నాటికి మొదటి నౌక వస్తుందని చెప్పారు. పోర్టులకు అనుబంధంగా రాష్ట్రంలో రూ.4 వేల కోట్లతో 10 ఫిషింగ్ హార్బర్లు, 6 ఫిష్ ల్యాండింగ్ సెంటర్లు ఏర్పాటు చేస్తున్నట్లు వివరించారు. వీటి ద్వారా లక్ష మందికి పైగా ఉపాధి పొందుతారన్నారు. 100కి పైగా దేశాలతో వాణిజ్య సంబంధాలను పెంపొందించడంలో ఆంధ్రప్రదేశ్ కీలకంగా వ్యవహరిస్తోందని చెప్పారు. ప్రస్తుతం ఏపీలో పోర్టుల సామర్థ్యం 320 మిలియన్ మెట్రిక్ టన్నులుండగా.. 2025-26 నాటికి అదనంగా 110 మిలియన్ మెట్రిక్ టన్నులకు చేరనుందని అమర్‌నాథ్ తెలిపారు. విశాఖలో నిర్మిస్తున్న క్రూయిజ్ టెర్మినల్ నౌకాయాన రంగంలో నూతన మార్పులకు శ్రీకారం చుడుతుందని ఎంపీ జీవీఎల్ నరసింహారావు అన్నారు. ప్రభుత్వం నిర్మిస్తున్న ప్రతి పోర్టుకు అనుబంధంగా 4 వేల ఎకరాల ల్యాండ్ బ్యాంక్ సిద్ధం చేసినట్లు ఏపీ మారిటైం బోర్డు చైర్మన్ కాయల వెంకటరెడ్డి చెప్పారు. వర్చువల్‌గా కేంద్ర పోర్టులు, నౌకాయాన శాఖ మంత్రి శర్బానంద సోనోవాలా, మరో కేంద్ర మంత్రి శాంతాను ఠాకూర్ వర్చువల్‌గా మాట్లాడారు. సాగర్‌మాల జాయింట్ సెక్రటరీ భూషణ్‌కుమార్, విశాఖ పోర్టు చైర్మన్ డా. అంగముత్తు, ఏపీ మారిటైం బోర్డు డిప్యూటీ సీఈవో రవీంద్రనాథ్‌రెడ్డి ఏపీ ఇన్‌లాండ్ వాటర్‌వేస్ చైర్మన్ దంతులూరి దిలీప్‌కుమార్, డ్రెడ్జింగ్ కార్పొరేషన్ ఎండీ కెప్టెన్ దివాకర్ పాల్గొన్నారు.

అర్హులు ఒక్కరూ మిగిలిపోకూడదని..

మిగిలిపోయిన వివిధ పథకాల అర్హులకు నేడు లబ్ధి

50 నెలల్లో డీబీటీతో పేదలకు పారదర్శకంగా రూ.2.33 లక్షల కోట్లు

సాక్షి, అమరావతి: అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ సంక్షేమ ఫలాలు సంతృప్త స్థాయిలో అందాలన్న కృతనిశ్చయంతో పారదర్శక విధానాలను అమలు చేస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఏ కారణం చేతనైనా వివిధ సంక్షేమ పథకాలను అందుకోలేక మిగిలిపోయిన అర్హులకు కూడా లబ్ధి చేకూర్చనున్నారు. 2022 డిసెంబర్ నుంచి 2023 జూలై వరకు అమలైన వివిధ సంక్షేమ పథకాలకు సంబంధించి ఏ కారణం చేతనైనా లబ్ధి పొందని 2,62,169 మంది అర్హులకు రూ.216.34 కోట్లను గురువారం తన క్యాంపు కార్యాలయం నుంచి బటన్ నొక్కి ఖాతాల్లో జమ చేయనున్నారు. దీంతోపాటు ఇదే సమయానికి సంబంధించి కొత్తగా అర్హత పొందిన మరో 1,49,875 మందికి పెన్షన్లు, 4,327 మందికి ఆరోగ్యశ్రీ కార్డులు, 2,00,312 మందికి రేషన్ కార్డులు, 12,069 మందికి ఇళ్ల పట్టాలను కూడా రాష్ట్ర ప్రభుత్వం అందించనుంది.

మిగిలిపోయిన అర్హులకు ఏటా రెండు దఫాలు..

అర్హులై ఉండి కూడా సంక్షేమ పథకాల వల్ల లబ్ధి పొందని వారు ఆయా పథకాలను అందించిన నెల లోపు గ్రామ, వార్డు సచివాలయాల్లో దరఖాస్తు చేసుకోవాలి. వెరిఫికేషన్ అనంతరం.. మిగిలిపోయిన అర్హులకు కూడా ఆర్నెళ్లకు ఒకసారి ప్రభుత్వం ప్రయోజనాన్ని చేకూరుస్తుంది. దేశంలో ఎక్కడా లేని విధంగా సోషల్ ఆడిట్ కోసం గ్రామ, వార్డు సచివాలయాల్లో లబ్ధిదారుల జాబితాలను ప్రదర్శిస్తూ పారదర్శకంగా వ్యవహరిస్తోంది. లంచాలు, వివక్షకు తావులేకుండా అర్హులందరికీ నూటికి నూరు శాతం సంతృప్త స్థాయిలో ప్రయోజనాన్ని చేకూరుస్తోంది. అర్హులైనప్పటికీ ఏ కారణం చేతనైనా ప్రయోజనం పొందని వారికి గురువారం అందిస్తున్న మొత్తంతో కలిపి 2021 డిసెంబర్ నుంచి ఇప్పటి వరకు నాలుగు పర్యాయాల్లో రూ.1,647 కోట్ల మేర లబ్ధి చేకూరుతోంది. జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా ప్రతి ఇంటిని జల్లెడ పట్టి 94,62,184 సర్టిఫికెట్ల జారీతో పాటు కొత్తగా అర్హులుగా గుర్తించిన మరో 12,405 మందికి నేడు లబ్ధి చేకూరనుంది. జగనన్నకు చెబుదాం ద్వారా అందిన దరఖాస్తుల్లో అర్హులైన 1,630 మందికి కూడా నేడు ప్రయోజనం కలగనుంది. అధికారంలోకి వచ్చిన 50 నెలల్లోనే వివిధ సంక్షేమ పథకాల ద్వారా లంచాలు, వివక్షకు తావు లేకుండా డీబీటీ రూపంలో నేరుగా రూ.2.33 లక్షల కోట్లను పేదల ఖాతాల్లో సీఎం జగన్ జమ చేశారు. గత ప్రభుత్వ హయాంలో జన్మభూమి కమిటీల సిఫారసులు, లంచాలకే పెద్దపీటతోపాటు వీలైనంత ఎక్కువ మందికి ఎగ్గొట్టడమే లక్ష్యంగా వ్యవహరించగా ఇప్పుడు అలాంటి వాటికి ఏమాత్రం తావు లేకుండా పూర్తి పారదర్శకంగా అర్హులందరికీ సంతృప్త స్థాయిలో ప్రయోజనాన్ని చేకూరుస్తున్నారు.

మిగిలిపోయిన అర్హులకు నేడు లబ్ధి ఇలా

పథకం పేరు	లబ్ధిదారుల సంఖ్య	అందిస్తున్న నగదు రూపాయల్లో
జగనన్న చేదోడు	43,131	43,13,10,000
వైఎస్సార్ ఈబీసీ నేస్తం	8,753	13,12,95,000
వైఎస్సార్ నేతన్న నేస్తం	267	64,08,000
వైఎస్సార్ మత్స్యకార భరోసా	207	20,70,000
జగనన్న అమ్మ ఒడి	14,836	22,25,40,000
జగనన్న విద్యా దీవెన	32,770	26,66,00,000
జగనన్న వసతి దీవెన	36,898	32,13,00,000
వైఎస్సార్ సున్నా వడ్డీ పంట రుణాలు, ఇన్‌పుట్ సబ్సిడీ	1,08,590	42,16,94,000
వైఎస్సార్ ఆసరా	16,717	36,01,56,051
మొత్తం	2,62,169	216,33,73,051

'పవర్' ఫుల్

నంద్యాల జిల్లాలో రూ.25,850 కోట్లతో ఏర్పాటు.

సోలార్, విండ్ ప్రాజెక్టులకు సీఎం జగన్ భూమి పూజ

సాక్షి, అమరావతి: రాష్ట్ర ఇంధన రంగానికి భద్రత చేకూరేలా మరో కీలక ఘట్టానికి శ్రీకారం చుడుతూ చరిత్రాత్మక ప్రాజెక్టులకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి శంకుస్థాపన చేశారు. విశాఖ గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్ ఒప్పందాలను శరవేగంగా కార్యాచరణలోకి తెస్తూ నంద్యాల జిల్లాలో రూ.25,850 కోట్ల విలువైన మూడు పునరుత్పాదక ఇంధన ప్రాజెక్టులకు క్యాంపు కార్యాలయం నుంచి బుధవారం వర్చువల్ విధానంలో భూమి పూజ నిర్వహించారు. మరో రెండు పంప్డ్ స్టోరేజీ ప్రాజెక్టుల (పీఎస్పీ) ఏర్పాటుకు ఆంధ్రప్రదేశ్ పవర్ జనరేషన్ కార్పొరేషన్ (ఏపీ జెన్‌కో), కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థ నేషనల్ హైడ్రో ఎలక్ట్రిక్ పవర్ కార్పొరేషన్ (ఎన్‌హెచ్‌పీసీ) మధ్య ఒప్పందం కుదిరింది. ఈ మేరకు సీఎం జగన్ సమక్షంలో ఒప్పంద పత్రాలపై ఏపీ జెన్‌కో ఎండీ చక్రధరబాబు, ఎన్‌హెచ్‌పీసీ ఫైనాన్స్ డైరెక్టర్ రాజేంద్రప్రసాద్ గోయల్ సంతకాలు చేశారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో గ్రీన్ హైడ్రోజన్ రంగంలో అపార పెట్టుబడుల అవకాశాలపై సీఎం జగన్ శ్వేతపత్రాన్ని విడుదల చేసి మాట్లాడారు.

భవిష్యత్తు గ్రీన్ ఎనర్జీదే

ఈ రోజు మరో మంచి కార్యక్రమం జరుగుతోంది. ఇక్కడ మనతో పాటు ఉన్న బ్రిటీష్ డిప్యూటీ హైకమిషనర్ గారత్, గ్రీన్‌కో, ఆర్సెలర్ మిట్టల్, ఎకోరన్ గ్రూపు యాజమాన్యాలకు, కంపెనీల ప్రతినిధులు, అధికారులు, ప్రజా ప్రతినిధులతో పాటు రాష్ట్ర ప్రభుత్వంతో ఎంవోయూ కుదుర్చుకునేందుకు ఇక్కడకు వచ్చిన ఎన్‌హెచ్‌పీసీ ఫైనాన్స్ డైరెక్టర్ గోయల్, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ రజత్‌కు ధన్యవాదాలు. ఇవాళ మూడు ప్రాజెక్టులకు శంకుస్థాపన నిర్వహిస్తున్నాం. నాలుగో కార్యక్రమం కింద ఎన్‌హెచ్‌పీసీతో అవగాహన ఒప్పందం కూడా కుదుర్చుకుంటున్నాం. మొదటి ప్రాజెక్టు గ్రీన్‌కో.. 2,300 మెగావాట్ల సౌర విద్యుత్తుకు సంబంధించి రూ.10,350 కోట్ల పెట్టుబడితో 2,300 మందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కలిగిస్తున్న ప్రాజెక్టు ఇది. ఇక పంప్డ్ స్టోరేజ్ అన్నది ఆర్టిఫీషియల్ బ్యాటరీ లాంటిది. పీక్ అవర్స్‌లో పవర్ జనరేట్ చేస్తాం. నాన్ పీక్ అవర్స్‌లో మళ్లీ నీళ్లని వెనక్కి పంప్ చేసి ఆ తరువాత, పీక్ అవర్స్‌లో పవర్‌ని జనరేట్ చేసేందుకు ఆర్టిఫీషియల్ బ్యాటరీ మాదిరిగా ఏర్పాట్లు ఉంటాయి. పంప్డ్ స్టోరేజీ ప్రాజెక్టులు భవిష్యత్తులో పూర్తిగా గ్రీన్ ఎనర్జీ ఉత్పత్తయ్యేలా దోహదం చేస్తాయి. దీనివల్ల బొగ్గు లాంటి శిలాజ ఇంధనాల మీద ఆధారపడే పరిస్థితి తగ్గుతుంది. పర్యావరణానికి మంచి జరగాలంటే రాబోయే రోజుల్లో పంప్డ్ స్టోరేజీ ప్రాజెక్టులు చాలా కీలక పాత్ర పోషిస్తాయి. సోలార్ ప్రాజెక్టులు, విండ్ ప్రాజెక్టులు, పంప్డ్ స్టోరేజీ ప్రాజెక్టులతో మనం అనుసంధానమవుతున్న తీరు గ్రీన్ ఎనర్జీలో పెను మార్పులకు దారి తీస్తాయి. పర్యావరణాన్ని పరిరక్షిస్తాయి. అదే సమయంలో విద్యుదుత్పత్తికి తోడ్పాటునివ్వడం ద్వారా గ్రీన్ ఎనర్జీలో ఒక విప్లవాత్మక మార్పు వస్తుంది.

మరో 30 ఏళ్లు ఉచిత విద్యుత్తుకు ఢోకా లేకుండా..

ఆంధ్రప్రదేశ్‌లో దాదాపు 8,998 మెగావాట్ల సోలార్, విండ్ పవర్ ఉత్పత్తి చేస్తున్నాం. రైతులకు దీర్ఘకాలం పగటి పూటే నాణ్యమైన ఉచిత విద్యుత్ సరఫరా కొనసాగించేందుకు 16 వేల మిలియన్ యూనిట్లు అంటే దాదాపు 7,200 మెగావాట్లకు సంబంధించి సెంట్రల్ గవర్నమెంట్ ఏజెన్సీ సోలార్ ఎనర్జీ కార్పొరేషన్ (సెకీ)తో యూనిట్ రూ.2.49కే అందేలా ఇప్పటికే ఒప్పందం కుదుర్చుకున్నాం. తద్వారా మరో 25 నుంచి 30 ఏళ్ల పాటు రాష్ట్ర ప్రభుత్వానికి పవర్ అందుబాటులో ఉంటుంది. దీనివల్ల ఎలాంటి ఇబ్బందులకు లోనుకాకుండా, ఒత్తిడి లేకుండా రైతులకు ఉచితంగా విద్యుత్ అందించే వెసులుబాటు లభిస్తుంది. అది కూడా రాష్ట్ర ప్రభుత్వం ముందుచూపుతో రూ.2.49కే మరో 25 - 30 ఏళ్ల పాటు ఉచిత కరెంటుకు ఢోకా లేకుండా ఒప్పందం కుదుర్చుకుంది. ఇది గొప్ప అడుగు.

41 వేల మెగావాట్లు.. 37 ప్రాంతాలు

ఒకవైపు ఇవన్నీ చేస్తూనే మరోవైపు పంప్డ్ స్టోరేజీని ప్రోత్సహించడంలో భాగంగా దాదాపు 41 వేల మెగావాట్లకు సంబంధించి 37 ప్రాంతాలను ఇప్పటికే గుర్తించాం. ఇందులో 33,240 మెగావాట్లకు సంబంధించి 29 చోట్ల ప్రాజెక్టు ఫీజిబులిటీ పరిశీలన జరుగుతోంది. 20,900 మెగావాట్ల కెపాసిటీకి సంబంధించిన ప్రాజెక్టుల డీపీఆర్‌లు కూడా పూర్తయ్యాయి. వీటిలో 16,180 మెగావాట్ల కెపాసిటీతో ఉత్పత్తి చేసేందుకు వివిధ కంపెనీలకు అలాట్‌మెంట్లు కూడా పూర్తయ్యాయి. ఇందులో భాగంగానే ఇవాళ ఎన్‌హెచ్‌పీసీతో ఒప్పందం చేసుకుంటున్నాం. దీనిలో యాగంటిలో 1,000 మెగావాట్ల ప్రాజెక్టు, కమలపాడులో మరో 950 మెగావాట్లు కలిపి మొత్తంగా దాదాపు 2 వేల మెగావాట్ల ప్రాజెక్టులను రాష్ట్ర ప్రభుత్వం ఎన్‌హెచ్‌పీసీతో కలిసి నిర్మించనుంది. దాదాపు రూ.10 వేల కోట్ల విలువైన ఈ ప్రాజెక్టులకు ఫీజిబులిటీ స్టడీస్ పూర్తయ్యాయి. ఎన్‌హెచ్‌పీసీ, రాష్ట్ర ప్రభుత్వం చెరి సగం వాటాతో ప్రాజెక్టును అభివృద్ధిలా ఇవాళ ఎంవోయూ కుదుర్చుకున్నాం.

హాజరైన మంత్రులు, ఉన్నతాధికారులు..

కార్యక్రమంలో మంత్రులు పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, బుగ్గన రాజేంద్రనాథ్, ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ, సీఎస్ డాక్టర్ కేఎస్ జవహర్ రెడ్డి, ఏపీ జెన్‌కో ఎండీ కేవీఎన్ చక్రధర్‌బాబు, ఎన్ఆర్ఈడీసీఏపీ వీసీ, ఎండీ ఎస్.రమణారెడ్డి, బ్రిటీష్ డిప్యూటీ హైకమిషనర్ గారెత్ విన్, డిప్యూటీ హెడ్ మిషన్ యూకే గవర్నమెంట్ వరుణ్ మాలి, యూకే గవర్నమెంట్ సీనియర్ అడ్వైజర్ నిషాంత్‌కుమార్ సింగ్, ఎన్‌హెచ్‌పీసీ ఫైనాన్స్ డైరెక్టర్ రాజేంద్రప్రసాద్ గోయల్, గ్రీన్‌కో వైస్ ప్రెసిడెంట్ ఎన్.శేషగిరిరావు, ఏఎం గ్రీన్ ఎనర్జీ బిజినెస్ హెడ్ సమీర్ మాథుర్, ఎకోరన్ గ్రీన్ ఎనర్జీ సీఎండీ వై.లక్ష్మీ ప్రసాద్, కంపెనీల ప్రతినిధులు పాల్గొన్నారు.




పారిశ్రామికవేత్తలతో మాట్లాడుతున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి

రాష్ట్రానికి.. రైతులకు.. యువతకు మేలు

ఈ ప్రాజెక్టుల ఏర్పాటుతో మనకు జరిగే మేలును ఒక్కసారి పరిశీలిస్తే.. రాబోయే రోజుల్లో మన యువతకు స్థానికంగా పెద్ద ఎత్తున ఉద్యోగ అవకాశాలు రావడమే కాకుండా అందుబాటులోకి వస్తున్న ప్రతి మెగావాట్‌కు మరో వందేళ్ల పాటు అంటే ఈ ప్రాజెక్టు లైఫ్ ఉన్నంత కాలం మెగావాట్‌కు రూ.లక్ష చొప్పున రాయల్టీగా రాష్ట్ర ప్రభుత్వానికి ఆదాయం వస్తుంది. దీంతో పాటు ఈ ప్రాజెక్టుల వల్ల జీఎస్టీ ఆదాయం కూడా లభిస్తుంది. అంతేకాకుండా ఈ ప్రాజెక్టులకు తమ భూములిస్తూ సహకరిస్తున్న రైతన్నలకు కూడా ఈ కంపెనీల నుంచి లీజు రూపంలో ఏటా ఎకరాకు రూ.30 వేలు చొప్పున ఆదాయం వస్తుంది. ఇందుకు ప్రభుత్వం మధ్యవర్తిగా ఉంటుంది. అంటే రైతులు ఎవరైనా భూములివ్వాలనుకుంటే ప్రతి రైతుకు, ప్రతి ఎకరానికి, ఏడాదికి రూ.30 వేలు లీజు రూపంలో ఇస్తారు. ప్రతి రెండేళ్లకు 5 శాతం లీజు రుసుము కూడా పెరుగుతుంది. దశాబ్దాలుగా నీళ్లకు కటకటలాడిన దుర్భిక్ష ప్రాంతం రాయలసీమ రైతన్నలకు ఈ ప్రాజెక్టులతో మంచి జరుగుతుంది. మరీ ముఖ్యంగా ఇవి పర్యావరణానికి మేలు చేస్తాయి.

– సీఎం జగన్



వర్చువల్‌గా శంకుస్థాపన చేస్తున్న సీఎం జగన్

మరో మూడు చోట్ల కూడా...!

ఎన్‌హెచ్‌పీసీతో కలసి ఇంకా వేగంగా అడుగులు ముందుకువేసే కార్యక్రమంలో భాగంగా మరో 2,750 మెగావాట్లకు సంబంధించి 3 ప్రాంతాలలో ఫీజుబులిటీ స్టడీస్ జరుగుతున్నాయి. రాబోయే రోజుల్లో ఆ ప్రాజెక్టులను కూడా ఎన్‌హెచ్‌పీసీతో కలిసి సంయుక్తంగా చేపడతాం. రాష్ట్ర ప్రభుత్వం తరఫున సామర్థ్యాన్ని పెంచుకుంటూనే మిగిలిన ప్రైవేట్ డెవలపర్స్‌కి కూడా అందుబాటులోకి తెచ్చి తద్వారా రాష్ట్రంతో పాటు దేశానికి కూడా మంచి చేసే కార్యక్రమాలు చేస్తున్నాం. వీటన్నింటితో రాబోయే రోజుల్లో గ్రీన్ ఎనర్జీ ఉత్పత్తిలో ఆంధ్రప్రదేశ్ దేశానికే ఆదర్శంగా నిలవనుంది.



బ్రిటిష్ డిప్యూటీ హైకమిషనర్ గారెత్ విన్‌కు జ్ఞాపిక అందజేస్తున్న సీఎం జగన్



ఎన్‌హెచ్‌పీసీ ఫైనాన్స్ డైరెక్టర్ గోయల్‌కు జ్ఞాపిక అందజేస్తున్న సీఎం జగన్

ప్రపంచాన్ని శాసించే ఎనర్జీ

దేవుడు గొప్పవాడు.. అందుకే మానవాళికి ఇంత చక్కటి వనరులను సృష్టించాడు. ఎండ బాగున్నప్పుడు ఉదయం 6 నుంచి సాయంత్రం 6 గంటల వరకు సోలార్ పవర్‌ని ఉత్పత్తి చేస్తే సాయంత్రం 6 నుంచి ఉదయం వరకు విండ్ పవర్ ఉత్పత్తి అవుతుంది. పీక్ అవర్స్‌లో నీళ్లతో పంప్డ్ స్టోరేజీ ప్రాజెక్టులను వాడుకోవచ్చు. పీక్ అవర్స్‌లో అవి ఆర్టిఫీషియల్ బ్యాటరీలా పనిచేస్తాయి. దీంతో పీక్ అవర్స్‌లో విద్యుదుత్పత్తి సాధ్యమవుతుంది. ఫలితంగా శిలాజ ఇంధనాల నుంచి బయటపడి పర్యావరణ హితమైన గ్రీన్ ఎనర్జీ లభిస్తుంది. ఇది ప్రపంచాన్ని శాసించ బోయే ఎనర్జీగా నిలుస్తుంది. అందులో ఏపీ తొలిస్థానంలో నిలిచేలా అడుగులు పడుతున్నాయి.

క్లుప్తంగా...

ఆరు జిల్లాలకు డీఎంహెచ్‌వోల నియామకం

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో 2022–23 ప్యానెల్ సంవత్సరానికి గాను 17 డిప్యూటీ సివిల్ సర్జన్‌లకు సివిల్ సర్జన్‌లుగా ప్రభుత్వం ప్రమోషన్‌లు ఇచ్చింది. ఈ క్రమంలో ప్రమోషన్‌లు పొందిన వారికి పోస్టింగ్‌లు ఇస్తూ బుధవారం వైద్య, ఆరోగ్య శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎం.టి.కృష్ణబాబు ఉత్తర్వులు ఇచ్చారు. ఆరుగురిని వివిధ జిల్లాలకు డీఎంహెచ్‌వోలుగా, మిగిలిన వారిని సీఎస్ఆర్ఎంవోలు, జేడీలు ఇలా వివిధ స్థానాల్లో నియమించారు.

జిలా పేరు	డీఎంహెచ్‌వో పేరు
విజయనగరం	డాక్టర్ ఎస్.భాస్కర్‌రావు
కాకినాడ	డాక్టర్ నరసింహ నాయక్
ఏలూరు	డాక్టర్ ఎస్.శర్మిష్ఠా
పల్నాడు	డాక్టర్ రవి
చిత్తూరు	డాక్టర్ ప్రభావతిదేవి
అనంతపురం	డాక్టర్ ఈ.బి.దేవి

ఎన్జీటీ చైర్‌పర్సన్‌గా జస్టిస్ శ్రీవాస్తవ బాధ్యతల స్వీకరణ

సాక్షి, న్యూఢిల్లీ: జాతీయ హరిత ట్రిబ్యునల్ (ఎన్జీటీ) ప్రధాన ధర్మాసనం చైర్‌పర్సన్‌గా జస్టిస్ ప్రకాశ్ శ్రీవాస్తవ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఆయన మాట్లాడుతూ.. ట్రిబ్యునల్ ఏర్పాటు లక్ష్యం పూర్తిగా నెరవేరేలా కృషి చేస్తానని చెప్పారు. పర్యావరణ పరిరక్షణకు సమతుల్య విధానం అవసరమని అభిప్రాయపడ్డారు. కాగా, 2021లో కోల్‌కత హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా బాధ్యతలు చేపట్టిన జస్టిస్ శ్రీవాస్తవ ఈ ఏడాది మార్చిలో పదవీ విరమణ చేశారు.

94,580 మందికి ఇంజనీరింగ్ సీట్ల కేటాయింపు

ప్రవేశాల కన్వీనర్ చదలవాడ నాగరాణి

సాక్షి, అమరావతి: ఏపీ ఈఏపీసెట్–2023 ఇంజనీరింగ్ ప్రవేశాల ప్రక్రియకు సంబంధించి బుధవారం 253 కళాశాలల్లో 94,580 మందికి సీట్లు కేటాయించినట్లు సాంకేతిక విద్యాశాఖ కమిషనర్, ప్రవేశాల కన్వీనర్ చదలవాడ నాగరాణి తెలిపారు. కన్వీనర్ కోటాలో మొత్తం 1,21,306 సీట్లు ఉండగా, తొలి విడత కేటాయింపులు పోనూ మిగిలిన 26,726 సీట్లను తదుపరి కౌన్సెలింగ్‌లో భర్తీ చేస్తామన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 1,00,986 మంది విద్యార్థులు 31,36,318 ఆప్షన్లను ఎంపిక చేసుకోగా నిబంధనల ప్రకారం ఆయా కళాశాలల్లో సీట్లను కేటాయించినట్టు వివరించారు. 26 విశ్వవిద్యాలయ ఇంజనీరింగ్ కళాశాలల్లో 5,813 సీట్లు, 221 ప్రైవేటు కళాశాలల్లో 84,956 సీట్లు, ఆరు ప్రైవేటు విశ్వవిద్యాలయాల్లో 3,811 సీట్లను భర్తీ చేశామన్నారు. 530 సీట్ల భర్తీకి సంబంధించి క్రీడా ప్రాధికార సంస్థ నుంచి జాబితాలు వచ్చిన వెంటనే అభ్యర్థులకు కేటాయిస్తామన్నారు.

చంద్రబాబు, లోకేశ్ మానసిక రోగులు

• మాజీ మంత్రి పేర్ని నాని

సాక్షి, అమరావతి: చంద్రబాబు, లోకేశ్ మానసిక రోగులు, సంస్కారహీనులని మాజీ మంత్రి, వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే పేర్ని వెంకట్రామయ్య (నాని) దుయ్యబట్టారు. ఆయన బుధవారం తాడేపల్లిలోని వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో మీడియా సమావేశంలో మాట్లాడుతూ.. గుడ్డలూడదీస్తాం.. అండర్‌వేర్ తీస్తాం.. అని అంటున్న చంద్రబాబు, లోకేశ్ మానసిక రోగంతో బాధపడుతున్నట్లు కనిపిస్తోందన్నారు. నలుగురు చంచాగిరిగాళ్లను పక్కన పెట్టుకొని సీఎంని, మంత్రులను, ఎమ్మెల్యేలను బూతులు తిడుతున్నారని అన్నారు. టీడీపీ తెలుగు బూతుల పార్టీగా మారిందన్నారు. బూతుల సభకు రూ. 20 కోట్లు ఖర్చు పెట్టారని, బూతులే భవిష్యత్తుకు లోకేశ్ ఇచ్చే భరోసానా అని ప్రశ్నించారు. టీడీపీలో వయసు మళ్లిన నేతలు కూడా ఒళ్లు తెలియకుండా రాష్ట్ర ముఖ్యమంత్రిపై వాడు.. వీడు అంటూ నోరుపారేసుకోవడం ప్రజలు చూస్తున్నారని చెప్పారు. డెబ్బై ఎనభై ఏళ్లు వచ్చిన ముసలోళ్లు కూడా బూతులు తిడుతూ పైశాచికత్వం పొందుతున్నారని అన్నారు. కొడాలి నానిని చూస్తే బాబు ప్యాంట్ ఎందుకు తడిసిపోతోందని ప్రశ్నించారు. టీడీపీలో ఉన్నప్పుడూ వల్లభనేని వంశీ పశువుల డాక్టరే కదా అని నిలదీశారు. తండ్రీ కొడుకులకు ఆవగింజంత సిగ్గు, దోసగింజంత ఆత్మాభిమానం ఉంటే గుడివాడలో టీడీపీ క్యాండిడేట్ ఎవరో చెప్పాలని అన్నారు. ఎన్టీఆర్ మనవడ్ని అని చెప్పుకుంటున్న లోకేశ్‌కు దమ్ముంటే గుడివాడలో నానిపై పోటీ చేసి గెలవాలని సవాల్ చేశారు. గన్నవరంలో కూడా పార్టీ ఇన్‌ఛార్జి లేకపోతే వైఎస్సార్‌సీపీలో ఎమ్మెల్యే అభ్యర్థిగా నిలబడి ఓడిన వ్యక్తిని పెట్టుకున్న దౌర్భాగ్య స్థితి టీడీపీది అని ఎద్దేవా చేశారు. బందరు పోర్టుకు టీడీపీ భూసేకరణ చేయలేదని, ఒక్క ఇటుక వేయలేదని అన్నారు. వైఎస్ జగన్ ప్రభుత్వం రాగానే బందరు పోర్టు పనులపై చిత్తశుద్ధితో పనిచేస్తుంటే, ఈ టీడీపీ రాక్షస మూకలు యాగాన్ని భగ్నం చేసేందుకు హైకోర్టు, సుప్రీంకోర్టుల్లో 5 దావాలేసి సెప్టెంబర్ 2022 వరకు ఎంత కాల్చుకుతిన్నారో అందరికీ తెలుసన్నారు.

లోకేశ్ చేస్తున్నది మిడ్ నైట్ యాత్ర

లోకేశ్ వయసెంత, ఆయన చేస్తున్న పాదయాత్ర తీరేమిటని అన్నారు. సూర్యుడు అస్తమించే సమయానికి సాయంత్రం 6 గంటలకు మొదలుపెట్టి తెల్లవారుజామున 3 గంటలకు ముగించే దాన్ని పాదయాత్ర అంటారా? మిడ్ నైట్ యాత్ర అంటారా అని అన్నారు. పగటిపూట పాదయాత్ర చేస్తే బాబు, లోకేశ్ నిర్వాకంపై ప్రజలు నిలదీస్తారనే భయంతోనే రాత్రిళ్లు తిరుగుతున్నారన్నారు. ఏమైనా లోకేశం యాత్ర పుణ్యమా అని అక్కడక్కడ పేదోళ్లకు రోజుకి రూ. వెయ్యి గిట్టుబాటు అవుతోందన్నారు. లోకేశ్ శుంఠన్నర కాబట్టే బాబు సినిమాస్టార్ వైపు చూస్తున్నారన్నారు. తండ్రి గురించి చెప్పుకోలేని దౌర్భాగ్యుడు లోకేశ్ అని మండిపడ్డారు.

లోకేశ్‌కు పోలీసుల నోటీసులు

నిబంధనలు ఉల్లంఘించి విద్వేషపూరిత ప్రసంగాలు చేయడమే కారణం

సాక్షి, అమరావతి/గన్నవరం: విద్వేషపూరిత ప్రసంగాలతో వర్గ విభేదాలను రెచ్చగొట్టి, శాంతిభద్రతల విఘాతానికి ప్రయత్నించిన టీడీపీ నాయకుడు నారా లోకేశ్‌కు పోలీసులు నోటీసులు జారీ చేశారు. యువగళం పాదయాత్రకు పోలీసులు ఇచ్చిన అనుమతుల్లోని నిబంధనలను ఉల్లంఘిస్తూ విద్వేష ప్రసంగాలు చేసినందున లోకేశ్‌తోపాటు కృష్ణా జిల్లా టీడీపీ అధ్యక్షుడు కొనకళ్ల నారాయణకు కూడా నోటీసులు జారీ చేయాలని పోలీసులు నిర్ణయించారు. గన్నవరంలో మంగళవారం నిర్వహించిన బహిరంగ సభలో లోకేశ్, టీడీపీ నేత అయ్యన్నపాత్రుడు తదితరులు ముఖ్యమంత్రి కార్యాలయ ప్రతిష్టను దిగజార్చేలా దూషణలకు పాల్పడ్డారు. వర్గ వైషమ్యాలను రెచ్చగొట్టేలా అసభ్యపదజాలంలో ప్రసంగించారు. దీంతో లోకేశ్‌తో పాటు పాదయాత్రకు అనుమతి కోరుతూ దరఖాస్తు చేసిన కొనకళ్ల నారాయణకు నోటీసులు ఇవ్వాలని పోలీసులు నిర్ణయించారు. కృష్ణా జిల్లా ఆత్కూరులో లోకేశ్ బస వద్దకు బుధవారం పోలీసులు వెళ్లి నోటీసులు తీసుకోవాలని కోరారు. నోటీసులు ఇచ్చేందుకు వచ్చిన పోలీసులను టీడీపీ కార్యకర్తలు అడ్డుకునేందుకు యత్నించారు. నోటీసులు తీసుకునేందుకు లోకేశ్ తిరస్కరించారు. కొనకళ్ల నారాయణ మాత్రం నోటీసులు తీసుకున్నారు. కాగా నోటీసులు తీసుకునేందుకు నిరాకరించిన లోకేశ్‌కు మరోసారి నోటీసులు జారీ చేయాలని పోలీసులు నిర్ణయించారు.

‘బెంగాల్ రామోజీ’ బిశ్వప్రియ గిరి అరెస్టు

▶ మొదటి పేజీ తరువాయి

న్యాయస్థానంలో హాజరు పరిచారు. బిశ్వప్రియ గిరికి న్యాయస్థానం సెప్టెంబరు 1 వరకు రిమాండ్ విధించింది. యూఆర్‌వో చిట్‌ఫండ్స్, మార్గదర్శి చిట్‌ఫండ్స్ మోసాలు ఒకే తరహాలో ఉన్నాయి. నిజానికి యూఆర్‌వో చిట్‌ఫండ్స్ కంటే మార్గదర్శి చిట్‌ఫండ్స్ మోసాలు అనేక రెట్లు పెద్దవి కావడం గమనార్హం.

రూ.200 కోట్లు మళ్లించిన యూఆర్‌వో చిట్‌ఫండ్స్

యూఆర్‌వో చిట్‌ఫండ్స్ ప్రమోటర్, డైరెక్టర్ బిశ్వప్రియ గిరి ఈ కుంభకోణానికి సూత్రధారి. చిట్‌ఫండ్స్ పేరుతో అధిక వడ్డీ ఆశ చూపి భారీగా అక్రమ డిపాజిట్లు వసూలు చేశారు. కేంద్ర చిట్‌ఫండ్స్ చట్టాన్ని ఉల్లంఘిస్తూ చందాదారుల సొమ్మును తమ సొంత వ్యాపార సంస్థల్లోకి మళ్లించారు. చందాదారుల సంతకాలను ఫోర్జరీ చేయడంతోపాటు పలు అక్రమాలకు పాల్పడ్డారు. రూ.200 కోట్లను ఇతర సంస్థల్లో అక్రమ పెట్టుబడులుగా మళ్లించారు. బిశ్వప్రియ గిరి కుటుంబానికే చెందిన ఆగ్రో ఇండస్ట్రీ, లైఫ్‌కేర్, ఆటోమోటివ్, హోటళ్లు-రిసార్టులు, రియల్ ఎస్టేట్ సంస్థల్లో పెట్టుబడులుగా పెట్టారు. చందాదారుల సొమ్మును తమ సొంత ఆర్థిక ప్రయోజనాల కోసం దుర్వినియోగం చేశారు. ఈ క్రమంలో చందాదారులకు సక్రమంగా చెల్లించలేక మోసానికి పాల్పడ్డారు. ఈడీ అధికారులు తనిఖీలు జరిపి పూర్తి ఆధారాలతో కేసు నమోదు చేశారు. బిశ్వప్రియ గిరిని ఈడీ అధికారులు మంగళవారం అరెస్టు చేసి న్యాయస్థానంలో హాజరు పరిచారు.

అంతకు మించి మార్గదర్శి మోసాలు

యూఆర్‌వో చిట్‌ఫండ్స్ వసూలు చేసినట్లుగానే మార్గదర్శి చిట్‌ఫండ్స్ కూడా తమ చందాదారుల నుంచి అక్రమ డిపాజిట్లు వసూలు చేసింది. 4 నుంచి 5 శాతం వడ్డీ చెల్లిస్తామని చెప్పి రశీదు రూపంలో అక్రమ డిపాజిట్లు సేకరించింది. బిశ్వప్రియ గిరి తరహాలోనే రామోజీరావు కూడా చిట్‌ఫండ్ చట్టానికి విరుద్ధంగా చందాదారుల సొమ్మును ఇతర సంస్థల్లోకి మళ్లించారు. తమ సొంత వ్యాపార సంస్థలైన ఉషాకిరణ్ మీడియా ప్రైవేట్ లిమిటెడ్, ఉషోదయ ఎంటర్‌ప్రైజస్‌లో చిట్‌ఫండ్ చందాదారుల డబ్బును పెట్టుబడులుగా పెట్టారు. అంతేకాకుండా వివిధ మ్యూచువల్ ఫండ్ సంస్థల్లో అక్రమ పెట్టుబడులుగా వాటిని మళ్లించారు. యూఆర్‌వో గ్రూప్‌నకు చెందిన బిశ్వప్రియ గిరి కేవలం రూ.200 కోట్లు మాత్రమే మళ్లించగా రామోజీరావు అంతకు ఎన్నో రెట్లు అధికంగా రూ.వేల కోట్లను అక్రమంగా దారి మళ్లించడం గమనార్హం. మ్యూచువల్ ఫండ్స్‌లో పెట్టిన అక్రమ పెట్టుబడులే రూ.1,035 కోట్లుగా ఉన్నట్లు స్టాంపులు-రిజిస్ట్రేషన్ల శాఖ, సీఐడీ అధికారులు గుర్తించారు. ఉషాకిరణ్ మీడియా ప్రైవేట్ లిమిటెడ్‌లో 88.50 శాతం, ఉషోదయ ఎంటర్‌ప్రైజస్‌లో 44.55 శాతం పెట్టుబడులుగా పెట్టారు. వాటి మార్కెట్ విలువ భారీగా ఉంటుందని మార్కెట్ నిపుణులు చెబుతున్నారు. దీన్నిబట్టి యూఆర్‌వో చిట్‌ఫండ్స్ మోసాల కంటే మార్గదర్శి చిట్‌ఫండ్స్ భారీగా అక్రమాలకు పాల్పడినట్లు స్పష్టమవుతోంది. చందాదారుల నిధులను అక్రమంగా మళ్లించిన కేసులో యూఆర్‌వో చిట్‌ఫండ్స్ డైరెక్టర్ బిశ్వప్రియ గిరి అరెస్టు అయ్యారు. మరి అంతకంటే భారీగా చందాదారుల నిధులను మళ్లించిన రామోజీరావుపై దర్యాప్తు సంస్థలు ఎలాంటి చర్యలు తీసుకుంటున్నాయన్నది ఆసక్తికరంగా మారింది. మార్గదర్శి చిట్‌ఫండ్స్ అక్రమాల గురించి సీఐడీ విభాగం ఇప్పటికే ఈడీ ప్రధాన కార్యాలయానికి ఆధారాలతో సహా నివేదికను సమర్పించింది.



కార్యక్రమంలో పాల్గొన్న రాకేశ్‌శర్మ, కేఆర్‌పీ రెడ్డి, హర్ముస్జి కామ, మేరీ పాల్

హైదరాబాద్‌లో ఐఎన్ఎస్ సమావేశం

సాక్షి, హైదరాబాద్: భారత పత్రికల సమాఖ్య (ఐఎన్ఎస్) సదస్సు పదిహేనేళ్ల తర్వాత హైదరాబాద్‌లో సమాఖ్య అధ్యక్షుడు కేఆర్‌పీ రెడ్డి అధ్యక్షతన బుధవారం జరిగింది. పత్రిక పరిశ్రమకు ఐఎన్ఎస్ అపెక్స్ కో ఆర్డినేషన్ సంస్థగా పనిచేస్తూ.. పరిశ్రమకు సంబంధించిన పలు అంశాలను చర్చించి, వాటిని పరిష్కరించడం, అవసరమైన వాటిని ప్రభుత్వ విభాగాల దృష్టికి తీసుకెళ్తుంది. బుధవారం జరిగిన సదస్సులో కేఆర్‌పీ రెడ్డి, ఉపాధ్యక్షుడు రాకేశ్‌శర్మ, సెక్రెటరీ జనరల్ మేరీ పాల్, అడ్వర్టైజ్‌మెంట్ కమిటీ చైర్మన్ హర్ముస్జి కామ, రీజినల్ అడ్వర్టైజ్‌మెంట్ కమిటీ చైర్మన్ స్థానిక అక్రెడిటెడ్ అడ్వర్టైజ్‌మెంట్ ఏజెన్సీలు, స్థానిక ఐఎన్ఎస్ పబ్లికేషన్‌తో సంప్రదింపులు జరిపి వారి నుంచి పలు అంశాలపై సమాచారం సేకరించారు. జీఎస్టీ, వాణిజ్య, ప్రభుత్వాల నుంచి రావాల్సిన ప్రకటనల చెల్లింపులు తదితర అంశాలపై సుదీర్ఘంగా చర్చించి కొన్నింటికి పరిష్కారాలు కనుగొన్నట్లు కేఆర్‌పీ రెడ్డి తెలిపారు.

జ్యోతి సురేఖకు సీఎం అభినందన



సాక్షి, అమరావతి: ప్రపంచ ఆర్చరీ విజేత వెన్నం జ్యోతి సురేఖను సీఎం వైఎస్ జగన్ అభినందించారు. ఆమె బుధవారం క్యాంపు కార్యాలయంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని కలిశారు. ఇటీవల బెర్లిన్‌లో జరిగిన వరల్డ్ ఆర్చరీ చాంపియన్‌షిప్, పారిస్‌లో జరిగిన ఆర్చరీ వరల్డ్ కప్‌లో సాధించిన పతకాలను సీఎంకు చూపించారు. సీఎం జగన్ మాట్లాడుతూ..అంతర్జాతీయ వేదికలపై అద్భుత ప్రదర్శనతో సురేఖ దేశ ప్రతిష్టను ఇనుమడింపజేసిందని ప్రశంసించారు. ప్రభుత్వం తరఫున క్రీడాకారులకు పూర్తి సహాయ సహకారాలు అందిస్తున్నామని చెప్పారు. భవిష్యత్తులోనూ ఇదే స్థాయిలో రాణించాలని ఆకాంక్షించారు. అనంతరం సురేఖ తనకు డిప్యూటీ కలెక్టర్‌గా ఉద్యోగం ఇచ్చినందుకు సీఎం జగన్‌కు కృతజ్ఞతలు తెలిపారు. ఆమె తండ్రి వెన్నం సురేంద్ర కుమార్ పాల్గొన్నారు.

కేంద్ర విద్యాసంస్థల్లోని పనులు త్వరగా పూర్తి చేయాలి

అధికారులకు సీఎస్ జవహర్‌రెడ్డి ఆదేశం

సాక్షి, అమరావతి: రాష్ట్రంలోని కేంద్ర విద్యా సంస్థల్లో మౌలిక సదుపాయాల కల్పన పనులను వేగంగా పూర్తి చేయాలని అధికారులను ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డా.కేఎస్ జవహర్‌రెడ్డి ఆదేశించారు. బుధవారం రాష్ట్ర సచివాలయంలో సంబంధిత శాఖల అధికారులతో సీఎస్ సమీక్ష నిర్వహించారు. కేంద్ర ప్రభుత్వం మంజూరు చేసిన వివిధ విద్యా సంస్థల్లో జరుగుతున్న నిర్మాణాలు, రహదారులు, విద్యుత్, నీటి వసతి, ప్రహరీల నిర్మాణం తదితర మౌలిక సదుపాయాల కల్పనకు సంబంధించిన పనుల ప్రగతిని సీఎస్ సమీక్షించారు. ఐఐటీ(తిరుపతి), ఐఐఎస్ఈఆర్(తిరుపతి), ఎన్ఐటీ (తాడేపల్లిగూడెం), ఐఐఎం(విశాఖ), సెంట్రల్ యూనివర్సిటీ(అనంతపురం), ఐఐఐటీడీఎం(కర్నూలు), సెంట్రల్ ట్రైబల్ యూనివర్సిటీ (విజయనగరం), ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పెట్రోలియం అండ్ ఎనర్జీ(విశాఖ), ఎయిమ్స్(మంగళగిరి), ఎన్ఐడీఎం(ఎన్టీఆర్ జిల్లా గన్నవరం)లోని మౌలిక సదుపాయాల కల్పన పనులపై సమీక్షించారు. నిర్దేశిత గడువు ప్రకారం పనులు పూర్తి చేయాలని ఆయన ఆదేశించారు. ప్రతి నెలా చివరి సోమవారం షెడ్యూల్–13 విద్యా సంస్థల పనుల ప్రగతిని సమీక్షిస్తానని చెప్పారు. సమావేశంలో ఉన్నతాధికారులు ఎస్ఎస్ రావత్, ఎల్.ప్రేమ్‌చంద్రారెడ్డి, జె.శ్యామలరావు, ప్రద్యుమ్న, యువరాజ్, డా.బి.ఆర్.అంబేద్కర్ తదితరులు పాల్గొన్నారు. వర్చువల్‌గా జిల్లాల కలెక్టర్లు, ఇతర అధికారులు పాల్గొన్నారు.



పిల్లితో ఆటలాడేవాడు దాని గోటి గీతలకు సిద్ధంగా ఉండాలి.
- మిగెల్ సెర్వాంటిజ్

సాక్షి
గురువారం, 24 ఆగస్టు 2023

మహోన్నత ఘట్టం

కోట్లాదిమంది భారతీయులు ఊపిరి బిగపట్టి ఎదురుచూసిన ఒక అపురూపమైన, మహోన్నతమైన ఘట్టం అంతరిక్షంలో ఆవిష్కృతమైంది. సహస్రాబ్దాలుగా విశ్వ మానవాళికి కనువిందు చేస్తున్న చందమామపై పరిశోధనల కోసం మన శాస్త్రవేత్తలు ప్రయోగించిన చంద్రయాన్–3 మిషన్ బుధవారం అఖండ విజయం సాధించింది. ఎవరికీ లొంగిరాని చంద్రుడి తలంపైనున్న దక్షిణ ధ్రువ ప్రాంతాన్ని పరిశోధనల కోసం ఎంచుకుని, విక్రమ్ ల్యాండర్‌ను అక్కడే దించితీరాలన్న లక్ష్యంతో పనిచేసిన మన శాస్త్రవేత్తల సాహస ప్రయత్నం సాకారం కావడం ప్రపంచ దేశాలను అబ్బురపరిచింది. దేశం సగర్వంగా తలెత్తుకునేలా చేసింది. విక్రమ్ ల్యాండర్ సరిగ్గా అనుకున్నచోటే, అనుకున్న సమయానికే సురక్షితంగా కాలూనడం అంతర్జాతీయ అంతరిక్ష పరిశోధనల పరంపరను కీలక మలుపు తిప్పే ఒక అసాధారణ విన్యాసం. ప్రధాని నరేంద్ర మోదీ చెప్పినట్టు ఇదొక చారిత్రక ఘట్టం. దీని వెనక వందలాదిమంది శాస్త్రవేత్తల నాలుగేళ్ల నిరంతర కృషి, దృఢసంకల్పమూ పెనవేసుకుని ఉన్నాయి. ముఖ్యంగా గత 41 రోజులుగా అన్ని విభాగాలకు చెందిన శాస్త్రవేత్తలూ పరస్పర సమన్వయంతో రాత్రింబగళ్లు పనిచేస్తూ చంద్రయాన్ గమనాన్ని కళ్లల్లో వత్తులు వేసుకుని చూశారు. రెప్పవాల్చని నిఘాతో ఎప్పటికప్పుడు దాన్ని నిశితంగా గమనిస్తూ అవసరమైన జాగ్రత్తలు తీసుకున్నారు. ఈ ప్రాజెక్టుతో ముడిపడిన శాస్త్ర, సాంకేతిక సిబ్బంది అందరూ చంద్రయాన్‌నే శ్వాసించారు. మరే వ్యాపకమూ లేదన్నట్టు ఈ ప్రాజెక్టుపైనే తమ సర్వశక్తులూ కేంద్రీకరించారు. మన శాస్త్రవేత్తల ప్రయోగాల్లో వైఫల్యాల శాతం అతి తక్కువ. చంద్రయాన్–2 ప్రాజెక్టులో పంపిన విక్రమ్ ల్యాండర్ చంద్రుడి గురుత్వాకర్షణ వేగాన్ని అధిగమించలేక విఫలమైందన్న మాటేగానీ, దాంతోపాటు పంపిన ఆర్బిటర్ ఇంకా పనిచేస్తూ ప్రస్తుత ప్రాజెక్టుకు అవసరమైన డేటాను అందించింది. గత నెల 14న శ్రీహరికోట నుంచి ప్రయోగించిన చంద్రయాన్–3 వ్యోమనౌక కక్ష్యను శాస్త్రవేత్తలు దశలవారీ పెంచుతూ రాగా, ఈనెల 1న భూ కక్ష్యను దాటుకుని చంద్రుడి కక్ష్య దిశగా అది దూసుకెళ్లింది. మరో నాలుగురోజులకు చంద్రుడి కక్ష్యలో చేరగా, ఆనాటినుంచీ దాని కక్ష్యను తగ్గించుకుంటూ వచ్చారు. ల్యాండర్‌ను కిందకు దించే ప్రక్రియను కొనసాగించాలా లేదా అన్నది కేవలం కొన్ని గంటలముందు నిర్ణయించవలసివుంటుంది. అప్పుడు కూడా అంతా సవ్యంగానే సాగుతున్నదని నిర్ధారించుకుని సరిగ్గా ముందనుకున్నట్టే సాయంత్రం 5.45కి ల్యాండర్‌ను చంద్రుడి ఉపరితలంపైకి మళ్లించే దశకు శాస్త్రవేత్తలు శ్రీకారం చుట్టారు. ఏ దశలోనూ చంద్రయాన్–3కి అవాంతరాలు ఎదురుకాకపోవటం, చివరకు శాస్త్రవేత్తలు సైతం అత్యంత కష్టసాధ్యమైనదని భావించిన చివరి 17 నిమిషాలూ అంచనాలకు అనుగుణంగా ముగియటం అనితర సాధ్యమైన ప్రక్రియ. ల్యాండింగ్ సమయంలో ఏ వ్యవస్థ విఫలమైనా ఆ వెంటనే మరో వ్యవస్థ దాన్ని నెరవేర్చేలా పకడ్బందీ ఏర్పాట్లు చేశారు.

వివిధ దేశాలు చంద్రుడిపైకి ఇంతవరకూ మొత్తం 18 వ్యోమనౌకలు పంపగా, అందులో 40 శాతం విఫలమయ్యాయి. 1959 జనవరిలో పూర్వపు సోవియెట్ యూనియన్ తొలి వ్యోమనౌకను పంపింది. 1976 తర్వాత... అంటే 47 ఏళ్ల తర్వాత ఇన్నాళ్లకు జరిపిన రెండో లూనా–25 ప్రయోగం ఆ దేశాన్ని తీవ్రంగా నిరాశ పరిచింది. ఈనెల 19న తమ వ్యోమనౌక విఫలమైందని ఆ దేశ అంతరిక్ష పరిశోధనా సంస్థ ఆ మరునాడు ప్రకటించింది. అంతరిక్ష రంగంలో కాకలు తీరిన సంస్థే విఫలమైందంటే ఇలాంటి ప్రాజెక్టుల్లో ఎన్ని సంక్లిష్టతలు ఇమిడివుంటాయో అర్థం చేసుకోవచ్చు. వాస్తవానికి మన చంద్రయాన్–2 ప్రాజెక్టుకు సహకరించడానికి అప్పట్లో రష్యా ముందుకొచ్చింది. 2011–12 మధ్య జరగాల్సిన ఆ ప్రయోగానికి రాకెట్, ఆర్బిటర్ మనం సమకూర్చుకోవటానికి, ల్యాండర్, రోవర్‌లను రష్యా అందించటానికి అవగాహన కుదిరింది. తీరా ఆ రెండూ వేరే ప్రయోగాల్లో విఫలం కావటం, రష్యా రూపొందించిన కొత్త డిజైన్లు మన రాకెట్‌కు అనువుగాలేని కారణంగా వాటిని సొంతంగానే రూపొందించుకోవాలని ఇస్రో నిర్ణయించింది. అందువల్లే 2019కి గానీ చంద్రయాన్–2 సాధ్యపడలేదు. అందులో ఎదురైన వైఫల్యాల నుంచి గుణపాఠం తీసుకోబట్టే తాజా విజయం చేతికందింది.

చంద్రుడిపై అతి శీతల ప్రాంతమైన దక్షిణ ధ్రువంలో ఇంతవరకూ ఏ దేశమూ తలపెట్టని అరుదైన ప్రయోగాలు ప్రజ్ఞాన్ రోవర్ నిర్వహిస్తుంది. చంద్రుడిపై ఉన్న మట్టిని, అక్కడి శిలలను సేకరించి మౌలిక, రసాయన సమ్మేళనాల డేటాను ఎప్పటికప్పుడు శాస్త్రవేత్తలకు పంపుతుంటుంది. ఉపరితలంపై ఉన్న మట్టిలోని అయాన్లనూ, ఎలక్ట్రాన్లనూ, వాటి సాంద్రతనూ మదింపు వేస్తుంది. వాటిల్లో కాలానుగుణంగా వచ్చిన మార్పులను పసిగడుతుంది. ఉపరితలంపై ఉన్న ఉష్ణోగ్రతనూ, అక్కడ వచ్చే కంపనాలనూ అంచనా వేస్తుంది. ఈ ప్రయోగాలన్నీ అది ఒక చాంద్రదినం (మనకు 14 రోజుల కాలం)లో పూర్తిచేయాల్సివుంటుంది. ఆ తర్వాత దాని జీవనయానం ముగుస్తుంది. సాంకేతికంగా ఎన్నో సంక్లిష్టతలతో నిండివున్న ఈ ప్రయోగానికి సిద్ధపడటం, వేరే దేశాలతో పోలిస్తే దాన్ని అత్యంత చౌకగా (ఈ ప్రాజెక్టు వ్యయం రూ. 600 కోట్లు) పూర్తి చేయటం మన శాస్త్రవేత్తల సమర్థతను తెలియజేస్తుంది. అణ్వస్త్ర దేశంగా, అయిదో అతి పెద్ద ఆర్థిక వ్యవస్థగా ఉన్న భారత్ ప్రతిష్ఠను చంద్రయాన్–3 ఘన విజయం మరింత పెంచింది. ఇది మరిన్ని ప్రయోగాలకు దోహదపడి మొత్తంగా మానవాళి జ్ఞానాన్ని మరింత సునిశితం చేయగలదని ఆశించాలి.

గ్రహం అనుగ్రహం

శ్రీ శోభకృత్ నామ సంవత్సరం, దక్షిణాయణం, వర్ష ఋతువు. నిజ శ్రావణ మాసం, **తిథి:** శు.అష్టమి రా.9.29 వరకు, తదుపరి నవమి, **నక్షత్రం:** అనూరాధ తె.5.02 వరకు (తెల్లవారితే శుక్రవారం), తదుపరి జ్యేష్ఠ, **వర్జ్యం:** ఉ.9.04 నుండి 10.40 వరకు, **దుర్ముహూర్తం:** ఉ.9.56 నుండి 10.47 వరకు, తదుపరి ప.2.56 నుండి 3.47 వరకు , **అమృతఘడియలు:** సా.6.37 నుండి 8.13 వరకు.

సూర్యోదయం : 5.47
సూర్యాస్తమయం : 6.18
రాహుకాలం : ప.1.30 నుండి 3.00 వరకు
యమగండం : ఉ.6.00 నుండి 7.30 వరకు

మణిపూర్ గాయాల్ని మాన్పాలంటే...

విశ్లేషణ



యశోవర్ధన్ ఆజాద్

మణిపూర్ పోలీసులకు చెందిన సుమారు 4,500 ఆయుధాల ఆచూకీ ఇప్పటికీ తెలియదు. కేంద్రం వెంటనే రాష్ట్ర పాలనా బాధ్యతలు తీసుకోవాల్సిన అసాధారణమైన, ప్రమాదకరమైన పరిస్థితి ఇది. మణిపూర్ ఏళ్లుగా తుపాకుల నీడలో, మత్తుమందుల ప్రభావంలో, బలవంతపు వసూళ్ల మధ్య బతికింది. వీటన్నింటి నుంచి బయటపడేందుకు రాష్ట్రానికి న్యాయమైన అవకాశం ఇవ్వాల్సిన సమయం ఇదే. రాజకీయంగా చర్చలు ప్రారంభించాలి. ఆర్థిక పరిపుష్టికి ఊతమివ్వాలి. మణిపూర్‌లోని అన్ని తెగలు కూడా దృఢమైన, న్యాయమైన పాలన కోసం ఎదురు చూస్తున్నాయి. రాష్ట్రపతి పాలనలో సమర్థమైన అధికార యంత్రాంగం మణిపూర్‌ను మళ్లీ సరైన మార్గంలో పెట్టగలదు.

మణిపూర్ నివురుగప్పిన నిప్పులా అసందిగ్ధ భవిష్యత్తుకేసి చూస్తోంది. వేలాది మంది నిరాశ్రయులయ్యారు. ఇళ్లు, దుకాణాలు, రహదారులు కూడా ధ్వంసమైపోయి రాష్ట్రం నిర్జీవమైన మట్టిదిబ్బ రూపం సంతరించుకుంది. అవిశ్వాస తీర్మానం సందర్భంగా మణిపూర్ ప్రస్తావన పార్లమెంటులో వచ్చింది. కానీ ఇరు పక్షాల పరస్పర నిందారోపణలతో ఒరిగింది శూన్యం. దేశ సర్వోన్నత న్యాయస్థానం మార్గదర్శకాలను అమలు చేసే క్రమంలో అసాం రైఫిల్స్, మణిపూర్ పోలీసుల మధ్య ఘర్షణపూరిత వాతావరణం కూడా పరిస్థితి మరింత దిగజారేందుకు కారణమైంది.

ఈ ఏడాది మే 4న కాంగ్పోక్పీ జిల్లాలో ఇద్దరు అమాయక మహిళలపై జరిగిన అకృత్యాలు సుప్రీంకోర్టును సైతం నిర్ఘాంతపోయేలా చేశాయి. రాష్ట్రం తన బాధ్యతను పూర్తిగా విస్మరించగా కొందరి ప్రయోజనాలు, పక్షపాతాలతో రాజకీయాలు నడిచాయి. జిల్లాలో సామూహిక అత్యాచారం జరిగితే కలెక్టర్ అయినా, ఎస్పీ అయినా అస్సలు సహించరాదు. అధ్వాన్నమైన స్థితి ఏమిటంటే... సంఘటన జరిగిన తొలిరోజే పోలీసులు ఎఫ్ఐఆర్ దాఖలు చేయకపోవడం. వారిని ఉద్యోగాల్లోంచి తొలగించేందుకు ఇంతకంటే బలమైన కారణం కనిపించదు. కొన్ని రోజుల తరువాత ఎఫ్ఐఆర్ దాఖలు చేసినా పరిస్థితి ఎక్కడిదక్కడే ఉంది. పోలీసులు, నాయకులు తమ బాధ్యతలను విస్మరించి, వారి వారి తెగల్లో హీరోలు కావాలని అనుకుంటే ఇంతకంటే ఎక్కువేమీ ఆశించలేము. ఈ ఘటన తరువాతి రోజే ఇంఫాల్‌లో కార్లు కడిగే పనిచేస్తున్న ఇద్దరు మహిళలపై దారుణమైన నేరం జరిగింది. రాష్ట్రం స్పందన భిన్నంగా ఏమీ లేదు. దౌర్భాగ్యకరమైన స్థితి ఏమిటంటే, ఈ మూక దాడుల్లో మహిళలూ భాగస్వాములు కావడం!

రాష్ట్ర పోలీసులకు చెందిన సుమారు 4,500 ఆయుధాల ఆచూకీ ఇప్పటికీ తెలియదు. కేంద్రం వెంటనే రాష్ట్ర పాలనా బాధ్యతలు తీసుకోవాల్సిన అసాధారణమైన, ప్రమాదకరమైన పరిస్థితి ఇది. నిఘా వర్గాలు కూడా దీనిపై కచ్చితంగా నివేదిక అందించే ఉంటాయి. రాష్ట్రం తనదైన కారణాలతో నోరు మెదపదు కానీ అంతర్గత ఘర్షణలతో అట్టుడుకుతున్న రాష్ట్రాన్ని కాపాడాల్సిన బాధ్యత కేంద్రానిది. నిబద్ధత కలిగిన హోంశాఖ కార్యదర్శి ఎవరైనా సరే... మణిపూర్ ఘటనపై సీరియస్‌గా స్పందించి ఉండేవారు. రాష్ట్ర ప్రభుత్వ యంత్రాంగం కుప్పకూలుతున్న వైనాన్ని గమనించి రాష్ట్రపతి పాలన విధించాల్సిందిగా సిఫారసు చేసేవారు. అయితే జరిగిందేమిటి? ఎత్తుకెళ్లిన ఆయుధాలు తిరిగి ఇచ్చేయండి సామీ అని రాష్ట్ర డీజీపీ స్వయంగా బతిమాలడం, ఆయుధాల సేకరణ కోసం రాజకీయ నేతల ఇళ్ల ముంగిట్లో డ్రాప్‌బాక్స్‌ల ఏర్పాటుచేయడం!

మణిపూర్ విషయంలో కేంద్రం నిర్ణయాత్మకంగా వ్యవహరించాల్సిన సమయం ఇదే. రాష్ట్రం సాధారణ స్థితికి చేరుకుని తన కాళ్లపై తాను నిలబడగలగాలంటే కనీసం రెండేళ్లపాటు రాజకీయాలను



దూరంగా పెట్టాలి. నిష్పక్షపాతమైన, ప్రొఫెషనల్‌గా వ్యవహరించే యంత్రాంగం పాలనా విధులు చేపట్టాలి. మణిపూర్‌ను మళ్లీ సాధారణ స్థితికి తెచ్చేందుకు ఈ కార్యాచరణ అనుసరించడం మేలు:

1. రాష్ట్ర పెద్దగా బాధ్యతగా వ్యవహరించలేకపోయిన, ప్రజల నైతిక మద్దతు కోల్పోయిన ముఖ్యమంత్రిని వెంటనే తొలగించాలి. కుకీలతోపాటు కొందరు మైతేయిల్లోనూ ముఖ్యమంత్రిపై విశ్వాసం పోయింది. శాంతిభద్రతలు భయంకరంగా ఉన్నాయని బీజేపీ నేతలే కొందరు వ్యాఖ్యానించడం గమనార్హం. ముఖ్యమంత్రిని పదవి నుంచి తొలగించడం ద్వారా ప్రధానమంత్రి రాష్ట్రానికి మాత్రమే కాకుండా, తనకు తాను మేలు చేసుకున్న వారవుతారు. 2. రాష్ట్రపతి పాలన విధించాలి. రాష్ట్రంలోని విశ్రాంత అధికారుల్లో సమర్థులను ఎన్నుకుని గవర్నర్‌గా నియమించాలి. 3. ఐఏఎస్, ఐపీఎస్, రక్షణ శాఖల నుంచి ఒక్కొక్కరిని గవర్నర్‌కు సలహాదారులుగా నియమించాలి. జి.ఎస్. పంధేర్, హర్జీత్ సంధూ, ఎ.ఎన్.ఝా, నిఖిలేష్ ఝా, జాన్ షిల్ఫీ, జర్నైల్ సింగ్, బీ.ఎల్.వోహ్రా లాంటి అత్యుత్తమ అధికారులను పరిగణనలోకి తీసుకోవచ్చు. ఆర్థిక, పారిశ్రామిక పరిస్థితిని పునరుద్ధరించేందుకు ఆర్థికరంగ నిపుణులు ఒకరిని కూడా సలహాదారుగా నియమించుకోవచ్చు. 4. ప్రత్యేక హక్కుల చట్టంతో సైన్యాన్ని తీసుకురావద్దు. ప్రజా స్వామ్య దేశంలో ఒక రాష్ట్రాన్ని పాలించలేమన్న సంకేతాన్ని పంపడం అనవసరం. పైగా ఏఎఫ్ఎస్పీఏతో సైన్యాన్ని దింపితే అది పాత గాయాలను మళ్లీ రేపవచ్చు. 5. క్షేత్రస్థాయి పోలీసింగ్ మళ్లీ మొదటి నుంచి మొదలుపెట్టాలి. అవసరమైతే జిల్లా మేజిస్ట్రేట్‌లు, ఎస్పీలను డిప్యుటేషన్‌పై బయటి రాష్ట్రాల నుంచి తీసుకురావచ్చు.

6. ఆయుధాలు ఎత్తుకెళ్లిన వారిని 'సిట్'లు అరెస్ట్ చేసేలా చూడాలి. దుండగుల చేతుల్లో 4,500 ఆయుధాలున్నాయంటే మణిపూర్ ఇప్పుడు సాయుధ రాష్ట్రమనే లెక్క. ఆయుధాలు ఎత్తుకెళ్లిన వారి పేర్లు వెల్లడించకపోతే తగిన చర్యలుంటాయని పోలీసులను హెచ్చరించాలి. దోపిడి సమయంలో అక్కడే ఉన్నవారిపై చట్టపరమైన విచారణ జరగాలి. 7. మిలిటెంట్లకు వ్యతిరేకంగా భద్రతాదళాలు తీసుకుంటున్న చర్యలకు విఘాతం కలిగిస్తున్న మహిళా వర్గాలపై కఠినమైన చర్యలు తీసుకోవాలి. తగినంత మంది మహిళ అధికారిణులు, సిబ్బందిని ఈ కార్యక్రమాల కోసం ఉపయోగించాలి. 8. నిందితుల విచారణకు ప్రత్యేక న్యాయస్థానాలు, నేర విచారణ బృందాలను ఏర్పాటు చేయాలి. తమకు న్యాయం జరుగుతుందన్న నమ్మకం బాధితుల్లో కలిగించేందుకు ఇది అత్యవసరం. 9. కుకీ మిలిటెంటు గ్రూపులు ఇరవై ఐదింటిపై చర్యలను నిలిపి వేయడంపై ఉన్న గందరగోళాన్ని తొలగించాలి. పద్నాలుగు క్యాంపుల్లోని 2,200 మంది కేడర్ వద్ద ఉన్న ఆయుధాలను సమీక్షించాలి. కుకీ, మైతేయి మిలిటెంట్లు ఏర్పాటు చేసుకున్న బలవంతపు వసూళ్ల చెక్ పోస్టులను పెకిలించాలి. నల్లమందు మాఫియాపై స్థానిక పోలీసులు కఠిన చర్యలకు దిగాలి. ఈ మాఫియాలో కొందరు రాజకీయ నేతలూ మిలాఖత్ అయి ఉన్నారు. డ్రగ్ మాఫియాకు వ్యతిరేకంగా వీరోచితంగా పోరాడుతున్న అదనపు ఎస్పీ థౌనావోజామ్ బృందం తనకు తగిన మద్దతు లేదని రాజీనామా చేయాల్సి వచ్చింది. ఇటువంటి వారిని మళ్లీ నియమించుకుని డ్రగ్ మాఫియా ఆటలు కట్టేలా చూడాలి. 10. నిరాశ్రయులైనవారు మళ్లీ తమ ఇళ్లకు చేరుకునేలా జిల్లా కలెక్టర్లు చర్యలు తీసుకోవాలి. ఇందుకు రాష్ట్ర ఖజానా నుంచి ఖర్చు చేయాలి.

పాలన యంత్రాంగ చక్రాలు కదలడం మొదలై, అది ప్రజలకు స్పష్టంగా కనిపించడం మొదలుపెట్టిన తరువాత రెండో దశ కార్యకలాపాలకు శ్రీకారం చుట్టాలి. పోలీసు కౌన్సిల్స్ ఏర్పాటు చేసి అందులో తటస్థులైన విద్యావేత్తలు, జర్నలిస్టులు, పౌర సమాజపు సభ్యులను చేర్చాలి. గతంలో భయంతో లేదా తమ తెగలకు నిబద్ధంగా ఉండాలన్న కారణంతో కొందరు సభ్యులు రాజీనామా చేశారు. తటస్థులను సభ్యులుగా చేయడం ద్వారా శాంతి స్థాపన సాధ్యం.

చివరగా... ఘర్షణల సమయంలో ఇతరుల ప్రాణాలు కాపాడేందుకు తెగువ చూపిన వారిని బహిరంగంగా గౌరవించాలి. కుకీలున్న చోట మైతేయిలను, మైతేయిల ప్రాబల్యం ఉన్న చోట కుకీలను కాపాడిన ఘటనలు కోకొల్లలు. 77వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల సందర్భంగా ఎర్రకోట నుంచి మాట్లాడుతూ ప్రధాని నరేంద్ర మోదీ మణిపూర్ సంక్షోభాన్ని పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఈ పరిష్కారం దీర్ఘకాలికమైందిగా ఉండాలి. ప్రతి తెగకూ తమ బాధలు చెప్పుకునేందుకు అనువైన వేదిక, ప్రాతినిధ్యం కల్పించాలి. అప్పుడు మాత్రమే ఉగ్రవాదులు ఆయుధాలు వదిలేయడం సాధ్యమవుతుంది. కంచెలు, కందకాలు తొలగిపోతాయి.

కేంద్ర మాజీ సమాచార కమిషనర్,
విశ్రాంత ఐపీఎస్ అధికారి, డీప్‌స్ట్రాట్ ఛైర్మన్
('ది ఇండియన్ ఎక్స్‌ప్రెస్' సౌజన్యంతో)

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!

సోషల్ మీడియా

చారిత్రక సందర్భం



చంద్రయాన్–3తో విజయవంతంగా చంద్రుడి మీద దిగినందుకు ఇండియాకూ, ఇస్రో బృందానికీ నా హృదయపూర్వక అభినందనలు. ఇది ఇండియాకే కాదు, మొత్తం ప్రపంచానికే చారిత్రక దినం.

– ఫిలిప్ అకర్‌మాన్, భారత్‌లో జర్మనీ రాయబారి

అద్భుత విజయం



అద్భుతమైన విజయంతో చంద్రుడి దక్షిణ ధ్రువంలో దిగిన మొదటి దేశం అయినందుకు ఇండియాకూ, 'ఇస్రో'కూ హృదయపూర్వక అభినందనలు. అంతరిక్షాన్ని తరచిచూడటంలో మీ కార్యదీక్ష మా అందరినీ 'మూన్‌స్ట్రక్' (ఉన్మత్తులను) చేసింది.

– నవోర్ గిలాన్, భారత్‌లో ఇజ్రాయిల్ రాయబారి


ఎందుకో తెలియొద్దా?



బిల్లును తిప్పిపంపినప్పుడు పార్లమెంటుకు/ప్రభుత్వానికి రాష్ట్రపతి ఒక లేఖను పంపాల్సిన అవసరం లేదని కొంద రంటారు. కానీ ఆయనో, ఆయన కార్యదర్శో లేఖ రాయకపోతే, బిల్లు మీద ఆయన అభ్యంతరాలను పార్లమెంట్/ప్రభుత్వం ఎలా తెలుసుకుంటుంది? అభ్యంతరాలను పేర్కొనకుండా కేవలం అలా తిప్పిపంపలేడు కదా?

– మార్కండేయ కట్జూ, సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి

గర్వకారణం



నా క్లినిక్ ఈ రోజు (ఆగస్ట్ 23) సాయంత్రం 5:45 నుంచి 6:15 మధ్య తాత్కాలికంగా మూసివుంటుంది. ప్రజ్ఞాన్ (చంద్రయాన్–3 రోవర్), ప్రజ్ఞాన్ (చదరంగ బాలమేధావి) మన దేశానికి గర్వ కారణం.

– పి. కామత్, గుండె వైద్యుడు

ఆట కాదు!



చంద్రయాన్–3 విజయం పట్ల భారతీయులం ఆనందపడుతూనే, ఒక చరిత్ర పాఠాన్ని మనసులో ఉంచుకోవాలి. చంద్రుడి మీద 64 ఏళ్ల క్రితం విజయవంతంగా దిగిన మొదటి దేశం రష్యా. అయినప్పటికీ వారి చివరి మిషన్ విఫలమైంది. అంతరిక్షమనేది కఠినమైనది, అదేమీ క్రీడ కాదు. దాన్నో సైన్స్ మిషన్‌లా కాకుండా, ఐపీఎల్ మ్యాచులా చూడకూడదు.

– గౌరవ్ సబ్నిస్, అసోసియేట్ ప్రొఫెసర్

జోక్యం ఎందుకు?



ఫేస్‌బుక్ స్వతంత్ర ఫ్యాక్ట్ చెకర్స్‌ను కలిగివుందనీ, అది అన్ని దృక్కోణాలను స్వాగతిస్తుందనీ, ఎన్నికల్లో జోక్యం చేసుకోదనీ మార్క్ జుకర్‌బెర్గ్ చెబుతారు. కానీ జాతీయ ప్రజాభిప్రాయ సేకరణ సమయంలో – తమ శత్రువుల మీద సెన్సార్‌షిప్ విధించాలని డిమాండ్ చేసే యాక్టివిస్టులకు ఫేస్‌బుక్ నిధులు కూర్చిందని ఒక పరిశోధన కనుగొంది.

– మైకేల్ షెలెన్‌బెర్గర్, అమెరికా రచయిత

ఉండిపోతాం!



ఇతరుల మీద మీరు కలిగించే ప్రభావాన్ని తక్కువ అంచనా వేయొద్దు. నేను ఇప్పటికీ ఒక యూట్యూబ్ వీడియోలో చూపించినట్టుగా పాస్తా వండుతాను. నేను నా స్నేహితురాలికి క్రిస్మస్ కానుకగా ఇచ్చిన అదే బ్రాండ్ చాక్లెట్లను తను ఇప్పటికీ కొంటుంది. కొందరు వాళ్ల 'మాజీలు విన్న సంగీతాన్ని ఇప్పటికీ వింటుంటారు. జనాలు వెళ్లిపోవచ్చు, కానీ జ్ఞాపకాలు ఉండి పోతాయి.

– పెర్రీ, బ్లాగర్

సాక్షి ఎడిటోరియల్ పేజీకి వ్యాసాలను, అభిప్రాయాలను యూనికోడ్‌లో పంపాలి. ఎక్కడా పరిశీలనలో లేనట్టు హామీపత్రం జతచేయాలి. ఈ–మెయిల్: editpage@sakshi.com

అభ్యుదయ గోపురం

ప్రజా ఉద్యమంలో పుట్టి వేద భారతాన్ని అన్వేషించిన అక్షర వాచస్పతి దాశరథి రంగాచార్యులు. రాముడిని ఆరాధ్య దైవంగా, మార్క్స్‌ను మహాత్ముడిగా కొలిచిన ఆయన సంప్రదాయ పునాదుల మీద పెరిగిన అభ్యుదయ గోపురం. తెలుగు నాట కథ, కవిత, నవల, జీవిత చరిత్ర, విమర్శ, అనువాదం వంటి ప్రక్రియలలో విశేష కృషి చేశారు. తెలంగాణ సాయుధ పోరాట కాలంలో ఆనాటి ప్రజల కడగండ్లను తన నవలల ద్వారా కళ్ళకు కట్టినట్టు చిత్రీకరించారు.



దాశరథి రంగాచార్య

రంగాచార్య 1928 ఆగస్టు 24న మహబూబాబాద్ జిల్లా చిన్న గూడూరు గ్రామంలో జన్మించారు. 12 ఏళ్ల వయసులోనే నిజాం నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా ఓనమాలు నేర్చుకున్నారు. 'ఆంధ్ర మహాసభ', 'ఆర్య సమాజ్' పోరాటాలకు ఆకర్షితులై ఎన్నో ఉద్యమాలు చేసి జైలు శిక్ష అనుభవించారు. తెలంగాణ సాయుధ పోరాట విరమణ తర్వాత ప్రభుత్వ ఉపాధ్యాయుడిగా, గ్రంథాలయ నిర్వాహకులుగా కొంతకాలం పని చేశారు. ఆ తర్వాత సికింద్రాబాద్ మున్సిపల్ కార్పొరేషన్‌లో 32 ఏళ్ళు ఉద్యోగం చేసి అసిస్టెంట్ కమిషనర్ హోదాలో పదవీ విరమణ పొందారు.

దాశరథి రంగాచార్య రచించిన గొప్పల నవల 'చిల్లర దేవుళ్ళు' నిజాం కాలపు భూస్వాముల ఆగడాలను దృశ్యమానం చేసింది. ఈ నవలకు కొనసాగింపుగా 'మోదుగు పూలు' రాశారు. నియంతృత్వ వ్యవస్థకు ప్రతినిధులుగా నిలిచిన పోలీస్ అధికారులు, జమీందార్ల అరాచకాలనూ, సామాన్య జనాల దయనీయమైన స్థితిగతులనూ ఇందులో చిత్రించారు. తెలంగాణ సాయుధ పోరాటం అనంతర పరిస్థితులను 'జనపదం' నవలలో అక్షరీకరించారు. తన ఆత్మ కథకు అక్షరూపంగా 'జీవనయానం' రచించారు. భారత, భాగవత, రామాయణాలనే కాదు... భారతీయ తాత్విక మూలాలు అయిన వేదాలను సైతం 'చతుర్వేద సంహిత' పేరుతో వ్యవహారిక వచనంలో అనువదించారు.

సాహితీ ప్రస్థానంలో అలుపెరుగని యోధుడు అయిన దాశరథి 2015 జూన్ 8న తుది శ్వాస విడిచారు. ఆయన రగిలించిన స్ఫూర్తి మాత్రం నవదీప్తిగా రగులుతూ ఉంటుంది.

– అంకం నరేష్; టీచర్, నిజామాబాద్
(నేడు దాశరథి రంగాచార్య జయంతి)

కాంట్రాక్టు కార్మికుల జీవితాల్లో వెలుగు

అభిప్రాయం



డా. పూనూరు గౌతమ్ రెడ్డి

స్వాతంత్ర్య దినోత్సవ పర్వదినాన్ని పురస్కరించుకుని రాష్ట్ర ప్రభుత్వంలోని వివిధ శాఖల్లో పనిచేస్తున్న కాంట్రాక్టు కార్మికులను క్రమబద్ధీకరించే కార్యక్రమాన్ని తీసుకున్నారు ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి. 2014 జూన్ 2వ తేదీకి ముందు సర్వీసులో ఉన్న వారికి ఈ అవకాశం కల్పించే బృహత్తర కార్యక్రమానికి తెర తీశారు. వాస్తవంగా ముందుగా తీసుకున్న నిర్ణయం మేరకు దాదాపు 10 వేల మంది వరకు కాంట్రాక్టు ఉద్యోగులను క్రమబద్ధీరించాలని భావించారు. అయితే 2014 జూన్ 2 నాటికి ఐదేళ్ల సర్వీస్ పూర్తిచేసి ఉండాలన్న నిబంధన తొలగించడంతో ప్రస్తుతం క్రమబద్ధీకరణకు అర్హుల సంఖ్య 14 వేల మందికి చేరుకున్నట్లు ఒక అంచనా.

ఇదే కాంట్రాక్టు కార్మికులు తమ ఉద్యోగాలను క్రమబద్ధీకరించమని 2014 నుండి 2019 మధ్య అనేక పర్యాయాలు అప్పటి సీఎం చంద్రబాబును బతిమాలుకున్నా ప్రయోజనం లేకపోయింది. జగన్ మోహన్ రెడ్డి ఆ నాడు ప్రతిపక్ష నేతగా అసెంబ్లీ సాక్షిగా కాంట్రాక్టు కార్మికుల సమస్యలపై గళమెత్తితే ఒక కమిటీ వేసి కాలయాపన చేశారు చంద్రబాబు.

ఒక విజన్ ఉన్న నేతగా సీఎం కుర్చీ ఎక్కగానే ముందుగా పారిశుద్ధ్య కార్మికులకు రూ. 7,500 మాత్రమే ఉన్న వేతనాన్ని ఒక్క సారిగా రూ.16 వేలకు, ఆ తరువాత రూ. 21 వేలకు పెంచారు. అక్కడ నుండి ప్రారంభమైన అయన ఔదార్యం అన్ని ప్రభుత్వ శాఖల్లో పనిచేస్తున్న కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు విస్తరించింది. అంగన్వాడీ కార్మికుల వేతనాలూ పెంచారు. వైసీపీ ప్రభుత్వం రాకముందు, అంటే గత అసెంబ్లీ ఎన్నికలకు ఆరు నెలల ముందు వరకూ అంగన్వాడీ టీచర్లకు నెలకు రూ. 7 వేలు, హెల్పర్లకు రూ. 4,500 మాత్రమే జీతంగా ఉండేది. జగన్ ముఖ్యమంత్రిగా అధికారం చేపట్టిన మొదటి మూడు వారాల్లోనే వారికి జీతాలు పెంచుతూ ప్రభుత్వం జీఓ జారీ



చేసింది. ఈ జీఓ ప్రకారం అంగన్వాడీ టీచర్లకు నెలకు రూ. 11,500కు, హెల్పర్లకు రూ. 7 వేలకు జీతాలు పెంచుతూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. విధి నిర్వహణలో మంచి పనితీరు కనబర్చిన అంగన్వాడీ వర్కర్లకు, హెల్పర్లకు ప్రోత్సాహకంగా నెలకు రూ. 500 చొప్పున ప్రభుత్వం అదనంగా అందిస్తోంది. 2013 నుంచి అంగన్వాడీలకు పదోన్నతులు లేవు. గత ప్రభుత్వం అసలు పట్టించుకోలేదు. రాష్ట్ర విభజన తర్వాత తొలిసారిగా వై సీపీ ప్రభుత్వమే ప్రమోషన్లు ఇచ్చి 560 గ్రేడ్–2 సూపర్వైజర్ పోస్టులను భర్తీ చేసింది. ఈ ఉద్యోగాలకు పరీక్షలు రాసే వయో పరిమితిని 45 ఏళ్ల నుంచి 50 ఏళ్లకు పెంచి ఎక్కువ మందికి అవకాశం కల్పించింది. అంగన్వాడీ వర్కర్లకు స్మార్ట్ ఫోన్లు కూడా ప్రభుత్వం ఇచ్చింది. రూ. 16 కోట్ల ఖర్చుతో ఒక్కో అంగన్వాడీ వర్కర్‌కు, హెల్పర్‌కు 6 చొప్పున యూనిఫాం శారీలు అందించే కార్యక్రమం కొనసాగుతోంది. అంగన్వాడీ కేంద్రాల సేవలను ఒకే గొడుగు కిందకు తెచ్చి పర్యవేక్షించడంతో పాటు... వర్కర్లు, హెల్పర్లకు వార్షిక సెలవులు, ప్రసూతి సెలవులు, బీమా సౌకర్యం కల్పించి భరోసా ఇస్తున్నారు.

ఇక ఆశావర్కర్ల వేతనాన్ని రూ. 3 వేల నుంచి రూ. 10 వేలకు పెంచుతూ నిర్ణయం తీసుకున్నారు. గతంలో వారికి మూడువేల రూపాయలే జీతంగా ఉండేది. ఇన్సెంటివ్‌గా రూ. 5,600 వరకు చెల్లించే అవకాశం ఉన్నా చంద్రబాబు ప్రభుత్వం అమలు చేయలేదు. కేవలం రూ. 3 వేలే ఇన్సెంటివ్‌గా చెల్లించేలా సీలింగ్ విధించారు. దీని వల్ల గరిష్ఠంగా నెలకు రూ. 6 వేలు మాత్రమే ఆశా వర్కర్లు పొందారు. దీంతో పాదయాత్రలో వారి కష్టాలను స్వయంగా విని వారికి న్యాయం చేస్తానని జగన్ హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చిన 60 రోజుల్లోనే ఇచ్చిన హామీని నెరవేర్చారు.

ఏపీ ట్రాన్స్‌కోలో పనిచేస్తున్న ఔట్‌సోర్సింగ్ కార్మికులకు 2018 రివైజ్డ్ పే స్కేల్ ప్రకారం వేతనాలు సవరిస్తూ ముఖ్యమంత్రి తాజాగా నిర్ణయం తీసుకున్నారు. థర్డ్ పార్టీ ఏజెన్సీలు, కాంట్రాక్టర్ల ద్వారా ట్రాన్స్‌కోలో పనిచేస్తోన్న ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు వేతనాలు సవరించారు. హైస్కిల్డ్, స్కిల్డ్, సెమీ స్కిల్డ్, అన్ స్కిల్డ్ కార్మికులకు భారీగా వేతనాలు పెంచారు.

కేవలం ప్రభుత్వ శాఖల్లో పనిచేసే కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకే కాకుండా... కార్మికులు, మహిళలు, యువత ఇలా అన్ని వర్గాలకు తన దాతృత్వాన్ని చాటుకున్నారు జగన్. సొంతంగా ఆటో, టాక్సీ వంటి వాహనాలను నడుపుకునే వారికి ఏటా రూ. 10 వేలు వంతున ఆర్థిక సాయం అందిస్తున్నారు. ఇక 'నవరత్నాల' పేరుతో 'నేతన్న నేస్తం', వైఎస్సార్ బీమా', 'మత్స్యకార భరోసా', దోభీ, దర్జీ, బార్బర్లకు 200 యూనిట్ల వరకు ఉచితంగా విద్యుత్ సరఫరా, అర్హత ఉన్న ప్రతి పేద వాడికి సొంత ఇంటి కల నెరవేరేలా 31 లక్షల మందికి ఇళ్ల నిర్మాణం, డ్వాక్రా మహిళలకు సున్నా వడ్డీ, ఆసరా, చేయుత వంటి పథకాలు, సూక్ష్మ, చిన్న, మధ్య తరగతి పరిశ్రమలకు ప్రోత్సాహకాల అందజేత... ఇలా చెప్పుకుంటూ పోతే లెక్కలేనన్ని ఉన్నాయి. ఇవన్నీ కూడా ఒక దార్శనికత కలిగిన, చిత్తశుద్ధి ఉన్న ముఖ్యమంత్రిగా జగన్‌మోహన్ రెడ్డి చేస్తున్న కార్యక్రమాలు. వీటిని ప్రజలు, కార్మిక వర్గాలు మనస్ఫూర్తిగా స్వాగతిస్తున్నారు.

ఏళ్ళ తరబడి కాంట్రాక్టు కార్మికులుగా పని చేస్తున్న వారికి మంచి చేస్తే మెచ్చుకోకపోగా బాబు లాంటి వారు కడుపుమంటతో రగిలిపోతున్నారు. జగన్‌పై బురద జల్లడానికి రకరకాల ఆరోపణలు చేస్తూ తిరుగుతున్నారు. ప్రజలు ఈ సంగతిని గమనిస్తున్నారు. వచ్చే ఎన్నికల్లో అన్ని వర్గాలూ ఏకమై మళ్లీ జగన్‌కే పట్టం కడతాయి. ఇది నిజం.

వ్యాసకర్త వైఎస్సార్ ట్రేడ్ యూనియన్స్ రాష్ట్ర అధ్యక్షులు ၊ 98481 05455

క్లుప్తంగా...

మళ్లీ ముంపులో గండిపోశమ్మ ఆలయం

- పెరుగుతున్న గోదావరి నీటిమట్టం
- ఆలయాన్ని చుట్టుముట్టిన వరదనీరు


గోదావరి వరద నీటిలో గండిపోశమ్మ ఆలయం

దేవీపట్నం(అల్లూరి సీతారామరాజు జిల్లా): మండలంలోని పూడిపల్లి పంచాయతీ గండిపోశమ్మ ఆలయం గోదావరి వరద నీటిలోనే మునిగి ఉంది. గత నెల 15న ఎగువ ప్రాంతాల నుంచి వరద పోటెత్తడంతో గోదావరి పెరిగి అమ్మవారి ఆలయాన్ని ముంచెత్తిన విషయం తెలిసిందే. పోలవరం ప్రాజెక్టు కాఫర్ డ్యామ్ నిర్మాణంతో బ్యాక్ వాటర్ పోటు కారణంగా అమ్మవారి ఆలయం వరద ముంపునకు గురైంది. దాదాపు 25 రోజుల అనంతరం ఈ నెల 10న ముంపు నుంచి అమ్మవారి ఆలయం బయటపడింది. అయితే మళ్లీ మూడు రోజులుగా గోదావరి నీటిమట్టం మళ్లీ పెరుగుతుండటం, దీనికి తోడు స్థానికంగా కురిసిన వర్షాలకు నీరు చేరడంతో మళ్లీ ఆలయం మునిగింది. అమ్మవారి విగ్రహం పూర్తిగా నీటమునిగి ఆలయ కార్యాలయం వరకూ వరద నీరు చేరడంతో అమ్మవారి దర్శనాన్ని తాత్కాలికంగా నిలిపివేశారు. వరదలు తగ్గి.. తదుపరి తేదీని ప్రకటించేంత వరకూ భక్తులెవరూ ఆలయానికి రావొద్దని ఈవో జీవీ లక్ష్మీకుమార్ సూచించారు.

నలుగురు అంతర్రాష్ట్ర గంజాయి స్మగ్లర్ల అరెస్టు


వివరాలను వెల్లడిస్తున్న సెబ్ ఏఈఎస్ రమేష్

గూడూరురూరల్ (తిరుపతి జిల్లా): ఒడిశాలోని బాలిగూడ ప్రాంతంలో కొనుగోలు చేసి ఆర్టీసీ బస్సులో బెంగళూరుకు అక్రమంగా గంజాయిని తరలిస్తున్న నలుగురు అంతర్రాష్ట్ర గంజాయి స్మగ్లర్లను గూడూరు ఎస్ఈబీ పోలీసులు బుధవారం తెల్లవారు జామున అరెస్ట్ చేశారు. సెబ్ ఏఈఎస్ రమేష్ తెలిపిన వివరాల మేరకు చిల్లకూరు మండలం బూదనం టోల్ ప్లాజా వద్ద గూడూరు డివిజన్ ఎస్ఈబీ టీం వాహనాలను తనిఖీ చేస్తున్నారన్నారు. ఈ నేపథ్యంలో తిరుపతి డిపోకు చెందిన ఆర్టీసీ బస్సులో ప్రయాణికుల ముసుగులో గంజాయి అక్రమ రవాణా చేస్తున్న కేరళ రాష్ట్రం అలప్పుజ జిల్లా ఏజుపున్న గ్రామానికి చెందిన అరుణ్ ఉదయన్, సురేష్ అర్జున్, అరోమల్ ఎదితర సాజి, జిబిన్ బాబును అరెస్టు చేశారని తెలిపారు. వారి నుంచి రూ.3లక్షల విలువ చేసే 8 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నామన్నారు. పట్టుబడిన వారంతా కొన్నేళ్లుగా బెంగళూరులో నివసిస్తున్నారని తెలిపారు. అవసరమైతే వీరందరిపై పీడీ యాక్ట్ ప్రయోగిస్తామని ఏఈఎస్ రమేష్ చెప్పారు.

శాస్త్రోక్తంగా కారీరిష్టి యాగం

తిరుమల: దేశం సుభిక్షంగా ఉండాలని, సకాలంలో వర్షాలు కురవాలని శ్రీవారిని ప్రార్థిస్తూ తిరుమల ధర్మగిరి వేద విజ్ఞాన పీఠంలో కారీరిష్టి యాగం, వరుణజపం, పర్జన్యశాంతి హోమాలు బుధవారం శాస్త్రోక్తంగా ప్రారంభమయ్యాయి. ధర్మగిరి వేద విజ్ఞాన పీఠం ప్రిన్సిపాల్ కేఎస్ఎస్ అవధాని ఆధ్వర్యంలో 32 మంది వేద, శ్రౌత, స్మార్తపండితులు ఉదయం, మధ్యాహ్నం, సాయంత్రం వేళల్లో యాగాలు, జపాలు, పారాయణాలు నిర్వహిస్తున్నారు. ఆరుగురు రుత్వికులు కారీరిష్టి యాగం చేపడుతున్నారు. 12 మంది రుత్వికులు గోగర్భం తీర్థంలో నడుము లోతు నీళ్లలో నిల్చుని వరుణ, పర్జన్య మంత్రాలను పఠించారు. ఏడు వేద శాఖలకు చెందిన 14 మంది రుత్వికులు రామాయణం, భాగవతం, మహాభారతంలోని విరాటపర్వం పారాయణం చేస్తున్నారు. కార్యక్రమంలో శ్రీవారి ఆలయ ప్రధానార్చకుల్లో ఒకరైన వేణుగోపాల దీక్షితులు, వేద విజ్ఞాన పీఠం అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రముఖ గణిత శాస్త్రవేత్త డాక్టర్ సీఆర్ రావు కన్నుమూత

ఏయూ క్యాంపస్/దాబాగార్డెన్స్: ప్రపంచ ప్రఖ్యాత గణాంక, గణిత శాస్త్రవేత్త డాక్టర్ సీఆర్ రావు (102) కన్నుమూశారు. అమెరికాలో ఉన్న ఆయన అనారోగ్యంతో మృతి చెందారు. 1920 సెప్టెంబర్ 10న కర్ణాటకలోని బళ్లారి జిల్లా హడగళిలో కల్యంపూడి రాధాకృష్ణా రావు (సీఆర్ రావు) తెలుగు కుటుంబంలో జన్మించారు. తర్వాత ఏపీలోని గూడూరు, నూజివీడు, నందిగామల్లో ఆయన బాల్యం గడిచింది. గూడూరులో 10వ తరగతి వరకు చదివారు. విశాఖలోని ఏవీఎన్ కళాశాలలో ఇంటర్ పూర్తి చేశారు. 1940లో ఏయూలో గణిత శాస్త్రం అభ్యసించారు. అనంతరం యూనివర్సిటీ ఆఫ్ కోల్‌కతాలో ఎంఏ స్టాటిస్టిక్స్ చేశారు. కేంబ్రిడ్జ్ యూనివర్సిటీలోని కింగ్స్ కాలేజీలో 1948లో పీహెచ్‌డీ పూర్తి చేశారు. ఇండియన్ స్టాటిస్టికల్ ఇన్‌స్టిట్యూట్‌లో విద్యార్థిగా చేరి అదే సంస్థకు డైరెక్టర్‌గా ఎదిగారు. అక్కడ పదవీ విరమణ చేసిన అనంతరం అమెరికాలో స్థిరపడి అక్కడ యూనివర్సిటీ ఆఫ్ బఫెలోలో రీసెర్చ్ ప్రొఫెసర్‌గా సేవలందించారు. ఆయన 19 దేశాల నుంచి 39 డాక్టరేట్లు అందుకున్నారు. 477 పరిశోధన పత్రాలను సమర్పించారు. 15 పుస్తకాలు రాశారు. 2002లో అప్పటి అమెరికా అధ్యక్షుడు జార్జి బుష్ చేతుల మీదుగా ఆ దేశ అత్యున్నత నేషనల్ మెడల్ ఆఫ్ సైన్స్ పురస్కారాన్ని అందుకున్నారు. యూకే ఇంటర్నేషనల్ స్టాటిస్టికల్ ఇన్‌స్టిట్యూట్, ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మ్యాథమెటికల్ సైన్స్, ఇంటర్నేషనల్ బయోమెట్రిక్ సొసైటీకి అధ్యక్షుడిగా పనిచేశారు. భారత స్టాటిస్టిక్స్ రంగానికి ఆయన చేసిన సేవలకు గాను కేంద్ర ప్రభుత్వం ఆయనను 1968లో పద్మభూషణ్, 2001లో పద్మవిభూషణ్‌తో సత్కరించింది. ఎస్ఎస్ భట్నాగర్ పురస్కారాన్ని కూడా సీఆర్ రావు అందుకున్నారు. ఆయన 2020 సెప్టెంబర్ 10న 100వ పుట్టినరోజును జరుపుకున్నారు.


ఆచార్య సీఆర్ రావు దంపతులను సత్కరిస్తున్న ఏయూ ఆచార్యులు (ఫైల్)


సిరిపురం కూడలి వద్ద ఏర్పాటు చేసిన ఆచార్య సీఆర్ రావు మార్గం

సీఆర్ రావు పరిశోధనలివే..

తన పరిశోధనలో భాగంగా డాక్టర్ సీఆర్ రావు 1945లో 3 ప్రాథమిక ఫలితాలను విశ్లేషించారు. ఇవి ఆధునిక గణాంక విధానానికి మార్గం సుగమం చేశాయి. అంతేకాకుండా సైన్స్‌లో ఈ గణాంక టూల్స్‌ను భారీగా వాడటానికి ఉపయోగపడ్డాయి. ఇందులో మొదటిది.. క్రామర్–రావు లోయర్ బౌండ్. ఇది గణాంక అంచనా వేయడంలో అత్యుత్తమ విధానాన్ని సూచించింది. రెండోది.. రావు–బ్లాక్‌వెల్ సిద్ధాంతం. ఇది ఒక అంచనాను మెరుగైన దానిగా మార్చడానికి ఉపయోగపడుతోంది. మూడోది సమాచార జామెట్రీ విస్తృతికి కొత్త ఇంటర్ డిసిప్లినరీ ఫీల్డ్ అభివృద్ధి. ఇది డేటా నుంచి సమాచారాన్ని మరింత సమర్థంగా సేకరించేందుకు సహాయపడుతోంది.

ఏయూతో అల్లుకున్న అనుబంధం

సీఆర్ రావుకు ఆంధ్ర విశ్వవిద్యాలయం (ఏయూ)తో విడదీయరాని అనుబంధం ఉంది. ఆయన మరణవార్త ఏయూని దుఃఖసాగరంలో ముంచేసింది. 1961లో సీఆర్ రావుకు ఏయూ గౌరవ డాక్టరేట్‌ను ప్రదానం చేసింది. ఆయన అందుకున్న తొలి డాక్టరేట్ ఇదే. 1977–85 మధ్య కాలంలో ఏయూ స్టాటిస్టిక్స్ విభాగానికి గౌరవ ఆచార్యునిగా సేవలు అందించారు. సీఆర్ రావు 1982లో ఏయూకి రూ.లక్ష విరాళంగా అందజేసి తన తండ్రి సీడీ నాయుడు పేరుతో గోల్డ్‌మెడల్‌ని ఏర్పాటు చేశారు. అప్పటి నుంచి ప్రతి ఏడాది ఎమ్మెస్సీ స్టాటిస్టిక్స్‌లో ప్రథమ ర్యాంకర్‌గా నిలిచిన వారికి బంగారు పతకాన్ని అందిస్తున్నారు. 2008, 2012ల్లో ఏయూలో జరిగిన అంతర్జాతీయ సదస్సుల్లో డాక్టర్ సీఆర్ రావు పాల్గొని కీలకోపన్యాసాలు చేశారు. ప్రతీ సంవత్సరం విద్యార్థులకు ఉపన్యాసాలు ఇచ్చి, తరగతులను బోధించేవారు. 2018లో ఏయూకు రూ.6 లక్షలు అందజేసి స్మారకోపన్యాసం ఏర్పాటు చేశారు. భారత్ వచ్చిన ప్రతీసారి ఆయన తప్పనిసరిగా ఏయూను సందర్శించే వారు. విశాఖలోని సిరిపురం కూడలి నుంచి ఏయూకు వెళ్లే మార్గాన్ని ఆచార్య సీఆర్ రావు మార్గంగా జీవీఎంసీ గతంలో ప్రకటించింది.

ఏవీఎన్ కాలేజీలో సంతాప సభ

డాక్టర్ సీఆర్ రావు మృతికి సంతాపం తెలియజేస్తూ బుధవారం విశాఖలోని ఏవీఎన్ కాలేజీ ఆవరణలో సంతాప సభను యాజమాన్యం నిర్వహించింది. సీఆర్ రావు ఏవీఎన్ కళాశాల పూర్వ విద్యార్థి కావడం తమ కళాశాలకే గర్వకారణమని, కళాశాల 150 సంవత్సరాల వేడుకకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారని, ప్రతి ఏడాది ప్రథమ స్థానంలో వచ్చిన విద్యార్థులకు సీఆర్ రావు పేరిట బహుమతులు ఆయనే ఇచ్చేవారని కళాశాల ప్రిన్సిపాల్ ఎం.సింహాద్రినాయుడు చెప్పారు. సంతాప సభలో గణాంక, గణితశాస్త్ర విభాగాధిపతి పి.గాంధీ, డీన్ శంకర్‌నారాయణ తదితరులు పాల్గొన్నారు.

స్టాటిస్టిక్స్‌లో నోబెల్ అంతటి గౌరవం

సీఆర్ రావుకు 75 ఏళ్ల కిందట గణాంక రంగంలో విప్లవాత్మకమైన ఆలోచనలకు బీజం వేసినందుకు గాను ఆ రంగంలో నోబెల్ బహుమతికి సమానమైన ఇంటర్నేషనల్ ప్రైజ్ ఆఫ్ స్టాటిస్టిక్స్–2023 అవార్డును అందజేశారు. 102 ఏళ్ల వయసులో ఈ ఏడాదే ఆయన ఈ పురస్కారాన్ని అందుకున్నారు. 1945లో కోల్‌కత మ్యాథమెటికల్ సొసైటీలో ప్రచురితమైన సీఆర్ రావు పరిశోధన పత్రానికి ఈ అవార్డు దక్కింది. ఆయన చేసిన కృషి.. ఇప్పటికీ సైన్స్‌పై తీవ్ర ప్రభావాన్ని చూపుతూ ఉందని ఇంటర్నేషనల్ ప్రైజ్ ఇన్ స్టాటిస్టిక్ ఫౌండేషన్ తెలిపింది.

గణాంక శాస్త్రంలో సీఆర్ రావుది అద్వితీయమైన కృషి

- గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్

సాక్షి, అమరావతి: ప్రముఖ గణాంక శాస్త్రవేత్త సీఆర్ రావు మృతిపై గవర్నర్ జస్టిస్ ఎస్.అబ్దుల్ నజీర్ విచారం వ్యక్తం చేశారు. గణాంక శాస్త్ర రంగంలో ఆయన అద్వితీయమైన కృషి చేసి దేశానికి అంతర్జాతీయంగా ఘనకీర్తిని సాధించిపెట్టారని కొనియాడారు. సీఆర్ రావు కుటుంబ సభ్యులకు గవర్నర్ తన ప్రగాఢ సానుభూతి తెలిపినట్లు ని రాజ్‌భవన్ వర్గాలు బుధవారం ప్రకటనలో తెలిపాయి.

గొప్ప మేధావి డాక్టర్ సీఆర్ రావు

ముఖ్యమంత్రి వైఎస్ జగన్

డాక్టర్ సీఆర్ రావు మృతి పట్ల సీఎం వైఎస్ జగన్ సంతాపం వ్యక్తం చేశారు. ఏయూ నుంచి మాస్టర్స్ పూర్తి చేసిన పద్మవిభూషణ్ డాక్టర్ సీఆర్ రావు నోబెల్ బహుమతికి సమానమైన అంతర్జాతీయ గణాంకాల బహుమతిని (2023) గెలుచుకున్న గొప్ప మేధావి అని సీఎం కొనియాడారు. క్రామర్–రావ్ లోయర్ బౌండ్, రావుబ్లాక్‌వెల్ సిద్ధాంతంతో సహా స్టాటిస్టిక్స్ రంగంలో డాక్టర్ రావు చేసిన సేవలను సీఎం జగన్ గుర్తు చేసుకున్నారు. సీఆర్ రావు కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు.

'సంక్షేమ' ప్రభుత్వానికే బహుజనుల మద్దతు

- 1,060వ రోజు రిలే దీక్షలో బహుజన నాయకులు

తాడికొండ: రాష్ట్రంలో సంక్షేమ పథకాలను కుల, మత, రాజకీయాలకతీతంగా అమలు చేస్తూ.. అన్ని వర్గాలకు న్యాయం చేస్తున్న ప్రభుత్వానికే తమ మద్దతు ఉంటుందని బహుజన పరిరక్షణ సమితి నాయకులు స్పష్టం చేశారు. గుంటూరు జిల్లా తుళ్లూరు మండలం తాళ్లాయపాలెం సీడ్ యాక్సెస్ రోడ్డు జంక్షన్‌లో మూడు రాజధానులకు మద్దతుగా బహుజన పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో 1,060 వరోజు కొనసాగుతున్న రిలేనిరాహార దీక్షలో బుధవారం పలువురు మాట్లాడారు. రాష్ట్రంలో అభివృద్ధి సంక్షేమం రెండు కళ్లుగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అందిస్తున్న పాలన అన్ని వర్గాలకు సంక్షేమం అభివృద్ధి అందిస్తుందన్నారు. చంద్రబాబు తమ సామాజిక వర్గ ఆధిపత్యాన్ని చలాయించాలనే లక్ష్యంతోనే పేద వర్గాలను అణగదొక్కుతున్నారని.. అందులో భాగంగానే రాజధానిలో పేదల ఇళ్లపై కుట్రలకు పాల్పడుతున్నారని ధ్వజమెత్తారు. ఏపీలో జరుగుతున్న పాలన పలు రాష్ట్రాలకు ఆదర్శంగా నిలుస్తుందని చెప్పారు. అభివృద్ధి అంటే ఒక ప్రాంతానికి, ఒక వర్గానికి పరిమితం కాదని అన్ని ప్రాంతాలు అన్ని వర్గాలకు సమాన ఫలాలు అందించినప్పుడు సార్థకత ఉంటుందని దానికి జగనన్న పాలనే నిదర్శనమన్నారు. బాబు ఆయన కుమారుడు లోకేశ్ ప్యాకేజీ పార్టీలు, పావలాకళ్యాణ్ ఎన్ని అడ్డంకులు సృష్టించినా మూడు రాజధానులతో పాటు, పేదల హక్కులు సాధించి తీరుతామని స్పష్టం చేశారు. నాయకులు ఈపూరి ఆదాం, మాదిగాని గురునాథం, పులిదాసు, రాజకుమారి,నూతక్కి జోషి తదితరులు పాల్గొన్నారు.

పట్టాతో పాటు ఉపాధి కల్పనే ప్రభుత్వ లక్ష్యం

- ఉన్నత విద్యామండలి చైర్మన్ హేమచంద్రారెడ్డి
- ఘనంగా జేఎన్‌టీయూకే వ్యవస్థాపక దినోత్సవం

బాలాజీచెరువు (కాకినాడ సిటీ): విద్యార్థులకు పట్టాతో పాటు ఉపాధి కల్పించడమే లక్ష్యంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కృషిచేస్తున్నారని రాష్ట్ర ఉన్నత విద్యామండలి చైర్మన్ కె.హేమచంద్రారెడ్డి తెలిపారు. కాకినాడలోని జేఎన్‌టీయూకే వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా బుధవారం జరిగిన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మైక్రోసాఫ్ట్ ద్వారా 24 వేల మందికి ఇంటర్న్‌షిప్ నిర్వహించి సర్టిఫికెట్లు అందించినట్టు తెలిపారు. ఉన్నత విద్యలో పలు సంస్కరణలకు శ్రీకారం చుట్టామని, వర్సిటీల్లో స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్లు ఏర్పాటుచేసి నైపుణ్యాలు పెంచుతున్నట్టు తెలిపారు. దీర్ఘకాలికంగా పెండింగ్‌లో ఉన్న అసిస్టెంట్ ప్రొఫెసర్ల నియామకాలకు అడ్డంకులు తొలగిన నేపథ్యంలో భర్తీ చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఉన్నత విద్యలో పరీక్ష విధానం, మెథడాలజీ, బోధన పద్ధతులు, పాఠ్య ప్రణాళికలో తేవాల్సిన మార్పులపై దృష్టి సారించామన్నారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌లో వస్తున్న మార్పులను కరిక్యులమ్‌లో భాగం చేయాలని హేమచంద్రారెడ్డి సూచించారు. అనంతరం వర్సిటీ వ్యవస్థాపక లోగోను ఆవిష్కరించారు. కార్యక్రమంలో వీసీ డాక్టర్ జీవీఆర్ ప్రసాదరాజు, మాజీ వీసీ రామలింగరాజు తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న హేమచంద్రారెడ్డి

కేరర్స్ ఫోరమ్‌ను బలోపేతం చేసేందుకు కృషి

- రాష్ట్ర దివ్యాంగుల సంక్షేమశాఖ డిప్యూటీ డైరెక్టర్ రవీంద్రారెడ్డి


మాట్లాడుతున్న డిప్యూటీ డైరెక్టర్ రవీంద్రారెడ్డి

మధురానగర్(విజయవాడ సెంట్రల్): కేరర్స్ ఫోరమ్‌ను బలోపేతం చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని రాష్ట్ర దివ్యాంగుల సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ రవీంద్రారెడ్డి అన్నారు. విజయవాడ అయోధ్యనగర్‌లో చేయూత మానసిక దివ్యాంగుల శిక్షణ కేంద్రంలో బుధవారం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సంరక్షకుల ఫోరం సమావేశం జరిగింది. కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న రవీంద్రారెడ్డి మాట్లాడుతూ.. తీవ్ర వైకల్యం గల వారి విషయంలో వారి సంరక్షకులు ఎదుర్కొంటున్న మానసిక, శారీరక, కుటుంబ సమస్యలను తాము గుర్తించామని, ఈ అంశాన్ని ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకువెళ్లి తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. కేరర్స్ వరల్డ్ వైడ్ ఫౌండర్ డైరెక్టర్ అనిల్ పాటిల్ మాట్లాడుతూ మన దేశంలో లక్షలాది మంది ఎటువంటి ఆదాయమూ లేకుండా నిరంతరం తమకు సంబంధించిన దివ్యాంగుల సంరక్షణ బాధ్యతలు చూసుకుంటున్నారని, ఇటువంటి వారిని ప్రభుత్వాలు గుర్తించి వారి కోసం ఒక పాలసీని తీసుకురావాల్సిన అవసరం ఉందన్నారు. చేయూత మానసిక వికలాంగుల శిక్షణ సంస్థ చైర్మన్ డాక్టర్ టి.కృష్ణకుమారి, కర్నూలు సెక్రెడ్ స్వచ్ఛంద సంస్థ డైరెక్టర్ తిప్పన్న, కాకినాడ ఉమామనో వికాస కేంద్రం డైరెక్టర్ ఎస్.పి.రెడ్డి తదితరులు పాల్గొన్నారు.


నిరంతరాయంగా విద్యుత్ సరఫరా

- డిమాండ్‌కు తగ్గట్టు విద్యుత్ ఉత్పత్తి.. మార్కెట్‌లో కొనుగోలు
- ఇంధనశాఖ అధికారులతో మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో కోతలు లేకుండా విద్యుత్ సరఫరా చేసేందుకు ముందుచూపుతో ప్రణాళిక సిద్ధం చేయాలని రాష్ట్ర ఇంధనశాఖ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి అధికారులను ఆదేశించారు. రాష్ట్రంలో విద్యుత్ వినియోగం, సరఫరాపై ఏపీ జెన్‌కో, ట్రాన్స్‌కో, డిస్కంల అధికారులతో బుధవారం ఆయన సమీక్ష నిర్వహించారు. మంత్రి మాట్లాడుతూ.. గతేడాది ఇదే సమయానికి 192.03 మిలియన్ యూనిట్ల డిమాండ్ ఉంటే, ఈ ఏడాది 228.94 మిలియన్ యూనిట్ల డిమాండ్ కొనసాగుతున్నదన్నారు. గతేడాదితో పోలిస్తే దాదాపు 19.22 శాతం విద్యుత్ డిమాండ్ పెరిగిందని మంత్రి వెల్లడించారు. ఈ నేపథ్యంలో రాష్ట్రంలోని జెన్‌కో థర్మల్ పవర్ స్టేషన్లను పూర్తిస్థాయిలో పనిచేయించడం ద్వారా విద్యుత్ ఉత్పత్తిని అవసరానికి అనుగుణంగా సమన్వయం చేసుకోవాలని అధికారులను ఆదేశించారు. బహిరంగ మార్కెట్‌లో విద్యుత్ కొనుగోలు చేసేందుకు ప్రయత్నించాలని, అయితే ఈ సీజన్‌లో విద్యుత్ లభ్యత పరిమితంగా ఉండడం వల్ల దానిపైనే ఆధారపడకూడదని మంత్రి సూచించారు. రాష్ట్రంలోని థర్మల్, విండ్, సోలార్ ప్లాంట్‌ను సమర్థంగా పనిచేయించడం ద్వారా డిమాండ్‌కు అనుగుణంగా విద్యుత్ ఉత్పత్తిని సాధించాలన్నారు. జెన్‌కో ఎండీ కేవీఎన్ చక్రధర్ బాబు, ఇంధనశాఖ జాయింట్ సెక్రటరీ కుమార్ రెడ్డి, ఆంధ్రప్రదేశ్ దక్షిణ, మధ్య ప్రాంత డిస్కంల సీఎండీలు కె.సంతోషరావు, జె.పద్మాజనార్దనరెడ్డి పాల్గొన్నారు.

ఎట్టకేలకు చిక్కిన మొసలి

మారేడుమిల్లి(అల్లూరి సీతారామరాజు జిల్లా): చేపల చెరువులో నీళ్లు తాగేందుకు వచ్చిన మేకలపై దాడి చేసిన మొసలిని అటవీ శాఖ సిబ్బంది పట్టుకున్నారు. ఈనెల 14న అల్లూరి సీతారామరాజు జిల్లా కుండాడలోని చేపల చెరువులో మొసలి కనిపించడంతో గ్రామస్తులు భయాందోళనకు గురయ్యారు. సర్పంచ్ కుండ్ల ప్రభాకర్‌రెడ్డి ఈ విషయాన్ని రంపచోడవరం డీఎఫ్‌వో నరేంద్రన్, రేంజ్ అధికారి ఆజాద్‌కు తెలియజేశారు. వారి సూచన మేరకు హైదరాబాద్‌కు చెందిన యూనిమల్ వారియర్స్ కన్జర్వేషన్ సొసైటీ సభ్యులు అమర్‌నాథ్, చేతన్‌కుమార్, శాక్సుద నేతృత్వంలో 15 మంది చెరువు వద్ద సీసీ కెమెరాలు అమర్చి మొసలి కదలికలపై నిఘా పెట్టారు. మంగళవారం చేపల చెరువుకు 500 మీటర్ల దూరంలోని చిన్న చెరువులోకి వెళ్లిన మొసలిని పట్టుకున్నారు.



తెలుగు భాషకు పూర్వ వైభవం తీసుకొస్తాం

- అధికార భాషా సంఘం అధ్యక్షుడు పి.విజయబాబు
- నేటి నుంచి వారం రోజుల పాటు గిడుగు జయంత్యుత్సవాలు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్)/ఏఎస్‌యూ: తెలుగు భాషకు పూర్వ వైభవం తీసుకువస్తామని అధికార భాషా సంఘం అధ్యక్షుడు పి. విజయబాబు అన్నారు. బుధవారం ఎన్టీఆర్ జిల్లా కలెక్టరేట్‌లో వ్యావహారిక భాషా ఉద్యమ పితామహుడు గిడుగు రామ్మూర్తి జయంతి ఉత్సవాల నిర్వహణపై విజయబాబు జిల్లా కలెక్టర్ ఎస్.ఢిల్లీరావుతో కలిసి మీడియాతో మాట్లాడారు. గురువారం నుంచి 29వ తేదీ వరకు వారం రోజుల పాటు గిడుగుజయంతి ఉత్సవాలు నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకుందన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లా కేంద్రాల్లోనూ ఉత్సవాలు ఘనంగా నిర్వహించనున్నట్లు తెలిపారు. కాగా ఆంధ్రప్రదేశ్ అధికార భాషా సంఘం, తెలుగు భాషాభివృద్ధి ప్రాధికార సంస్థ, ఆచార్య నాగార్జున యూనివర్సిటీ తెలుగు విభాగం సంయుక్తంగా నిర్వహిస్తున్న తెలుగు భాషా వారోత్సవాల ప్రారంభోత్సవ సభ బుధవారం ఆచార్య నాగార్జున వర్సిటీలో జరిగింది. ఆర్కిటెక్చర్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య ఈ.శ్రీనివాసరెడ్డి రచించిన 'నీడనివ్వని చెట్టు' పుస్తకాన్ని వీసీ ఆచార్య పి.రాజశేఖర్‌తో కలిసి ఆవిష్కరించారు.

• తిరుమల శ్రీవారిని బుధవారం కర్ణాటక గవర్నర్ థావర్ చంద్ గెహ్లాట్, ఢిల్లీ హైకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ రోహిణి దర్శించుకున్నారు. వీరికి ఆలయ అధికారులు ప్రత్యేక దర్శన ఏర్పాట్లు చేశారు. దర్శనం అనంతరం ఆలయ రంగనాయకుల మండపంలో పండితులు వేదాశీర్వచనాలను, అధికారులు ప్రసాదాలను అందజేశారు.

ముువ్వెన్నెల చంద్రహాసం

ప్రతిష్టాత్మక చంద్రయాన్–3 మిషన్ ఘన విజయం


అంతరిక్ష ప్రయోగాల్లో చరిత్ర సృష్టించిన భారత్

- సాయంత్రం 6.04 గంటలకు జాబిల్లిపై సాఫ్ట్ ల్యాండింగ్
- అవాంతరాల్లేకుండా ఉపరితలంపై క్షేమంగా దిగిన ల్యాండర్
- చంద్రుడి దక్షిణధ్రువంపై అడుగుపెట్టిన మొదటి దేశంగా భారత్ రికార్డు
- చందమామపై ల్యాండర్‌ను భద్రంగా దించిన నాలుగో దేశంగా ఘనత
- చంద్రయాన్–3 విజయంపై రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము, ప్రధాని మోదీ హర్షం
- దేశ ప్రజల్లో ఆనందోత్సాహాలు.. ఇస్రో శాస్త్రవేత్తలపై ప్రశంసల జల్లు
- భారత్‌కు వివిధ దేశాల అధినేతల అభినందనలు
- చంద్రుడి మూలాలను అధ్యయనం చేయనున్న రోవర్ 'ప్రజ్ఞాన్'



దిగడానికి ముందు ల్యాండర్ తీసిన చంద్రుని ఉపరితలం ఫొటో

సూళ్లూరుపేట(తిరుపతి జిల్లా)/బెంగళూరు: భారత అంతరిక్ష పరిశోధన సంస్థ(ఇస్రో) ప్రపంచ అంతరిక్ష ప్రయోగాల చరిత్రలో సరికొత్త రికార్డు సృష్టించింది. జాబిల్లి దక్షిణ ధ్రువంపై అడుగుపెట్టిన మొట్టమొదటి దేశంగా భారత్ చరిత్రకెక్కింది. చంద్రుడి ఉపరితలంపై ల్యాండర్‌ను క్షేమంగా దించిన నాలుగో దేశంగా మరో ఘనత సాధించింది. రష్యా ల్యాండర్ లూనా–25 విఫలమైన చోటే భారత్ విజయపతాక ఎగురవేసింది. భూమి నుంచి చంద్రుడి దిశగా 41 రోజులపాటు సాగించిన తన ప్రయాణాన్ని చంద్రయాన్–3 మిషన్ ఘనంగా ముగించింది. దేశ ప్రజలను ఆనందోత్సాహాల్లో ముంచెత్తింది. ప్రతి ఇంటా పండుగను తీసుకొచ్చింది. ప్రపంచవ్యాప్తంగా భారతదేశ గౌరవ ప్రతిష్టలను మరింత ఇనుమడింపజేసింది. చందమామపై పరిశోధనల కోసం ఇస్రో చేపట్టిన చంద్రయాన్–3 మిషన్ విజయవంతమైంది. ఈ ప్రయోగంలో అంతర్భాగమైన ల్యాండర్ మాడ్యూల్ 'విక్రమ్' బుధవారం సాయంత్రం 6.04 గంటలకు చందమామను సున్నితంగా ముద్దాడింది. చంద్రుడి ఉపరితలంపై ల్యాండర్ ఎలాంటి అవాంతరాలు లేకుండా సురక్షితంగా అడుగుపెట్టింది. దేశ ప్రజలంతా ఈ అద్భుతాన్ని ఉత్కంఠతో వీక్షించారు. చంద్రయాన్–3 ప్రయోగం విజయవంతం కావడం పట్ల రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము, ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, కేంద్ర మంత్రులు, వివిధ రాష్ట్రాల ముఖ్యమంత్రులు హర్షం వ్యక్తం చేశారు. ఇస్రోను వివిధ దేశాల అధినేతలు భారత్‌కు అభినందనలు తెలియజేశారు. ల్యాండింగ్ పూర్తయ్యాక 4 గంటల అనంతరం రోవర్ 'ప్రజ్ఞాన్' ఆరు చక్రాల సాయంతో ల్యాండర్ నుంచి సురక్షితంగా బయటకు అడుగుపెట్టింది. జాబిల్లి ఉపరితలంపైకి చేరుకొని తన




కార్యాచరణ ప్రారంభించింది. రెండు వారాల పాటు ఉపరితలంపై సంచరిస్తూ పరిశోధనలు చేస్తుంది. విలువైన సమాచారాన్ని భూమిపైకి చేరవేస్తుంది.

అత్యంత అరుదైన ఘనత

ప్రపంచంలో ఇప్పటిదాకా 12 దేశాలు చంద్రుడి మీదకు 141 ప్రయోగాలు చేశాయి. ఏ దేశం కూడా చంద్రుడి దక్షిణ ధ్రువంపై అడుగుపెట్టలేకపోయింది. అత్యంత అరుదైన ఈ ఘనతను భారత్ తన ఖాతాలో వేసుకుంది. చంద్రయాన్–2 వైఫల్యాల నుంచి పాఠాలు నేర్చుకొని, పొరపాట్లను సరిదిద్దుకొని చంద్రయాన్–3 ప్రయోగాన్ని విజయవంతం చేసింది ఇస్రో. అన్ని అవరోధాలను అధిగమించి నిర్దేశిత సమయానికే ల్యాండర్‌ను సరిగ్గా సాయంత్రం 6.04 గంటలకు జాబిల్లిపై భద్రంగా దించి ప్రపంచాన్ని అబ్బురపర్చింది. 140 కోట్ల మంది ఆశలను నెరవేర్చింది. టీవీలకు అతుక్కుపోయి ఏమవుతుందో అని ఆతృతగా ఎదురుచూసిన వారికి అంతులేని ఆనందాన్ని పంచింది. భారత్‌తోపాటు ప్రపంచ దేశాలు ఈ విన్యాసాన్ని ఎంతో ఆసక్తితో వీక్షించాయి. ఎలాంటి ప్రతికూల పరిస్థితులు ఎదురుకాకపోవడంతో అనుకున్న సమయానికే ప్రయోగం పూర్తయ్యింది. ల్యాండింగ్‌ను వాయిదా వేయాల్సిన పరిస్థితి తలెత్తకపోవడంతో ఇస్రో శాస్త్రవేత్తలు ఊపిరి పీల్చుకున్నారు.

37 నిమిషాలు తీవ్ర ఉత్కంఠ

చంద్రయాన్–3 మిషన్‌ను ఇస్రో గత నెల 14న ఆంధ్రప్రదేశ్‌లోని శ్రీహరికోట నుంచి ప్రయోగించిన సంగతి తెలిసిందే. తొలుత భూమికి, చంద్రుడికి మధ్యలోని భూ మధ్యంతర కక్ష్యలోకి ప్రవేశపెట్టారు. ప్రొపల్షన్ మాడ్యూల్‌లోని ఇంధనాన్ని మండించి ఐదుసార్లు కక్ష్య దూరాన్ని పెంచారు. ఈ నెల 5న చంద్రుడి కక్ష్యలోకి ప్రవేశపెట్టారు. అనంతరం ప్రొపల్షన్ మాడ్యూల్‌లోని ఇంధనాన్నే మండించి ఐదుసార్లు కక్ష్య దూరాన్ని తగ్గించారు. దాంతో చంద్రయాన్–3 మిషన్ చంద్రుడికి దగ్గరవుతూ వచ్చింది. ఈ నెల 17న ప్రొపల్షన్ మాడ్యూల్ తన నుంచి ల్యాండర్ మాడ్యూల్‌ను విజయవంతంగా విడిచిపెట్టింది. ఆ తరువాత ల్యాండర్ మాడ్యూల్‌ను చంద్రుడికి మరింత సమీపానికి చేర్చారు. బుధవారం సాయంత్రం 5.27 గంటలకు సాఫ్ట్ ల్యాండింగ్ ప్రక్రియ ప్రారంభించారు. 37 నిమిషాలపాటు ఈ ప్రక్రియ కొనసాగింది. సరిగ్గా 6.04 గంటలకు ల్యాండర్ చంద్రుడి దక్షిణ ధ్రువంపై కాలుమోపింది. కొద్దిసేపటికే ల్యాండర్‌లోని ల్యాండర్ హారిజాంటల్ వెలాసిటీ కెమెరా (ఎల్‌హెచ్‌వీసీ) చంద్రుడి ఉపరితలాన్ని ఫొటోలు తీసి, భూమిపైకి పంపించింది. జాబిల్లిపై దిగిన కొద్దిసేపటి తర్వాత ల్యాండర్‌కు, బెంగళూరులోని మిషన్ ఆపరేషన్స్ కాంప్లెక్స్‌కు మధ్య కమ్యూనికేషన్ లింక్ ఏర్పడింది. ఇప్పటికే చంద్రయాన్–1 ప్రయోగంలో చంద్రుడిపై నీటి జాడలను కనుగొన్నారు. స్ఫటికాల రూపంలో నీరు ఉన్నట్లు గుర్తించారు. చంద్రయాన్–3 ద్వారా చంద్రుడి మూలాలను మరింత లోతుగా అధ్యయనం చేయనున్నారు.



సాఫ్ట్ ల్యాండింగ్ అంటే?

చంద్రయాన్–3 ప్రయోగంలో అత్యంత కీలక ఘట్టం సాఫ్ట్ ల్యాండింగ్. అధిక పీడనంతో గ్యాస్‌ను విరజిమ్ముతూ ల్యాండర్ చంద్రుడిపై దిగిన సమయంలో దుమ్ము ధూళీ పైకి లేచి కెమెరాల అద్దాలను, సెన్సార్లను కమ్మేస్తుంది. దీంతో ఇతర సైంటిఫిక్ పరికరాలు దెబ్బతినే ప్రమాదం ఉంది. ఈ క్రమంలో ల్యాండర్ క్రాష్ అయ్యే అవకాశమూ లేకపోలేదు. అందుకే దుమ్ము పైకి లేవకుండా ల్యాండర్‌ను మృదువుగా దించే ప్రక్రియనే సాఫ్ట్ ల్యాండింగ్ అంటారు. దీన్ని నాలుగు దశల్లో చేపట్టి, ల్యాండర్‌ను సురక్షితంగా చంద్రుడి ఉపరితలంపైకి దించారు.

బయటకు వచ్చిన రోవర్

సూళ్లూరుపేట(తిరుపతి జిల్లా): చంద్రయాన్–3 ల్యాండర్ బుధవారం సాయంత్రం 6.04 గంటలకు చంద్రుడి దక్షిణ ధ్రువం ఉపరితలంపై సురక్షితంగా దిగింది. ల్యాండర్‌లో నుంచి రాత్రి 10.04 గంటలకు రోవర్ బయటకు వచ్చింది. ఆరు చక్రాలతో కూడిన రోవర్ ప్రజ్ఞాన్ చంద్రుడిపై సెకనుకు ఒక సెంటీమీటర్ వేగంతో ముందుకు కదులుతోంది. సుమారు 500 మీటర్ల దూరం దాకా ప్రయాణించి అక్కడున్న స్థితిగతుల గురించి భూనియంత్రిత కేంద్రాలకు సమాచారాన్ని చేరవేస్తుంది. ల్యాండర్ దిగిన సందర్భంగా అందరూ పండుగ చేసుకునేలోపే రోవర్ కూడా విజయవంతంగా బయటకు రావడంతో ఇస్రో శాస్త్రవేత్తల ఆనందానికి అవధులు లేకుండా పోయాయి.

జాబిల్లిపై గర్జించిన సింహాలు..!

చంద్రుడిపై విజయవంతంగా దిగి చరిత్ర సృష్టించిన చంద్రయాన్–3... ఆ చరిత్ర తాలూకు ఆనవాళ్లను కూడా జాబిల్లి ఉపరితలంపై శాశ్వతంగా, సగర్వంగా ముద్రించింది. ప్రజ్ఞాన్‌గా పిలుస్తున్న రోవర్ వెనక చక్రాలు మన జాతీయ చిహ్నమైన మూడు సింహాలతో కూడిన అశోక చక్రాన్ని, ఇస్రో అధికారిక లోగోను చందమామ దక్షిణ ధ్రువం మీద ముద్రించాయి. తద్వారా చందమామ చెక్కిలిపై చెరగని సంతకం చేశాయి. ఇందుకు సంబంధించి ఇస్రో బుధవారం మధ్యాహ్నమే ముందస్తుగా విడుదల చేసిన కర్టెన్ రైజర్ వీడియో ఇప్పుడు వైరల్‌గా మారింది. అన్నట్టూ లాండర్, రోవర్ పని చేసేది కేవలం ఒక్క చంద్ర దినం పాటు మాత్రమేనట! అంటే భూమిపై 14 రోజులన్నట్టు!! అన్నీ అనుకూలించి, కాస్త అదృష్టమూ కలిసొస్తే అవి రెండూ మరో చంద్ర దినంపాటు పని చేసే అవకాశాన్ని కొట్టి పారేయలేమని ఇస్రో అంటోంది.



చంద్రయాన్–3 ప్రయోగం ఖర్చు:	ప్రయోగం నిర్వహించిన తేదీ	భూమి నుంచి చంద్రుడిపైకి ప్రయాణించిన దూరం:
రూ.685 కోట్లు	2023 జూలై 14	3.89 లక్షల కిలోమీటర్లు
చంద్రయాన్–3 మిషన్‌ను పంపించిన రాకెట్: ఎల్‌వీఎం3–ఎం4	చంద్రుడిపై దిగిన తేదీ 2023 ఆగస్టు 23	ల్యాండర్ మాడ్యూల్ బరువు 1,752 కిలోలు
	చంద్రుడిపైకి ప్రయాణించిన రోజులు: 41	ల్యాండర్ తీసుకెళ్లిన పేలోడ్స్: 9



చంద్రునిపై దిగుతున్న ల్యాండర్ ఊహా చిత్రాలు

రోవర్ 'ప్రజ్ఞాన్' బరువు:	ఆఖరి కక్ష్య తగ్గింపునకు పట్టిన సమయం
26 కిలోలు	37 నిమిషాలు
రోవర్ తీసుకెళ్లిన పేలోడ్స్: 2	చంద్రుడిపై దిగిన సమయం: 2023 ఆగస్టు 23 సాయంత్రం 6.04 గంటలకు

ఈ విజయం వెనుక ఎందరెందరో...

ప్రముఖ శాస్త్రవేత్తలు, ఇంజనీర్ల కృషితో చంద్రయాన్–3 విజయవంతం

భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ(ఇస్రో) అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టిన చంద్రయాన్–3 మిషన్ వెనుక పలువురు కీలకమైన శాస్త్రవేత్తలు ఉన్నారు. వారి కృషి, పట్టుదల, నిరంతర శ్రమతో ప్రయోగం సఫలమైంది. వారు ఇస్రో బృందానికి నేతృత్వం వహిస్తూ ముందుండి నడిపించారు. ఈ ప్రయోగం వెనుక దాదాపు 1,000 మంది ఇంజనీర్లు, సైంటిస్టుల కృషి ఉంది. ముఖ్యమైన సైంటిస్టులు, నిపుణుల గురించి తెలుసుకుందాం.. - సాక్షి, నేషనల్ డెస్క్

ఎస్.సోమనాథ్, ఇస్రో చైర్మన్



చంద్రయాన్–3 ప్రయోగ సారథి ఇస్రో అధినేత ఎస్.సోమనాథ్. ఏరోస్పేస్ ఇంజనీరింగ్ అభ్యసించారు. బెంగళూరులోని ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ సైన్స్‌లో చదువుకున్నారు. సంస్కృత భాషలో అనర్గళంగా మాట్లాడగలరు. ఆయన పేరులోని సోమనాథ్‌కు అర్థం చంద్రుడి ప్రభువు. విక్రమ్ సారాభాయి స్పేస్ సెంటర్(వీఎస్ఎస్‌సీ), లిక్విడ్ ప్రొపల్షన్ సిస్టమ్స్ సెంటర్ డైరెక్టర్‌గా ఎస్.సోమనాథ్ సేవలందించారు. చంద్రయాన్–3ని ప్రయోగించిన బాహుబలి రాకెట్ మార్క్–3 రూపకల్పనలో కీలక పాత్ర పోషించారు. గగన్‌యాన్, ఆదిత్య–ఎల్1 ప్రయోగాల్లోనూ పాలుపంచుకుంటున్నారు.

ఎస్.మోహన కుమార్, మిషన్ డైరెక్టర్



సీనియర్ సైంటిస్టు మోహన కుమార్ విక్రమ్ సారాభాయి అంతరిక్ష కేంద్రంలో పనిచేశారు. వన్ వెబ్ ఇండియా 2 శాటిలైట్స్ ప్రాజెక్టు(ఎల్‌వీఎం3–ఎం3)లో డైరెక్టర్‌గా సేవలందించారు. చంద్రయాన్–3లో మిషన్ డైరెక్టర్‌గా వ్యవహరించారు.

ఎం.శంకరన్, యూ.ఆర్.రావు శాటిలైట్ సెంటర్ డైరెక్టర్



ఇస్రో ప్రయోగించిన వివిధ శాటిలైట్ల డిజైన్, అభివృద్ధిలో భాగస్వాములయ్యారు. ఉపగ్రహాల తయారీలో ఈయనది సుదీర్ఘ అనుభవం. మంగళ్‌యాన్, చంద్రయాన్–1, చంద్రయాన్–2 మిషన్లలో పనిచేశారు. 2021 జూన్ నుంచి యూ.ఆర్.రావు శాటిలైట్ సెంటర్ డైరెక్టర్‌గా వ్యవహరిస్తున్నారు.

ఎం.వనిత, యూ.ఆర్.రావు శాటిలైట్ సెంటర్ డిప్యూటీ డైరెక్టర్



చందమామపై చేసిన ప్రయోగానికి నాయకత్వం వహించిన మొట్టమొదటి మహిళా శాస్త్రవేత్తగా వనిత గుర్తింపు పొందారు. ఎలక్ట్రానిక్స్ సిస్టమ్స్ ఇంజనీరింగ్‌లో పట్టా పొందారు. చంద్రయాన్–2 మిషన్‌కు ప్రాజెక్టు డైరెక్టర్‌గా పనిచేశారు. ఈ అనుభవంతో చంద్రయాన్–3 విజయవంతం కావడానికి కృషి చేశారు.

పి.వీరముత్తువేల్, ప్రాజెక్టు డైరెక్టర్



తమిళనాడులోని విల్లుపురంలో జన్మించిన ప్రముఖ సైంటిస్టు వీరముత్తువేల్ 2019లో చంద్రయాన్–3 మిషన్‌లో ప్రాజెక్టు డైరెక్టర్‌గా చేరారు. నాలుగేళ్లుగా సేవలందిస్తున్నారు. ఐఐటీ–మద్రాసులో విద్యనభ్యసించారు. మాస్టర్స్ ఆఫ్ టెక్నాలజీ పట్టాలో అందుకున్నారు. చంద్రయాన్–2, మంగళ్‌యాన్ మిషన్లలోను ఆయన భాగస్వామ్యం ఉంది. ఇంతకుముందు ఇస్రో ప్రధాన కార్యాలయంలోని స్పేస్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ప్రోగ్రామ్ ఆఫీసులో డిప్యూటీ డైరెక్టర్‌గా వ్యవహరించారు. సాంకేతికపరమైన అంశాలపై అపారమైన పట్టు ఉంది.

ఎస్.ఉన్నికృష్ణన్ నాయర్, విక్రమ్ సారాభాయి స్పేస్ సెంటర్ డైరెక్టర్



ఏరోస్పేస్ ఇంజనీర్‌గా రాకెట్ ప్రయోగాల్లో ఎంతో అనుభవం ఉంది. అంతరిక్షంలోకి వ్యోమగామిని పంపే మిషన్‌ను నాయకత్వం వహిస్తున్నారు. హ్యూమన్ స్పేస్ ఫ్లైట్ సెంటర్‌కు డైరెక్టర్‌గా పనిచేస్తున్నారు. జీఎస్ఎల్వీ మార్క్–3 రాకెట్‌ను ఈయన నాయకత్వంలోనే అభివృద్ధి చేశారు.

కె.కల్పన, చంద్రయాన్–3 డిప్యూటీ డైరెక్టర్



ప్రముఖ ఇంజనీర్ కె.కల్పన చంద్రయాన్–3 ప్రయోగాన్ని విజయవంతం చేయడానికి తన బృందంతో కలిసి పని చేశారు. మిషన్ డిప్యూటీ డైరెక్టర్‌గా సమర్థవంతంగా వ్యవహరించారు. పలు ఉపగ్రహాల తయారీలో భాగస్వాములయ్యారు. చంద్రయాన్–2, మంగళ్‌యాన్ మిషన్లలోనూ ఆమె తన వంతు సేవలు అందించారు.

వి.నారాయణన్, లిక్విడ్ ప్రొపల్షన్ సెంటర్ డైరెక్టర్

వ్యోమనౌకలకు అవసరమైన లిక్విడ్ ప్రొపల్షన్ ఇంజన్లను తయారు చేయడంలో ఈయన నిపుణులు. చంద్రయాన్–3 మిషన్‌లో భాగంగా విక్రమ్ ల్యాండర్ చంద్రుడి ఉపరితలంపై సాఫ్ట్ ల్యాండింగ్ కావడానికి తోడ్పడిన థ్రస్ట్ ఇంజన్లను నారాయణన్ నేతృత్వంలోనే అభివృద్ధి చేశారు. ఐఐటీ–ఖరగ్‌పూర్‌లో చదువుకున్నారు. క్రయోజెనిక్ ఇంజన్ల అభివృద్ధి, తయారీలోనూ మంచి అనుభవం ఉంది.

భూమిపై సంకల్పం.. జాబిల్లిపై సాకారం

- చంద్రయాన్–3 విజయంపై ప్రధాని నరేంద్ర మోదీ హర్షం
- ఇస్రో శాస్త్రవేత్తలకు అభినందనలు
- ఈ విజయం ప్రపంచంలోని ప్రజలందరిదీ..
- ఆకాశమే హద్దు కాదని భారత్ నిరూపిస్తోంది
- త్వరలోనే 'చందమామ ఏక్ టూర్ కే'

న్యూఢిల్లీ: చంద్రయాన్–3 ప్రయోగం విజయవంతం కావడం పట్ల ప్రధానమంత్రి నరేంద్ర మోదీ హర్షం వ్యక్తం చేశారు. ఇస్రో శాస్త్రవేత్తలపై ప్రశంసల వర్షం కురిపించారు. వారికి అభినందనలు తెలియజేశారు. భారత జాతీయ పతాకాన్ని రెపరెపలాడిస్తూ తన ఆనందాన్ని పంచుకున్నారు. ఇప్పుడు చంద్రుడిపై భారత్ అడుగుపెట్టిందని అన్నారు. ఇది కేవలం భారత్ విజయం కాదని చెప్పారు. ఈ ఘనత ప్రపంచంలోని ప్రజలందరికీ చెందుతుందని చెప్పారు. బ్రిక్స్ సదస్సులో పాల్గొనేందుకు దక్షిణాఫ్రికాలోని జోహన్నెస్‌బర్గ్ వెళ్లిన మోదీ బుధవారం సాయంత్రం చంద్రయాన్–3 సాఫ్ట్ ల్యాండింగ్ ప్రక్రియను టీవీలో ప్రత్యక్షంగా వీక్షించారు. ల్యాండింగ్ సక్సెస్ అయిన వెంటనే ఇస్రో సైంటిస్టులను ఉద్దేశించి వర్చువల్‌గా ప్రసంగించారు. బ్రిక్స్ సదస్సు కోసం ప్రస్తుతం తాను దక్షిణాఫ్రికాలో ఉన్నప్పటికీ తన మనసు, ఆత్మ మొత్తం భారత్‌లోనే ఉన్నాయని పేర్కొన్నారు. ప్రపంచంలోని బలమైన జీ20 కూటమికి భారత్ నాయకత్వం వహిస్తున్న ఈ శుభసందర్భంలో చంద్రయాన్–3 ప్రయోగం సఫలం కావడం మరింత ఆనందాన్ని ఇస్తోందన్నారు. భూగోళంపై మనం తీసుకున్న సంకల్పం చందమామపై నెరవేరిందని సంతోషం వ్యక్తం చేశారు. ఈ విజయం చిరస్మరణీయమని తెలిపారు. ఈ అద్భుత క్షణం శాశ్వతంగా మదిలో నిలిచిపోతుందని చెప్పారు. చంద్రుడి దక్షిణ ధ్రువంపై అడుగుపెట్టిన మొట్టమొదటి దేశంగా భారత్ చరిత్ర సృష్టించిందంటూ ప్రధాని మోదీ భావోద్వేగానికి లోనయ్యారు. ఇదొక చరిత్రాత్మక సందర్భమని ఉద్ఘాటించారు. అభివృద్ధి చెందుతున్న భారత్‌కు ఇది ప్రతీక అని చెప్పారు. కొత్త చరిత్రను భారత్ లిఖించిందని వెల్లడించారు. నవ భారతదేశంలో నూతన శిఖరాలకు చేరుకుంటున్నామని, అందుకు మనమంతా సాక్ష్యులమని వివరించారు.

శాస్త్రవేత్తల అంకితభావం వల్లే..

అమృతకాలంలో ఇది మొదటి విజయమని అన్నారు. ఇది అమృత వర్షమని అభివర్ణించారు. ఆకాశమే హద్దు కాదని భారత్ పదేపదే నిరూపిస్తోందని ప్రధాని మోదీ చమత్కరించారు. ఇప్పటిదాకా ఎవరూ చేరుకోని జాబిల్లి దక్షిణ ధ్రువానికి భారత్ చేరుకుందని ఉద్ఘాటించారు. మన శాస్త్రవేత్తల అంకితభావం, నైపుణ్యం వల్లే ఈ విజయం సాధ్యమైందన్నారు. చందమామకు సంబంధించిన మన ఊహాగానాలు, ప్రచారంలో ఉన్న కథలు ఇక మారుతాయని, సామెతలు కొత్త తరం కోసం కొత్త అర్థాలను వెతుక్కుంటాయని వ్యాఖ్యానించారు. భూమిని తల్లిగా, చంద్రుడిని మామగా మనం భావిస్తామని చెప్పారు. 'చందమామ దూర్ కే' అంటుంటామని, ఇకపై 'చందమామ ఏక్ టూర్ కే' అనే రోజులు దగ్గర్లోనే ఉన్నాయని వివరించారు. తద్వారా జాబిల్లిపై పర్యటనలు త్వరలో ప్రారంభమవుతాయని పరోక్షంగా స్పష్టం చేశారు. సూర్యుడిపై పరిశోధనల కోసం 'ఆదిత్య–ఎల్1' ప్రయోగానికి ఇస్రో సిద్ధమవుతోందని చెప్పారు. శుక్రగ్రహంపైనా అధ్యయనం చేసే ప్రణాళిక ఉందన్నారు. అనంతరం ప్రధాని మోదీ ఇస్రో చైర్మన్ ఎస్.సోమనాథ్‌తో మాట్లాడారు. అభినందనలు తెలిపారు.



ఇస్రో చైర్మన్ సోమనాథ్‌ను ఫోన్‌లో అభినందిస్తున్న మోదీ

ఇక అంగారకుడిపైకి అడుగు!

ఇస్రో చైర్మన్ సోమనాథ్ వెల్లడి

బెంగళూరు: దేశం కోసం స్ఫూర్తిదాయక కార్యం సాధించినందుకు ఎంతో గర్వంగా ఉందని ఇస్రో చైర్మన్ ఎస్.సోమనాథ్ హర్షం వ్యక్తంచేశారు. భారత శాస్త్రవేత్తల కృషి ఫలించిందని, ఇందులో పాలుపంచుకున్న ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు తెలిపారు. 'చంద్రయాన్–3 విజయంతో అంగారకుడిపైకి వెళ్తాం. భవిష్యత్తులో శుక్రుడితోపాటు ఇతర గ్రహాలపైకి వెళ్తాం' అని చెప్పారు.

ఇది ఏ దేశానికైనా కష్టం

'ఈ రోజు టెక్నాలజీ ఇంతగా అభివృద్ధి చెందినా చంద్రుడిపైకి ప్రయాణం చేయడం ఏ దేశానికైనా అంత సులువు కాదు. అదీగాక సాఫ్ట్ లాండింగ్ మరింత సంక్లిష్టమైన విషయం. అయితే, కేవలం రెండు మిషన్లతోనే భారత్ సుసాధ్యం చేసి చూపింది. మానవరహిత వ్యోమనౌకను చంద్రుడి కక్ష్యలోకి ప్రవేశపెట్టేందుకు మాత్రమే చంద్రయాన్–1ను చేపట్టాం.' అని సోమనాథ్ చెప్పారు.

మేడిన్ ఇండియా మిషన్

'చంద్రయాన్–2 నుంచి నేర్చుకున్న పాఠాలు ఎంతో ఉపయోగపడ్డాయి. ప్రతి ఒక్కరూ చంద్రయాన్ విజయం కోసం ప్రార్థించారు. చంద్రయాన్–2 మిషన్‌లో పాలుపంచుకున్న చాలామంది కీలక శాస్త్రవేత్తలు చంద్రయాన్–3 మిషన్ బృందంలో పనిచేశారు. చంద్రయాన్–3లో వినియోగించిన సాంకేతిక పరిజ్ఞానం ఏ టెక్నాలజీ కంటే కూడా తక్కువ కాదు. ప్రపంచంలోని అత్యుత్తమ సెన్సర్లు మన వద్ద ఉన్నాయి. ఇది పూర్తిగా ప్రపంచస్థాయి పరికరాలతో దేశీయంగా రూపొందించిన మేడిన్ ఇండియా మిషన్' అని సోమనాథ్ చెప్పారు.

చంద్రయాన్–3 ప్రయాణం సాగిందిలా ..

- గత ఏడాది ఏప్రిల్‌లో చంద్రయాన్–3 ఫస్ట్‌లుక్‌ను ఇస్రో విడుదల చేసింది. తొలుత 2020లో చంద్రయాన్‌ను ప్రయోగించాలని భావించారు కానీ కోవిడ్–19తో ఆలస్యమైంది.
- ఈ మిషన్ కోసం ఇస్రో రూ.615 కోట్లు ఖర్చు చేసింది. చంద్రయాన్–2 కంటే తక్కువ ఖర్చుతో ఈ మిషన్ పూర్తయింది. చంద్రయాన్–2కి రూ.978 కోట్లు ఖర్చు చేశారు.

చంద్రయాన్–3 మూడు భాగాలుగా ఉంది.

1. ల్యాండర్ మాడ్యూల్ (ఎల్ఎం),
2. ప్రొపల్షన్ మాడ్యూల్ (పీఎం) 3. రోవర్

- చంద్రయాన్ ల్యాండర్ నిర్దేశించిన చంద్రుడి ఉపరితలంపై సాఫ్ట్‌గా ల్యాండ్ అయ్యే సామర్థ్యం కలిగి ఉంది.చంద్రుడిపై ఈ ల్యాండర్ (విక్రమ్) దిగిన తర్వాత రోవర్ (ప్రజ్ఞాన్) బయటకి వస్తుంది. ఈ రెండూ కలిసి చంద్రుడి ఉపరితలంపై పరిశోధనల్ని చేస్తాయి. ల్యాండర్, రోవర్‌లు పరిశోధనలకు అనుగుణమైన సైంటిఫిక్ పే లోడ్స్‌ను కలిగి ఉన్నాయి.
- ఇక ల్యాండర్ మాడ్యూల్‌ను చివరి 100 కి.మీ. దూరం వరకు మోసుకుపోవడమే ప్రొపల్షన్ మాడ్యూల్ ప్రధాన విధి.
- చంద్రయాన్–3 మిషన్ లాంచ్‌వెహికల్ మార్క్–3 (ఎల్‌వీఎం–3) రాకెట్‌ని ఆంధ్రప్రదేశ్‌లో సతీష్ ధావన్ స్పేస్ సెంటర్ నుంచి జులై 14 మధ్యాహ్నం 2.35 గంటలకు విజయవంతంగా ప్రయోగించారు. మొత్తం 41 రోజుల పాటు ఈ వ్యోమనౌక ప్రయాణించి సూపర్ సక్సెస్ కొట్టింది.
- ఆ మర్నాడు జులై 15న మొదటి ఆర్బిట్ రైజింగ్ (కక్ష్య దూరం పెంపుదల) మొదటి విడతలో భూమికి దగ్గరగా 173 కిలోమీటర్లు ఎత్తుకు, భూమికి దూరంగా 41,762 కిలోమీటర్లు ఎత్తుకు పెంచారు.
- అలా అయిదుసార్లు కక్ష్యం పెంచాక ఆగస్టు 1న అర్ధరాత్రి చంద్రయాన్–3 మిషన్‌ను పెరిజీలోకి అంటే భూమికి దగ్గరగా వచ్చిన సమయంలో లూనార్ ట్రాన్స్ ఇంజెక్షన్ అనే ఆపరేషన్‌తో భూమధ్యంతర కక్ష్య నుంచి చంద్రుడి కక్ష్య వైపుకు విజయవంతంగా మళ్లించారు.
- ఆగస్టు 5న భూ మధ్యంతర కక్ష్య నుంచి 3,69,328 లక్షల కిలోమీటర్లు దూరం ప్రయాణించి లూనార్ ఆర్బిట్ (చంద్రుని కక్ష్య)లో 164''18074 ఎత్తుకు చేరుకుంది.
- అప్పట్నుంచి కక్ష్యను అయిదుసార్లు తగ్గించుకుంటూ వచ్చారు. ఆగస్టు 6, 9, 14, 16 తేదీలలో కక్ష్య తగ్గిస్తూ రావడంతో చంద్రయాన్–3 చంద్రుడికి మరింత చేరువైంది.
- ఆగస్టు 18న ల్యాండర్ మాడ్యూల్‌లో వున్న కొద్దిపాటి ఇంధనాన్ని మండించి చంద్రుడికి చేరువగా అంటే 113''157 కిలోమీటర్లు దగ్గరగా వెళ్లింది.
- చంద్రయాన్–3లో మరో కీలకఘట్టం విక్రమ్ ల్యాండర్, ప్రజ్ఞాన్ రోవర్‌లతో కూడిన లాండర్ మాడ్యూల్ (ఎల్ఎమ్) ప్రొపల్షన్ మాడ్యూల్ నుంచి ఆగస్టు 17న విజయవంతంగా విడిపోయింది. దీంతో చంద్రయాన్–3 ల్యాండర్ మాడ్యూల్ చంద్రుడి చుట్టూ ఉన్న 100 కి.మీ. వృత్తాకార కక్ష్యలోకి ప్రవేశించింది.
- ల్యాండర్ మాడ్యూల్ చిట్టచివరి డీ బూస్టింగ్ ప్రక్రియ ఆగస్టు 20న విజయవంతంగా పూర్తయింది. అప్పట్నుంచి ఆ ల్యాండర్ చంద్రుడి చుట్టూ 25 134కి.మీ. కక్ష్యలో పరిభ్రమించింది.
- ఈ ప్రయోగంలో ఇస్రో మొట్టమొదటి సారిగా థ్రొటెల్–అబల్ అనే లిక్విడ్ ఇంజిన్‌లను ఉపయోగించింది
- ఆగస్టు 23 సాయంత్రం 5. 44 గంటలకు ల్యాండర్ విక్రమ్ ఈ ప్రత్యేక ఇంజిన్ల సాయంతో దశల వారీగా వేగాన్ని తగ్గించుకుంటూ వచ్చింది. సరిగ్గా 6.04 గంటలకు జాబిల్లి దక్షిణ ధ్రువంపై విజయవంతంగా దిగిన విక్రమ్ ల్యాండర్ దిగడంతో భారత్ కీర్తి పతాక చంద్రుడిపై రెపరెపలాడింది.
- రోవర్ చంద్రుడి ఉపరితలంపైకి వచ్చాక సెకెండ్‌కు ఒక సెంటీమీటర్ వేగంతో కదులుతూ ఒక లూనార్ డే (చంద్రరోజు) పనిచేస్తుంది. ఒక లూనార్ డే అంటే భూమి మీద కొలిస్తే 14 రోజులు అవుతుంది. అంటే సెప్టెంబర్ 7 దాకా 500 మీటర్లు దూరం ప్రయాణిస్తుంది.



ఢిల్లీలోని నెహ్రూ ప్లానెటోరియంలో చంద్రయాన్-3 ల్యాండింగ్‌ను టీవీలో ప్రత్యక్షంగా వీక్షిస్తూ సంబరాల్లో మునిగిపోయిన విద్యార్థులు



చంద్రయాన్-3 విజయవంతం కావడంతో ఢిల్లీలో జాతీయ జెండా ప్రదర్శిస్తున్న కేంద్ర సైన్స్ అండ్ టెక్నాలజీ మంత్రి జితేంద్ర సింగ్

చంద్రయాన్ -3 తరువాత?

- నలభై రోజుల ఉత్కంఠపై శుభం కార్డు పడింది!
- 140 కోట్ల మంది ప్రజల ఆకాంక్షలు సాకారమయ్యాయి!
- అగ్రరాజ్యాలను తోసిరాజంటూ.. భారత్ జాబిల్లి దక్షిణ ధ్రువంపై జెండా పాతేసింది!
- అన్నివైపుల నుంచి ప్రశంసలు వెల్లువెత్తుతున్నాయి!
- బాగానే ఉంది కానీ... వాట్ నెక్స్ట్?
- జాబిల్లి దక్షిణ ధ్రువంపై దిగిన తొలిదేశం తరువాతి లక్ష్యం ఏమిటి?
- ఈ విజయంతో మనకొచ్చే లాభాలేమిటి? మానవాళికి ఒరిగేదేమిటి?



భారత అంతరిక్ష పరిశోధన సంస్థ తన రెండో ప్రయత్నంలో జాబిల్లి దక్షిణ ధ్రువంపై రోవర్‌ను ల్యాండ్ చేయడంలో విజయం సాధించింది. భవిష్యత్తు ఏమిటన్న విషయానికి క్లుప్తంగా ఇవ్వగలిగిన సమాధానం ఆకాశమే హద్దుగా అంతరిక్ష రంగంలో మనదైన ముద్రను వేయడమే అని చెప్పవచ్చు. ఎందుకంటే ఈ ఏడాదిలోనే రష్యా, ఇజ్రాయెల్‌లు రెండూ జాబిల్లి దక్షిణ ధ్రువంపై దిగేందుకు విఫలయత్నం చేశాయి. భారత్ మాత్రమే విజయం సాధించగలిగింది. కచ్చితంగా ఇది భారత శాస్త్రవేత్తల సునిశిత ప్లానింగ్, ఆలోచన, నిబద్ధతలకు ప్రత్యక్ష ప్రమాణం. కాబట్టి చంద్రయాన్-3 తరువాత అంతరిక్ష ప్రయోగాల కోసం ఇస్రో వైపు చూసే దేశాల సంఖ్య నిస్సందేహంగా పెరుగుతుంది. ప్రస్తుతం భారత అంతరిక్ష ప్రయోగ మార్కెట్ విలువ దాదాపు 800 కోట్ల డాలర్లని అంచనా. 2040 నాటికి ఇది ఐదు రెట్లు పెరుగుతుందని ఇప్పటికే ఒక అంచనా ఉండగా.. చంద్రయాన్-3 విజయం ఈ లక్ష్యాన్ని మరింత ముందుగానే అందుకునేందుకు అవకాశం కల్పిస్తుంది. కొన్నేళ్లుగా భారత అంతరిక్ష రంగం ఇతర దేశాల కంటే రెట్టింపు వేగంతో ఎదుగుతున్న విషయం తెలిసిందే.

కలిసొచ్చే జుగాడ్...

చంద్రయాన్ -3 ఖర్చు రూ.600 కోట్లు ఉంటే.. ఇంతే స్థాయి అంతరిక్ష ప్రయోగానికి విదేశాల్లో ఎన్నో రెట్లు ఎక్కువ ఖర్చు పెట్టాల్సి వస్తుందనేది ఇప్పటికే మనకు అనుభవమైన విషయం. అతితక్కువ ఖర్చుతో ఉపగ్రహాలను అంతరిక్షంలోకి చేర్చగలగడం ఇస్రో ప్రత్యేకతగా మారింది. కాబట్టి సొంతంగా ఉపగ్రహాలు పంపుకోలేని చాలా దేశాలిప్పుడు భారత్‌ను ఆశ్రయిస్తాయి. ఇది మనకు కలిసొచ్చే అంశం. ఇస్రోకు నేరుగా ప్రయోజనం కలిగితే ఈ సంస్థకు విడిభాగాలు, సామాన్లు సరఫరా చేసే ప్రైవేట్ కంపెనీలు బోలెడన్ని లాభాలు చవిచూస్తాయి. రక్షణ రంగంతోపాటు అంతరిక్ష రంగంలోనూ ప్రైవేట్ పెట్టుబడులను ఆకర్షించేందుకు కేంద్రం ఆలోచన చేస్తున్న నేపథ్యంలో చంద్రయాన్-3 విజయం చాలా కీలకం కానుంది. విదేశీ కంపెనీలు భారతీయ సంస్థలతో కలిసి పనిచేసేందుకు, లేదా సొంతంగా కార్యకలాపాలు ప్రారంభించేందుకు అవకాశాలు మెరుగవుతాయి. ఉపగ్రహాలను మోసుకెళ్లేందుకు మానవసహిత అంతరిక్ష ప్రయోగాలకు, ఇతర అవసరాలకు వేర్వేరు శక్తిసామర్థ్యాలు కలిగిన జియోసింక్రనస్ లాంఛ్ వెహికల్ కలిగి ఉండటం ఇస్రోకు లాభించే ఇంకో అంశం.

- సాక్షి, నేషనల్ డెస్క్

1972 తరువాత భూమి సహజ ఉపగ్రహం చంద్రుడిపై మనిషి కాలుపెట్టలేదు. అయితే అక్కడ నీరు ఉందన్న విషయం స్పష్టమైన తరువాత చాలా దేశాలు వ్యోమగాములను పంపేందుకు ప్రయత్నాలు ముమ్మరం చేశాయి. అమెరికా తన ఆర్టిమిస్ ప్రోగ్రామ్ ద్వారా వచ్చే ఏడాదికల్లా చంద్రుడిపైకి వ్యోమగాములను పంపడం, అక్కడే ఒక శాశ్వత స్థావరం ఏర్పాటు చేసుకోవడం వంటి లక్ష్యాలతో పనిచేస్తోంది. జాబిల్లిపై నీటితోపాటు చాలా విలువైన ఖనిజాలు ఉన్నాయన్న విషయం అందరికీ తెలిసిందే. కాలుష్యరహితమైన, అత్యంత సమర్థమైన హీలియం-3 ఆ వనరుల్లో ఒకటి.

భవిష్యత్తు అవసరాల కోసం?

భవిష్యత్తులో జాబిల్లిపైని వనరులను వాడుకునే అవకాశం లభిస్తే (శుద్ధి, రవాణా వంటి వాటికి తగిన టెక్నాలజీలు అభివృద్ధి చేసుకోవాలి) అందులో భారత్‌కూ భాగస్వామ్యం లభించేందుకు చంద్రయాన్-3 విజయం సాయపడుతుంది. అలాగే జాబిల్లిని ఒక కేంద్రంగా ఏర్పాటు చేసుకుని సౌర కుటుంబంలోని ఇతర గ్రహాలను అన్వేషించాలని, అంగారకుడిపై స్థిర నివాసం ఏర్పరచుకోవాలని మనిషి చాలాకాలంగా ఆలోచిస్తున్నాడు. ఈ ప్రస్థానంలో జాబిల్లి దక్షిణ ధ్రువం మాదిరిగా ఇతర గ్రహాలపైని అత్యంత కఠినమైన పరిస్థితులను తట్టుకుని వ్యోమనౌకలను ల్యాండ్ చేయడమెలా అన్నది తెలిసిన వారి అవసరం కచ్చితంగా ఉంటుంది. అంతేకాకుండా.. ఇస్రో ఇప్పటికే అనేక దేశాలతో కలిసి అంతరిక్ష ప్రయోగాలు నిర్వహించింది. పరిశోధనల్లోనూ భాగస్వామిగా నిలిచింది. ఈ అనుభవమంతా భవిష్యత్తులో అంతరిక్షాన్ని మన అవసరాల కోసం ఉపయోగించుకునే సందర్భంలో ఉపయోగపడుతుంది. అంతరిక్షాన్ని శాంతియుత ప్రయోజనాల కోసం వాడుకోవాలన్న భారత ప్రకటిత లక్ష్యానికి తగిన విధానాలను రూపొందించవచ్చు.

రష్యాలో విమాన ప్రమాదం

వాగ్నర్ చీఫ్ ప్రిగోజిన్ మృతి?



మాస్కో: రష్యాలో బుధవారం జరిగిన ఘోర విమాన ప్రమాదంలో 10 మంది దుర్మరణం పాలయ్యారు. రష్యా అనుకూల కిరాయి సైనిక ముఠా వాగ్నర్ గ్రూప్ చీఫ్ యెవ్గెనీ ప్రిగోజిన్ కూడా వారిలో ఉన్నట్లు అనుమానిస్తున్నారు. ప్రయాణికుల జాబితాలో ఆయన పేరు కూడా ఉన్నట్లు అధికారులు ధ్రువీకరించారు. అయితే ప్రిగోజిన్ విమానం ఎక్కిందీ లేనిదీ తేలడం లేదు. అతని సొంత విమానమని చెబుతున్న సదరు ప్రైవేట్ బిజినెస్ జెట్ రష్యా రాజధాని మాస్కోకు 100 కిలోమీటర్ల దూరంలో త్వెర్ ప్రాంతంలో కుప్పకూలింది. ఉక్రెయిన్‌తో యుద్ధంలో వాగ్నర్ గ్రూప్ రష్యా తరఫున పోరాడిన విషయం తెలిసిందే. ఈ ఏడాది జూన్‌లో రష్యా సైనిక నాయకత్వం మీద వాగ్నర్ గ్రూప్ సాయుధ తిరుగుబాటు చేసి విఫలమైంది. అనంతరం ప్రిగోజిన్‌ను బెలారస్‌కు ప్రవాసం పంపుతున్నట్లు రష్యా ప్రకటించింది. వాగ్నర్ గ్రూప్ సభ్యులు కూడా ఆయనను అనుసరించడమో, రిటైర్ అవడమో, రష్యా సైన్యంలో చేరడమో చేయొచ్చని పేర్కొంది.

చంద్రుడి గుట్టు తెలుసుకొనేలా..

చంద్రయాన్-3తో వివిధ పేలోడ్లను పంపించిన ఇస్రో

సూళ్లూరుపేట(తిరుపతి జిల్లా): చంద్రుడిపై దాగి ఉన్న రహస్యాలను అధ్యయనం చేయడం కోసం ఇస్రో సైంటిస్టులు చంద్రయాన్-3 ప్రయోగం చేపట్టారు. ఈ మిషన్‌లో 5 ఇస్రో పేలోడ్స్, నాసాకు చెందిన ఒక పేలోడ్‌ను పంపించారు. ల్యాండర్‌ను చంద్రుడి దక్షిణ ధ్రువ ప్రాంతంలో ఉపరితలంపై దించి పరిశోధనలకు శ్రీకారం చుట్టారు. ఈ ప్రాంతంలో సూర్యరశ్మి సోకదని, చీకటిగా ఉంటుందని చెబుతున్నారు. ప్రొపల్షన్ మాడ్యూల్ చంద్రుడి కక్ష్య (లూనార్ ఆర్బిట్) నుంచి అటు భూమిని, ఇటు చంద్రుడిని అధ్యయనం చేయడానికి 'ఆర్బిటార్ స్పెక్ట్రో పోలారిమెట్రీ ఆఫ్ హ్యాబిటబుల్ ప్లానెట్ ఎర్త్'అనే ఒక సైంటిఫిక్ పరికరం అమర్చి పంపారు. ఈ సైంటిఫిక్ పేలోడ్‌తో ముఖ్యంగా చంద్రుడి ఉపరితలం నివాసయోగ్యంగా ఉందా? అనేది అధ్యయనం చేస్తారు. అలాగే చంద్రుడిపై జరుగుతున్న మార్పులను తెలుసుకోవచ్చు. జాబిల్లిని అధ్యయనం చేయడానికి ఇది ప్రయోగాత్మక పేలోడ్ కావడం విశేషం.

ల్యాండర్‌లో పేలోడ్స్ ఇవీ...

- ల్యాండర్‌లో మూడు పేలోడ్స్ ఉన్నాయి. ఇందులో లాంగ్‌మ్యూయిర్ ప్రోబ్ (రంభ-ఎల్‌పీ) అనే సైంటిఫిక్ పేలోడ్‌తో చంద్రుడి ఉపరితలంపై ప్లాస్మా, అయాన్లు, ఎలక్ట్రాన్లు, చంద్రుడి అంతర్భాగం దాగి ఉన్న ఖనిజాలపై పరిశోధన చేస్తారు.
- చంద్రాస్ సర్ఫేస్ థర్మో ఫిజికల్ ఎక్స్‌పరిమెంట్ అనే పేలోడ్ చంద్రుడి ఉపరితలంపై ఉష్ణ లక్షణాలను కొలవడానికి, చంద్రుడిపై మ్యాప్ తయారు చేయడానికి ఉపయోగపడుతుంది.
- ఇన్‌స్ట్రుమెంట్ ఫర్ లూనార్ సీస్మిక్ యాక్టివిటీ, రేడియో అనాటమీ ఆఫ్ మూన్‌బౌండ్ హైపర్‌సెన్సిటివ్ అయానోస్పియర్, అట్మాస్పియర్ అనే పేలోడ్స్‌తో చంద్రుడిపై లాండింగ్ సైట్ చుట్టూ ప్రకంపనలను గుర్తిస్తారు.

రోవర్‌లోని పేలోడ్స్

- చంద్రుడి ఉపరితలం మూలక కూర్పును అధ్యయనం చేయడానికి రోవర్‌లో రెండు సైంటిఫిక్ పరికరాలను అమర్చి పంపారు. ఇందులో అల్ఫా పార్టికల్ ఎక్స్-రే స్పెక్ట్రోమీటర్ అనే పేలోడ్‌తో చంద్రుడిపై ఖనిజ సంపద, శిలాజాలను శోధిస్తారు. చంద్రుడిపై రసాయనాలుంటే వాటిని కూర్పు చేయడానికి ఉపయోగిస్తారు.
- లేజర్ ప్రేరేపిత బ్రేక్‌డౌన్ స్పెక్ట్రోస్కోప్ అనే పేలోడ్‌తో చంద్రుడిపై రాళ్లను అధ్యయనం చేస్తారు. ముఖ్యంగా చంద్రుడిపై నేల స్వభావం ఎలా ఉందో గుర్తిస్తారు.
- గ్యాస్, ప్లాస్మా పర్యావరణాన్ని అధ్యయనం చేయడానికి, చంద్రశ్రేణి అధ్యయనాల కోసం అమెరికా అంతరిక్ష పరిశోధన సంస్థ 'నాసా'కు చెందిన లేజర్ రెట్రోరిఫ్లెక్టర్ శ్రేణి అనే ఒక సైంటిఫిక్ పరికరాన్ని కూడా రోవర్‌లో అమర్చారు. ఇది కూడా చంద్రుడిపై మరింత అధ్యయనం కోసమే.

విస్తారా విమానాలకు తప్పిన ముప్పు

న్యూఢిల్లీ: దేశ రాజధాని న్యూఢిల్లీ విమానాశ్రయంలో బుధవారం ఉదయం అతి పెద్ద ముప్పు తప్పింది. ఒకే రన్ వే మీద ఒకే సమయంలో రెండు విస్తారా విమానాలకు ల్యాండింగ్, టేకాఫ్‌లకు అనుమతినివ్వడంతో అతి పెద్ద ప్రమాదం త్రుటిలో తప్పిపోయింది. వివరాల్లోకి వెళితే అహ్మదాబాద్ నుంచి ఢిల్లీకి వచ్చిన విమానం ఉదయం ఒక రన్‌వేపై ల్యాండ్ అయింది. అదే సమయంలో ఢిల్లీ నుంచి బగ్‌డోగ్రాకు వెళ్లాల్సిన విమానానికి అదే రన్ వే మీద నుంచే టేకాఫ్‌కు సిబ్బంది అనుమతినిచ్చారు. అహ్మదాబాద్ విమానం పార్కింగ్ బే దగ్గరకి వాయువేగంతో వస్తూ ఉంటే బగ్‌డోగ్రాకు వెళ్లాల్సిన విమానం టేకాఫ్ అవడానికి ఎదురుగా వస్తోంది. ఆ రెండు విమానాలు ఒకదానికొకటి ఢీకొనవలసిందే. అహ్మదాబాద్-ఢిల్లీలోని మహిళా పైలట్ సోను గిల్ అది చూసి వెంటనే ఎయిర్ ట్రాఫిక్ కంట్రోల్ (ఏటీసీకి) సమాచారం అందించారు. ఏటీసీ అధికారులు వెంటనే టేకాఫ్ అవ్వాల్సిన విమానాన్ని నిలిపివేయడంతో పెను ముప్పు తప్పింది.

బ్రిక్స్ విస్తరణకు భారత్ మద్దతు

- భాగస్వామ్య దేశాల ఏకాభిప్రాయంతో జరగాలి
- బ్రిక్స్ సదస్సులో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ



జోహెన్నెస్‌బర్గ్: బ్రెజిల్, రష్యా, ఇండియా, చైనా, దక్షిణాఫ్రికా (బ్రిక్స్)ల దేశాలతో కూడిన బ్రిక్స్ కూటమిని విస్తరించాలన్న ప్రతిపాదనతో భారత్ ముందుకు వచ్చింది. అయితే ఈ విస్తరణ ఏకాభిప్రాయంతో జరగాలని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ స్పష్టం చేశారు. దక్షిణాఫ్రికా జోహెన్నెస్‌బర్గ్‌లో జరుగుతున్న బ్రిక్స్ వార్షిక సదస్సులో బుధవారం నాడు ప్రధాని మోదీ ప్రసంగించారు. అద్భుతమైన భవిష్యత్‌కు బ్రిక్స్ సంసిద్ధంగా ఉండాలంటే మనం మన సమాజాలను భవిష్యత్‌కు సిద్ధం చేయాలని ప్రధాని మోదీ చెప్పారు. ఆఫ్రికన్ యూనియన్‌కు జీ20లో శాశ్వత సభ్యత్వాన్ని తాము ప్రతిపాదిస్తున్నట్టుగా చెప్పారు. "జీ 20 సదస్సును భారత్‌లో సెప్టెంబర్ 9, 10 తేదీల్లో నిర్వహిస్తున్నాం. బ్రిక్స్ దేశాలన్నీ అందులో శాశ్వత సభ్యులే. ఆఫ్రికన్ యూనియన్‌కు కూడా జీ-20లో శాశ్వత సభ్యత్వం ఇవ్వాలని మేము ప్రతిపాదిస్తున్నాం. బ్రిక్స్ భాగస్వామ్య పక్షాలన్నీ ఇందుకు అంగీకరిస్తాయని భావిస్తున్నాం" అని మోదీ ఆశాభావం వ్యక్తం చేశారు. గ్లోబల్ సౌత్ దేశాలకు బ్రిక్స్ సదస్సులో ప్రాధాన్యం కల్పించడాన్ని ప్రధాని స్వాగతించారు. జీ-20 సదస్సులో భారత్ కూడా గ్లోబల్ సౌత్ దేశాలకు అత్యధిక ప్రాధాన్యతనిస్తుందని స్పష్టం చేశారు. గత రెండు దశాబ్దాల్లో బ్రిక్స్ దేశాలు పరస్పర సహకారంతో అత్యంత అద్భుతమైన ప్రయాణాన్ని కొనసాగించాయని ప్రధాని మోదీ అన్నారు. గ్లోబల్ సౌత్ అభివృద్ధిలో బ్రిక్స్‌కు చెందిన న్యూ డెవలప్‌మెంట్ బ్యాంక్ కీలక పాత్ర పోషిస్తున్న విషయాన్ని గుర్తు చేశారు. రైల్వే రీసెర్చ్ నెట్‌వర్క్, స్టార్టప్ రంగాల్లో భారత్ చేసిన సూచనలతో అపారమైన అభివృద్ధి జరుగుతోందని అన్నారు.

పశ్చిమ దేశాల వల్లే ఉక్రెయిన్ యుద్ధం: పుతిన్

బ్రిక్స్ సదస్సులో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ప్రసంగించిన రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ ఉక్రెయిన్‌పై యుద్ధం పశ్చిమ దేశాల పాపమేనని ఆరోపించారు. డాన్‌బాస్ ప్రాంతంలో నివసించే ప్రజలకు వ్యతిరేకంగా పశ్చిమ దేశాలు ఉక్రెయిన్‌లో యుద్ధానికి దిగుతున్నాయని నిందించారు. యుద్ధాన్ని నిలిపివేయడమే రష్యా మిలటరీ లక్ష్యమని పుతిన్ అన్నారు. దక్షిణాఫ్రికాకు వస్తే అంతర్జాతీయ క్రిమినల్ కోర్టు వారెంట్లు మేరకు తనని అరెస్ట్ చేసే అవకాశం ఉందని అందుకే వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడుతున్నట్టు చెప్పారు.

చంద్రయానాలకు... ఆ మట్టే ప్రయోగశాల...!

న్యూఢిల్లీ: అక్కడ చంద్రుని దక్షిణ ధ్రువం మీద సగర్వంగా జెండా పాతి చంద్రయాన్ -3 విజయనాదం చేసింది. దేశ దక్షిణ కొసన తమిళనాడులో మారుమూల విసిరేసినట్టుగా ఉండే నమ్మక్కల్ లో సంబరాలు మిన్నంటాయి. ఎందుకంటే చంద్రయాన్ ప్రయోగాల్లో అక్కడి మట్టిదే ప్రధాన పాత్ర మరి! ఎందుకు, ఎలా అన్నది ఓ ఆసక్తికరమైన కథ...! 2008లో చంద్రయాన్ -1 అనంతరం తర్వాతి ప్రయోగాలకు ఇస్రో సిద్ధమవుతున్న రోజులవి. చంద్రునిపై సాఫ్ట్ లాండింగే లక్ష్యంగా చంద్రయాన్ -2 ను తయారు చేశారు. అది చంద్రునిపై దిగితే అందులోని రోవర్ బయటికి వచ్చి చంద్రుని నేలపై నడిచేలా ప్లాన్ చేశారు. అందుకోసం లాండర్ ను ఎక్కడ దించాలి? రోవర్ ఎలా నడవాలి? ఇవన్నీ ప్రశ్నలే. వాటికి సమాధానం వెదికేందుకు ఇస్రో సిద్ధమైంది. అందుకు చంద్రునిపై ఉండే మట్టి మాదిరి మట్టి కావాలి. అందుకోసం వెదుకులాట మొదలైంది. వారికి సరిపోయే మట్టి నమ్మక్కల్ లో దొరికింది. 2021లో అక్కడి నుంచి 50 టన్నుల మట్టి సేకరించారు. 2019లో చంద్రయాన్ -2 మిషన్‌లో ఆ మట్టితోనే ల్యాండర్, రోవర్ అడుగులను పరీక్షించారు. తాజాగా చంద్రయాన్ -3 ప్రయోగాలకు నమ్మక్కల్ మట్టినే వాడారు.

అది అనర్తో సైట్ మృత్తిక

'చంద్రుని ఉపరితలం మీద ఉన్నది అనర్తో సైట్ రకం మృత్తిక. తమిళనాడులోని కొన్ని చోట్ల అదే రకం మట్టి ఉన్నట్టు మేం యాదృచ్ఛికంగా చేసిన భూగర్భ పరిశోధనల్లో తేలింది. కున్నమలై, సీతంపూండి వంటి నమ్మక్కల్ పరిసర ప్రాంతాల్లో అది పుష్కలంగా దొరికింది'అని పెరియార్ విశ్వవిద్యాలయం జియాలజీ ప్రొఫెసర్ అయిన ఎస్.అన్బళగన్ వెల్లడించారు.

ఏటా రెండుసార్లు బోర్డు పరీక్షలు

- ఇంటర్‌లో ఉత్తమ స్కోరును ఎంచుకునే అవకాశం
- ఎన్‌సీఎఫ్ ప్రతిపాదనలు

న్యూఢిల్లీ: జాతీయ విద్యావిధానంలో భాగంగా పరీక్షల విధానంలో కేంద్రం కొత్త మార్పులకు సిద్ధమైంది. ఇకపై ఇంటర్‌లో ఏటా రెండుసార్లు బోర్డు పరీక్షలు నిర్వహించాలని, భారతీయ భాషలు తప్పనిసరిగా చదవాలని నూతన కరిక్యులమ్ ఫ్రేమ్‌వర్క్ (ఎన్‌సీఎఫ్) ప్రతిపాదనలు చేసింది. అలాగే, 9-12 తరగతుల విద్యార్థులకు కనీస సబ్జెక్టుల సంఖ్యను పెంచాలని చెప్పింది. ఈ మేరకు కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ ఎన్‌సీఎఫ్ నివేదికను బుధవారం జాతీయ విద్య, పరిశోధన శిక్షణ మండలికి అందించారు. ఏటా రెండు సార్లు పరీక్షలు నిర్వహించడం వల్ల ఆయా సబ్జెక్టుల్లో విద్యార్థులు ఏ పరీక్షలో అయితే ఉత్తమ మార్కులు సాధిస్తారో వాటినే ఎంచుకునే అవకాశం ఉంటుందని కేంద్ర విద్యాశాఖ చెప్పింది. ఏటా రెండుసార్లు నిర్వహించడం వల్ల విద్యార్థులు ఎలాంటి ఒత్తిడి లేకుండా పరీక్షలు రాసే అవకాశం ఉంటుందని పేర్కొంది. క్రమక్రమంగా అన్ని బోర్డులు కూడా సెమిస్టర్ లేదా టర్మ్ బేస్డ్ వ్యవస్థకు మారతాయని కేంద్ర విద్యాశాఖ స్పష్టంచేసింది. దీనివల్ల విద్యార్థులు ఒక సబ్జెక్టును పూర్తిచేయగానే అతడు పరీక్ష రాయొచ్చని, ఇలా ఒక పరీక్ష పూర్తయినా విద్యార్థిపై కంటెంట్ భారం తగ్గుతుందని చెప్పింది. ఎన్‌సీఎఫ్‌ను ఇస్రో మాజీ చైర్మన్ కస్తూరిరంగన్ నేతృత్వంలోని జాతీయ స్టీరింగ్ కమిటీ రూపొందించింది. బోర్డు పరీక్షల్లో ఇలాంటి సంస్కరణలు తొలిసారి కాదు. 2009లో పదో తరగతిలో 'నిరంతర సమగ్ర మూల్యాంకనం (సీసీఈ)' విధానాన్ని ప్రవేశపెట్టగా, 2017లో రద్దుచేసి తిరిగి వార్షిక పరీక్షల విధానాన్ని తెచ్చారు. 9, 10 తరగతుల విద్యార్థులు ఇకపై కచ్చితంగా మూడు లాంగ్వేజ్ సబ్జెక్టులు చదవడం తప్పనిసరని ఎన్సీఎఫ్ సిఫార్సు చేసింది. వీరు మూడు లాంగ్వేజ్‌లతోపాటు మ్యాథ్స్, కంప్యూటేషనల్ థింకింగ్, సోషల్ సైన్స్, సైన్స్, ఆర్ట్ ఎడ్యుకేషన్, ఫిజికల్ ఎడ్యుకేషన్, వెల్-బియింగ్, వొకేషనల్ ఎడ్యుకేషన్ లాంటి వాటి నుంచి ఏడు సబ్జెక్టులు చదవాల్సి ఉంటుంది.

చరిత్రాత్మక ఘట్టం

ఇస్రో శాస్త్రవేత్తలకు రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము అభినందనలు



న్యూఢిల్లీ: చంద్రుని ఉపరితలంపై చంద్రయాన్-3 విజయవంతంగా ల్యాండ్ కావడాన్ని రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము చరిత్రాత్మక ఘట్టంగా అభివర్ణించారు. 'యావద్దేశం గర్వపడే ఇలాంటి మహత్తర ఘటన జీవితకాలంలో ఒక్కసారే సంభవిస్తుంది. ఇస్రోకు, ఈ మిషన్‌లో పాలుపంచుకున్న ప్రతీఒక్కరికీ అభినందనలు' అని రాష్ట్రపతి బుధవారం వీడియో సందేశంలో చెప్పారు. మన శాస్త్రవేత్తలు చరిత్రను సృష్టించారని, నిజంగా ఇది అద్భుతమైన ఘట్టమంటూ కొనియాడారు. 'చంద్రయాన్-3 విజయం సమస్త మానవాళి సాధించిన విజయం.. ఇది మానవ సేవలో భారత్ సంప్రదాయ విజ్ఞానంతోపాటు ఆధునిక సైన్స్‌ను ఎంత గొప్పగా వినియోగించుకుందో చూపిస్తుంది' అని పేర్కొన్నారు.


భారత్‌కు శుభాకాంక్షలు: నాసా చీఫ్ బిల్ నెల్సన్



చంద్రుడి దక్షిణ ధ్రువంపై చంద్రయాన్-3 విజయవంతంగా ల్యాండ్ అయినందుకు ఇస్రో శాస్త్రవేత్తలకు అభినందనలు. జాబిల్లిపై అడుగిడిన నాలుగో దేశంగా నిలిచినందుకు భారత్‌కు శుభాకాంక్షలు. ఈ మిషన్‌లో మీ భాగస్వామిగా ఉన్నందుకు మాకు సంతోషంగా ఉంది.

దేశానికే గర్వకారణం

ఆంధ్రప్రదేశ్ గవర్నర్ అబ్దుల్ నజీర్ హర్షం



సాక్షి, అమరావతి: చంద్రయాన్-3 మిషన్ విజయవంతం కావడంపై ఆంధ్రప్రదేశ్ గవర్నర్ జస్టిస్ ఎస్.అబ్దుల్ నజీర్ హర్షం వ్యక్తం చేశారు. ఇస్రో శాస్త్రవేత్తలను అభినందించారు. ఇది దేశానికే గర్వకారణమన్నారు.

సీఎం వైఎస్ జగన్ అభినందనలు



చంద్రుడి ఉపరితలంపై చంద్రయాన్-3 సాఫ్ట్ ల్యాండింగ్ జరగడం దేశం గర్వించదగిన, ప్రతిష్టాత్మకమైన క్షణాలు అని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అభివర్ణించారు. ఇస్రో సైంటిస్టుల బృందాన్ని ఆయన అభినందించారు.

అద్భుతమైన పురోగతికి నిదర్శనం: పుతిన్



చంద్రయాన్-3 ఘట్టం విజయవంతమైనందుకు భారత రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము, ప్రధాని మోదీకి హృదయపూర్వక శుభాకాంక్షలు. అంతరిక్షం అన్వేషణలో ఇది అద్భుతమైన పురోగతి. సైన్స్ ఇంజనీరింగ్‌లో భారత్ సాధించిన అద్భుతమైన పురోగతికి నిదర్శనం.



బ్రిడ్జి కింద నలిగిన బతుకులు

- మిజోరంలో ఘోరం.. 18 మంది కార్మికుల దుర్మరణం

కోల్‌కతా/ఐజ్వాల్: ఈశాన్య రాష్ట్రం మిజోరంలో బుధవారం ఘోరం జరిగింది. ఐజ్వాల్ జిల్లాలో నిర్మాణంలో ఉన్న 100 మీటర్ల పొడవైన రైల్వే బ్రిడ్జి కుప్పకూలింది. నిర్మాణ పనుల్లో ఉన్న కార్మికుల్లో కనీసం 18 మంది ఈ ప్రమాదంలో దుర్మరణం పాలయ్యారు. ఇంకా కనీసం ఐదుగురి జాడ తెలియాల్సి ఉంది. మృతుల్లో అత్యధికులు పశ్చిమ బెంగాల్‌కు చెందిన వారే. ప్రమాద ప్రాంతం సైరంగ్ ఐజ్వాల్‌కు 21 కిలోమీటర్ల దూరంలో ఉంది. కురింగ్ నది మీద నిర్మిస్తున్న బ్రిడ్జి పైకి చేర్చే క్రమంలో గాంట్రీ కుప్పకూలడమే ప్రమాదానికి కారణమని అధికారులు తెలిపారు. ఇప్పటిదాకా 16 మృతదేహాలను వెలికితీశారు. సహాయ, తరలింపు తదితర చర్యల్లో మిజోరం అధికారులతో ఎప్పటికప్పుడు సమన్వయం చేసుకోవాల్సిందిగా బెంగాల్ రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిని ముఖ్యమంత్రి మమతా బెనర్జీ ఆదేశించారు. మృతుల కుటుంబాల్లోని అర్హులకు రైల్వే శాఖ పర్మనెంట్ ఉద్యోగం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ప్రమాదంపై విచారణకు ఉన్నత స్థాయి కమిటీ ఏర్పాటైంది. ఈ దుర్ఘటనపై ప్రధాని నరేంద్ర మోదీ తీవ్ర దిగ్భ్రాంతి వెలిబుచ్చారు. మృతుల కుటుంబాలకు రూ.2 లక్షలు, గాయపడ్డవారికి రూ.50 వేల పరిహారాన్ని ప్రధాని కార్యాలయం ప్రకటించింది.

'యూట్యూబ్' చూస్తూ భార్యకు కాన్పు

- మగబిడ్డకు జన్మనిచ్చి.. మరణించిన భార్య
- తమిళనాడులోని కృష్ణగిరి జిల్లాలో దారుణం

హోసూరు: పురిటి నొప్పులతో బాధపడుతున్న భార్యను ఆస్పత్రికి తీసుకెళ్లకుండా యూట్యూబ్‌లో వీడియో చూస్తూ ఓ భర్త కాన్పు చేశాడు. మగబిడ్డకు జన్మనిచ్చిన ఆమె తీవ్ర రక్తస్రావమై మరణించింది. ఈ ఘటన తమిళనాడులోని కృష్ణగిరి జిల్లా హనుమంతపురంలో జరిగింది. హనుమంతపురానికి చెందిన మాదేష్(27)కు పోచ్చంపల్లి సమీపంలోని పులియంబట్టికి చెందిన వేడియప్పన్ కూతురు లోకనాయకి(27)తో రెండేళ్ల క్రితం వివాహం జరిగింది. వీరిద్దరూ అగ్రికల్చర్ కోర్సులో డిగ్రీ చేశారు. ఇంటి వద్ద పెరట్లో సేంద్రియ పద్ధతిలో పండించిన కూరగాయలనే తినేవారు. ఈ క్రమంలో లోకనాయకి గర్భం దాల్చగా.. ఇంటి వద్దే సహజసిద్ధంగా ప్రసవం చేయాలని వారిద్దరూ నిర్ణయించుకున్నారు. ఇందుకోసం మాదేష్ యూట్యూబ్‌లో వీడియోలు చూస్తుండేవాడు. మంగళవారం తెల్లవారుజామున లోకనాయకికి పురిటినొప్పులు ప్రారంభమయ్యాయి. ఆమెను మాదేష్ ఆస్పత్రికి తీసుకెళ్లకుండా.. ముందుగా నిర్ణయించుకున్న ప్రకారం యూట్యూబ్‌లో చూస్తూ కాన్పుకు సాయం చేశాడు. మగ బిడ్డకు జన్మనిచ్చిన అనంతరం.. లోకనాయకి తీవ్ర రక్తస్రావంతో కోమాలోకి వెళ్లింది. ఆ తర్వాత ఆమెను స్థానిక ఆస్పత్రికి తీసుకెళ్లగా.. పరిశీలించిన డాక్టర్లు లోకనాయకి మరణించినట్లు తెలిపారు.

క్లుప్తంగా...

చంద్రయాన్‌-3 విజయవంతానికి వన దుర్గా హోమం



శారదాపీఠంలో వనదుర్గా హోమం నిర్వహిస్తున్న స్వరూపానందేంద్ర సరస్వతి, స్వాత్మానందేంద్ర సరస్వతి

సింహాచలం(విశాఖ) : చంద్రయాన్‌-3 విజయవంతంగా చంద్రుడిపైకి అడుగు మోపాలని ఆకాంక్షిస్తూ విశాఖ శ్రీశారదాపీఠం బుధవారం ప్రత్యేక పూజలు నిర్వహించింది. రుషికేష్‌లోని విశాఖ శ్రీ శారదాపీఠం ఆశ్రమంలో చాతుర్మాస్య దీక్షలో ఉన్న పీఠాధిపతులు స్వరూపానందేంద్ర సరస్వతి, స్వాత్మానందేంద్ర సరస్వతి పర్యవేక్షణలో వన దుర్గా హోమం జరిపారు. పూర్ణాహుతి కార్యక్రమాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. భారతావని ప్రతిష్టను మరింత ఇనుమడింపచేసేందుకు చంద్రయాన్‌-3 ప్రయోగం దోహదపడుతుందని స్వరూపానందేంద్ర సరస్వతి ఈ సందర్భంగా పేర్కొన్నారు. ప్రపంచంలో బలీయమైన శక్తిగా భారత్‌ ఎదగాలనే ఆకాంక్షతోనే వన దుర్గా హోమం చేపట్టినట్టు తెలిపారు.

గగనానికి దేశ కీర్తి

- రాఘవేంద్రస్వామి మఠం పీఠాధిపతి సుబుధేంద్రతీర్థులు



మంత్రాలయం: చంద్రయాన్‌-3 విజయవంతంతో భారతదేశ కీర్తి గగన సీమకు విస్తరించడం అభినందనీయమని రాఘవేంద్రస్వామి మఠం పీఠాధిపతి సుబుధేంద్రతీర్థులు కొనియాడారు. బుధవారం శ్రీమఠంలో స్వామిజీ మీడియాతో మాట్లాడారు. ఇస్రో శాస్త్రవేత్తలు అనుకున్న లక్ష్యాలను అధిరోహించడం శుభ పరిణామమన్నారు. శాస్త్రవేత్తల ప్రయోగాలకు సహకరిస్తున్న ప్రధాని నరేంద్రమోదీ, ముఖ్యమంత్రి వైఎస్‌ జగన్‌మోహన్‌రెడ్డికి ఆశీర్వచనాలు పలికారు. ఇతిహాసాల్లోనూ సైన్స్‌ పరిజ్ఞానం ఉందన్నారు. వైకుంఠవాసుడు, రాఘవేంద్రస్వామి కృప శాస్త్రవేత్తలపై ఎల్లవేళలా ఉండాలని ఆశీర్వదించారు.

ప్రజలను తప్పుదోవ పట్టించేలా కథనాలు రాస్తే చర్యలు తప్పవు

- 'సున్నా వడ్డీ'పై తప్పుడు కథనం రాసిన పత్రికకు లీగల్‌ నోటీసులు
- పేదరిక నిర్మూలన సంస్థ సీఈవో

సాక్షి, అమరావతి: వైఎస్సార్‌ సున్నా వడ్డీ కార్యక్రమం అమలుపై తప్పుడు ఆరోపణలతో కథనం ప్రచురించిన పత్రికకు లీగల్‌ నోటీసులు ఇచ్చేందుకు చర్యలు చేపట్టినట్టు గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ(సెర్ప్‌) సీఈవో కార్యాలయం ఒక ప్రకటనలో పేర్కొంది. 2019లో సీఎంగా వైఎస్‌ జగన్‌ బాధ్యతలు చేపట్టిన నాటి నుంచి ఇప్పటివరకు రాష్ట్ర ప్రభుత్వం ఏటా సంక్షేమ క్యాలండర్‌ను ప్రకటించి క్రమం తప్పకుండా పథకాలు అందించడంతో పాటు, పొదుపు సంఘాల మహిళలకు గతంలో కంటే ఎక్కువగా బ్యాంకుల నుంచి రుణాల మంజూరు, సున్నా వడ్డీ, వైఎస్సార్‌ ఆసరా పథకాలను అమలు చేస్తోందని పేర్కొన్నారు. గత తెలుగుదేశం ప్రభుత్వం 2016 ఆగస్టు నుంచి వడ్డీ లేని రుణం పూర్తిగా రద్దు చేసిందని, ప్రస్తుత ప్రభుత్వం ఆ పథకాన్ని పునరుద్ధరించిందని తెలిపారు. 2019 నుంచి క్రమం తప్పకుండా ఈ నాలుగేళ్లలో అర్హతగల మహిళా సంఘాలకు సున్నా వడ్డీ కార్యక్రమం ద్వారా రూ.4,969.05 కోట్లు ఆర్థిక లబ్ధిని చేకూర్చిందని, ఇప్పటి వరకు గరిష్టంగా ప్రతి ఏటా 9.76 లక్షల సంఘాలకు సంబంధించి 1.05 కోట్ల మహిళలకు లబ్ధి చేకూరిందన్నారు. అయితే, సున్నావడ్డీపై మంగళవారం ఓ పత్రిక తప్పుడు ఆరోపణలతో కథనం ప్రచురించిందన్నారు. ప్రజలను తప్పుదోవపట్టించేందుకు ఇలాంటి నిరాధార ఆరోపణలు ప్రచురించిన వారిపై చట్టపరంగా చర్యలు తీసుకుంటామని సెర్ప్‌ సీఈవో కార్యాలయం ఆ ప్రకటనలో పేర్కొంది. కాగా, ఈనాడు పత్రిక మంగళవారం 'మహిళా పక్షపాతమంటే ఇదేనా జగన్‌?' శీర్షికతో డ్వాక్రా సున్నావడ్డీలో కోత పెడుతున్నారంటూ కథనాన్ని ప్రచురించింది. దీనిపై సెర్ప్‌ సీఈవో కార్యాలయం స్పందించి లీగల్‌ నోటీసులు ఇవ్వడానికి సిద్ధమైంది.

రాష్ట్ర ఆర్థిక పరిస్థితిపై వాస్తవాలు తెలపండి : యనమల

సాక్షి, అమరావతి:రాష్ట్ర ప్రభుత్వానికి సంబంధించి వాస్తవ ఆర్థిక పరిస్థితి ఏమిటో తెలపాలని టీడీపీ నేత యనమల రామకృష్ణుడు ఆర్థిక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రావత్‌కు బుధవారం లేఖ రాశారు. కేంద్ర ప్రభుత్వాన్ని మోసం చేస్తూ కాగ్‌కు తప్పుడు సమాచారం ఇస్తున్నారని లేఖలో విమర్శించారు.

ఆస్తి వివాదంలో గాల్లోకి కాల్పులు

- కర్ణాటకలోని ధార్వాడలో ఘటన

సాక్షి, బళ్లారి: ఆస్తి వివాదం కారణంగా రెండు గ్రూపుల మధ్య జరిగిన గొడవ కాల్పులకు దారితీసింది. ఈ ఘటన కర్ణాటకలోని ధార్వాడ నగరం అత్తికూళ్ల కాలనీలో బుధవారం జరిగింది. గొడవలో సుశాంత ఆగర్వాల్‌ అనే వ్యక్తి గాల్లోకి కాల్పులు జరపడంతో ఉద్రిక్త పరిస్థితులు ఏర్పడ్డాయి. అత్తికూళ్లకాలనీలో సుశాంత్‌ అగర్వాల్‌కు చెందిన ఆస్తి ఉంది. ఆయన ముంబైలో నివసిస్తున్నాడు. పవన్‌ అనే వ్యక్తి తన ఆస్తి కబ్జా చేస్తున్నాడని తెలుసుకుని వచ్చి అతనితో గొడవకు దిగాడు. దీంతో ఇరువురి అనుచరుల మధ్య ఘర్షణ ప్రారంభమైంది. కాల్పులు జరిపిన సుశాంత్‌ అగర్వాల్‌ను అదుపులోకి తీసుకున్నారు.

విద్యార్థుల్లో చంద్రయాన్‌ విజయోత్సాహం

ప్రభుత్వ పాఠశాలల్లో ఐఎఫ్‌పీ స్క్రీన్స్‌పై ప్రత్యక్ష ప్రసారం

- ఆద్యంతం వీక్షించిన ఉపాధ్యాయులు, విద్యార్థులు, స్థానిక ప్రజలు
- చంద్రునిపై ల్యాండర్‌ మాడ్యూల్‌ దిగిన వెంటనే కేరింతలు
- జయహో భారత్‌ అంటూ నినాదాలు
- ఇస్రో శాస్త్రవేత్తలకు మంత్రుల అభినందనలు



చంద్రయాన్‌-3 విజయవంతంతో కర్నూలు మోడల్‌ పాఠశాలలో విద్యార్థుల ఆనందం



ఒంగోలు నవోదయ స్కూల్‌ చిన్నారుల సంబరం



తిరుపతిలోని మహిళా విశ్వవిద్యాలయంలో విద్యార్థినుల ఆనందోత్సాహం

సాక్షి, అమరావతి/సాక్షి నెట్‌వర్క్‌ : అంతరిక్షంలో సరికొత్త శకాన్ని ఆవిష్కరించి, ప్రపంచంలో చిరస్థాయిగా గుర్తుండిపోయే విజయాన్ని అందుకున్న చంద్రయాన్‌-3 ప్రయాణాన్ని ఆద్యంతం వీక్షించిన విద్యార్థులు రాష్ట్రవ్యాప్తంగా విజయోత్సాహంలో మునిగితేలారు. ఈ ఘనతను పాఠశాలల్లో విద్యార్థులు వీక్షించేలా చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వం ఆదేశించడంతో బుధవారం సాయంత్రం అన్ని ప్రభుత్వ పాఠశాలల్లోను అందుకు అవసరమైన ఏర్పాట్లుచేశారు. ఇటీవల ఉన్నత పాఠశాలలకు ప్రభుత్వం అందించిన ఇంటరాక్టివ్‌ ఫ్లాట్‌ ప్యానెళ్లపై చంద్రయాన్‌ మిషన్‌లో భాగమైన ల్యాండర్‌ మాడ్యుల్‌ ప్రయాణాన్ని ప్రత్యక్ష ప్రసారం చేశారు. విద్యార్థులు ఉపాధ్యాయులతో పాటు పలుచోట్ల సాధారణ ప్రజలు సైతం సమీప పాఠశాలల్లో బిగ్‌ స్క్రీన్స్‌పై ఆద్యంతం వీక్షించారు. చంద్రుని దక్షిణ ధృవంపై ల్యాండర్‌ మాడ్యూల్‌ దిగిన వెంటనే సంబరాలు జరుపుకున్నారు. జయహో భారత్‌ అంటూ నినాదాలు చేశారు. విద్యార్థుల కోసం ప్రత్యక్ష ప్రసార ఏర్పాట్లు చేసిన రాష్ట్ర ప్రభుత్వానికి, అధికారులకు విద్యార్థులు, ఉపాధ్యాయులు కృతజ్ఞతలు తెలిపా రు. చంద్రుని దక్షిణ ధృవానికి చేరిన మొదటి దేశం మనదైనందుకు గర్విస్తూ, ఇందుకు కృషిచేసిన శాస్త్రవేత్తలకు వారంతా అభినందనలు తెలిపారు. అలాగే..

- ప్రపంచం మొత్తం భారత్‌ వైపు చూస్తోందని వ్యవసాయ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి అన్నారు. చంద్రయాన్‌-3 విజయవంతం కావడం ఖగోళ చరిత్రలో భారతదేశం పేరు సువర్ణాక్షరాలతో లిఖించతగ్గ విషయమన్నారు. ఇస్రో శాస్త్రవేత్తలు జాతిని తలెత్తుకునేలా చేశారని ఆయన కొనియాడారు.
- భారతదేశం అంతా ఈ రోజు గర్వించదగ్గ రోజని పౌర సరఫరాల శాఖ మంత్రి కారుమూరి నాగేశ్వరరావు అభివర్ణించారు. యావత్‌ ప్రపంచం భారతదేశ వైపు చూస్తోందని ఆయన కొనియాడారు. ఈ విజయాన్ని అందించిన ఇస్రో శాస్త్రవేత్తలు అందరికీ మంత్రి శుభాభినందనలు తెలిపారు.
- చంద్రయాన్‌-3 విజయోత్సవాలు జరుపుకుంటున్న సమయంలో ఏలూరు జిల్లా గణపవరానికి చెందిన స్వర్ణకారుడు పేరూరి కృష్ణ కేవలం 700 మిల్లీగ్రాముల బంగారంతో చంద్రయాన్‌-3 విక్రమ్‌ రోవర్‌ను తయారుచేసి జాతికి అంకితమిచ్చారు.
- చంద్రుడి దక్షిణ ధృవంపై అడుగుపెట్టడం ద్వారా ఇస్రో శాస్త్రవేత్తలు దేశ ఖ్యాతిని ప్రపంచానికి చాటిచెప్పారని హోంమంత్రి తానేటి వనిత కొనియాడారు. దేశ పౌరులుగా ప్రతీ ఒక్కరు గర్వించదగిన రోజని కీర్తించారు. ఈ అద్భుత ఆవిష్కరణ చేసిన శాస్త్రవేత్తలందరికీ ఆమె అభినందనలు తెలిపారు.
- తిరుపతి రీజనల్‌ సైన్స్‌ సెంటర్‌లో ఏర్పాటుచేసిన ఎల్‌ఈడీ స్క్రీన్స్‌పై చంద్రయాన్‌-3 ల్యాండింగ్‌ ప్రక్రియను నగరంలోని వివిధ పాఠశాలలకు చెందిన విద్యార్థులు, తల్లిదండ్రులు, పెద్ద సంఖ్యలో హాజరై ఆసక్తితో తిలకించారు. తిరుపతిలోని మహిళా విశ్వవిద్యాలయం ఆడిటోరియంలోనూ ఈ అపూర్వ ఘట్టాన్ని తిలకించిన విద్యార్థుల ఆనందానికి అవధుల్లేకుండా పోయాయి. ఎస్వీ యూనివర్సిటీ, కేంద్రీయ సంస్కృత విద్యాలయం, వెటర్నరీ విశ్వవిద్యాలయం, అగ్రికల్చరల్‌ కళాశాలల్లోనూ విద్యార్థులు ఆనందోత్సాహాలతో కేరింతలు కొట్టారు. ఇస్రో శాస్త్రవేత్తలకు సలామ్‌ అంటూ పెద్ద ఎత్తున అభినందనలు తెలిపారు.
- ఇస్రోకి శుభాకాంక్షలు తెలుపుతూ బుధవారం కృష్ణాజిల్లా అవనిగడ్డ ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులు 'కంగ్రాట్యులేషన్స్‌ ఇస్రో' ఆకారంలో చేసిన విద్యార్థుల ప్రదర్శన విశేషంగా ఆకట్టుకుంది. చంద్రుడిపై చంద్రయాన్‌-3 దిగిన దృశ్యాలను 860 మందికి పైగా విద్యార్థులు వీక్షించారు.



తూర్పు గోదావరి జిల్లా రాజమహేంద్రవరంలోని ఆనం కళాకేంద్రంలో విద్యార్థుల కేరింతలు

- మరోవైపు.. భారతదేశ ఖ్యాతిని విశ్వాంతరాలలో సుస్థిరం చేసిన ఇస్రో శాస్త్రవేత్తల కృషిని మంత్రి చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ అభినందించారు. చంద్రయాన్‌-3 విజయవంతం అవ్వడంపట్ల బుధవారం తన క్యాంపు కార్యాలయంలో జాతీయ పతాకంతో ఆయన ఆనందం వ్యక్తంచేస్తూ ఇస్రో శాస్త్రవేత్తలకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ విజయం ప్రపంచవ్యాప్తంగా మన దేశ కీర్తి ప్రతిష్టలను ఇనుమడింప చేసిందని కొనియాడారు. ఈ విజయానికి కృషిచేసిన శాస్త్రవేత్తలకు రాష్ట్ర ప్రజలు తరపున మంత్రి శుభాకాంక్షలు తెలిపారు.

చంద్రయాన్‌లో మనోళ్లు..



అసోసియేట్‌ డైరెక్టర్‌గా కె. కల్పన ప్రముఖ పాత్ర.. • ఈమెకు ఇస్రో చైర్మన్‌ ప్రత్యేక అభినందనలు

- యంగ్‌ సైంటిస్ట్‌గా వైఎస్సార్‌ జిల్లా యువతి డిజైనర్‌గా రాణింపు • విజయనగరానికి చెందిన శాస్త్రవేత్త డా. కరణం దుర్గాప్రసాద్‌..
- రాజంపేటకు చెందిన యువ శాస్త్రవేత్త ఎర్రబాలు రాజేంద్ర ప్రసాద్‌రెడ్డి కూడా సేవలు..



కె.కల్పన

సూళ్లూరుపేట (తిరుపతి జిల్లా)/ఒంటిమిట్ట/విజయనగరం అర్బన్‌/రాజంపేట టౌన్‌ : పున్నమి చంద్రుడి సొగసు చూస్తూ మురిసిపోయిన భారతావని.. ఇప్పుడా నెలరాజుపై పరిశోధనలకు ల్యాండర్‌ విక్రమ్‌ను దింపి విజయగర్వంతో ఉప్పొంగుతోంది. ప్రపంచ దేశాలన్నీ భారత్‌ వైపు చూసేలా చేసింది. ఉత్కంఠగా ఎదురుచూసిన ఈ ప్రక్రియను విజయవంతం చేయడంలో మన రాష్ట్రానికి చెందిన శాస్త్రవేత్తలూ ఉన్నారు. వీరిలో చిత్తూరుకు చెందిన కె. కల్పన, వైఎస్సార్‌ కడప జిల్లా యువతి అవ్వారు చందన.. విజయనగరానికి చెందిన డా. కరణం దుర్గాప్రసాద్‌.. రాజంపేటకు చెందిన ఎర్రబాలు రాజేంద్ర ఉండటం మనందరికీ గర్వకారణం. అలాగే.. చిత్తూరుకు చెందిన కె. కల్పన ప్రముఖ పాత్ర పోషించడం తెలుగు వారికి గర్వకారణం. ల్యాండర్‌ సేఫ్‌ ల్యాండింగ్‌ అయిన వెంటనే బెంగళూరులోని ఇస్ట్రాక్‌ కేంద్రంలో ఇస్రో చైర్మన్‌ ఎస్‌ సోమనాథ్‌ ఆమెను ప్రత్యేకంగా అభినందించారు. ఈ ప్రాజెక్టులో ఆమె అసోసియేట్‌ డైరెక్టర్‌గా వ్యవహరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ల్యాండర్‌ను సేఫ్‌గా దించడం తన జీవితంలో మర్చిపోలేని అనుభూతి.. మధురమైన జ్ఞాపకమన్నారు. ఈ ప్రయోగం సక్సెస్‌తో కల్పనకు ప్రత్యేకమైన గౌరవం లభించడమే కాక తెలుగుజాతి మొత్తం ఆమెకు అభినందనలు తెలియజేస్తోంది. మిగిలిన ముగ్గురూ చంద్రయాన్‌-3లో తమ అనుభవాలను 'సాక్షి'తో ఇలా పంచుకున్నారు..

థర్మోఫిజికల్‌ లీడ్స్‌లో ఒకడిని..



అహ్మదాబాద్‌లోని అంతరిక్షం ఇస్రో విభాగమైన ఫిజికల్‌ రీసెర్చ్‌ లాబొరేటర్‌ (పీఆర్‌ఎల్‌)లో ప్లానెటరీ శాస్త్రవేత్తగా పనిచేస్తున్నాను. చంద్రయాన్‌-1 నుంచి ప్రస్తుత చంద్రయాన్‌-3 వరకు పనిచేసిన అనుభవం ఉంది. చంద్రుని ఉపరితల థర్మోఫిజికల్‌ ప్రయోగం (సీహెచ్‌ఏఎస్‌టీఈ) అనే పరికరం లీడ్స్‌లో నేను ఒకడిని. ఇదొక థర్మామీటర్‌లా పనిచేస్తుంది. చంద్రుని మొదటి ఉపరితలం సీటు థర్మల్‌ ప్రొఫైల్‌ను అందించేందుకు చంద్రుని ఉష్ణోగ్రతలను కొలుస్తుంది. చంద్రునిపై నీటి ఉనికి, స్థిరత్వం, చలనశీలతను నిర్దేశించే ప్రయోగం ఇది. భవిష్యత్తులో చంద్రుని అన్వేషణలో ముఖ్యమైన అంశం అయిన నీరు–మంచు, ఇతర వనరుల స్థిరత్వ మండలాల గురించి చెప్పే ముఖ్యమైన ప్రయోగం చంద్రయాన్‌-3.

– డాక్టర్‌ కరణం దుర్గాప్రసాద్‌, విజయనగరం

ఇది చిన్నప్పటి కల..



వైఎస్సార్‌ జిల్లా ఒంటిమిట్ట మండలం, కొత్తమాధవరం మా స్వగ్రామం. తొమ్మిదో తరగతి చదువుతున్న సమయంలో హైదరాబాద్‌ వారు నిర్వహించిన యంగ్‌ సైంటిస్ట్‌ కార్యక్రమంలో ప్రతిభ చూపడంతో శాస్త్రవేత్తగా ఎదిగేందుకు అవసరమైన సూచనలు చేశారు. ఇంటర్‌లో ఉపకార వేతనం లభించింది. కడపలోని అంబేద్కర్‌ డిగ్రీ కళాశాలలో ద్వితీయ సంవత్సరం చదువుతూ డీపీఐడీ పూర్తిచేశాను. విజయవాడలో డీఎస్సీ శిక్షణ తీసుకున్న అనంతరం ఇస్రో పరీక్షలకు సిద్ధమై ఎంపికయ్యాను. మూడో స్థానం దక్కింది. తల్లి ఆదిలక్ష్మి, అమ్మమ్మ సాలమ్మల ప్రోత్సాహం మరువలేనిది. ఇస్రోకు ఎంపికైన తర్వాత బెంగళూరు యుఆర్‌.రావు శాటిలైట్‌ సెంటర్‌లో పనిచేస్తున్నాను. అబ్దుల్‌ కలాం స్ఫూర్తితో రాకెట్‌ లాంచ్‌ అంశంపై అవగాహన పెంచుకున్నా. చంద్రయాన్‌-3 డిజైనర్‌గా నేను భాగస్వామి కావడం నాకు ఆనందంగా ఉంది. ఇది నా చిన్నప్పటి కల. మరిన్ని విజయాల్లో నేనూ భాగస్వామి కావాలని ఉంది.

– చందన, కొత్త మాధవవరం, ఒంటిమిట్ట మండలం

మాటల్లో వర్ణించలేని ఆనందమిది..

చంద్రయాన్‌-3 ప్రయో గం జరుగుతున్న తరుణంలోనే నేనూ సైంటిస్ట్‌ అయ్యి ఈ ప్రయోగంలో భాగస్వామ్యం కావడం, అలాగే చంద్రయాన్‌-3 విజయవంతం కావ డం మాటల్లో వర్ణించలేని ఆనందాన్నిస్తోంది. విక్రమ్‌ ల్యాండర్‌ చందమామకు రెండు కిలోమీటర్ల దూరంలో ఉన్నప్పుడు ఉత్కంఠభరితమైన క్షణాలను గడిపాం. చందమామపై విక్రమ్‌ ల్యాండర్‌ సాఫ్ట్‌గా ల్యాండ్‌ అయిన క్షణం నాకు తెలియకుండానే నా కళ్ల నుంచి ఆనందభాష్పాలు వచ్చాయి. ఈ ప్రయోగం నా జీవితంలో మరచిపోలేని ఓ తీపిగుర్తు. నేను ఎంటెక్‌ పూర్తిచేశాక హైదరాబాద్‌లోని క్వాల్‌కం కంపెనీ తమ సంస్థలో ఉద్యోగం ఇ చ్చేందుకు రూ.43 లక్షల ప్యాకేజీ ఆఫర్‌ ఇచ్చింది. అయితే, తన మేధస్సును దేశానికి ఉపయోగించాలన్న ఆలోచనతో ఆ ఉద్యోగాన్ని తిరస్కరించా. ఆ తరువాత తన అడుగులు శా స్త్రవేత్తగా ఈ రంగంపై పడ్డాయి. అన్నమ య్య జిల్లా రాజంపేట మండలం దిగువ బసినా యుడుగారిపల్లె ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పనిచేసే వై.సుబ్రమణ్యంరెడ్డి, చ ంద్రకళ.. రాజేంద్రప్రసాద్‌రెడ్డి తల్లిదండ్రులు.



– ఎర్రబాలు రాజేంద్ర ప్రసాద్‌రెడ్డి, రాజంపేట

బాబును దాచి.. చీకటి రాతలు!

గత ప్రభుత్వం చేసిన తప్పులు కనబడవా?

విద్యుత్‌ సంస్థలను దెబ్బతీసింది మీ చంద్రబాబు కాదా?

- అధిక ధరలకు పీపీఏలు కుదుర్చుకుని అప్పులు మిగల్చింది మర్చిపోయారా?
- వాతావరణ, రాజకీయ పరిస్థితులతో డిమాండ్‌ పెరగడం నిజం కాదా?
- త్వరితగతిన థర్మల్‌ ఉత్పత్తి ప్రారంభించేందుకు చర్యలు
- ముందస్తు ప్రణాళికలతో బహిరంగ మార్కెట్‌లో విద్యుత్‌ కొనుగోలు
- గత ప్రభుత్వాన్ని భుజానికెత్తుకుని ఈనాడులో తప్పుడు కథనం
- అందులో రాసినవన్నీ అభూతకల్పనన్న విద్యుత్‌ సంస్థలు



సాక్షి, అమరావతి: గత ప్రభుత్వ నిర్వాకాలను దాచేసి, నిరంతరం విద్యుత్తు అందిస్తున్న సీఎం వైఎస్‌ జగన్‌ పైనా, వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం పైనా విషం కక్కారు రామోజీరావు. గత ప్రభుత్వం చేసిన తప్పులు, ప్రజాప్రయోజనాలకు విరుద్ధంగా చేపట్టిన చర్యలు, విద్యుత్‌ సంస్థలను తీవ్రంగా దెబ్బతీసేలా తీసుకున్న నిర్ణయాలను ఈనాడు ఉద్దేశపూర్వకంగా మరుగునపరిచింది. పైగా ఆ ప్రభుత్వ కాలంలో అద్భుతాలు జరిగాయన్నట్టుగా తప్పుడు కథనాన్ని అచ్చేసింది. నిజాలకు పాతరేసి ఈనాడు కథనంలో రాసినవన్నీ అభూత కల్పన లేనని విద్యుత్‌ సంస్థలు స్పష్టం చేశాయి. రాష్ట్ర విభజన తొలినాళ్లలో ఉన్న విద్యుత్‌ కొరత పరిస్థితిని తీసివేసి, కేవలం కొన్ని నెలల్లోనే కోతలు లేని రాష్ట్రంగా తయారైందని గత ప్రభుత్వానికి ఈనాడు సర్టిఫికెట్‌ ఇచ్చేసింది. ఈనాడు రాసింది, చెప్పింది పూర్తిగా అవాస్తవమని స్పష్టం చేశాయి. అవి వెల్లడించిన అసలు వాస్తవాలు ఇలా ఉన్నాయి..

- గత ప్రభుత్వ హయాంలో విద్యుత్‌ విధానాలు, కొనుగోలు ఒప్పందాలన్నీ అక్రమాల మయం. పారదర్శకత మచ్చుకైనా లేని ఆ చర్యలతో కరెంటు సంస్థలకు, ప్రభుత్వ ఖజానాకు తీవ్ర నష్టం కలిగించారు. ప్రపంచవ్యాప్తంగా సోలార్‌ విద్యుత్‌ రేట్లు తగ్గుతున్న సమయంలో కంపెనీలతో కుమ్మక్కై, అక్రమాలకు పాల్పడి యూనిట్‌ కరెంటును రూ.7కు కొనేలా ఒప్పందాలు చేసుకున్న చరిత్ర గత ప్రభుత్వానిది. అలాగే పవన్‌ విద్యుత్‌ ఒప్పందాల్లో అనేక అవకతవకలకు పాల్పడ్డారు. యూనిట్‌ కరెంటుకు రూ.5 చెల్లించేలా చేసుకున్న ఒప్పందాలు ఎవరి ప్రయోజనం కోసం? ఈ భారాన్ని మోయలేక విద్యుత్‌ సంస్థలు బావురుమన్న వైనం గత ప్రభుత్వంలో జరిగిందే. ఇవి రాష్ట్రంలో విద్యుత్‌ రంగానికి అంధకారం నింపే కార్యక్రమాలే రామోజీ.
- గత చంద్రబాబు ప్రభుత్వం 8 వేల మెగావాట్లకు అధిక ధరలకు చేసుకున్న ఒప్పందాల వల్ల ఏటా రూ.3 వేల కోట్ల చొప్పున 25 ఏళ్లపాటు భారాన్ని మోయాల్సిన పరిస్థితులు కల్పించారు. ఇది దూరదృష్టి ఎలా అవుతుంది? గత ప్రభుత్వ పెద్దలకు ఉచిత కరెంటు అంటే కరెంటు తీగల మీద బట్టలు ఆరేసుకోవడమేనంటూ మాట్లాడిన చరిత్ర ఉంది. ఇదే పెద్దలు 2014 తర్వాత కూడా రైతుల ఉచిత విద్యుత్‌ పథకానికి ఎగనామం పెట్టేలా పాలన సాగించారు. ఈ పథకం కింద కరెంటు సరఫరా చేసినందుకు డిస్కంలకు ఇవ్వాల్సిన డబ్బులను ఎగ్గొట్టారు. డిస్కంలు, జెన్‌కోల అప్పులు రూ.29,703 కోట్ల నుంచి రూ.68,596 కోట్లకు పెరిగిపోయేలా చేశారు. విద్యుత్‌ ఉత్పత్తి సంస్థలకు డిస్కంలు ఇవ్వాల్సిన బకాయిలు రూ.2,800 కోట్ల నుంచి రూ.21వేల కోట్లకు గత ప్రభుత్వంలో పెరిగిపోయాయి. ఇలా విద్యుత్‌ సంస్థలను అన్ని రకాలుగా దెబ్బ తీసి, అవి అప్పులపాలై, కుప్పకూలిపోయే ప్రమాదకర పరిస్థితికి తీసుకెళ్లారు. కరెంటు సంస్థల ఆర్థికస్థితిని దారుణంగా దెబ్బతీసినా గత ప్రభుత్వం భేషుగ్గా చేసిందని కితాబునివ్వడం ఒక్క ఈనాడు మాత్రమే చేయగలదు.
- వైఎస్‌ జగన్‌ ముఖ్యమంత్రి అయిన తర్వాత ప్రజా సంక్షేమంతో పాటు ప్రభుత్వ సంస్థల సంక్షేమాన్నీ బాధ్యతగా చేపట్టారు. ఇందులో భాగంగా విద్యుత్‌ సంస్థల అభివృద్ధికీ బాటలు వేశారు. రైతులకు ఇస్తున్న కరెంటు బకాయిలను ఎప్పటికప్పుడు చెల్లిస్తున్నారు. అంతేకాకుండా రైతులకు ఉచిత కరెంటు భవిష్యత్తులో కూడా నిరాటంకంగా అందాలని కేంద్ర ప్రభుత్వ సంస్థ సెకీతో యూనిట్‌కు కేవలం రూ.2.49 కే ఒప్పందం చేసుకుని, అత్యంత పారదర్శకంగా వ్యవహరించింది. ఇది విద్యుత్‌ వ్యవస్థల్లో అంధకారం నింపడం ఎలా అవుతుంది?
- డిస్కంల నికర విలువ గత ప్రభుత్వం వచ్చే నాటికి 2014లో సుమారు మైనస్‌ రూ. 4,315 కోట్లు ఉంటే, ఆ ప్రభుత్వం దిగిపోయేనాటికి దారుణంగా క్షీణించి మైనస్‌ రూ. 20 వేల కోట్లకు చేరింది. మరి గత ప్రభుత్వం ఏ రకంగా వెలుగులు నింపింది? గత ప్రభుత్వ హయాంలో విద్యుత్‌ సబ్సిడీలకు రూ.12,634 కోట్లు ఇస్తే, ఈ ప్రభుత్వం ఇప్పటి వరకు రూ.33,749 కోట్లు అందించింది.
- ప్రపంచ వ్యాప్తంగా ఉద్రిక్త రాజకీయ పరిస్థితులు, ఉక్రెయిన్‌ యుద్ధం, అంతకు ముందు వచ్చిన కోవిడ్‌ లాంటి విపత్తులు ప్రపంచవ్యాప్తంగా కరెంటు ఉత్పత్తిలో కీలక పాత్ర పోషించే బొగ్గు మార్కెట్‌ను అతలాకుతలం చేశాయి. కావాల్సినంత బొగ్గు దొరక్కపోగా, రేట్లు అమాంతంగా పెరిగిపోయా యి. కొందామంటే కూడా దొరకని పరిస్థితి. దేశంలోనూ అంతే. ఒక రాష్ట్ర ప్రభుత్వం చేతుల్లో లేని ఇ లాంటి పరిస్థితులను తట్టుకుంటూ, ఎప్పటికప్పుడు ప్రణాళికలు వేసుకుంటూ వైఎస్‌ జగన్‌ ప్రభుత్వం అత్యంత సమర్థంగా కరెంటును సరఫరా చేస్తోంది.
- ఈ ఏడాది సుదీర్ఘకాలం నడిచిన వేసవి, ప్రతికూల వాతావరణం, ఆగస్టు నెలలో కూడా వేసవిని తలపించేలా ఎండలు తదితర కారణాలతో కరెంటు ఉత్పత్తిలో అసమతుల్యత ఏర్పడింది. దీనిని సర్దుబాటు చేసుకుంటూ విద్యుత్‌ సంస్థలు వినియోగదారులకు కరెంటును అందిస్తున్నాయి. ఈ క్రమంలో తలెత్తిన స్వల్ప అవాంతరాలను ఆసరా చేసుకుని ఈనాడు ప్రభుత్వం మీదున్న అక్కసుతో వ్యతిరేక ప్రచారానికి దిగింది.
- ప్రతి ఏటా మాదిరే ప్రస్తుతం రుతుపవనాల కాలంలో జల విద్యుత్‌ ప్రారంభమై, పవన విద్యుత్‌ కూడా అధిక మొత్తంలో అందుబాటులో ఉండాలి. కానీ రుతుపవనాల విస్తరణలో అంతరాయం, ప్రతికూల వాతావరణం కారణంగా జల, పవన విద్యు త్‌లో కూడా తరచూ హెచ్చు తగ్గులు ఏర్పడ్డాయి.
- వాతావరణంలో ఎల్నినో పరిణామం వల్ల తీవ్రమైన ఉష్ణోగ్రత, ఉక్కపోత పరిస్థితుల్లో విద్యుత్‌ డిమాండ్‌ పెరిగింది. నీటిపారుదల ప్రాజెక్టుల్లో తగినంత నీరు లేకపోవడం వలన వ్యవసాయ రంగంలోనూ సాగునీటి కోసం పంపుసెట్ల వాడకం వల్ల వినియోగం ఎక్కువగా జరుగుతోంది. ఇవన్నీ అసాధారణ పరిస్థితులే. వీటి గురించి ఈనాడు ఎక్కడా ప్రస్తావించలేదు.
- ఇన్ని ప్రతికూల పరిస్థితుల్లోనూ విద్యుత్‌ పంపిణీ సంస్థలు నెల, వారం వారీగా విద్యుత్‌ డిమాండ్‌, సరఫరాపై ముందస్తుగా వేసుకున్న ప్రణాళికలను పునఃపరిశీలించుకుని ముందుకెళ్తున్నాయి.
- ప్రస్తుతం రాష్ట్రంలో అసాధారణ డిమాండ్‌ పెరుగుదల లేదని ఈనాడు పత్రిక చెప్పడం పూర్తిగా అబద్ధం. ప్రస్తుత ఆగస్టు నెలలో వేసవి మాదిరి రోజువారి గ్రిడ్‌ డిమాండ్‌ దాదాపు 230 మిలియన్‌ యూనిట్లు ఉంటోంది. అసలు ఈ సీజన్లో విద్యుత్‌ డిమాండ్‌ తగ్గిపోయి రోజుకి 170 నుంచి 185 మిలియన్‌ యూనిట్లు ఉండేది. కానీ రోజుకి 45 మిలియన్‌ యూనిట్ల నుంచి 55 మిలియన్‌ యూనిట్లు ఎక్కువగా ఉంటోంది. దీన్ని అసాధారణ పెరుగుదల అని కాక ఇంకేమంటారు?
- గతేడాది ఇదే కాలంలో దాదాపు 2500 నుంచి 3000 మెగావాట్ల వరకూ వచ్చే పవన విద్యుత్‌ ఇప్పుడు ఒక్కోసారి 150 నుంచి 200 మెగావాట్ల కనిష్ట స్థాయికి పడిపోతోంది. ఈ ఉత్పత్తి తగ్గుదల సాయంత్రం, రాత్రి సమయాల్లో ఎక్కువగా ఉంటోంది.
- ప్రస్తుతం రాయలసీమ థర్మల్‌ కేంద్రంలో ఒక యూనిట్‌ మాత్రమే వార్షిక మరమ్మతుల కోసం ఆపారు. కృష్ణపట్నం కేంద్రంలో ఒక 800 మెగావాట్ల యూనిట్‌ వాణిజ్య కార్యకలాపాలు మొదలుపెట్టిన తరువాత చట్టబద్ధంగా చెయ్యవలసిన ఒరిజినల్‌ పరికరాల తనిఖీ కోసం తాత్కాలికంగా నిలిపారు. రాష్ట్ర ప్రభుత్వ ఆధీనంలోని జెన్‌కో విద్యుత్‌ కేంద్రాల వార్షిక మరమ్మతుల షెడ్యూలును ప్రస్తుత అధిక డిమాండ్‌ కారణంగా వాయిదా వేశారు.
- కేంద్ర ప్రభుత్వ ఆధీనంలోని ఎన్టీపీసీ విద్యుత్‌కేంద్రాల వార్షిక మరమ్మత్తుల షెడ్యూలును కేంద్ర మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలోని సెంట్రల్‌ ఎలక్ట్రిసిటీ అథారిటీ (సీఈఏ) నిర్ణయిస్తుంది. ప్రస్తుతం రాష్ట్రంలో ఉన్న డిమాండ్‌ దృష్ట్యా వార్షిక మరమ్మతులు జరుగుతున్న యూనిట్లను వెంటనే అందుబాటులోకి తేవాలని కేంద్రాన్ని రాష్ట్రం కోరింది.
- రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల ప్రకారం వినియోగదారులకు రాబోయే రోజుల్లో ఎంత ఖర్చయినా ఏ విధమైన అంతరాయాలు లేకుండా విద్యుత్‌ సరఫరా చేయడానికి ప్రయత్నాలు జరుగుతున్నాయి. బహిరంగ మార్కెట్‌లో విద్యుత్‌ కొనుగోలుకు విద్యుత్‌ సంస్థలు అన్ని ప్రయత్నాలు చేస్తున్నాయి. దీంతో గత రెండు రోజులుగా సరఫరా బాగా మెరుగుపడింది. మంగళవారం ఏ విధమైన లోడ్‌ రిలీఫ్‌ ఇవ్వలేదు.

క్లుప్తంగా...

పారదర్శకంగా ఓటర్ల జాబితా

సాక్షి, అమరావతి: ఓటర్ల జాబితాలో పేర్ల చేరిక, తొలగింపు ప్రక్రియలో ఎన్నికల సంఘం పూర్తి కచ్చితత్వంతో వ్యవహరిస్తోందని రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి ముఖేష్ కుమార్ మీనా స్పష్టం చేశారు. జనవరి 1 నుంచి తొలగించిన ఓట్లను బీఎల్‌వోలు 100 శాతం క్షేత్రస్థాయి పరిశీలన చేయాలని ఆగస్టు 9న మెమో జారీ చేసినట్లు తెలిపారు. దీని ప్రకారం బీఎల్‌వోలు 100 శాతం క్రాస్ వెరిఫికేషన్ చేసిన తర్వాత ఈఆర్‌వోలు ప్రతీ నియోజకవర్గంలోని 1,000 తొలగింపులను యాధృచ్చికంగా పరిశీలన చేయాలని, రెండో స్థాయి తనిఖీగా జిల్లా సీనియర్ అధికారి (కలెక్టర్/డీఈవో) ప్రతీ 500 తొలగింపుల్లో 100 తొలగింపులను పరిశీలన చేయాల్సి ఉంటుందన్నారు. మొత్తం ప్రక్రియను ఆగస్టు 30 నాటికి పూర్తి చేయాలని, పునఃపరిశీలన అనంతరం నివేదికను కేంద్ర ఎన్నికల సంఘానికి పంపుతామన్నారు.

లోకేశ్ నుంచి ప్రాణహాని.. భద్రత కల్పించండి: పోసాని



సాక్షి, అమరావతి: టీడీపీ నేత నారా లోకేశ్ నుంచి తనకు ప్రాణహాని ఉందని రాష్ట్ర ఫిల్మ్, టీవీ, థియేటర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ పోసాని కృష్ణ మురళి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆయన మంగళగిరిలో డీజీపీ రాజేంద్రనాథ్‌రెడ్డిని బుధవారం కలిసి ఫిర్యాదు చేశారు. తనకు ఏదైనా జరిగితే లోకేశ్‌దే బాధ్యత అని డీజీపీ దృష్టికి తీసుకువెళ్లారు. రాష్ట్ర పోలీస్ ప్రధాన కార్యాలయం వెలుపల ఆయన మీడియాతో మాట్లాడుతూ లోకేశ్ కోరినప్పటికీ టీడీపీలో చేరేందుకు తాను నిరాకరించడంతోనే తనపై కక్ష పెంచుకున్నారని చెప్పారు. తాను లోకేశ్ బండారం మొత్తం బయటపెట్టడంతో తనను హత్య చేసేందుకు పన్నాగం పన్నుతున్నారని చెప్పారు.

బీజేపీని మరింత బలోపేతం చేయాలి



మద్రిపాలెం(విశాఖ పశ్చిమ): బీజేపీని మరింత బలోపేతం చేయడానికి కృషి చేయాలని ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరి కోరారు. ఆర్అండ్‌బీ జంక్షన్ వద్ద గల ఓ హోటల్‌లో బుధవారం జరిగిన పదాధికారుల సమావేశంలో ఆమె మాట్లాడారు. పదాధికారులు విషయ పరిజ్ఞానం పెంచుకోవాలని చెప్పారు. రాష్ట్రంలో మహిళలకు రక్షణ లేకుండా పోయిందని ఆందోళన వ్యక్తం చేశారు. టీడీపీ హయాంలో 3.74 లక్షల కోట్ల రుణాలు చేయగా, వైఎస్సార్ సీపీ ప్రభుత్వం రూ.7.44 లక్షల కోట్ల అప్పులు చేసిందని విమర్శించారు. నిధుల మళ్లింపు వంటి వాటిపై జనసేనతో కలిసి ఆందోళన కార్యక్రమాలు నిర్వహించాలని కోరారు. ప్రత్యేక హోదాకు ధీటుగా కేంద్రం ఇచ్చే ప్యాకేజీకి గత సీఎం చంద్రబాబునాయుడు అంగీకారం తెలిపారని పేర్కొన్నారు. బీజేపీ రాష్ట్ర సహ ఇన్‌ఛార్జి సునీల్ దేవధర్, సోము వీర్రాజు, పి.విష్ణుకుమార్ రాజు, మాధవ్ తదితరులు పాల్గొన్నారు.

లోకేశ్‌ది కొవ్వు కరిగించుకునే యాత్ర



సాక్షి, రాజమహేంద్రవరం: తన ఒంట్లో పేరుకుపోయిన కొవ్వు, బలిసిపోయిన ఒళ్లు కరిగించుకునేందుకే లోకేశ్ యువగళం పేరుతో పాదయాత్ర చేస్తున్నాడని రాజమహేంద్రవరం ఎంపీ మార్గాని భరత్ రామ్ విమర్శించారు. రాజమహేంద్రవరంలో బుధవారం ఎంపీ విలేకరులతో మాట్లాడారు. ఎవరైనా రాత్రి 3.30 గంటలకు యాత్ర చేస్తారా? పప్పు యాత్ర చూసి ప్రజలు నవ్వుకుంటున్నారన్నారు. చంద్రబాబు బీసీలను ఉద్ధరిస్తానని ప్రకటనలు గుప్పిస్తున్నాడని, ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో బీసీలు కనపడలేదా? అని ప్రశ్నించారు. పవన్‌కళ్యాణ్, లోకేశ్, చంద్రబాబు ముగ్గురూ అభివృద్ధి నిరోధకులన్నారు. 'నీతి ఆయోగ్' నివేదిక ప్రకారం టీడీపీ ప్రభుత్వ హయాంలో 11.5 శాతం ఉన్న పేదరికం.. ప్రస్తుతం 6 శాతానికి తగ్గిందంటే అభివృద్ధి ఏ ప్రభుత్వంలో జరిగిందో గ్రహించాలన్నారు. ఎమ్మెల్యే సత్తి సూర్యనారాయణరెడ్డి పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ రామచంద్రారెడ్డికి మారిషస్ పురస్కారం



మారిషస్ దేశ అధ్యక్షుడి చేతుల మీదుగా అవార్డు అందుకుంటున్న ఎమ్మెల్సీ రామచంద్రారెడ్డి

సాక్షి, అమరావతి/కడప ఎడ్యుకేషన్: ఉపాధ్యాయ ఎమ్మెల్సీ, సాయిబాబా విద్యాసంస్థల చైర్మన్ ఎంవీ రామచంద్రారెడ్డిని మారిషస్ ప్రభుత్వం సత్కరించింది. విద్యా వ్యవస్థలో ప్రణాళిక బద్ధమైన బోధన, సిబ్బంది నిర్వహణలో మెరుగైన విధానాలను అమలు చేసేందుకు కృషి చేసినందుకు గాను 2023 సంవత్సరానికి 'ఎక్సలెన్స్ ఇన్ స్కూల్ ఎడ్యుకేషన్' పురస్కారాన్ని ఆ దేశ అధ్యక్షుడు పృథ్వీరాజ్ సింగ్ చేతుల మీదుగా అందుకున్నట్టు రామచంద్రారెడ్డి బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ ప్రత్యేక కార్యక్రమంలో మారిషస్ ఉప ప్రధాని, విద్యాశాఖ మంత్రి లీలాదేవి దూకున్, విదేశీ వ్యవహారాలశాఖ మంత్రి అలన్ గను పాల్గొన్నారు.

రామోజీ 'కడుపు మంట కథ'

రాష్ట్రంలో ప్రభుత్వ వైద్య విద్య బలోపేతంపై మరో అబద్ధాల కథనం

- ప్రభుత్వ రంగంలో వైద్య సీట్లను పెంచుతున్న సీఎం వైఎస్ జగన్
- చరిత్రలో లేని విధంగా 17 కొత్త వైద్య కళాశాలల నిర్మాణం
- వీటిలో 2,550 సీట్లు అందుబాటులోకి వస్తాయి
- ఈ ఏడాదే 5 కాలేజీలు ప్రారంభం
- వీటి ద్వారా ఏకంగా 319 కన్వీనర్ కోటా సీట్లు
- బీసీ, ఎస్సీ, ఎస్టీలకూ మేలు
- వచ్చే ఏడాది మరో ఐదు, 2025-26లో ఏడు అందుబాటులోకి
- దీంతో ప్రభుత్వ రంగంలో 29 మెడికల్ కాలేజీల్లో 4,,910 సీట్లు
- ప్రైవేట్ వైద్య కళాశాలలను ప్రోత్సహించి పేద విద్యార్థులకు అన్యాయం చేసింది చంద్రబాబే
- కొత్త కళాశాలల్లో మంచి ప్రమాణాల కోసమే సెల్ఫ్ ఫైనాన్స్ సీట్లు
- ప్రభుత్వ రంగంలో వైద్య విద్య బలోపేతమే రామోజీ కడుపు మంటకు కారణం

వైద్యవిద్యనూ అమ్మేశారు!



ప్రభుత్వ వైద్య కళాశాలలు, ఎంబీబీఎస్ సీట్లు పెరుగుదల ఇలా

సంవత్సరం	కళాశాలలు	ఎంబీబీఎస్ సీట్లు
2019-20	12	2,360
2023-24	17	3,110
2024-25	22	3,860
2025-26	29	4910



సాక్షి, అమరావతి: చరిత్రలోనే తొలిసారిగా రాష్ట్రంలో వైద్య రంగాన్ని, వైద్య విద్యని బలోపేతం చేస్తూ అటు విద్యార్థులకు, ఇటు ప్రజలకు మేలు చేస్తున్న వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వంపై రామోజీరావు మరో ఏడుపుగొట్టు కథనాన్ని ప్రచురించారు. రాష్ట్రంలో కొత్తగా 17 కొత్త వైద్య కళాశాలలు ఏర్పాటు చేస్తూ మన విద్యార్థులకు వైద్య విద్య అవకాశాలు పెంచుతూ ప్రజలకు సూపర్ స్పెషాలిటీ వైద్య సేవలను అందిస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌పట్ల ప్రజల్లో ఆదరణ పెరుగుతోంది. ఇది భరించలేని రామోజీరావు వైద్య కళాశాలల ఏర్పాటుపై గోబెల్స్ ప్రచారానికి తెరలేపారు. గత నెల 20న పలు వక్రీకరణలు, అవాస్తవాలతో ఈనాడులో కథనం ప్రచురించారు. నెల తిరక్కుండానే మరోసారి 'వైద్య విద్యనూ అమ్మేశారు!' అంటూ బుధవారం కథనం రాసుకొచ్చారు. ప్రభుత్వ రంగంలో వైద్యవిద్యను బలోపేతం చేయడంపై రామోజీరావు కడుపుమంటను బయటపెట్టుకున్నారు. చంద్రబాబు సీఎంగా ఉండగా ప్రైవేటు వైద్య కళాశాలలను ప్రోత్సహించి వైద్య విద్యను అమ్మేసి తన వాళ్ల జేబులు నింపుతున్నప్పుడు రామోజీరావు నిస్సిగ్గుగా ఎందుకు ఊరకుండిపోయారనే ప్రశ్నలు వినిపిస్తున్నాయి.



పేద విద్యార్థులకు తీరని నష్టం చేసింది మీ బాబే

1923 నుంచి 2019 వరకు రాష్ట్రంలో (ఉమ్మడి, ప్రత్యేక రాష్ట్రంలో) ప్రభుత్వ రంగంలో వైద్య కళాశాలలు 12 (11+1 పద్మావతి వైద్య కళాశాల) మాత్రమే ఉన్నాయి. 2014–19 మధ్య ఐదేళ్లలో చంద్రబాబు అధికారంలో ఉన్నప్పటికీ, ఒక్క ప్రభుత్వ వైద్య కళాశాలను కూడా నెలకొల్పలేదు. పైగా, తన అనుంగులతో ప్రైవేటు వైద్య కళాశాలలను ఏర్పాటు చేశారు. దీంతో ప్రతిభ ఉన్నప్పటికీ అందుబాటులో తగినన్ని సీట్లు లేక బడుగుబలహీన వర్గాల విద్యార్థులు వైద్య విద్యకు దూరమయ్యారు. ఇది బీసీ, ఎస్సీ, ఎస్టీలకు నష్టం చేయడం కాదా రామోజీ? చంద్రబాబు చేసిన నష్టంపై ఏ రోజైనా చిన్న వార్త అయినా రాశారా? వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయ్యాక పెరుగుతున్న డిమాండ్‌కు అనుగుణంగా ప్రభుత్వ రంగంలోనే 17 కళాశాలలు ఏర్పాటు చేస్తున్నారు. దీంతో సీట్లు పెరుగుతున్నాయి. ఎస్సీ, ఎస్టీ, బీసీ విద్యార్థులకూ మేలు జరుగుతోంది. 2019 వరకు 12 ప్రభుత్వ కళాశాలల్లో ఎంబీబీఎస్ సీట్లు 2,360 మాత్రమే. కొత్తగా 17 కళాశాలల ఏర్పాటుతో మరో 2,550 సీట్లు అందుబాటులోకి వస్తున్నాయి. ఈ విద్యా సంవత్సరంలోనే విజయనగరం, ఏలూరు, రాజమండ్రి, మచిలీపట్నం, నంద్యాల వైద్య కళాశాలలు ప్రారంభమవుతున్నాయి. వచ్చే విద్యా సంవత్సరం మరో ఐదు, 2025–26లో మిగిలిన ఏడు అందుబాటులోకి వస్తాయి. దీంతో ప్రభుత్వ రంగంలో 29 మెడికల్ కాలేజీలు ఉంటాయి. వీటిలో ఎంబీబీఎస్ సీట్లు ఏకంగా 4,,910కి పెరుగుతాయి. ఇది విద్యార్థులకు మంచి చేసినట్టే కదా?

ఇంత దుర్మార్గపు రాతలా?

ఈ విద్యా సంవత్సరం ఐదు ప్రభుత్వ మెడికల్ కళాశాలలు కొత్తగా ప్రారంభమవుతున్నాయి. వీటి ద్వారా ఏకంగా 319 కన్వీనర్ కోటా సీట్లు సమకూరాయి. తద్వారా ఎస్సీ, ఎస్టీ, బీసీ విద్యార్థులకూ సీట్లు పెరుగుతాయి. కొత్త కళాశాలల్లో ఆల్ ఇండియా కోటా పోను మిగిలిన సీట్లలో 50 శాతం కన్వీనర్ కోటా కింద ప్రభుత్వం భర్తీ చేసింది. 35 శాతం సెల్ఫ్ ఫైనాన్స్, 15 శాతం ఎన్నారై కోటాకు కేటాయించారు. ఐదు కాలేజీల్లో 750 సీట్లు ఉండగా 113 సీట్లు ఆల్ ఇండియా కోటాకు వెళ్తాయి. మిగిలిన 637 సీట్లలో 319 సీట్లు కన్వీనర్ కోటాకే ఇచ్చారు. దీంతో పాత 12 కళాశాలల్లోని 2,360 కన్వీనర్ కోటా సీట్లకు 319 అదనంగా చేరాయి. ప్రభుత్వ రంగంలోని పాత వైద్య కళాశాలలు, కొత్తగా వచ్చిన ఐదు కళాశాలల్లో, ప్రైవేట్‌లోని కన్వీనర్ కోటా సీట్లలో 2022-23, 2023-24 ప్రవేశాలను పరిశీలిస్తే విద్యార్థులకు ఎటువంటి నష్టం లేదని అర్థం అవుతుంది.

విభాగం	2022-23	2023-24
ఓసీ	1,509	1,693
ఈడబ్ల్యూఎస్	172	172
మైనారిటీ	125	125
ఆంగ్లో	1	1
ఎస్సీ	503	559
ఎస్టీ	202	224
బీసీ-ఎ	235	260
బీసీ-బి	336	373
బీసీ-సి	34	39
బీసీ-డి	235	260
బీసీ-ఈ	135	150
మొత్తం	3,487	3,856

ప్రపంచ స్థాయి ప్రమాణాల కల్పన కోసమే

కొత్తగా ఏర్పాటు చేస్తున్న కళాశాలల్లో సెల్ఫ్ ఫైనాన్స్, ఎన్నారై కోటా కింద వచ్చే డబ్బేమీ నారాయణ, ఇతర వైద్య విద్యతో వ్యాపారాలు చేసే ప్రైవేట్ వ్యక్తుల జేబుల్లోకి వెళ్లదు. వాటితో సంబంధిత మెడికల్ కాలేజీలో సౌకర్యాలు, నిర్వహణను మెరుగు పరుస్తూ సమర్థంగా నిర్వహిస్తారు. మన విద్యార్థులకు మంచి వాతావరణం, సదుపాయాలు కలిగిన అత్యున్నత స్థాయి వైద్య కళాశాలలు అందుబాటులోకి వస్తాయి. తద్వారా ఉత్తమ బోధన, ఉన్నత ప్రమాణాలతో పోటీ ప్రపంచంలో మనగలుగుతాయి. అక్కడకు వచ్చే పేద రోగులపై ఎలాంటి భారమూ ఉండదు. అంతిమంగా ప్రభుత్వ మెడికల్ కాలేజీల్లో సీట్లు ఒక్కటీ తగ్గకపోగా అదనంగా మరిన్ని అందుబాటులోకి వస్తాయి. వ్యవస్థలు సజావుగా నడిచేందుకు పారదర్శక విధానాన్ని తెస్తుంటే రామోజీకి నచ్చదు. ఆయన జేబులో మనిషి చంద్రబాబులా అన్నీ అనుంగులకు కట్టబెట్టడమే కావాల్సింది. సీఎం వైఎస్ జగన్ ప్రజలకు మేలు చేయడమే రామోజీ కడుపు మంటకు కారణం.

ఒక్క ఏపీలోనే అమలు చేస్తున్నట్టు గగ్గోలు

సెల్ఫ్ ఫైనాన్స్ విధానాన్ని ఏపీలో సీఎం జగన్ ప్రభుత్వమే కొత్తగా ప్రవేశపెట్టినట్టు రామోజీరావు గగ్గోలు పెడుతున్నారు. మన రాష్ట్రంలో స్విమ్స్‌లో 2014లోనే ఈ విధానాన్ని ప్రవేశపెట్టారు. గుజరాత్, రాజస్థాన్, హరియాణ, పంజాబ్, హిమాచల్ ప్రదేశ్, గోవా, పుదుచ్చేరి వంటి రాష్ట్రాల్లో, కేంద్ర పాలిత ప్రాంతాల్లోని ప్రభుత్వాలు కూడా అమలు చేస్తున్నాయి. ఆ రాష్ట్రాల్లోని ప్రభుత్వ వైద్య కళాశాలల్లో సెల్ఫ్ ఫైనాన్స్, ఎన్నారై కోటా సీట్లకు వసూలు చేసే ఫీజులను పరిశీలిస్తే ఈనాడు పత్రిక పక్షపాతంతో, వక్రీకరణలతో సీఎం జగన్ ప్రభుత్వంపై చేస్తున్న దుష్ప్రచారం బయటపడుతుంది.

రాష్ట్రం	ప్రభుత్వ వైద్య కళాశాలల్లో మేనేజ్‌మెంట్/ఎన్నారై కోటా ఫీజులు
గుజరాత్	ప్రభుత్వ కోటా రూ.5.50 లక్షలు, మేనేజ్‌మెంట్ కోటా రూ.17 లక్షలు, ఎన్నారై కోటా -రూ.20.60 లక్షలు (25 వేల డాలర్లు)
రాజస్థాన్	మేనేజ్‌మెంట్ కోటా రూ.8.26 లక్షలు, ఎన్నారై కోటా రూ.26.04 లక్షలు (31,500 డాలర్లు)
చండీఘర్	మొత్తం కోర్సుకు ఎన్నారై కోటా రూ.90.94 లక్షలు (1.10 లక్షల డాలర్లు)
హరియాణ	ఎన్నారై కోటా అడ్మిషన్ సమయంలో రూ.8.26 లక్షలు (10 వేల డాలర్లు), అనంతరం ఏడాదికి రూ.4.13 లక్షలు (5 వేల డాలర్లు)
హిమాచల్ ప్రదేశ్	ఎన్నారై కోటా రూ.16.53 లక్షలు (20 వేల డాలర్లు)
గోవా	ఎన్నారై కోటా మొత్తం కోర్సుకు రూ. 41.33 లక్షలు (50 వేల డాలర్లు)
పుదుచ్చేరి	మేనేజ్‌మెంట్ కోటా రూ.16 లక్షలు, ఎన్నారై కోటా రూ.20 లక్షలు

ప్రభుత్వ వైద్యం బలోపేతం ఇలా

- నాలుగేళ్లలో 53 వేలకు పైగా వైద్య పోస్టుల భర్తీ. ఎప్పటికప్పుడు ఖాళీల భర్తీకి సీఎం జగన్ ఆదేశాలు. పోస్టుల భర్తీ కోసమే ప్రత్యేకంగా రిక్రూట్‌మెంట్ బోర్డ్ ఏర్పాటు.
- గ్రామాల్లో 10,032 వైఎస్సార్ విలేజ్ క్లినిక్‌లు. 12 రకాల వైద్య సేవలు, 14 రకాల పరీక్షలు, 105 రకాల మందులతో సొంత ఊళ్లలోనే వైద్య సేవలు.
- దేశంలోనే తొలిసారిగా ఫ్యామిలీ డాక్టర్ విధానం అమలు. ఇప్పటివరకూ 1.70 కోట్ల మందికి సొంత ఊళ్లలోనే వైద్యం.
- వైఎస్సార్ ఆరోగ్యశ్రీలో ప్రొసీజర్లు 1,059 నుంచి 3,257కి పెంపు. రూ.8 వేల కోట్ల వ్యయం. వైఎస్సార్ ఆరోగ్య ఆసరాతో విశ్రాంతి సమయంలో జీవన భృతి. 17.25 లక్షల మందికి రూ.1,074.69 కోట్లు అందించిన ప్రభుత్వం.
- 108, 104 సేవలు బలోపేతం. కొత్తగా 768 అంబులెన్స్‌లు.
- ప్రభుత్వ ఆస్పత్రుల్లో జీఎంపీ, డబ్ల్యూహెచ్‌వో ప్రమాణాలు కలిగిన మందులు ఉచితంగా అందించేలా ప్రభుత్వం చర్యలు.

వైద్య రంగంలో నాడు-నేడు

కార్యక్రమం	నిధులు (రూ.కోట్లలో)
పలాస కిడ్నీ రీసెర్చ్ సెంటర్	50
సీహెచ్‌సీ, ఏరియా ఆస్పత్రుల బలోపేతం	1,223.28
ఎ) కడప క్యాన్సర్ ఆస్పత్రి బి) కడప మెంటల్ హెల్త్ ఇన్‌స్టిట్యూషన్ సి) కడప సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి	272
17 కొత్త వైద్య కళాశాలల ఏర్పాటు	8,480
వైద్య కళాశాలలు, ఆస్పత్రుల బలోపేతం	3,820
గిరిజన మల్టీ స్పెషాలిటీ ఆస్పత్రులు	246
వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌లు	1,692
వైఎస్సార్ అర్బన్ హెల్త్ క్లినిక్‌లు	374.61
పీహెచ్‌సీల బలోపేతం	664.96
మొత్తం	16,822.85

ఎక్కువ కేసులుంటే నామినేటెడ్ పోస్టులు

- అవసరమైతే జైలుకు పోతాను కానీ కోర్టులకు వెళ్లను
- 2024 ఎన్నికల్లో వంశీకి రిటర్న్ గిఫ్ట్ ఇస్తా
- టీడీపీ నేత నారా లోకేశ్



గన్నవరం : వచ్చే ఎన్నికల నాటికి రాష్ట్రంలో అత్యధిక పోలీస్ కేసులు నమోదైన టీడీపీ నేతలకు అధికారంలోకి రాగానే నామినేటెడ్ పదవులిచ్చే బాధ్యతను తాను తీసుకుంటానని ఆ పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ ప్రకటించారు. కృష్ణాజిల్లా గన్నవరం సమీపంలోని ఎస్ఎం కన్వెన్షన్ హాలులో బుధవారం యార్లగడ్డ వెంకట్రావు వర్గీయులు పార్టీలో చేరికను పురస్కరించుకుని లోకేశ్ ప్రసంగించారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత టీడీపీ శ్రేణులపై పెద్దఎత్తున అక్రమ కేసులు పెడుతోందని ఆరోపించారు. తనపైనే ఏకంగా 21 కేసులను నమోదు చేసినట్లు చెప్పారు. ఈ విషయమై గవర్నర్‌ను ఇటీవల కలిసి ఫిర్యాదు కూడా చేసినట్లు ఆయన తెలిపారు. ఈ కేసుల్లో కోర్టు విచారణకు హాజరవుతున్నారా అని గవర్నర్ అడగ్గా అవసరమైతే జైలుకు పోతాను కాని కోర్టులకు వెళ్లనని చెప్పినట్లు లోకేశ్ చెప్పారు. తన మాదిరిగానే పార్టీ నేతలు కూడా ఎక్కువ కేసులు పెట్టించుకోవాలని చెబుతూ నామినేటెడ్ పోస్టుల ఆఫర్‌ను లోకేశ్ ఇచ్చారు.

పార్టీకి వంశీ వెన్నుపోటు..

2019 ఎన్నికల్లో టీడీపీ పరాజయం తర్వాత తల్లిలాంటి పార్టీకి ఎమ్మెల్యే వల్లభనేని వంశీమోహన్ వెన్నుపోటు పొడిచి వైఎస్సార్‌సీపీకి మద్దతు పలికారని లోకేశ్ గుర్తుచేశారు. ఇటువంటి పిల్ల సైకోకి, సన్నబియ్యం సన్నాసికి రాజకీయంగా సమాధి కట్టాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. 2024 ఎన్నికల్లో వంశీమోహన్‌కు రిటర్న్ గిఫ్ట్ ఇస్తానన్నారు. మంగళగిరిలో 2019 ఎన్నికల్లో తన ఓటమిపై ఇతర పార్టీలు ఎగతాళి చేసినప్పటికీ తిరిగి అక్కడి నుండే పోటీచేస్తానని లోకేశ్ వెల్లడించారు.

నియోజకవర్గ ఇన్‌ఛార్జ్‌గా యార్లగడ్డ..

ఇక ఎమ్మెల్సీ బచ్చుల అర్జునుడు మరణం తర్వాత గత ఏడాదిగా ఖాళీగా ఉన్న టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ పదవిని మూడు రోజుల క్రితం పార్టీలో చేరిన యార్లగడ్డ వెంకట్రావుకు కట్టబెట్టారు. ఈ మేరకు ఆయన్ను ఇన్‌చార్జిగా నియమిస్తూ లోకేశ్ సమావేశంలో ప్రకటించారు. ఇదే విషయాన్ని పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు అచ్చెన్నాయుడు కూడా బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. అయితే, యార్లగడ్డకు ఈ బాధ్యతలు అప్పగించడంపై ఆ పార్టీలోనే భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఇంతకాలం పార్టీకి సేవలు చేసిన వారి అభిప్రాయాలను తెలుసుకోకుండా ఏకపక్షంగా యార్లగడ్డకు బాధ్యతలు అప్పగించడంపై ఆ పార్టీ నేతలు తప్పుబడుతున్నారు.

చందాదారుల నగదును కాపాడాల్సిన బాధ్యత ఉంది

- 'మార్గదర్శి' పిటిషన్లపై తెలంగాణ హైకోర్టులో ఏపీ సర్కార్ వాదనలు
- అక్రమాలను చందాదారులకు వివరించడంలో తప్పులేదు

సాక్షి, హైదరాబాద్: 'మార్గదర్శి చిట్‌ఫండ్స్ ప్రైవేట్ లిమిటెడ్‌లో అక్రమాలపై ఇప్పటికే దాదాపు 300 మంది ఫిర్యాదు చేశారు. విచారణకు సంబంధించిన అంశాలతో పిటిషన్ల మీద పిటిషన్లు వేస్తుండటంతో వివరాలన్నీ పబ్లిక్ డొమైన్‌లోకి వెళ్తున్నాయి. ప్రజల డబ్బు కోట్లాది రూపాయలకు సంబంధించిన అంశం కాబట్టి వారికి వివరాలు వెల్లడించాల్సి వస్తోంది. పైసాపైసా వారు కూడబెట్టుకుంటున్న నగదు ఎక్కడికి వెళ్తోంది.. తిరిగి వస్తుందా? రాదా? అన్న విషయం తెలుసుకునే హక్కు చందాదారులకు ఉంటుంది. అలాగే వారి నగదును కాపాడాల్సిన బాధ్యత మాకు (ప్రభుత్వానికి) ఉంది' అని తెలంగాణ హైకోర్టులో ఏపీ సర్కార్ వాదనలు వినిపించింది. ఏపీ ప్రభుత్వం తరఫున ప్రత్యేక జీపీ గోవిందరెడ్డి వాదనలు వినిపిస్తూ.. ఇప్పటికే మార్గదర్శి స్కాంకు సంబంధించి రెండు కేసుల్లో చార్జిషీట్ కూడా ఫైల్ చేసినట్లు తెలిపారు. తమ సంస్థలో సోదాలు ఆపాలని, ఎలాంటి కఠిన చర్యలు తీసుకోకుండా ఆదేశాలు ఇవ్వాలంటూ పలు విజ్ఞప్తులతో మార్గదర్శి దాఖలు చేసిన పిటిషన్లపై న్యాయమూర్తి జస్టిస్ సీవీ భాస్కర్‌రెడ్డి బుధవారం విచారణ చేపట్టారు. విచారణ ప్రారంభ దశలో ఎలాంటి ఆదేశాలు ఇవ్వలేమని మార్గదర్శి న్యాయవాదులకు తేల్చిచెప్పారు. రిట్, క్వాష్.. ఇలా రెండు రకాల పిటిషన్లు ఉన్నాయని, అన్నింటిపై ఈ కోర్టుకు పరిధి ఉందో లేదో చూడాల్సిన అవసరం కూడా ఉందని న్యాయమూర్తి అభిప్రాయపడ్డారు. మీడియాకు వివరాలు వెల్లడించవద్దని పిటిషనర్లు భావిస్తే ఇంజక్షన్ దావా వేసుకోవాలని సూచించారు. తదుపరి విచారణను సెప్టెంబర్ 12కు వాయిదా వేశారు.

పొగాకు రైతు ఇంట సిరుల పంట

మార్కెట్‌లో రికార్డు ధర

- అంతర్జాతీయ మార్కెట్‌లో డిమాండ్
- రెండేళ్లుగా లాభాలబాట పట్టిన పొగాకు మార్కెట్
- కేజీ పొగాకు సరాసరి ధర రూ.214.47 నమోదు
- రెట్టింపైన పొగాకు రైతు ఆదాయం
- అదనపు పంటపై జరిమానాలు రద్దు
- మార్కెట్ ఒడిదుడుకుల్లో రైతులకు అండగా నిలిచిన ప్రభుత్వం



పొగాకు బేళ్లు



ఈ ఫొటోలోని పొగాకు రైతు పేరు రావూరు వెంగళరెడ్డి. ఆత్మకూరు మండలం బోయలచిరివెళ్ళకు చెందిన ఆయన గత 13 సంవత్సరాలుగా పొగాకు పండిస్తున్నాడు. రెండు బ్యారెన్లు పంట సాగు చేస్తే గతేడాది పెద్దగా మిగిలిందేమీ లేదు. ఈ క్రమంలో 2022–23 వ్యవసాయ సీజన్‌లో తనకు సొంతంగా ఉన్న బ్యారెన్‌తో పాటు మర్రిపాడు మండలం డీసీపల్లిలో మరో ఆరు బ్యారెన్లు కౌలుకు తీసుకుని పొగాకు సాగు చేశాడు. ఇందుకోసం రూ.70 లక్షలు బ్యాంకుల వద్ద, ప్రైవేట్ వడ్డీ వ్యాపారుల వద్ద అప్పు చేశాడు. అంతకు ముందే అతనికి రూ. 70 లక్షల అప్పు ఉంది. అయితే ముందెన్నడూలేని విధంగా పొగాకు ధరలు పెరగడంతో గతంలో తనకున్న అప్పులన్నీ తీరి మరో పాతిక లక్షల రూపాయల ఆదాయం మిగిలిందని రైతు వెంగళరెడ్డి ఆనందంతో చెప్పాడు.



మర్రిపాడు మండలం డీసీపల్లికి చెందిన ఈ రైతు పేరు గోపిరెడ్డి రమణారెడ్డి. 30 ఏళ్లకుపైగా పొగాకు సాగు చేస్తున్నాడు. మూడు దశాబ్దాలకు పైగా పొగాకు సాగు చేస్తున్నా కుటుంబ అవసరాలు తీర్చడానికే తప్ప ఆర్థికంగా పెద్దగా ఆదాయం మిగలలేదు. ఈనేపథ్యంలో 2022–23 వ్యవసాయ సీజన్‌లో తనకున్న ఒక్క బ్యారెన్‌తో పాటు మరో మూడు బ్యారెన్లు కౌలుకు తీసుకుని పొగాకు పంట సాగు చేశారు. ఈ ఏడాది వేలంలో ధరలు అమాంతం పెరిగిపోవడంతో అన్ని ఖర్చులు పోను రూ.60 లక్షలకు పైగా ఆదాయం మిగిలిందని సంతోషంగా చెప్పాడు.

సాక్షి ప్రతినిధి, నెల్లూరు: రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక ప్రోత్సాహంతో పాటు అంతర్జాతీయ మార్కెట్‌లో వర్జీనియా పొగాకు డిమాండ్ పెరగడంతో పొగాకు పంట ఈ ఏడాది రైతు ఇంట సిరులు కురిపించింది. ఈ ఏడాది పొగాకు వేలంలో కేజీ పొగాకు రికార్డు స్థాయిలో ధర పలికింది. బ్రైట్ గ్రేడ్, లోగ్రేడ్ అన్న తేడా లేకుండా అన్ని గ్రేడ్‌లకు రికార్డు ధరలు రావడంతో కేజీ పొగాకు సరాసరి ధర రూ.214గా నమోదైంది. మరోపక్క రాష్ట్ర ప్రభుత్వం పొగాకు బోర్డుపై ప్రత్యేక ఒత్తిడి తెచ్చి పొగాకు ముక్క (స్క్రాప్)ను వేలం కేంద్రాల్లోనే అమ్ముకునే వెసులుబాటు కల్పించడం, అదనపు పొగాకు పంట అమ్మకాలపై జరిమానాలు రద్దు చేయడంతో రైతుల ఆదాయం రెట్టింపు అయింది.

భారీగా పెరిగిన ఉత్పత్తి ..

పొగాకు బోర్డు ఒంగోలు రీజియన్ పరిధిలో ప్రకాశం, నెల్లూరు జిల్లాల పరిధిలో 11 పొగాకు వేలం కేంద్రాలున్నాయి. వీటిలో కందుకూరు–1, కందుకూరు–2, కలిగిరి, డీసీ పల్లి వేలం కేంద్రాలు నెల్లూరు జిల్లాలో ఉండగా, ఒంగోలు–1, ఒంగోలు–2, పొదిలి, కనిగిరి, కొండెపి, వెల్లంపల్లి, టంగుటూరు ప్రకాశం జిల్లా పరిధిలో ఉన్నాయి. వీటిని ఎస్‌బీఎస్ (సదరన్ బ్లాక్ సాయిల్), ఎస్ఎల్ఎస్ (సదరన్ లైట్ సాయిల్)గా విభజించారు. వీటిలో ఎస్‌బీఎస్ పరిధిలో 5 వేలం కేంద్రాలుంటే, ఎస్ఎల్ఎస్ పరిధిలో 6 వేలం కేంద్రాలున్నాయి. ఎస్‌బీఎస్, ఎస్ఎల్ఎస్ పరిధిలో 2022–23 పంట సీజన్‌కు సంబంధించి 89.35మిలియన్ కేజీల పొగాకును అమ్ముకునేందుకు బోర్డు అనుమతి ఉంది. కాని ఇప్పటికే 122.34మిలియన్ కేజీల పొగాకు అమ్మకాలు జరిగాయి. పలు వేలం కేంద్రాల్లో ఈ నెలాఖరు వరకు వేలం జరిగే అవకాశం ఉండడంతో ఇది మరింత పెరిగే అవకాశం ఉంది. అంటే ఈ ఏడాది దిగుబడులు అధికంగా వచ్చినట్లు అర్థమవుతుంది.

రికార్డు ధరలు ఈ ఏడాదే..

గత రెండేళ్ల నుంచి రికార్డు పొగాకు మార్కెట్ ఆశాజనకంగా ఉన్నా.. ఈ ఏడాదిలోనే మార్కెట్‌లో రికార్డు ధరలు నమోదయ్యాయి. ఒంగోలు రీజియన్ పరిధిలో ఈ సీజన్‌లో బ్రైట్ గ్రేడ్ కేజీ పొగాకు అత్యధిక రూ. 288 పలికినా ప్రస్తుతం స్థిరంగా రూ. 280 ధర వస్తుంది. అయితే ఈ ఏడాది గ్రేడ్‌లతో సంబంధం లేకుండా దాదాపు అన్ని గ్రేడ్‌లకు రేట్లు పెరగడంతో సరాసరి రేట్లు మొదటిసారి డబుల్ సెంచరీ దాటాయి. ఎస్‌బీఎస్, ఎస్ఎల్ఎస్ పరిధిలో ప్రస్తుతం కేజీ పొగాకు సరాసరి ధర రూ 214.47గా నమోదైంది. అంటే క్వింటా పొగాకు సరాసరిన రూ 21,300 వరకు ధర రావడం గమనార్హం.

పొగాకు సరాసరి ధరలు

సంవత్సరం	సరాసరి ధర
2017-18	133.80
2018-19	115
2019-20	124.55
2020-21	148.54
2021-22	172.49
2022-23	214.47

రెండింతలైన బ్యారన్ కౌలు..

ఈ ఏడాది పొగాకు సాగులో వచ్చిన లాభాలతో మరోసారి రైతులు పొగాకు పంట సాగుపై ఆసక్తి చూపుతున్నారు. దీంతో పొలాలు, బ్యారన్‌లకు ఒక్కసారిగా డిమాండ్ పెరిగిపోయింది. దీంతో గతేడాది రూ.15వేలు ఉన్న పొలం కౌలు ప్రస్తుతం రూ.30 వేల వరకు చెల్లించేందుకు వెనుకాడడం లేదు. అదే సందర్భంలో గతేడాది రూ.1లక్ష ఉన్న బ్యారన్ కౌలు ఈ ఏడాది రూ.2లక్షలు పలుకుతుంది.


పొగాకు రైతులకు అండగా రాష్ట్ర ప్రభుత్వం..

పొగాకు రైతుల పట్ల రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న చొరవ రైతులకు మేలు చేసింది. మార్కెట్‌లో డిమాండ్ లేని సమయంలో రైతులను ఆదుకునేందుకు 2020–21 సీజన్‌లో నేరుగా మార్క్‌ఫెడ్‌ని రంగంలోకి దించి పొగాకు కొనుగోలు చేయించింది. ఈ ప్రభావంతో 2021–22 సీజన్ నుంచి పొగాకు మార్కెట్‌లో ఊహించని ధరలు రైతులకు లభిస్తున్నాయి. ప్రస్తుతం 2022–23 సీజన్ అయితే రికార్డు ధరలతో అదరగొట్టింది. ఇదిలా ఉంటే బోర్డుపై ఒత్తిడి తేవడంతో అదనపు అమ్మకాలపై విధించే 5శాతం ఫెనాల్టీని రద్దు చేశారు. ఇప్పటి వరకు అదనపు పొగాకును అమ్ముకోవాలంటే 5శాతం ఫెనాల్టీ చొప్పున అంటే ప్రస్తుతం ఉన్న ధరల ప్రకారం క్వింటాకు రూ.1,500 నుంచి రూ.1,800 వరకు బోర్డుకు చెల్లించాల్సి వచ్చేది. దీని వల్ల ఒక్కొక్క రైతుకు సరాసరిన రూ 40వేల నుంచి 60వేల వరకు లబ్ధి జరిగింది. ఇక స్క్రాప్(పొగాకు ముక్క)ను ఈ ఏడాది నేరుగా వేలం కేంద్రాల్లో అమ్ముకునేందుకు అవకాశం కల్పించింది. ప్రస్తుతం ఉన్న డిమాండ్ దృష్ట్యా పొగాకు ముక్కను కూడా వ్యాపారులు కేజీ రూ 150 వరకు వెచ్చించి కొనుగోలు చేశారు.



అంకిత శుభారంభం

యూఎస్ ఓపెన్ గ్రాండ్‌స్లామ్ టెన్నిస్ క్వాలిఫయింగ్ టోర్నీ మహిళల సింగిల్స్ విభాగంలో భారత నంబర్ వన్ అంకిత రైనా శుభారంభం చేసింది. న్యూయార్క్‌లో బుధవారం జరిగిన తొలి రౌండ్‌లో ప్రపంచ 182వ ర్యాంకర్ అంకిత 6-3, 7-5తో ప్రపంచ 214వ ర్యాంకర్ మిరియమ్ బుల్గారు (రొమేనియా)పై గెలిచింది. 2 గంటల 15 నిమిషాలపాటు జరిగిన ఈ మ్యాచ్‌లో అంకిత తన సర్వీస్‌ను రెండుసార్లు కోల్పోయి, ప్రత్యర్థి సర్వీస్‌ను నాలుగుసార్లు బ్రేక్ చేసింది. భారత్‌కే చెందిన కర్మన్‌కౌర్ థండి తొలి రౌండ్‌లో 6-3, 5-7, 3-6తో ఒషీన్ డోడిన్ (ఫ్రాన్స్) చేతిలో ఓడిపోయింది.



కివీస్ కోచింగ్ బృందంలో ఫ్లెమింగ్

వన్డే వరల్డ్ కప్ సన్నాహాల్లో భాగంగా మాజీ కెప్టెన్, కోచ్‌గా అనుభవజ్ఞుడైన స్టీఫెన్ ఫ్లెమింగ్‌ను న్యూజిలాండ్ జట్టు తమ కోచింగ్ బృందంలోకి చేర్చింది. ఐపీఎల్‌లో చెన్నై సూపర్ కింగ్స్ ఐదుసార్లు విజేతగా నిలవడంలో కోచ్‌గా కీలకపాత్ర పోషించిన ఫ్లెమింగ్‌కు భారత గడ్డపై ఉన్న అపార అనుభవం తమ జట్టుకు అదనపు ప్రయోజనాన్ని ఇస్తుందని కివీస్ బోర్డు భావించింది. ఇంగ్లండ్ మాజీ క్రికెటర్లు జేమ్స్ ఫోస్టర్, బెల్ (ఇంగ్లండ్), సక్లాయిన్ (పాకిస్తాన్) కూడా కోచింగ్ టీమ్‌లోకి వచ్చారు.

విజేత తేలేది 'టైబ్రేక్స్'లోనే...



కార్ల్‌సన్ తరఫున తొలి ఎత్తు వేసి రెండో గేమ్‌ను ప్రారంభించిన అజర్‌బైజాన్ మహిళా గ్రాండ్‌మాస్టర్ సోఫియెవా


ప్రజ్ఞానంద, కార్ల్‌సన్ ఫైనల్ మ్యాచ్ రెండో గేమ్ కూడా 'డ్రా'

బకూ (అజర్‌బైజాన్): ప్రపంచకప్ చెస్ టోర్నీ ఓపెన్ విభాగంలో చాంపియన్ ఎవరో టైబ్రేక్స్ ద్వారా తేలనుంది. భారత యువ గ్రాండ్‌మాస్టర్ ప్రజ్ఞానంద, వరల్డ్ నంబర్‌వన్ కార్ల్‌సన్ (నార్వే) మధ్య ఫైనల్లో రెండో గేమ్ 30 ఎత్తుల్లో 'డ్రా'గా ముగిసింది. వరుసగా రెండో 'డ్రా' తర్వాత ఇద్దరూ 1-1తో సమంగా నిలిచారు. ఫలితంగా నేడు వీరిద్దరి మధ్య టైబ్రేక్ నిర్వహించి విజేతను నిర్ణయిస్తారు. ముందుగా ర్యాపిడ్ ఫార్మాట్‌లో 25 నిమిషాల నిడివిగల రెండు గేమ్‌లు ఆడిస్తారు. ఇందులో ఫలితం వస్తే ఫైనల్‌ను ముగిస్తారు. రెండు గేమ్‌ల తర్వాత కూడా సమంగా ఉంటే... ఈసారి 10 నిమిషాలు నిడివిగల రెండు గేమ్‌లు నిర్వహిస్తారు. ఇక్కడా ఫలితం తేలకపోతే 5 నిమిషాల నిడివిగల రెండు గేమ్‌లను ఆడిస్తారు. అయినా ఫలితం తేలకపోతే 3 నిమిషాల నిడివిగల గేమ్‌లను ఇద్దరిలో ఒకరు గెలిచే వరకు ఆడించి విజేతను ఖరారు చేస్తారు. 32 ఏళ్ల కార్ల్‌సన్ గతంలో క్లాసికల్, ర్యాపిడ్, బ్లిట్జ్ ఫార్మాట్‌లలో ప్రపంచ చాంపియన్‌గా నిలువగా... ప్రజ్ఞానంద కెరీర్‌లో తొలిసారి ప్రపంచకప్ ఫైనల్ ఆడుతున్నాడు.

లాంగ్‌జంప్ ఫైనల్లో జెస్విన్

- మురళీ శ్రీశంకర్‌కు నిరాశ
- ప్రపంచ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్

బుడాపెస్ట్ (హంగేరి): ప్రపంచ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్‌లో తొలి నాలుగు రోజులు భారత్‌కు నిరాశ ఎదురవగా... ఐదోరోజు మిశ్రమ ఫలితాలు లభించాయి. పురుషుల లాంగ్‌జంప్‌లో జెస్విన్ ఆల్డ్రిన్ ఫైనల్‌కు అర్హత సాధించగా... మరో లాంగ్‌జంపర్ మురళీ శ్రీశంకర్ అనూహ్యంగా క్వాలిఫయింగ్‌లోనే వెనుదిరిగాడు. మహిళల జావెలిన్ త్రో ఈవెంట్‌లో అన్ను రాణి కూడా ఆకట్టుకోలేకపోయింది. క్వాలిఫయింగ్‌లో గ్రూప్ 'బి'లో పోటీపడ్డ తమిళనాడుకు చెందిన 21 ఏళ్ల జెస్విన్ 8 మీటర్ల దూరం దూకి చివరిదైన 12వ క్వాలిఫయర్‌గా ఫైనల్ బెర్త్ ఖరారు చేసుకున్నాడు. గత ఏడాది ప్రపంచ చాంపియన్‌షిప్‌లో ఫైనల్‌కు అర్హత సాధించడంతోపాటు ఏడో స్థానంలో నిలిచిన శ్రీశంకర్ ఈసారి నిరాశపరిచాడు. శ్రీశంకర్ 7.74 మీటర్ల దూరం దూకి ఓవరాల్‌గా 22వ ర్యాంక్‌లో నిలిచాడు. ఫైనల్ నేడు జరుగుతుంది. మహిళల జావెలిన్ త్రో క్వాలిఫయింగ్‌లో అన్ను రాణి ఈటెను 57.05 మీటర్ల దూరం విసిరి 19వ ర్యాంక్‌లో నిలిచింది.



జెస్విన్ ఆల్డ్రిన్

వానతో ముగిసిన ఆట!

భారత్, ఐర్లాండ్ చివరి టి20 మ్యాచ్ రద్దు

- సిరీస్ 2-0తో భారత్ సొంతం

డబ్లిన్: భారత జట్టు ఐర్లాండ్ పర్యటనకు వర్షంతో ముగింపు లభించింది. బుధవారం జరగాల్సిన మూడో టి20 మ్యాచ్ వాన కారణంగా ఒక్క బంతి కూడా వేయకుండానే రద్దయింది. నిర్విరామంగా కురిసిన వర్షం తెరిపినివ్వకపోవడంతో టాస్ వేసే అవకాశం కూడా లేకుండా పోయింది. మధ్యలో కొద్దిసేపు వాన తీవ్రత తగ్గడంతో అంపైర్లు మైదానాన్ని పరీక్షించినా... కనీసం 5 ఓవర్ల మ్యాచ్ కూడా నిర్వహించే అవకాశం లేదని తేలిపోయింది. దాంతో స్థానిక కాలమానం ప్రకారం సాయంత్రం 6 గంటలకు మ్యాచ్ రద్దుపై అంపైర్లు అధికారిక ప్రకటన చేశారు. దాంతో తొలి రెండు మ్యాచ్‌లలో గెలిచిన భారత్ ఖాతాలో 2-0తో సిరీస్ చేరింది. భారత కెప్టెన్ జస్‌ప్రీత్ బుమ్రాకు 'ప్లేయర్ ఆఫ్ ద సిరీస్' అవార్డు దక్కింది.

'చంద్రయాన్'ను వీక్షిస్తూ...

మ్యాచ్ రోజు డబ్లిన్‌లో భారత క్రికెటర్లు టీవీలో 'చంద్రయాన్-3' ప్రత్యక్ష ప్రసారాన్ని చూస్తూ సమయం గడిపారు. విక్రమ్ ల్యాండర్ చంద్రునిపై అడుగు పెట్టిన క్షణాన సంబరాలు చేసుకుంటూ భావోద్వేగంతో తమ ఆనందాన్ని ప్రదర్శించారు. మరోవైపు మాజీ క్రికెటర్ సచిన్ టెండూల్కర్, స్టార్ ప్లేయర్ కోహ్లి తదితరులు తమ సంతోషాన్ని ప్రకటిస్తూ ట్విట్టర్‌లో 'ఇస్రో'కు అభినందనలు తెలియజేశారు.



డబ్లిన్‌లో బుధవారం చంద్రయాన్-3 ప్రత్యక్ష ప్రసారాన్ని టీవీలో వీక్షిస్తున్న భారత క్రికెటర్లు

అమన్‌ప్రీత్‌కు స్వర్ణం



బకూ (అజర్‌బైజాన్): ప్రపంచ సీనియర్ షూటింగ్ చాంపియన్‌షిప్‌లో బుధవారం భారత్‌కు ఒక స్వర్ణం, ఒక కాంస్య పతకం లభించాయి. పురుషుల 25 మీటర్ల స్టాండర్డ్ పిస్టల్ ఈవెంట్‌లో అమన్‌ప్రీత్ సింగ్ పసిడి పతకం సొంతం చేసుకోగా... మహిళల 25 మీటర్ల స్టాండర్డ్ పిస్టల్ టీమ్ విభాగంలో టియానా, యశిత, కృతిక శర్మలతో కూడిన భారత జట్టు 1601 పాయింట్లతో కాంస్య పతకం దక్కించుకుంది. 50 మంది షూటర్లు పోటీపడ్డ 25 మీటర్ల స్టాండర్డ్ పిస్టల్ ఈవెంట్‌లో అమన్‌ప్రీత్ 577 పాయింట్లతో విజేతగా అవతరించాడు. భారత్‌కే చెందిన హర్ష్ 573 పాయింట్లతో నాలుగో స్థానంలో, అక్షయ్ జైన్ 545 పాయింట్లతో 40వ స్థానంలో నిలిచారు.

ప్రత్యర్థులుగా ఇంగ్లండ్, నెదర్లాండ్స్

వన్డే వరల్డ్ కప్‌లో భారత్ వామప్ మ్యాచ్‌లు



దుబాయ్: వన్డే వరల్డ్ కప్ ప్రధాన పోరుకు ముందు సన్నాహకంగా జరిగే వామప్ మ్యాచ్‌ల షెడ్యూల్‌ను అంతర్జాతీయ క్రికెట్ మండలి (ఐసీసీ) ప్రకటించింది. మూడు వేదికలు హైదరాబాద్, తిరువనంతపురం, గువహటి నగరాల్లో ఈ మ్యాచ్‌లు జరుగుతాయి. టోర్నీలో పాల్గొంటున్న 10 జట్లూ సెప్టెంబర్ 29 నుంచి అక్టోబర్ 3 మధ్య రెండేసి మ్యాచ్‌ల చొప్పున ఆడతాయి. సెప్టెంబర్ 30న డిఫెండింగ్ చాంపియన్ ఇంగ్లండ్‌తో గువహటిలో తలపడే భారత్... అక్టోబర్ 3న తిరువనంతపురంలో నెదర్లాండ్స్‌ను ఎదుర్కొంటుంది. మూడు ప్రధాన మ్యాచ్‌లకు ఆతిథ్యం ఇస్తున్న హైదరాబాద్‌లోని రాజీవ్‌గాంధీ స్టేడియంలో రెండు వామప్ మ్యాచ్‌లు కూడా జరుగుతాయి. సెప్టెంబర్ 29న పాకిస్తాన్, న్యూజిలాండ్...అక్టోబర్ 3న పాకిస్తాన్, ఆస్ట్రేలియా మధ్య ఉప్పల్ స్టేడియంలో వామప్ మ్యాచ్‌లు నిర్వహిస్తారు.

టికెటింగ్ పార్ట్‌నర్‌గా బుక్ మై షో...

వరల్డ్ కప్ కోసం 'బుక్ మై షో'ను తమ టికెటింగ్ భాగస్వామిగా బీసీసీఐ ప్రకటించింది. ప్రధాన మ్యాచ్‌లు, వామప్ మ్యాచ్‌లు కలిపి మొత్తం 58 మ్యాచ్‌ల టికెట్లను బుక్ మై షో ద్వారా కొనుగోలు చేయవచ్చు. భారత్ మినహా ఇతర జట్ల వామప్ మ్యాచ్‌లకు ఈ నెల 25 నుంచి, భారత్ ఆడే వామప్ మ్యాచ్‌లకు ఈ నెల 30 నుంచి టికెట్లు అందుబాటులో ఉంటాయి. అయితే బోర్డు స్పాన్సర్లలో ఒకరైన 'మాస్టర్ కార్డ్' వినియోగదారులకు మాత్రం ఒకరోజు ముందుగానే (నేటి సాయంత్రం 6 గంటల నుంచి, 29 సాయంత్రం 6 గంటల నుంచి) టికెట్లు లభిస్తాయి.

'టాప్'లో కోస్టల్ రైడర్స్

విశాఖ స్పోర్ట్స్: ఆంధ్ర ప్రీమియర్ లీగ్ రెండో సీజన్‌లో లీగ్ దశ మ్యాచ్‌లు ముగిశాక కోస్టల్ రైడర్స్ జట్టు 16 పాయింట్లతో టాపర్‌గా నిలిచింది. ఉత్తరాంధ్ర లయన్స్, రాయలసీమ కింగ్స్ 12 పాయింట్లతో సంయుక్తంగా రెండో స్థానంలో... బెజవాడ టైగర్స్, గోదావరి టైటాన్స్ 8 పాయింట్లతో సంయుక్తంగా మూడో స్థానంలో నిలిచాయి. అయితే మెరుగైన రన్‌రేట్ ఆధారంగా ఉత్తరాంధ్ర లయన్స్‌కు రెండో స్థానం, రాయలసీమ కింగ్స్‌కు మూడో స్థానం, బెజవాడ టైగర్స్‌కు నాలుగో స్థానం లభించాయి. కోస్టల్ రైడర్స్‌తోపాటు ఈ మూడు జట్లు ప్లే ఆఫ్స్‌కు అర్హత పొందాయి. శుక్రవారం జరిగే ఎలిమినేటర్ మ్యాచ్‌లో రాయలసీమ కింగ్స్‌తో బెజవాడ టైగర్స్ ... క్వాలిఫయర్-1లో ఉత్తరాంధ్ర లయన్స్‌తో కోస్టల్ రైడర్స్ ఆడతాయి.

రాయలసీమ కింగ్స్‌తో చివరి రౌండ్ లీగ్ మ్యాచ్‌లో కోస్టల్ రైడర్స్ జట్టు వీజేడీ పద్ధతిలో 8 వికెట్లతో గెలిచింది. ముందుగా రాయలసీమ కింగ్స్ 18 ఓవర్లలో 9 వికెట్లకు 131 పరుగులు చేసింది. ఈ దశలో వర్షం అంతరాయం కలిగించింది. హనీష్ రెడ్డి (78; 5 ఫోర్లు, 6 సిక్స్‌లు) మెరిశాడు. వర్షం తగ్గాక కోస్టల్ రైడర్స్ జట్టుకు 17 ఓవర్లలో 124 పరుగుల విజయలక్ష్యాన్ని నిర్దేశించారు. కోస్టల్ జట్టు 14 ఓవర్లలో రెండు వికెట్లు కోల్పోయి 127 పరుగులు చేసి గెలిచింది. ప్రణీత్ (64 నాటౌట్; 6 ఫోర్లు, 3 సిక్స్‌లు), చిరంజీవి (32 నాటౌట్; 3 ఫోర్లు, 2 సిక్స్‌లు) దూకుడుగా ఆడారు. మరో మ్యాచ్‌లో ఉత్తరాంధ్ర లయన్స్ ఏడు వికెట్లతో గోదావరి టైటాన్స్‌ను ఓడించింది.

ప్రిక్వార్టర్ ఫైనల్లో గాయత్రి-ట్రెసా జోడీ




కోపెన్‌హాగెన్ (డెన్మార్క్): ప్రపంచ బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్ డబుల్స్ విభాగంలో బుధవారం భారత్‌కు మంచి ఫలితాలు లభించాయి. మహిళల డబుల్స్‌లో పుల్లెల గాయత్రి-ట్రెసా జాలీ జోడీ... పురుషుల డబుల్స్‌లో సాత్విక్ సాయిరాజ్-చిరాగ్ శెట్టి ద్వయం ప్రిక్వార్టర్ ఫైనల్లోకి దూసుకెళ్లాయి. తొలి రౌండ్‌లో 'బై' పొందిన గాయత్రి-ట్రెసా జంట రెండో రౌండ్‌లో 21-18, 21-10తో చాంగ్ చింగ్ హుయ్-యాంగ్ చింగ్ టున్ (చైనీస్ తైపీ) జోడీని ఓడించింది. తొలి రౌండ్‌లో 'బై' పొంది నేరుగా రెండో రౌండ్ మ్యాచ్ ఆడిన సాత్విక్-చిరాగ్ ద్వయం 21-16, 21-9తో కెన్నెత్ జె హుయ్-మింగ్ చుయెన్ లిమ్ (ఆస్ట్రేలియా) జోడీపై గెలిచింది.

భారత్‌కు మూడో స్థానం



డసెల్‌డార్ఫ్ (జర్మనీ): నాలుగు దేశాల జూనియర్ మహిళల అంతర్జాతీయ హాకీ టోర్నీలో భారత జట్టు మూడో స్థానాన్ని సంపాదించింది. ఇంగ్లండ్ జట్టుతో బుధవారం జరిగిన ప్లే ఆఫ్ మ్యాచ్‌లో టీమిండియా 6-2 గోల్స్ తేడాతో ఘనవిజయం సాధించింది. భారత్ తరఫున అన్ను (26వ, 43వ ని.లో) రెండు గోల్స్ చేయగా... నీలమ్ (25వ ని.లో), సునెలితా టొప్పో (35వ ని.లో), హీనా బానో (38వ ని.లో), ముంతాజ్ ఖాన్ (40వ ని.లో) ఒక్కో గోల్ సాధించారు. ఇంగ్లండ్ జట్టుకు క్లాడియా స్వెయిన్ (16వ ని.లో), చార్లోట్ బింగామ్ (54వ ని.లో) ఒక్కో గోల్ అందించారు.

సినిమా



"నా పనిని ఎంజాయ్ చేయడం కోసం నేను సినిమా రంగంలోకి వచ్చాను. మనం చేసే పని ఏదైనా అందులో సంతృప్తి దక్కాలి. 'గాండీవధారి అర్జున' చిత్రం చేయడం నా బాధ్యత అనిపించింది. నా మనసుకు నచ్చిన సినిమా ఇది. నాకు సంతృప్తినిచ్చింది" అని హీరో వరుణ్ తేజ్ అన్నారు. ప్రవీణ్ సత్తారు దర్శకత్వంలో వరుణ్ తేజ్, సాక్షీ వైద్య జంటగా నటించిన చిత్రం 'గాండీవధారి అర్జున'. బి. బాపినీడు సమర్పణలో బీవీఎస్ఎన్ ప్రసాద్ నిర్మించిన ఈ సినిమా రేపు (శుక్రవారం) విడుదలవుతోంది. ఈ సందర్భంగా వరుణ్ తేజ్ చెప్పిన విశేషాలు.

అప్పుడే ప్రేమలో పడ్డా!

- వరుణ్ తేజ్

- ప్రవీణ్ సత్తారుగారి సినిమాలను ప్రారంభం నుంచి చూస్తున్నాను. వైవిధ్యమైన చిత్రాలు చేయటానికి ఆయన ప్రయత్నిస్తుంటాడు. ప్రవీణ్ తీసిన 'చందమామ కథలు' సినిమాలోని భావోద్వేగాలు, 'పీఎస్‌వీ గరుడవేగ' చిత్రంలోని యాక్షన్ నాకు ఇష్టం. 'గని' సినిమా సమయంలో నేను 'గాండీవధారి అర్జున' కథ విన్నాను. సాధారణంగా స్టైలిష్ యాక్షన్ మూవీ అంటే యాక్షన్, స్టైలిష్ అంశాలపై ఫోకస్ ఎక్కువగా ఉంటుంది.. కథ తక్కువగా ఉంటుంది. కానీ ప్రవీణ్‌గారు కథ చెప్పినప్పుడు అందులోని పాయింట్, భావోద్వేగాలు నచ్చాయి.
- ఈ చిత్రంలో హీరో పేరు అర్జున్. ఓ నటుడికి సామాజిక బాధ్యతాయుతమైన పాత్రల్లో నటించే అవకాశాలు తక్కువగా వస్తుంటాయి. అందుకే మంచి కథతో పాటు సామాజిక బాధ్యతను గుర్తు చేసేలా ఉండే ఈ సినిమా చేయటం సంతోషంగా ఉంది. ఈ సినిమాలో ఎక్కువగా రియలిస్టిక్ యాక్షన్ సీక్వెన్స్ ఉన్నాయి.. అవి చేస్తున్నప్పుడు నాకు గాయాలయ్యాయి.
- 'గాండీవధారి..' లో బాడీగార్డ్ రోల్ చేశాను. ఈ చిత్రం ద్వారా ప్రేక్షకులకు ఏదో సందేశం ఇచ్చి మీరు మారాలని చెప్పటం లేదు. ప్రస్తుతం ఉన్న పెద్ద సమస్యని యాక్షన్, ఎమోషన్, ఎంటర్‌టైనింగ్‌గా చెప్పే ప్రయత్నం చేశాం. సినిమా చూసి కొందరైనా మారితే మంచిదే. కథ డిమాండ్ మేరకే లండన్‌లో షూట్ చేశాం. అక్కడి వాతావరణం షూటింగ్‌కి సహకరించకపోవడం వల్ల బడ్జెట్ ముందుగా అనుకున్నదాని కంటే పెరిగింది. అయినా బీవీఎస్ఎన్ ప్రసాద్‌గారు, బాపినీడు ఖర్చుకు వెనకాడలేదు.
- సాక్షీ వైద్యకి చాలా ప్రతిభ ఉంది. తొలి రోజు షూటింగ్‌లోనే సినిమాలోని మూడు పేజీల డైలాగ్‌ని సింగిల్ టేక్‌లో చెప్పటం ఆశ్చర్యంగా అనిపించింది. మిక్కీ జె. మేయర్ అద్భుతమైన సంగీతం, అంతకు మించి నేపథ్య సంగీతం అందించారు. ప్రస్తుతం 'ఆపరేషన్ వాలెంటైన్', 'మట్కా' సినిమాలు చేస్తున్నాను.
- మీ (వరుణ్-లావణ్యా త్రిపాఠి) ప్రేమ ఎప్పుడు మొదలైంది? పెళ్లెప్పుడు? అని వరుణ్ తేజ్‌ని అడగ్గా.. ''తొలిసారి తనని కలిసినప్పుడే ('మిస్టర్' సినిమా అప్పుడు) అని నవ్వుతూ సమాధానం ఇచ్చారు. ''మా పెళ్లి ఈ ఏడాదిలోనే ఉండే అవకాశం ఉంది'' అన్నారు వరుణ్.

''లవ్, ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌గా 'ఖుషి' సినిమా ఉంటుంది. విప్లవ్, ఆరాధ్య పాత్రల్లో విజయ్ దేవరకొండ, సమంతల నటన, భావోద్వేగాలు ప్రేక్షకుల్ని కట్టిపడేస్తాయి. ఒక్క మాటలో చెప్పాలంటే 'ఖుషి'లో అన్ని వాణిజ్య అంశాలుంటాయి'' అని ఛాయాగ్రాహకుడు జి. మురళి అన్నారు. విజయ్ దేవరకొండ, సమంత జంటగా శివ నిర్వాణ దర్శకత్వం వహించిన చిత్రం 'ఖుషి'. మైత్రీ మూవీ మేకర్స్ బ్యానర్‌పై నవీన్ యెర్నేని, వై. రవి శంకర్ నిర్మించిన ఈ సినిమా సెప్టెంబర్ 1న విడుదలవుతోంది. ఈ సందర్భంగా జి. మురళి మాట్లాడుతూ– ''సినిమాటోగ్రఫీలో శిక్షణ పొంది, సినిమాల్లోకి వచ్చాను. ఎవరి వద్దా అసిస్టెంట్‌గా చేయలేదు. తెలుగులో నా తొలి సినిమా 'అందాల రాక్షసి'. ఆ తర్వాత 'ఖుషి'నే. ప్రేమ గురించి కలలు కనే యువకుడికి ప్రేమ, జీవితం అంటే మన ఊహలకు అనుగుణంగా ఉండవని తెలిసి రావడమే ఈ సినిమా నేపథ్యం. మణిరత్నంగారి సినిమాల్లో సినిమాటోగ్రాఫర్ పీసీ శ్రీరామ్‌గారు చూపించే విజువల్ బ్యూటీ 'ఖుషి'లో చూస్తారు. అయితే అలాంటి సీన్స్‌ను మేం కాపీ కొట్టలేదు.. అలాంటి అనుభూతి కలిగించేలా విజువల్స్ ఉంటాయి. ఈ సినిమా పూర్తయ్యాక ప్రేక్షకులకు కొత్త అనుభూతి కలుగుతుంది. కెమేరా ద్వారా ఆ ఎమోషన్‌ని తీసుకొచ్చేందుకు నా ప్రయత్నం చేశాను. నవీన్ యెర్నేని, వై. రవిశంకర్‌గార్లకు సినిమాల మీద ఉన్నంత ప్యాషన్ నేను ఇంకో ప్రొడక్షన్‌లో చూడలేదు. శివ నిర్వాణగారు ఎప్పుడూ సినిమా గురించే ఆలోచిస్తుంటారు. హేషమ్ అబ్దుల్ వాహబ్ అద్భుతమైన సంగీతం ఇచ్చారు'' అన్నారు.

ఆ సీన్స్‌ని కాపీ కొట్టలేదు

- జి. మురళి



తెలుగు ప్రేక్షకులకు దండం పెట్టాలి

- సుప్రియ



"బాయ్స్ హాస్టల్' ట్రైలర్ చూడగానే నవ్వొచ్చింది. ప్రపంచంలో కెల్లా మంచి ప్రేక్షకులు మన తెలుగు వాళ్లే. మంచి సినిమాలను భాషతో సంబంధం లేకుండా ఆదరిస్తారు. అందుకే మన ప్రేక్షకులకి దండం పెట్టాలి" అని నిర్మాత సుప్రియ యార్లగడ్డ అన్నారు. ప్రజ్వల్ బీపీ, మంజునాథ్ నాయక, రాకేశ్ రాజ్‌కుమార్, శ్రీవత్స ప్రధాన పాత్రల్లో, అతిథిగా రిషబ్ శెట్టి నటించిన కన్నడ చిత్రం 'హాస్టల్ హుడుగారు బేకగిద్దరే'. ఈ చిత్రాన్ని 'బాయ్స్ హాస్టల్'గా అన్నపూర్ణ స్టూడియోస్, చాయ్ బిస్కెట్ ఫిల్మ్స్ తెలుగులో ఈ నెల 26న రిలీజ్ చేస్తున్నాయి. ఇందులో రష్మీ గౌతమ్, తరుణ్ భాస్కర్ అతిథి పాత్రలు చేశారు. ఈ చిత్ర నిర్మాతల్లో ఒకరైన సుప్రియ చెప్పిన విశేషాలు.

- 'హాస్టల్ హుడుగారు బేకగిద్దరే' సినిమాని అనువదించడం కష్టంగా అనిపించింది. ఎందుకంటే వందకు పైగా వాయిస్‌లు ఉన్నాయి. చాలా జాగ్రత్తలు తీసుకొని ప్రతి వాయిస్‌ని తెలుగు నేటివిటీకి తగ్గట్టు డబ్ చేశాం. 'బాయ్స్ హాస్టల్' చూస్తున్నప్పుడు ప్రేక్షకులకు స్ట్రయిట్ తెలుగు సినిమా చూస్తున్న అనుభూతి కలుగుతుంది. చాయ్ బిస్కెట్ ఫిల్మ్స్ వాళ్ల సినిమాలను చాలా చక్కగా చేస్తున్నారు.. అందుకే వాళ్లతో కలిసి ఈ చిత్రాన్ని విడుదల చేస్తున్నాం.
- వారసత్వాన్ని కాపాడుకోవడం చాలా ముఖ్యం. 'మనం' సినిమా షూటింగ్ మరో పది రోజులు ఉందనగా తాతగారి (అక్కినేని నాగేశ్వరరావు) ఆరోగ్య పరిస్థితి తెలిసింది. అప్పటికే ఆయన 255 సినిమాలు చేశారు. 'మనం' ఆయన చివరి సినిమాగా పూర్తి చేయాలనుకున్నప్పుడు ఎంతో ఒత్తిడి ఉండేది. రోజుకు 22 గంటలు పని చేశాం. అయితే ఆ టైమ్‌లో ఎవరితోనూ తిట్టించుకోకపోవడం గొప్ప విషయం (నవ్వు తూ). తాతగారు ఇప్పటికీ నెలకోసారి కలలోకి వచ్చి నన్ను తిడుతుంటారు (నవ్వుతూ).
- నాగార్జునగారి కంటే మంచి నిర్మాత ఎవరూ లేరు. ఆయన యాక్టర్ అవ్వడం వల్లే అన్నపూర్ణ స్టూడియో నిలిచిందని భావిస్తాను. స్టూడియో ప్రారంభమైన కొత్తల్లో కరెంటు బిల్లు కూడా కట్టేంత ఆదాయం వచ్చేది కాదు. తాత, అమ్మమ్మ (ఏఎన్ఆర్-అన్నపూర్ణ) బాధ పడేవారు. ఇప్పుడు ఈ స్టూడియో ఇంత పెద్దగా ఎదిగిందంటే ఇందులో తాతగారు, నాగార్జునగారి కృషి ఉంది. నాకు యాక్టింగ్ వస్తుందా? రాదా అని చెక్ చేసుకోవడానికి 'గూఢచారి' చేశాను (నవ్వుతూ). 'గూఢచారి 2'లో నా పాత్ర ఉంటే నటిస్తాను. మా బ్యానర్‌లో నాగచైతన్య, అఖిల్‌లతో ప్రాజెక్ట్స్ లైన్‌లో ఉన్నాయి.

ఆన్ ఇన్వెస్టిగేషన్



- కాజల్
- తమన్నా
- త్రిష

పోలీస్ ఆఫీసర్లుగా కొందరు నాయికలు దోషులను పట్టుకునేందుకు రెడీ అయ్యారు. ఇందులో భాగంగా కేసు వివరాల కోసం లోతుగా విచారణ చేస్తూ, ఇన్వెస్టిగేషన్ మోడ్‌లోకి వెళ్లిపోయారు. ఈ తారల పరిశోధనల విశేషాల్లోకి వెళదాం.

పవర్‌ఫుల్ సత్యభామ

హైదరాబాద్‌లో అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ పోలీస్ సత్యభామగా చార్జ్ తీసుకున్నారు కాజల్ అగర్వాల్. ఆమె టైటిల్ రోల్‌లో రూపొందుతున్న చిత్రం 'సత్యభామ'. ఈ చిత్రంలో ఏసీపీ సత్యభామ పాత్ర చేస్తున్నారు కాజల్. ఆల్రెడీ టీజర్‌ను కూడా రిలీజ్ చేశారు. అఖిల్ డేగల ఈ సినిమాకు దర్శకత్వం వహిస్తున్నారు. గతంలో కొన్ని చిత్రాల్లో కాజల్ పోలీసాఫీసర్ పాత్రలో నటించినప్పటికీ ఓ పూర్తి స్థాయి ఇన్వెస్టిగేషన్ ఆఫీసర్‌గా నటించడం ఇదే తొలిసారి.

తొలి అడుగు

రెండు దశాబ్దాలుగా అగ్రకథానాయికగా త్రిష ప్రయాణం దిగ్విజయంగా కొనసాగుతోంది. ఇప్పుడు డిజిటల్ ఎంటర్‌టైన్‌మెంట్ హవా కూడా నడుస్తున్న తరుణంలో ఈ ప్లాట్‌ఫామ్‌లో ఆమె సైన్ చేసిన తొలి వెబ్ సిరీస్ 'బృందా'. ఇందులో త్రిష పోలీసాఫీసర్‌గా నటిస్తున్నారు. పూర్తి స్థాయి పోలీసాఫీసర్ పాత్రలో త్రిష నటిస్తుండటం కూడా ఇదే మొదటిసారి అనొచ్చు. క్రైమ్-ఇన్వెస్టిగేషన్ నేపథ్యంలో ఈ సిరీస్‌కు సురేష్ వంగలా దర్శకత్వం వహిస్తున్నారు. తెలుగులో రూపొందుతున్న ఈ సిరీస్ ఇతర భాషల్లో అనువాదమై, త్వరలో స్ట్రీమింగ్ కానుంది.

ఆఖరి నిజం

ఢిల్లీలో 2018లో జరిగిన బురారి ఆత్మహత్యల ఘటన ఆధారంగా ఇప్పటికే కొన్ని వెబ్ సిరీస్‌లు రూపొందాయి. తాజాగా రూపొందిన మరో వెబ్ సిరీస్ 'ఆఖ్రీ సచ్' (ఆఖరి నిజం). ఆత్మహత్యల మిస్టరీ ఛేదించే ఇన్వెస్టిగేషన్ ఆఫీసర్ అన్యగా తమన్నా నటించారు. ఈ తరహా పాత్ర చేయడం ఇదే తొలిసారి అని ఇటీవల తమన్నా పేర్కొన్నారు. రాబీ గ్రేవాల్ ఈ వెబ్ సిరీస్‌కు దర్శకత్వం వహించారు.

ఇలా ఇన్వెస్టిగేషన్ ఆఫీసర్స్‌గా మరికొందరు తారలు నటిస్తున్నారు.

గూఢచారి 111



- 'వెన్నెల' కిశోర్

'వెన్నెల' కిశోర్, సంయుక్తా విశ్వనాథన్ హీరో హీరోయిన్లుగా, మురళీ శర్మ కీలక పాత్రలో నటిస్తున్న స్పై యాక్షన్ కామెడీ ఫిల్మ్ 'చారి 111'. టీజీ కీర్తికుమార్ దర్శకత్వంలో అదితీ సోనీ ఈ సినిమాను నిర్మిస్తున్నారు. బుధవారం ఈ సినిమాను ప్రకటించడంతో పాటు, కాన్సెప్ట్ టీజర్‌ను కూడా విడుదల చేశారు. ఈ సందర్భంగా టీజీ కీర్తి కుమార్ మాట్లాడుతూ– ''ఓ సిటీలో జరిగే అనుమానాస్పద ఘటనలను ఛేదించే రహస్య గూఢచారి పాత్రలో 'వెన్నెల' కిశోర్ కనిపిస్తారు. అలాగే ఆయన పాత్రలో ఓ కన్‌ఫ్యూజన్ కూడా ఉంటుంది. స్టైలిష్ యాక్షన్ సన్నివేశాలతో ఆద్యంతం వినోదభరితంగా ప్రేక్షకులను అలరించేలా ఈ సినిమా ఉంటుంది'' అన్నారు. ''స్పై జానర్‌లో 'చారి 111' కొత్తగా ఉంటుంది. కథలో చాలా సర్‌ప్రైజ్‌లు ఉన్నాయి. షూటింగ్ జరుగుతోంది'' అన్నారు అదితీ సోనీ. ఈ చిత్రానికి సంగీతం: సైమన్ కె. కింగ్.

అనులో మంచి పాత్ర చేశాను

- ఆమని



కార్తీక్ రాజు, ప్రశాంత్ కార్తి, మిస్టీ చక్రవర్తి, ఆమని, దేవీ ప్రసాద్, భీమినేని శ్రీనివాసరావు, పోసాని కృష్ణమురళి ప్రధాన పాత్రల్లో నటించిన చిత్రం 'అను'. సందీప్ గోపిశెట్టి స్వీయ దర్శకత్వంలో నిర్మిస్తున్న ఈ సినిమా సెప్టెంబరులో విడుదల కానుంది. ఈ సందర్భంగా బుధవారం జరిగిన ఈ సినిమా విలేకర్ల సమావేశంలో ఆమని మాట్లాడుతూ– ''ఈ సినిమాలో ఓ మంచి పాత్ర చేశాను. చక్కని సందేశాత్మక చిత్రం ఇది. ప్రేక్షకులు ఈ సినిమాను ఆదరించాలి'' అన్నారు. ''దర్శకుడిగా నాకు ఇదే తొలి చిత్రం. సెప్టెంబరులో సినిమాను విడుదల చేయాలనుకుంటున్నాం'' అన్నారు సందీప్ గోపిశెట్టి. ''ఈ సినిమాలో విలన్‌గా చేశాను'' అన్నారు ప్రశాంత్ కార్తి. దేవీ ప్రసాద్, భీమనేని శ్రీనివాసరావు, లైన్ ప్రొడ్యూసర్ కల్యాణ్ చక్రవర్తి ఈ సినిమా విజయంపై నమ్మకం వ్యక్తం చేశారు.

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు		
సెన్సెక్స్ ▲	213	65,433
నిఫ్టీ ▲	48	19,444

మరిన్ని బిజినెస్ వార్తల కోసం 'సాక్షి ప్లస్' చూడండి

విదేశీ సూచీలు (రాత్రి 11.30 గంటలకు)

సూచీ	విలువ	మార్పు
నాస్‌డాక్	13,739	▲ 233
డోజోన్స్	34,512	▲ 233
ఎఫ్‌టీఎస్‌ఈ 100	7,321	▲ 50
డాక్స్	15,728	▲ 23
షాంఘై	3,078	▽ 42
నికాయ్	32,010	▲ 154

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

బులియన్ రూ.లలో — ముంబై

బంగారం (24 క్యారట్)	58,520	▽ 137
బంగారం (22 క్యారట్)	58,286	▽ 137
వెండి (కిలో)	72,679	▲ 539

చంద్రయాన్‌పై కార్పొరేట్ల హర్షం..



చంద్రయాన్-3 విజయవంతం కావడంపై కార్పొరేట్లు హర్షం వ్యక్తం చేశారు. చంద్రయాన్ టీమ్‌ను ప్రశంసించారు.

గర్వకారణం...



ఇది ప్రతి భారతీయుడు గర్వించదగ్గ క్షణం. భారత అంతరిక్ష, సాంకేతిక ప్రయాణంలో ఒక కీలక మైలురాయి. ప్రధాని నరేంద్ర మోదీకి, ఇస్రో బృందానికి శుభాభినందనలు. రాబోయే తరాలకు ఇది ఎంతో స్ఫూర్తిదాయకంగా నిలుస్తుంది.

– ఎన్ చంద్రశేఖరన్, టాటా సన్స్ చైర్మన్

సామర్థ్యానికి నిదర్శనం



ఇస్రో, భారత సైంటిస్టులు అందరికీ హృదయపూర్వక శుభాభినందనలు. అంతరిక్ష పరిశోధనలో భారతదేశ సామర్థ్యాలకు ఈ విజయం ఒక నిదర్శనం. ఈ అపూర్వ ఘట్టంలో భాగం కావడం మాకెంతో గర్వకారణం.

– ఎస్ఎన్ సుబ్రమణ్యన్, ఎల్అండ్‌టీ సీఈవో

జాబిల్లి చేతికి అందింది



మానవ జాతి ఆరంభం నుంచి చంద్రుడిని చూస్తూ కలలు కంటూనే ఉంది. చందమామ తన మాయాజాలంతో మనల్ని స్వాప్నికులుగా మార్చింది. నేడు ఆ మాయ, సైన్స్ కలిసి జాబిల్లిని మన చేతికి అందించాయి.

– ఆనంద్ మహీంద్రా, పారిశ్రామిక దిగ్గజం

చారిత్రక క్షణం



ఇస్రో బృందానికి అభినందనలు. మీరు దేశానికి గర్వకారణం. అంతరిక్ష పరిశోధనలను విజయవంతంగా అమలు చేయగలగడం దేశానికి తన సామర్థ్యాలపై గల నమ్మకానికి నిదర్శనం. ఇది 140 కోట్ల మంది భారతీయులకు చారిత్రక క్షణం.

– గౌతమ్ అదానీ, అదానీ గ్రూప్ చైర్మన్

అద్భుత ఘట్టం



భారత అంతరిక్ష పరిశోధనల చరిత్రలో ఇది మరో అద్భుత ఘట్టం.. మన అంతరిక్ష పరిశ్రమ సామర్థ్యాలకు నిదర్శనం. మూడు దశాబ్దాలుగా భారతీయ స్పేస్ ప్రోగ్రామ్‌తో అనుబంధం కలిగి ఉండటం మాకు గర్వకారణం.

– పర్వత్ శ్రీనివాస్ రెడ్డి, ఎంటార్ టెక్నాలజీస్ ఎండీ

తనిష్క్ వరలక్ష్మీ వ్రత కలెక్షన్.. 'ఆర్ణ'

హైదరాబాద్: సంపద, సంతోషం, సుఖం అందించే దేవత లక్ష్మీదేవిని పూజిస్తూ చేసుకునే పవిత్ర వరలక్ష్మీ వ్రత పర్వదినాన్ని పురస్కరించుకుని భారత్ అతిపెద్ద జ్యువెలరీ బ్రాండ్- తనిష్క్ 'ఆర్ణ' పేరుతో ప్రత్యేక ఆభరణాల కలెక్షన్‌ను ఆవిష్కరించింది. ఈ మేరకు విడుదలైన ఒక ప్రకటన ప్రకారం వైవిధ్యమైన అభిరుచులకు అనుగుణంగా ఈ కలెక్షన్‌లో ప్రత్యేకమైన నెక్‌పీస్, హరామ్, వంకీలు, నడుము వడ్డాణాలు, చెవిపోగులు, బ్యాంగిల్స్‌సహా అత్యంత నాణ్యమైన, విభిన్న డిజైన్‌లతో కూడిన బంగారం, కలర్ స్టోన్స్, ముత్యాల ఆభరణాలు ఉన్నాయి. తనిష్క్ ఆభరణాల ఎక్స్ఛేంజ్‌పై 20 శాతం వరకూ తగ్గింపు ఆఫర్ కూడా అందుబాటులో ఉంది. ఈ ఆఫర్ తెలుగు రాష్ట్రాల్లోని సంస్థ అన్ని షోరూమ్‌లలో లభ్యమవుతుందని తనిష్క్ ప్రకటనలో పేర్కొంది.



కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)

24-8-2023	
విశాఖ	475-00
చిత్తూరు	503-00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	465-00
విజయవాడ	465-00
రిటైల్ ధర (డజను)	72.00
23-8-2023 ఫామ్ ధర...	
హైదరాబాద్	435-00
వరంగల్	437-00
రిటైల్ ధర	4.95

మార్కెట్లకు బ్యాంకింగ్ పుష్

- సెన్సెక్స్ 213 పాయింట్లు అప్
- ఇంట్రాడేలో 65,500 దాటేసింది
- 19,444కు నిఫ్టీ– 48 పాయింట్లు ప్లస్



ముంబై: తొలుత అమ్మకాలు తలెత్తినప్పటికీ వరుసగా మూడో రోజు దేశీ స్టాక్ మార్కెట్లు బలపడ్డాయి. సెన్సెక్స్ 213 పాయింట్లు పుంజుకుని 65,433 వద్ద నిలిచింది. మిడ్‌సెషన్‌లో 285 పాయింట్లు ఎగసి 65,505కు చేరింది. ఇక నిఫ్టీ 48 పాయింట్లు లాభపడి 19,444 వద్ద ముగిసింది. వెరసి మూడు రోజుల్లో సెన్సెక్స్ 485 పాయింట్లు, నిఫ్టీ 134 పాయింట్లు జమ చేసుకున్నాయి. ప్రధానంగా బ్యాంకింగ్ కౌంటర్లు మార్కెట్లకు జోష్‌నివ్వగా యూరోపియన్ మార్కెట్ల సానుకూలతలు సైతం ఇందుకు మద్దతిచ్చినట్లు విశ్లేషకులు పేర్కొన్నారు.

బ్యాంకుల జోరు

ఎన్ఎస్ఈలో ప్రధానంగా పీఎస్‌యూ, ప్రయివేట్ బ్యాంక్స్ 1.7–1.3 శాతం చొప్పున ఎగశాయి. కన్జూమర్ డ్యూరబుల్స్, మీడియా, రియల్టీ 0.6 శాతం పుంజుకోగా.. ఎఫ్ఎంసీజీ 0.5 శాతం నీరసించింది. నిఫ్టీ దిగ్గజాలలో హిందాల్కో, యాక్సిస్, ఐసీఐసీఐ, దివీస్, ఎల్అండ్‌టీ, ఎస్‌బీఐ, టాటా స్టీల్, మారుతీ, సిప్లా, నెస్లే, ఎస్‌బీఐ లైఫ్, కొటక్ బ్యాంక్ 2.3–1% మధ్య లాభపడ్డాయి. అయితే అదానీ ఎంటర్‌ప్రైజెస్ 6% పతనమైంది.

నేలచూపులోనే జియో



జియో ఫైనాన్షియల్ సర్వీసెస్‌లో వరుసగా మూడో రోజు అమ్మకాలు కొనసాగాయి. దీంతో బీఎస్ఈలో మరోసారి 5 శాతం పతనమై 227 వద్ద నిలిచింది. ఎన్ఎస్ఈలోనూ 5 శాతం డౌన్ సర్క్యూట్‌ను తాకి రూ. 225 దిగువన ముగిసింది. గత మూడు రోజులుగా ఈ షేరు లోయర్ సర్క్యూట్లను తాకుతున్న నేపథ్యంలో తాజాగా కంపెనీ మార్కెట్ క్యాప్(విలువ) రూ. 1,44,378 కోట్లకు చేరింది. రిలయన్స్ నుంచి ప్రత్యేక కంపెనీగా విడివడిన జియో ఫైనాన్షియల్ ఈ నెల 29వరకూ ప్రధాన ఇండెక్సులు సెన్సెక్స్, నిఫ్టీలలో కొనసాగనుంది.

చంద్రయాన్-3 షేర్లు జిగేల్



చంద్రయాన్-3 చంద్రుడిపై విజయవంతంగా కాలు మోపనుందన్న అంచనాల నేపథ్యంలో అంతరిక్షం, రక్షణ రంగ కంపెనీల కౌంటర్లకు భారీ డిమాండ్ ఏర్పడింది. బీఎస్ఈలో సెంటమ్ ఎలక్ట్రానిక్స్ 15 శాతం దూసుకెళ్లగా.. స్పేస్ టెక్నాలజీస్, ఎంటార్ టెక్నాలజీస్, హిందుస్తాన్ ఏరోనాటిక్స్ 5.5–3.6 శాతం మధ్య జంప్‌చేశాయి. చంద్రయాన్–3 మిషన్‌కు సెంటమ్ 200కుపైగా కీలక మాడ్యూల్స్‌ను సరఫరా చేసింది. ఇక ఈ బాటలో భారత్ ఫోర్జ్, ఆస్ట్రా మైక్రోవేవ్, ఎల్అండ్‌టీ 3–1.5 శాతం మధ్య ఎగశాయి. వీటిలో కొన్ని కౌంటర్లు ఏడాది గరిష్టాలకు చేరడం గమనార్హం!

రిలయన్స్ రిటైల్‌లో క్యూఐఏకు వాటా

- 0.99 శాతం వాటాకు ఖతార్ ఇన్వెస్ట్‌మెంట్ నుంచి రూ.8,278 కోట్లు
- ఇప్పటికే సిల్వర్‌లేక్, కేకేఆర్, టీపీజీ, జీఐసీ, జీఏ తదితరాల పెట్టుబడులు



న్యూఢిల్లీ: అనుబంధ కంపెనీ రిలయన్స్ రిటైల్ వెంచర్స్(ఆర్ఆర్‌వీఎల్)లో తాజాగా ఖతార్ ఇన్వెస్ట్‌మెంట్ అథారిటీ(క్యూఐఏ) పెట్టుబడులు చేపట్టనున్నట్లు డైవర్సిఫైడ్ దిగ్గజం రిలయన్స్ ఇండస్ట్రీస్ పేర్కొంది. తద్వారా ఆర్ఆర్‌వీఎల్‌లో 0.99 శాతం వాటాను పొందనున్నట్లు రిలయన్స్ వెల్లడించింది. సొంత అనుబంధ సంస్థ ద్వారా క్యూఐఏ బిలియన్ డాలర్ల(రూ. 8,278 కోట్లు) వెచ్చించనుంది. వెరసి 100 బిలియన్ డాలర్ల(రూ. 8.27 లక్షల కోట్లు) విలువలో ఆర్ఆర్‌వీఎల్ వాటాను సొంతం చేసుకోనుంది. దేశ ఆర్థిక వ్యవస్థలోని సానుకూలతలకు, రిలయన్స్ రిటైల్ బిజినెస్ మోడల్‌కుగల సామర్థ్యాలకు ఆర్ఆర్‌వీఎల్‌లో క్యూఐఏ పెట్టుబడులు ప్రతీకలని డైరెక్టర్ ఈషా ముకేష్ అంబానీ ఈ సందర్భంగా వ్యాఖ్యానించారు. తమ కంపెనీలో పెట్టుబడిదారుగా క్యూఐఏకు ఆహ్వానం పలుకుతున్నట్లు తెలియజేశారు. రిలయన్స్ గ్రూప్ మొత్తం రిటైల్ బిజినెస్‌లకు ఆర్ఆర్‌వీఎల్ హోల్డింగ్ కంపెనీగా వ్యవహరిస్తోంది. కొత్త తరహా కంపెనీలలో అదికూడా అత్యధిక వృద్ధికి వీలున్న దేశీ రిటైల్ మార్కెట్లో ఇన్వెస్ట్ చేసేందుకు సంస్థ కట్టుబడి ఉన్నట్లు క్యూఐఏ సీఈవో మన్సూర్ ఇబ్రహీం అల్‌మహ్మద్ పేర్కొన్నారు.

దిగ్గజాల క్యూ...: ఆర్ఆర్‌వీఎల్‌లో పలు గ్లోబల్ పీఈ దిగ్గజాలు 2020 ప్రారంభంలోనే భారీగా ఇన్వెస్ట్ చేశాయి. కంపెనీ 10.09% వాటాను విక్రయించడం ద్వారా 6.4 బిలియన్ డాలర్లు సమీకరించింది. కంపెనీలో ఇన్వెస్ట్ చేసిన దిగ్గజాలలో సిల్వర్ లేక్, కేకేఆర్, ముబడాలా, అబుధాబీ ఇన్వెస్ట్‌మెంట్ అథారిటీ, జీఐసీ, టీపీజీ, జనరల్ అట్లాంటిక్, సౌదీ పబ్లిక్ ఇన్వెస్ట్‌మెంట్ ఫండ్ ఉన్నాయి. 57 బిలియన్‌డాలర్ల(రూ. 4.2 లక్షల కోట్లు) విలువలో కంపెనీ ఈ పెట్టుబడులను సమకూర్చుకుంది. తద్వారా మూడేళ్ల క్రితం రిటైల్ రంగంలో భారీ నిధుల సమీకరణకు ఆర్ఆర్‌వీఎల్ తెరతీసింది.

పీఎంఎస్ సేవల్లోకి సావర్ట్

యాడ్ ఆస్ట్రా ఫండ్ ఆవిష్కరణ



హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: ఇన్వెస్ట్‌మెంట్ అడ్వైజరీ సంస్థ సావర్ట్ కొత్తగా యాడ్ ఆస్ట్రా ఫండ్ పేరిట పోర్ట్‌ఫోలియో మేనేజ్‌మెంట్ సేవలను (పీఎంఎస్) ఆవిష్కరించింది. ఆగస్టు 26 నుంచి వీటిని అందుబాటులోకి తెస్తున్నట్లు సంస్థ వ్యవస్థాపకుడు, సీఈవో సంకర్ష్ చందా బుధవారమిక్కడ వెల్లడించారు. మార్కెట్ల నియంత్రణ సంస్థ సెబీ నిబంధనల ప్రకారం కనీస పెట్టుబడి రూ. 50 లక్షల నుంచి ఉంటుందని ఆయన వివరించారు. ఇప్పటికే రూ. 30 కోట్ల వరకు పెట్టుబడి ప్రతిపాదనలు వచ్చాయని, పీఎంఎస్ ప్రారంభమయ్యాక మరో రూ. 40 కోట్ల వరకు రాగలవని సంకర్ష్ చందా చెప్పారు. ఈ ఆర్థిక సంవత్సరం ఆఖరు నాటికి రూ. 350 కోట్ల వరకూ రావచ్చని అంచనా వేస్తున్నట్లు చెప్పారు.

రూపాయి మరింత జోరు

డాలర్‌తో పోలిస్తే 82.72 వద్ద ముగింపు



న్యూఢిల్లీ: డాలర్‌తో పోలిస్తే రూపాయి వరుసగా రెండో రోజూ బలపడింది. 27 పైసలు పెరిగి 82.72 వద్ద క్లోజయ్యింది. రెండు నెలల వ్యవధిలో ఒకే రోజున రూపాయి ఇంతగా పెరగడం ఇదే ప్రథమం. ఐపీవో సంబంధ పెట్టుబడుల ప్రవాహం, దేశీ మార్కెట్లు సానుకూలంగా ఉండటం, క్రూడాయిల్ రేట్లు తగ్గుతుండటం తదితర అంశాలు రూపాయి పెరగడానికి దోహదపడినట్లు ఫారెక్స్ ట్రేడర్లు తెలిపారు. ఇంటర్‌బ్యాంక్ ఫారెక్స్ మార్కెట్లో బుధవారం దేశీ కరెన్సీ ట్రేడింగ్ 83.02 వద్ద ప్రారంభమైంది. 82.68–83.02 మధ్య తిరుగాడింది. మంగళవారం నాడు రూపాయి ఆల్‌టైమ్ కనిష్ట స్థాయిల నుంచి కోలుకుని 14 పైసలు లాభంతో 82.99 వద్ద ముగిసిన సంగతి తెలిసిందే.

అదానీ గ్రూప్ లాభాల స్పీడ్

క్యూ1లో 42 శాతం వృద్ధి



న్యూఢిల్లీ: బిలియనీర్ గౌతమ్ అదానీ గ్రూప్ కంపెనీలు ఈ ఆర్థిక సంవత్సరం(2023–24) తొలి త్రైమాసికంలో ఆకర్షణీయ ఫలితాలు సాధించాయి. గ్రూప్‌లోని 10 లిస్టెడ్ కంపెనీలు ఏప్రిల్–జూన్(క్యూ1)లో ఉమ్మడిగా రూ. 23,532 కోట్ల నిర్వహణ లాభం(ఇబిటా) ఆర్జించాయి. గ్రూప్ చరిత్రలోనే ఇది అత్యధికం కాగా.. గతేడాది(2022–23) క్యూ1తో పోలిస్తే ఇది 42 శాతం వృద్ధి. ఇక 2018–19లో గ్రూప్ ఆర్జించిన పూర్తి ఇబిటా రూ. 24,780 కోట్లకు దాదాపు సమానమని అదానీ గ్రూప్ పేర్కొంది. డైవర్సిఫైడ్ కార్యకలాపాలు కలిగిన గ్రూప్‌లో అదానీ ఎంటర్‌ప్రైజెస్, అదానీ పోర్ట్స్, అదానీ గ్రీన్ ఎనర్జీ, అదానీ పవర్, అదానీ ఎనర్జీ సొల్యూషన్స్, అదానీ టోటల్ గ్యాస్ తదితరాలున్నాయి. వీటి రూ. 42,115 కోట్ల నగదు నిల్వలను పరిగణించాక రూ. 18,690 కోట్ల నికర రుణ భారాన్ని కలిగి ఉన్నాయి.

భవిత

విద్య, ఉద్యోగ సమాచారం

కృష్ణా జిల్లాలో ఈ-డిస్ట్రిక్ట్ మేనేజర్ పోస్టులు

కృష్ణా జిల్లా మచిలీపట్నంలోని కలెక్టర్ కార్యాలయం.. కాంట్రాక్ట్ ప్రాతిపదికన ఈ–డిస్ట్రిక్ట్ మేనేజర్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 01
» **అర్హత:** బీసీఏ, బీఎస్సీ, బీఈ/బీటెక్, పీజీ ఉత్తీర్ణతతోపాటు ఇంగ్లిష్ కమ్యూనికేషన్ స్కిల్స్ కలిగి ఉండాలి.
» **వయసు:** 01.07.2023 నాటికి 21 నుంచి 35 ఏళ్ల మధ్య ఉండాలి.
» **వేతనం:** నెలకు రూ.22,500 చెల్లిస్తారు
» **పని ప్రదేశం:**కలెక్టరేట్,మచిలీపట్నం,కృష్ణా జిల్లా
» **ఎంపిక విధానం:** రాతపరీక్ష, ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపికచేస్తారు.
» **దరఖాస్తు విధానం:** ఆఫ్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి. దరఖాస్తులను కలెక్టరేట్, మచిలీపట్నం,కృష్ణా జిల్లా చిరునామాకు పంపించాలి.
» **దరఖాస్తులకు చివరితేది:** 26.08.2023.
» **వెబ్‌సైట్:** krishna.ap.gov.in

జీజీహెచ్ ఒంగోలులో వివిధ ఉద్యోగాలు

ఒంగోలులోని గవర్నమెంట్ జనరల్ హాస్పిటల్, డి-అడిక్షన్ సెంటర్ కాంట్రాక్ట్ ప్రాతిపదికన పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 03
» **పోస్టుల వివరాలు:** సైకియాట్రిస్ట్/ఎంబీబీఎస్ డాక్టర్-01, వార్డ్ బాయ్స్-01, కౌన్సిలర్-01.
» **అర్హత:** పోస్టును అనుసరించి ఎంబీబీఎస్, ఎనిమిదో తరగతి, డిగ్రీతోపాటు పని అనుభవం ఉండాలి.
» **వేతనం:** నెలకు సైకియాట్రిస్ట్‌కు రూ.60,000, వార్డు బాయ్స్‌కు రూ.13,000, కౌన్సిలర్‌కు రూ.17,500. **వయసు:** 18 నుంచి 42 ఏళ్ల మధ్య ఉండాలి.
» **దరఖాస్తు విధానం:** ఆఫ్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.దరఖాస్తును సూపరింటెండెంట్, జీజీహెచ్,ఒంగోలు చిరునామకు పంపించాలి.
» **దరఖాస్తులకు చివరితేది:** 28.08.2023.
» **వెబ్‌సైట్:** prakasam.ap.gov.in

శ్రీకాకుళం జిల్లాలో పీపీఎం కోఆర్డినేటర్ పోస్టులు

శ్రీకాకుళం జిల్లా టీబీ కంట్రోల్ ఆఫీస్.. కాంట్రాక్ట్ ప్రాతిపదికన పీపీఎం కోఆర్డినేటర్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 01
» **అర్హత:**పీజీతోపాటు సంబంధిత రంగంలో ఏడాది పని అనుభవం ఉండాలి. టూ వీలర్ డ్రైవింగ్ లైసెన్స్, ద్విచక్ర వాహనాన్ని నడపగలగాలి.
» **వేతనం:** నెలకు రూ.28,980.
» **దరఖాస్తు విధానం:** ఆఫ్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి. దరఖాస్తును టీబీ కంట్రోల్ ఆఫీస్, రూమ్ నెం.24,హాస్పిటల్(జీజీహెచ్), బలగ, శ్రీకాకుళం చిరునామకు పంపించాలి.
» **దరఖాస్తులకు చివరితేది:** 28.08.2023.
» **వెబ్‌సైట్:** srikakulam.ap.gov.in

పశ్చిమ గోదావరి జిల్లాలో ఈ-డిస్ట్రిక్ట్ మేనేజర్ పోస్టులు

పశ్చిమ గోదావరి జిల్లా భీమవరంలోని కలెక్టర్ కార్యాలయం..కాంట్రాక్ట్ ప్రాతిపదికన ఈ–డిస్ట్రిక్ట్ మేనేజర్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 02
» **అర్హత:** బీసీఏ, బీఎస్సీ, బీఈ/బీటెక్, పీజీ ఉత్తీర్ణతతోపాటు ఇంగ్లిష్ కమ్యూనికేషన్ స్కిల్స్ కలిగి ఉండాలి. » **వయసు:** 01.07.2022 నాటికి 21 నుంచి 35 ఏళ్ల మధ్య ఉండాలి.
» **వేతనం:** నెలకు రూ.22,500 చెల్లిస్తారు.
» **పని ప్రదేశం:** కలెక్టరేట్(పశ్చిమ గోదావరి జిల్లా, భీమవరం), రెవెన్యూ డివిజనల్ కార్యాలయం(భీమవరం డివిజన్).
» **ఎంపిక విధానం:** రాతపరీక్ష, ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపికచేస్తారు.
» **దరఖాస్తు విధానం:** ఆఫ్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి. దరఖాస్తును జిల్లా రెవెన్యూ అధికారి, కలెక్టరేట్, పశ్చిమ గోదావరి, భీమవరం చిరునామకు పంపించాలి.
» **దరఖాస్తులకు చివరితేది:** 25.08.2023.
» **వెబ్‌సైట్:** westgodavari.ap.gov.in

స్పైసెస్ బోర్డ్, కొచ్చిన్‌లో 15 ఉద్యోగాలు

కొచ్చిన్‌లోని స్పైసెస్ బోర్డ్.. వివిధ ఉద్యోగాల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 15
» **పోస్టుల వివరాలు:** ఎగ్జిక్యూటివ్, టెక్నికల్ ఆఫీసర్.
» **విభాగాలు:** మార్కెటింగ్, డెవలప్‌మెంట్.
» **అర్హత:** పోస్టును అనుసరించి సంబంధిత స్పెషలైజేషన్‌లో ఎంబీఏ/ఎంఏ ఉత్తీర్ణులవ్వాలి. కనీసం రెండేళ్ల పని అనుభవం ఉండాలి. **వయసు:** 40 ఏళ్లు ఉండాలి.
» **వేతనం:** నెలకు రూ.30,000 నుంచి రూ.35,000 చెల్లిస్తారు.
» **ఎంపిక విధానం:** రాతపరీక్ష/ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపికచేస్తారు.
» **ఇంటర్వ్యూ వేదిక:** స్పైసెస్ బోర్డ్(మినిస్ట్రీ ఆఫ్ కామర్స్–ఇండస్ట్రీ,గవర్నమెంట్ ఆఫ్ ఇండియా),సుగంధభవన్,ఎన్.హెచ్.బైపాస్,పాలరివట్టమ్.పీఓ,కొచ్చి–682025,కేరళ,ఇండియా.
» **దరఖాస్తు విధానం:** ఈమెయిల్, ఆఫ్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి. ది సెక్రటరీ, స్పైసెస్ బోర్డ్, కొచ్చి.
» **ఈమెయిల్:** hrd.sbker@gov.i
» **దరఖాస్తులకు చివరితేది:** 09.09.2023.
» **వెబ్‌సైట్:** www.indianspices.com

ఎయిమ్స్‌లో.. నర్సింగ్ ఆఫీసర్



నర్సింగ్ కోర్సులు పూర్తి చేసుకున్న అభ్యర్థులకు గుడ్ న్యూస్! ప్రతిష్టాత్మక వైద్య సంస్థల్లో నర్సింగ్ ఆఫీసర్స్‌గా కొలువుదీరే అవకాశం స్వాగతం పలుకుతోంది! దేశవ్యాప్తంగా ఉన్న 18 ఎయిమ్స్‌లో మూడు వేలకుపైగా నర్సింగ్ ఆఫీసర్ పోస్టుల భర్తీకి ఇటీవల నోటిఫికేషన్ విడుదలైంది. ప్రవేశ ప్రక్రియలో రాణిస్తే.. ఆకర్షణీయ వేతనంతోపాటు ఉజ్వల కెరీర్ సొంతమవుతుంది. ఈ నేపథ్యంలో.. ఎయిమ్స్ నర్సింగ్ ఆఫీసర్ పోస్ట్‌ల వివరాలు, ఎంపిక విధానం, కెరీర్ స్కోప్ తదితర వివరాలు..

» మూడు వేలకుపైగా నర్సింగ్ ఆఫీసర్ పోస్టుల భర్తీ!
» నోటిఫికేషన్ విడుదల చేసిన ఎయిమ్స్
» ఎన్ఓఆర్‌సీఈటీలో ప్రతిభతో ఎంపిక

ఎయిమ్స్ నర్సింగ్ ఆఫీసర్ రిక్రూట్‌మెంట్ ప్రక్రియ ద్వారా దేశవ్యాప్తంగా ఉన్న 18 ఎయిమ్స్ క్యాంపస్‌లలో నర్సింగ్ ఆఫీసర్ పోస్ట్‌లను భర్తీ చేయనున్నారు. మూడు వేలకు పైగా పోస్ట్‌లు అందుబాటులో ఉన్నట్లు తెలుస్తోంది. తెలుగు రాష్ట్రాలకు సంబంధించి ఎయిమ్స్–మంగళగిరి, ఎయిమ్స్–బీబీనగర్‌లలోనూ ఖాళీలు ఉంటాయి. జాతీయ స్థాయి పరీక్షలో మెరిట్ ఆధారంగా అభ్యర్థుల ఎంపిక జరుగుతుంది.

అర్హతలు

- బీఎస్సీ నర్సింగ్/బీఎస్సీ నర్సింగ్ ఆనర్స్ ఉత్తీర్ణత ఉండాలి. లేదా పోస్ట్ బేసిక్ బీఎస్సీ నర్సింగ్ ఉత్తీర్ణులవ్వాలి(లేదా) జనరల్ నర్సింగ్ అండ్ మిడ్‌వైఫరీలో డిప్లొమా ఉత్తీర్ణులవ్వాలి. దీంతోపాటు 50 పడకల ఆసుపత్రిలో కనీసం రెండేళ్ల పని అనుభవం తప్పనిసరి.
- విద్యార్హతలతోపాటు రాష్ట్ర/జాతీయ నర్సింగ్ కౌన్సిల్స్‌లో నర్సులు లేదా మిడ్ వైఫ్‌లుగా నమోదు చేసుకుని ఉండాలి.
- **వయసు:** ఆగస్టు 25, 2023 నాటికి 18 –30 ఏళ్ల మధ్య ఉండాలి. ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు అయిదేళ్లు, ఓబీసీ అభ్యర్థులకు మూడేళ్లు, పీడబ్ల్యూడీ అభ్యర్థులకు పదేళ్లు చొప్పున గరిష్ట వయో పరిమితిలో సడలింపు లభిస్తుంది.

ఎన్ఓఆర్‌సీఈటీ

ఎయిమ్స్ క్యాంపస్‌లలోని నర్సింగ్ ఆఫీసర్ పోస్ట్‌ల భర్తీకి జాతీయ స్థాయిలో నర్సింగ్ ఆఫీసర్ రిక్రూట్‌మెంట్ కామన్ ఎలిజిబిలిటీ టెస్ట్ (ఎన్ఓఆర్‌సీఈటీ) నిర్వహిస్తారు. ఈ పరీక్షలో ప్రతిభ ఆధారంగా నియామకాలు ఖరారు చేస్తారు. ఎన్ఓఆర్‌సీఈటీ.. ప్రిలిమ్స్, మెయిన్స్ అనే రెండు దశలుగా ఉంటుంది.

100 మార్కులకు ప్రిలిమ్స్

ఎంపిక ప్రక్రియలో తొలి దశ ప్రిలిమ్స్‌ను 100 ప్రశ్నలు–100 మార్కులకు నిర్వహిస్తారు. వీటిలో 20 ప్రశ్నలు జనరల్ నాలెడ్జ్ అండ్ ఆప్టిట్యూడ్ నుంచి, మిగిలిన 80 ప్రశ్నలను నర్సింగ్ కోర్సులోని సబ్జెక్ట్‌ల నుంచి అడుగుతారు. పరీక్ష పూర్తిగా ఆన్‌లైన్ విధానంలోనే ఉంటుంది. ప్రతి తప్పు సమాధానానికి 1/3వ వంతు మార్కును నెగెటివ్ మార్కుగా పరిగణిస్తారు. పరీక్షకు కేటాయించిన సమయం గంటన్నర.

రెండో దశ మెయిన్స్

మొదటి దశ ప్రిలిమ్స్‌లో చూపిన ప్రతిభ ఆధారంగా ఒక్కో పోస్ట్‌కు అయిదుగురిని చొప్పున(1:5 నిష్పత్తి) రెండో దశ మెయిన్ ఎగ్జామ్‌కు ఎంపిక చేస్తారు.అభ్యర్థులు ప్రిలిమ్స్‌లో తప్పనిసరిగా కనీస అర్హత మార్కులు సాధించాలనే నిబంధన విధించారు.జనరల్, ఈడబ్ల్యూఎస్ అభ్యర్థులు 50 పర్సంటైల్; ఓబీసీ, ఎస్సీ, ఎస్టీ, పీడబ్ల్యూడీ అభ్యర్థులు 40 పర్సంటైల్‌ను సాధించాలి. ఈ కనీస అర్హత మార్కులు పొందిన వారినే మెయిన్స్ జాబితా రూపకల్పనకు పరిగణనలోకి తీసుకుంటారు.

మెయిన్స్.. సబ్జెక్ట్ పరీక్షగా

మెయిన్స్‌ను సబ్జెక్ట్ పరీక్షగా నిర్వహిస్తారు. మొత్తం 100 ప్రశ్నలు–100 మార్కులకు పరీక్ష ఉంటుంది. ఇందులో నర్సింగ్ కోర్సు సబ్జెక్ట్‌లోని అంశాల నుంచి ప్రశ్నలు అడుగుతారు. కేస్ ఆధారిత ప్రశ్నలు కూడా ఉంటాయి. మెయిన్స్ పరీక్ష కూడా ఆబ్జెక్టివ్ విధానంలోనే ఉంటుంది. 1/3 వంతు మార్కు చొప్పున నెగెటివ్ మార్కింగ్ నిబంధన ఉంది. పరీక్షకు లభించే సమయం గంటన్నర.

మెయిన్ ఆధారంగా మెరిట్ లిస్ట్

మెయిన్ పరీక్షలో చూపిన ప్రతిభ ఆధారంగా ఫైనల్ మెరిట్ లిస్ట్ రూపొందిస్తారు. ఈ జాబితాలో నిలిచిన వారికి ఎయిమ్స్ క్యాంపస్‌లతోపాటు ఎన్ఐటీఆర్‌డీ, జాతీయ స్థాయిలో ఇతర వైద్య విజ్ఞాన సంస్థల్లోని నర్సింగ్ ఆఫీసర్ పోస్ట్‌లకు దరఖాస్తు చేసుకునే అవకాశం లభిస్తుంది. అభ్యర్థులు దరఖాస్తు సమయంలో తమకు ఆసక్తి ఉన్న ఎయిమ్స్ క్యాంపస్‌లను ప్రాధాన్యత క్రమంలో పేర్కొనాల్సి ఉంటుంది. దానికి అనుగుణంగా ఫైనల్ మెరిట్ లిస్ట్‌లో నిలిచిన వారికి నియామకాలు ఖరారు చేస్తారు.

గ్రూప్-బి హోదాలో కొలువు

ఎన్ఓఆర్‌సీటీలో ఫైనల్ మెరిట్ లిస్ట్‌లో చోటు సొంతం చేసుకుని.. నియామకం ఖరారు చేసుకున్న వారికి ఎయిమ్స్ క్యాంపస్‌లలో గ్రూప్–బి హోదాలో నర్సింగ్ ఆఫీసర్‌గా కెరీర్ ప్రారంభమవుతుంది. పే లెవల్–7 మేరకు రూ.9,300 –రూ. 34,800 శ్రేణిలో ప్రారంభ వేతనం ఉంటుంది. 2019 నుంచి ఈ విధానాన్ని అమలు చేస్తున్నారు.

80 శాతం మహిళలకు

ఎయిమ్స్ నర్సింగ్ ఆఫీసర్స్ రిక్రూట్‌మెంట్‌లో మహిళలకు అధిక ప్రాధాన్యం ఇస్తున్నారు. మొత్తం ఖాళీల్లో 80 శాతం పోస్ట్‌లను మహిళలకు, మిగతా 20శాతం పోస్ట్‌లను పురుషులకు కేటాయిస్తున్నారు.

చీఫ్ నర్సింగ్ ఆఫీసర్ హోదాకు

నర్సింగ్ ఆఫీసర్ కొలువులో చేరిన వారు భవిష్యత్తులో చీఫ్ నర్సింగ్ ఆఫీసర్ స్థాయికి చేరుకునే అవకాశం ఉంది. సిస్టర్ గ్రేడ్–1, సిస్టర్ గ్రేడ్–2, అసిస్టెంట్ నర్సింగ్ సూపరింటెండెంట్, డిప్యూటీ నర్సింగ్ సూపరింటెండెంట్,నర్సింగ్ సూపరింటెండెంట్, చీఫ్ నర్సింగ్ ఆఫీసర్ పోస్ట్‌లకు పదోన్నతులు పొందొచ్చు. ఒక్కో హోదాలో కనీసం ఆరేళ్లు పని చేసిన తర్వాత పదోన్నతులకు పరిగణనలోకి తీసుకుంటారు.

ముఖ్య సమాచారం

- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి
- **ఆన్‌లైన్ దరఖాస్తు చివరి తేదీ:** 25.08.2023
- **ఆన్‌లైన్ దరఖాస్తు సవరణ అవకాశం:** ఆగస్ట్ 26–28, 2023
- **ఎన్ఓఆర్‌సీఈటీ ప్రిలిమినరీ పరీక్ష తేదీ:** సెప్టెంబర్ 17, 2023
- **ఎన్ఓఆర్‌సీఈటీ మెయిన్ ఎగ్జామ్ తేదీ:** అక్టోబర్ 7, 2023
- **తెలుగు రాష్ట్రాల్లో పరీక్ష కేంద్రాలు:** హైదరాబాద్, గుంటూరు, కర్నూలు, విశాఖపట్నం, తిరుపతి, విజయవాడ.
- **వివరాలకు వెబ్‌సైట్:** www.aiimsexams.ac.in
- **ఆన్‌లైన్ దరఖాస్తు వెబ్‌సైట్:** http://norcet5.aiimsexams.ac.in

విజయానికి అడుగులు ఇలా

జనరల్ నాలెడ్జ్ అండ్ ఆప్టిట్యూడ్

మొదటి దశ ప్రిలిమ్స్‌లో ఉండే ఈ విభాగంలోని 20ప్రశ్నలకు సరైన సమాధానాలు ఇచ్చేందుకు కరెంట్ అఫైర్స్, పాలిటీ, జాగ్రఫీ, ముఖ్య ప్రదేశాలు, సదస్సులు, సమావేశాలు, జనరల్ సైన్స్ అంశాలు, భారత చరిత్రలోని ముఖ్యాంశాలు, దేశాలు– రాజధానులు, రాజ్యాంగ వ్యవస్థపై దృష్టి పెట్టాలి. ఆప్టిట్యూడ్ విభాగంలో ప్రశ్నల కోసం నంబర్ సిస్టమ్, సింప్లిఫికేషన్, ప్రాబబిలిటీ, టైమ్ అండ్ డిస్టెన్స్, టైమ్ అండ్ వర్క్, రేషియోస్, పర్సంటేజెస్, బేసిక్ ఇంగ్లిష్ గ్రామర్ అంశాలపై పట్టు సాధించాలి.

సబ్జెక్ట్ ప్రశ్నలకు ఇలా

ప్రిలిమ్స్‌లో 80 మార్కులకు, మెయిన్స్‌లో 100 మార్కులకు ఉండే నర్సింగ్ సబ్జెక్ట్‌లకు సంబంధించిన ప్రశ్నలకు సరైన సమాధానాలు ఇచ్చేందుకు అభ్యర్థులు బ్యాచిలర్ స్థాయిలోని నర్సింగ్ సబ్జెక్ట్‌లను, వాటిలోని ముఖ్యమైన అంశాలను అవలోకనం చేసుకోవాలి. ప్రధానంగా డ్రగ్ స్టోరేజ్ మేనేజ్‌మెంట్, హ్యూమన్ అనాటమీ అండ్ ఫిజియాలజీ, మిడ్ వైఫరీ అండ్ గైనకాలజికల్ నర్సింగ్, హెల్త్ ఎడ్యుకేషన్ అండ్ ఫార్మసీ, హాస్పిటల్ అండ్ క్లినికల్ ఫార్మసీ, ఫండమెంటల్స్ ఆఫ్ నర్సింగ్, నర్సింగ్ మేనేజ్‌మెంట్, కమ్యూనిటీ హెల్త్ నర్సింగ్, మెడికల్ సర్జికల్స్ ఆఫ్ నర్సింగ్, మైక్రో బయాలజీ, బయో కెమిస్ట్రీ, సైకాలజీ, మెంటల్ హెల్త్, టాక్సికాలజీ, ఫస్ట్ ఎయిడ్ విధానం, కంప్యూటర్స్ ఇన్ నర్సింగ్, పిడియాట్రిక్ నర్సింగ్‌లకు సంబంధించి అన్ని అంశాలను క్షుణ్నంగా చదవాలి.

గార్గేయపురంలో వజ్రాల వేట



జాతరను తలపిస్తున్న గార్గేయపురం చెరువు ప్రాంతం

ఒక్క వజ్రం దొరికితే చాలు మనిషి జీవితమే మారిపోతుంది. అటువంటి వజ్రాల కోసం కర్నూలు జిల్లా కర్నూలు మండలం గార్గేయపురం ఎదుటనున్న కొండపై వేట తీవ్రంగా సాగుతోంది. ఒకరికి వజ్రం దొరకడంతో కర్నూలు నగరంతో పాటు జిల్లా నలుమూలల నుంచి ప్రజలు ఇక్కడికొచ్చి ఉదయం నుంచి సాయంత్రం వరకు తమ అదృష్టాన్ని పరీక్షించుకుంటున్నారు. కుటుంబ సభ్యులంతా భోజనాలతో సహా చేరుకొని అణువణువూ శోధిస్తున్నారు. దొరికిన ప్రతి రాయిని భద్రపరుస్తున్నారు. ఇదే సమయంలో కొనుగోలుదారులు కూడా ఇక్కడే మకాం వేశారు. లభించిన రాళ్లను ఆధునిక యంత్రాలతో అక్కడికక్కడే పరీక్షించి వజ్రమా, కాదా అనే విషయాన్ని తేల్చేస్తున్నారు. గత పది రోజులుగా ఈ ప్రాంతం జాతరను తలపిస్తోంది.

– సాక్షి ఫొటోగ్రాఫర్, కర్నూలు



వజ్రాలను పోలిన రాళ్లు

15 రాష్ట్రాల్లోనే 90 శాతం డిజిటల్ చెల్లింపులు




మొదటి స్థానంలో ఆంధ్రప్రదేశ్ ● తర్వాత స్థానాల్లో మహారాష్ట్ర, తెలంగాణ, కర్ణాటక

ఈ నాలుగు రాష్ట్రాల వాటా 8-12 శాతం

- యూపీ, రాజస్థాన్, తమిళనాడు, బిహార్, పశ్చిమ బెంగాల్ వాటా 5–8 శాతం
- యూపీఐ చెల్లింపుల పెరుగుదలతో ఏటీఎంల్లో తగ్గిన నగదు ఉపసంహరణలు
- ఎస్‌బీఐ రీసెర్చ్ నివేదిక వెల్లడి

సాక్షి, అమరావతి: డిజిటల్ చెల్లింపుల విలువ, పరిమాణంలో 90 శాతం వాటా దేశంలో టాప్ 15 రాష్ట్రాలదేనని స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బీఐ) రీసెర్చ్ నివేదిక స్పష్టం చేసింది. ఈ రాష్ట్రాల్లో ఆంధ్రప్రదేశ్ మొదటి స్థానంలో ఉండగా మహారాష్ట్ర, తెలంగాణ, కర్ణాటక తర్వాత స్థానాల్లో ఉన్నాయని పేర్కొంది. ఈ రాష్ట్రాల్లో సగటు డిజిటల్ చెల్లింపుల పరిమాణం రూ.2,000 నుంచి రూ.2,200 వరకు ఉందని తెలిపింది. ఏపీ, మహారాష్ట్ర, తెలంగాణ, కర్ణాటక తర్వాత అత్యధికంగా డిజిటల్ చెల్లింపులు జరిగిన రాష్ట్రాల్లో ఉత్తరప్రదేశ్, రాజస్థాన్, తమిళనాడు, బిహార్, పశ్చిమ బెంగాల్ ఉన్నాయి. ఈ రాష్ట్రాల్లో సగటు డిజిటల్ చెల్లింపుల పరిమాణం రూ.1,800 నుంచి రూ.2,000 వరకు ఉంది. వీటి తర్వాత ఒడిశా, కేరళ, మధ్యప్రదేశ్, గుజరాత్, అసోం, హరియాణాల్లో డిజిటల్ చెల్లింపుల పరిమాణం రూ.1,600 నుంచి రూ.1,800 వరకు ఉన్నట్లు నివేదిక వెల్లడించింది.

టాప్-15 రాష్ట్రాల్లో యూపీఐ చెల్లింపుల విలువ, పరిమాణం, సగటు చెల్లింపుల పరిమాణం..



767 శాతానికి పెరిగిన డిజిటల్ చెల్లింపులు..



డిజిటల్ లావాదేవీలకు సంబంధించి 2016లో ప్రారంభించిన యూనిఫైడ్ పేమెంట్ ఇంటర్‌ఫేస్ (యూపీఐ) దేశంలో అత్యంత ప్రజాదరణ పొందిందని ఎస్‌బీఐ నివేదిక తెలిపింది. మొత్తం డిజిటల్ చెల్లింపులు 2016లో దేశ జీడీపీలో 668 శాతం ఉండగా 2023 నాటికి 767 శాతానికి పెరిగాయి. రిటైల్ డిజిటల్ చెల్లింపులు (ఆర్‌టీజీఎస్ మినహా) 2016లో దేశ జీడీపీలో 129 శాతం ఉండగా 2023లో 242 శాతానికి పెరిగాయి. దేశంలో వ్యక్తి నుంచి మరో వ్యక్తికి, వ్యక్తి నుంచి వ్యాపారికి మొత్తం డిజిటల్ చెల్లింపుల్లో యూపీఐ విలువ 73 శాతం ఉంది. ఈ లావాదేవీల్లో దేశం కొత్త మైలురాళ్లను అందుకుంది. యూపీఐ లావాదేవీల పరిమాణం 2017లో 1.8 కోట్ల నుంచి 2023 నాటికి 8,375 కోట్లకు పెరిగింది. ఇదే సమయంలో యూపీఐ లావాదేవీల విలువ రూ.6,947 కోట్ల నుంచి రూ.139 లక్షల కోట్లకు చేరింది. అంటే.. 2004 రెట్లు పెరిగింది.


డిజిటల్ చెల్లింపుల్లో ఏపీ వాటా 8-12 శాతం

డిజిటల్ చెల్లింపుల్లో దేశంలోనే మొదటి స్థానంలో ఉన్న ఆంధ్రప్రదేశ్ వాటా 8–12 శాతంగా ఉందని నివేదిక పేర్కొంది. దేశంలో జిల్లాల వారీగా యూపీఐ డిజిటల్ చెల్లింపుల పరిమాణం, విలువల్లో టాప్ 100 జిల్లాలే 45 శాతం వాటా కలిగి ఉన్నట్లు తేలింది. దేశ జీడీపీలో 2017లో ఏటీఎంల నుంచి 15.4 శాతం నగదు ఉపసంహరణలు జరగ్గా.. 2023లో 12.1 శాతానికి ఇవి తగ్గిపోయాయి. గతంలో ఒక వ్యక్తి ఏడాదిలో ఏటీఎంలకు 16 సార్లు వెళ్తే ఇప్పుడు 8 సార్లుకు పడిపోయింది.

గ్రామీణ, సెమీ అర్బన్ ప్రాంతాల్లో 60 శాతం వాటా..

రూ.2 వేల నోట్ల ఉపసంహరణ యూపీఐ చెల్లింపులపై ఎటువంటి ప్రభావం చూపలేదని నివేదిక విశ్లేషించింది. ఈ ఏడాది ఏప్రిల్‌లో 414 బ్యాంకుల్లో యూపీఐ ద్వారా 890 కోట్ల ఆర్థిక లావాదేవీలు జరిగాయి. వీటి మొత్తం విలువ రూ.14.1 లక్షల కోట్లుగా ఉందని నివేదిక తెలిపింది. దీన్నిబట్టి నగదు రహిత ఆర్థిక వ్యవస్థ దిశగా దేశం ముందుకు వెళ్తున్నట్టు స్పష్టమవుతోందని పేర్కొంది. డిజిటల్ చెల్లింపులు కేవలం మెట్రో నగరాలకే పరిమితం కాలేదని, గ్రామీణ, సెమీ అర్బన్ ప్రాంతాలు కూడా ఆశ్చర్యకరంగా 60 శాతం వాటాను కలిగి ఉన్నట్లు వెల్లడించింది.

దేశ జీడీపీలో ఏటీఎంల నుంచి నగదు ఉపసంహరణ ఇలా..



ప్రకృతి, సేంద్రీయ ఉత్పత్తులను సేకరిస్తాం

అమూల్ ఆర్గానిక్స్ పేరిట మార్కెటింగ్

- ఏపీ నుంచి ఎగుమతి చేసేందుకు కృషి
- ఏపీ ప్రభుత్వంతో త్వరలో అవగాహనా ఒప్పందం
- ఉన్నతాధికారుల భేటీలో అమూల్ ఆర్గానిక్స్ బిజినెస్ హెడ్ నిమిత్ దోషి

సాక్షి, అమరావతి: ఆంధ్రప్రదేశ్‌లో సేంద్రీయ, ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులను మార్కెటింగ్ చేసేందుకు అమూల్ సంస్థ సిద్ధంగా ఉందని అమూల్ ఆర్గానిక్స్ బిజినెస్ హెడ్ నిమిత్ దోషి వెల్లడించారు. ఆర్గానిక్ సర్టిఫికేషన్ కలిగిన రైతుల నుంచి మార్కెట్ ధరపై నిర్దేశించిన ప్రీమియం ధరతో వ్యవసాయ ఉత్పత్తులను సేకరిస్తూ.. వారికి తగిన గిట్టుబాటు ధర లభించేలా కృషి చేస్తామని చెప్పారు. వ్యవసాయ అనుబంధశాఖల ఉన్నతాధికారులతో బుధవారం సచివాలయంలో అమూల్ ప్రతినిధి బృందం భేటీ అయ్యింది. అమూల్ ఆర్గానిక్స్ ద్వారా ప్రకృతి, సేంద్రీయ ఉత్పత్తులను మార్కెటింగ్ చేసేందుకు ఉన్న అవకాశాలపై విస్తృత స్థాయిలో చర్చించారు. నిమిత్ దోషి మాట్లాడుతూ ఈ ప్రాజెక్టు కోసం ఐదేళ్ల ప్రణాళికను రూపొందిస్తున్నామన్నారు. త్వరలో రాష్ట్ర ప్రభుత్వంతో ఒప్పందం చేసుకుంటామని తెలిపారు. తొలి దశలో ధాన్యం, శనగలు, కందులు, కందిపప్పు, రాజ్మా, శనగపిండి తదితర ఉత్పత్తులను ప్రీమియం ధరలకు రైతుల నుంచి సేకరించి, ప్రాసెస్ చేసి అమూల్ ఆర్గానిక్స్ పేరిట మార్కెట్‌లోకి తీసుకొస్తామన్నారు. భవిష్యత్‌లో విదేశాలకు ఎగుమతి చేస్తామన్నారు. నేషనల్ కో–ఆపరేటివ్ ఆర్గానిక్ లిమిటెడ్‌లో చేరితే విస్తృతస్థాయి మార్కెటింగ్ అవకాశాలను అందిపుచ్చుకోవచ్చునన్నారు. రైతు సాధికార సంస్థ ఎగ్జిక్యూటివ్ వైస్ చైర్మన్ టి.విజయకుమార్ మాట్లాడుతూ రాష్ట్రంలో 8.5 లక్షల మంది రైతులు ప్రకృతి వ్యవసాయం చేస్తున్నారని వీరు పండించిన ఉత్పత్తులకు సర్టిఫికేషన్ జారీ ప్రక్రియను సరళీకృతం చేయాల్సిన అవసరం ఉందన్నారు. సెర్ప్ సీఈవో ఎండీ ఇంతియాజ్ మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయం చేస్తున్న వారిలో మహిళలే అత్యధికమని తెలిపారు. తొలి దశలో ఆర్గానిక్ సర్టిఫికెట్ కలిగిన గిరిజన ప్రాంతాలలోని రైతుల నుంచి రాజ్మా సేకరించాలని సూచించారు. మార్క్‌ఫెడ్ ఎండీ రాహుల్ పాండే, రైతు బజార్ సీఈవో నందకిషోర్, నాబార్డు ఏజీఎం ఎం.చావ్‌సాల్కర్ పాల్గొన్నారు.



వ్యవసాయ అనుబంధ శాఖల ఉన్నతాధికారులతో అమూల్ ఆర్గానిక్స్ ప్రతినిధుల భేటీ

నేటితో ముగియనున్న వెబ్ ఆప్షన్‌ల నమోదు గడువు

సాక్షి, అమరావతి: వైద్య విద్య పీజీ డెంటల్ కోర్సుల్లో 2023–24 విద్యా సంవత్సరానికి కన్వీనర్ కోటా సీట్ల భర్తీలో భాగంగా వెబ్ ఆప్షన్‌ల నమోదుకు డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్య విశ్వవిద్యాలయం నోటిఫికేషన్ జారీ చేసింది. అభ్యర్థులకు గురువారం రాత్రి 10 గంటలకు గడువు ముగియనుంది. అభ్యర్థులు https:// mdscq. ysruhs. com/ వెబ్‌సైట్‌లో ఆప్షన్‌లు నమోదు చేసుకోవాల్సి ఉంటుంది. ఆప్షన్‌ల నమోదులో సాంకేతిక సమస్యలు తలెత్తినట్టైతే అభ్యర్థులు 74165 63063, 74162 53073, 90634 00829 నంబర్లలో సంప్రదించాల్సి ఉంది.

Published and Printed by V. Murali on behalf of Jagati Publications Limited, Published at Survey no 481 phase-2, Jawahar Auto Nagar, Vijaywada, NTR District - 520 007 (AP) and Printed at Jagati Publications Limited, Survey no 481 phase-2, Jawahar Auto Nagar, Vijaywada, NTR District - 520 007 (AP)., Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) Phone No. 0863-2512581 Fax: No. 0863-2512584. RNI Reg No. APTEL/2008/23794.

సాక్షి విజయవాడ సిటీ

ఎన్టీఆర్ జిల్లా

గురువారం । 24 । ఆగస్టు । 2023



కార్తికేయుని సేవలో...

మోపిదేవి: శ్రీవల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామిని దేవదాయ ధర్మాదాయ శాఖ కమిషనర్ శ్రీరామ సత్యనారాయణ బుధవారం దర్శించుకున్నారు.



నిత్యాన్నదానానికి విరాళాలు

దుర్గమ్మ సన్నిధిలో నిత్యాన్నదానానికి కన్యాకుమారి, వెంకటలక్ష్మి,నాగమణి రూ.లక్ష చొప్పున విరాళాలు అందచేశారు.

-IIలో▸



కిటకిటలాడిన పూల మార్కెట్

వన్‌టౌన్: శ్రావణ శుక్రవారం వరలక్ష్మీ వ్రతాలు ఆచరించనున్న నేపథ్యంలో వన్‌టౌన్ సమీపంలోని పూలమార్కెట్ బుధవారం కొనుగోలుదారులతో కిటకిటలాడింది.

న్యూస్‌రీల్

సాదియాకు సత్కారం



తాడేపల్లిరూరల్: అంతర్జాతీయ స్థాయిలో పవర్ లిఫ్టింగ్ పోటీల్లో నాలుగు బంగారు పతకాలు సాధించిన వడ్డేశ్వరం కేఎల్‌యూ విద్యార్థిని షేక్ సాదియా భారత్‌కు తిరిగి వచ్చిన సందర్భంగా యూనివర్సిటీ విద్యార్థులు, అధ్యాపకులు బుధవారం ఆమెకు ఘనస్వాగతం పలికారు. ఎంబీఏ విభాగాధిపతి డాక్టర్ కె.హేమదివ్య ఆధ్వర్యంలో గన్నవరం విమానాశ్రయం వద్ద సాదియాకు ఘనస్వాగతం పలికి, అనంతరం యూనివర్సిటీలో ఆమెను ఘనంగా సత్కరించి మెమెంటోను అందజేసినట్లు వర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ కె.సుబ్బారావు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యూఏఈలోని షార్జా వేదికగా జరిగిన ప్రథమ ఏషియన్ యూనివర్సిటీస్ పవర్ లిఫ్టింగ్ పోటీల్లో తమ యూనివర్సిటీలో ఎంబీఏ ప్రథమ సంవత్సరం చదువుతున్న షేక్ సాదియా అల్మాస్ నాలుగు బంగారు పతకాలతోపాటు స్ట్రాంగ్ ఉమెన్ టైటిల్‌ను కైవసం చేసుకోవడంతో ఎంతో ఆనందంగా ఉందన్నారు. ఈ సందర్భంగా వర్సిటీ వైస్ చాన్సలర్ డాక్టర్ జి.పార్థసారథి వర్మ, ప్రొ.వైస్ చాన్సలర్లు డాక్టర్ ఏవీఎస్ ప్రసాద్, డాక్టర్ ఎస్.వెంకటరామ్, ఎంహెచ్ఎస్ డీన్ డాక్టర్ ఎం.కిషోర్ బాబు, విద్యార్థి సంక్షేమ విభాగాధిపతి డాక్టర్ సీహెచ్ హనుమంతరావు, సలహాదారు డాక్టర్ హబీబుల్లా ఖాన్, క్రీడల అసోసియేట్ డీన్ డాక్టర్ కె.హరికిషోర్, వ్యాయామ అధ్యాపకులు సాదియాను అభినందించారు.

ఇస్రో శాస్త్రవేత్తలకు కలెక్టర్ అభినందనలు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): భారత అంతరిక్ష పరిశోధన సంస్థ (ఇస్రో) ప్రయోగించిన చంద్రయాన్–3 విజయవంతం కావడం పట్ల జిల్లా కలెక్టర్ ఎస్.ఢిల్లీరావు ఇస్రో శాస్త్రవేత్తలకు అభినందనలు తెలిపారు. ఈ మేరకు ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. విక్రమ్ ల్యాండర్‌ను చంద్రుని దక్షిణ ధ్రువంపై సేఫ్‌గా దించి దేశ ప్రజల ఆకాంక్ష నెరవేర్చారన్నారు. చంద్రయాన్ విజయవంతంతో చరిత్ర సృష్టించిన దేశంగా భారత్ నిలిచిందని పేర్కొన్నారు . చంద్రుని దక్షిణ ధ్రువం పై అడుగు పెట్టిన తొలి దేశంగా మన దేశం రికార్డు దక్కించుకుందని తెలిపారు. భవిష్యత్తులో మరిన్ని ఆవిష్కరణలకు ఇస్రో నాంది పలకాలని కాంక్షిస్తూ జయహో భారత్.. సాహో ఇస్రో అంటూ తన సిబ్బంది కుటుంబ సభ్యులతో కలిసి కలెక్టర్ ఆనందాన్ని పంచుకున్నారు.

ఆకట్టుకున్న లేగదూడల ప్రదర్శన



ఉయ్యూరు: పశుగణాభివృద్ధిసంస్థ (గన్నవరం), పశుసంవర్ధకశాఖ ఆధ్వర్యంలో కాటూరు పశువైద్యశాలలో బుధవారం ఏర్పాటుచేసిన లేగదూడల ప్రదర్శన ఆకట్టుకుంది. వివిధ ప్రాంతాల నుంచి పశుపోషకులు 60 లేగదూడలను ప్రదర్శనకు తీసుకొచ్చారు. సంస్థ అదనపు సీఈఓ డాక్టర్ రజనీకుమారి సందర్శించి పశుపోషకులను అభినందించారు. కార్యక్రమంలో జిల్లా పశుసంవర్ధకశాఖ అధికారి డాక్టర్ దివాకర్, గుడ్లవల్లేరు డెప్యూటీ డైరెక్టర్ డాక్టర్ జగన్నాథరావు, ఏడీ డాక్టర్ రామశేఖర్, పశువైద్య సిబ్బంది పాల్గొన్నారు. ఈ సందర్భంగా పశుపోషకులకు మందులు పంపిణీ చేశారు.

8న సామూహిక వరలక్ష్మి వ్రతాలు

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): విజయవాడ ఇంద్రకీలాద్రిపైగల శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానంలో వచ్చే నెల 8వ తేదీన సామూహిక వరలక్ష్మి వ్రతాలను నిర్వహిస్తున్నట్లు ఆలయ ఈవో భ్రమరాంబ తెలిపారు. ఉచిత సామూహిక వరలక్ష్మీ వ్రతాలకు సెప్టెంబర్ 3 నుంచి మూడు రోజుల పాటు దరఖాస్తులు ఇస్తారని పేర్కొన్నారు. మూడు రోజుల పాటు సుమారు 500 దరఖాస్తులను భక్తులకు పంపిణీ చేస్తామన్నారు. సెప్టెంబర్ 8వ తేదీ ఉదయం 7 నుంచి 9 గంటల వరకు ప్రత్యేక ఆర్జిత సేవగా వరలక్ష్మీ వ్రతాన్ని నిర్వహిస్తామని, రూ.1,500 టికెట్‌పై భక్తులను ఈ సేవకు అనుమతిస్తామన్నారు. వ్రతం అనంతరం భక్తులను ప్రత్యేకంగా రూ.300 క్యూలైన్‌లో అమ్మవారి దర్శనానికి అనుమతిస్తారన్నారు. ఇక ఉచితంగా నిర్వహించే సామూహిక వరలక్ష్మీ వ్రతం ఉదయం 9.30 నుంచి 11.30 గంటల వరకు నిర్వహిస్తామన్నారు.



వన్‌టౌన్‌లోని హిందూ హైస్కూల్ విద్యార్థుల విజయోత్సాహం



విజయవాడ సత్యనారాయణపురంలో ర్యాలీ చేస్తున్న అజయ్ స్కూల్ విద్యార్థులు

అద్భుతం.. ఆనందం..

- చంద్రయాన్–3 విజయవంతంపై సర్వత్రా హర్షాతిరేకాలు
- ప్రత్యక్ష ప్రసారం ద్వారా వీక్షించిన ప్రజలు
- కేరింతలు కొట్టిన ఫైనం
- శాస్త్రవేత్తలకు అభినందనల వెల్లువ

భవానీపురం(విజయవాడపశ్చిమ): చంద్రయాన్–3 ప్రయోగంలో కీలక ఘట్టం ముగిసి విజయపథం వైపు పరుగులు పెడుతోంది. ప్రతిష్టాత్మక చంద్రయాన్–3 మిషన్‌లో భాగమైన ల్యాండర్ మాడ్యూల్ తన తుది గమ్యానికి చేరుకుంది. దీనిపై ప్రపంచవ్యాప్తంగా హర్షాతిరేకాలు వ్యక్తం అవుతున్నాయి. 'జయహో భారత్..జయహో ఇస్రో' అంటూ నినాదాలు మిన్నంటాయి. ముందుగా అనుకున్నట్లుగానే బుధవారం సాయంత్రం చంద్రుడి దక్షిణ ఉపరితలంపై ల్యాండింగ్ కావడాన్ని ప్రత్యక్ష ప్రసారం ద్వారా ఉత్కంఠగా వీక్షించిన ప్రజలు కేరింతలు కొట్టారు. శాస్త్ర, సాంకేతిక రంగాల్లో నవశకంగా, ఖగోళంలో భారత శాస్త్రవేత్తల అద్భుతంగా అభివర్ణిస్తున్నారు. దక్షిణ ధ్రువంలో అడుగుపెట్టిన తొలి దేశం భారత్ కావటం గర్వకారణమని వ్యాఖ్యానిస్తున్నారు. చరిత్ర సృష్టించిన ఇస్రో శాస్త్రవేత్తలను అభినందిస్తున్నారు.



పాయకాపురంలో ర్యాలీ చేస్తున్న పుచ్చలపల్లి సుందరయ్య మున్సిపల్ హైస్కూల్ విద్యార్థులు

భారత ఖ్యాతిని నిలిపిన ఇస్రో



చంద్రయాన్–3 చంద్రునిపై విజయవంతంగా దిగడంతో ఇస్రో శాస్త్రవేత్తలకు యావత్ భారత దేశం సెల్యూట్ కొడుతుంది. ఈ మహత్తర విజయం మన శాస్త్రవేత్తల నిర్విరామ కృషి, అంకిత భావానికి నిదర్శనం. రష్యాకు చెందిన లూనా కూడా ఇటీవల క్రాష్ అవ్వడంతో చంద్రయాన్–3 పరిస్థితి ఏమిటా అన్న ఆలోచనలో పడ్డారు. ల్యాండర్‌కు అమర్చిన రోబోటిక్ కాళ్ల సహాయంతోనే విక్రమ్ ల్యాండర్ బయటకొచ్చింది. సెన్సార్లు, కెమెరాలు, అధునాతన సాఫ్ట్‌వేర్ సహాయంతో విక్రమ్ ల్యాండర్ సరైన చోట ల్యాండ్ అయింది. ఖగోళంలో భారత శాస్త్రవేత్తల బృందం సరికొత్త చరిత్రను సృష్టించారు. భారత దేశ ఖ్యాతిని మరింత ఎత్తయిన శిఖరాలకు తీసుకువెళ్లారు.

– డాక్టర్ జయరామిరెడ్డి కొండ, సీఇఓ, సైన్స్ సిటీ ఆఫ్ ఏపీ

శాస్త్రవేత్తల సామర్థ్యానికి నిదర్శనం



ప్రతిష్టాత్మక చంద్రయాన్–3 ఒక యునిక్ ప్రోగ్రామ్. ప్రపంచంలోని అన్ని అగ్ర దేశాలు మన వైపు చూడటం భారత్‌కు గర్వకారణం . గతంలో ఒక సారి ఫెయిల్ అయిన తరువాత ఎందుకు అలా జరిగిందో తెలుసుకుని అన్ని జాగ్రత్తలు తీసుకుని ఇప్పుడు ప్రయోగించిన చంద్రయాన్–3 విజయవంతం కావడం శుభపరిణామం. చంద్రుడి దక్షిణ ధ్రువ ఉపరితలంపై అడుగు పెట్టిన 14 రోజులకు ఫొటోలుతో కూడిన సమాచారం వస్తుంది. ఇతర దేశాలకు దొరకని సమాచారం అందటం ఇస్రో శాస్త్రవేత్తల సామర్థ్యానికి నిదర్శనం. అంతరిక్షంలో మన సత్తా చూపిన కార్యక్రమం ఇది. ఇస్రో శాస్త్రవేత్తలకు శుభాకాంక్షలు.

– డాక్టర్ వై.అపర్ణ, ఆంధ్రప్రదేశ్ స్టేట్ కౌన్సిల్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ (అప్‌కాస్ట్) మెంబర్ సెక్రటరీ

వండర్‌ఫుల్ మిషన్



చంద్రుని దక్షిణ ధ్రువంపై ఇస్రో ద్వారా పంపిన చంద్రయాన్–3 వండర్‌ఫుల్ మిషన్. తొలుత ఉత్కంఠ రేపినా చివరికి సక్సెస్ కావడం ఇస్రో శాస్త్రవేత్తల అవిరళ కృషికి నిదర్శనం. చంద్రుడిపై నివాస యోగ్యత, నీటి లభ్యత, జీవరాశుల మనుగడకు సంబంధించిన సమాచారాన్ని ప్రపంచానికి తెలియజేయడంలో భారత్ ముందుంది. దీని తరువాత ఇస్రో శాస్త్రవేత్తలు తలపెట్టిన ప్లానెట్ (గ్రహాలు) మిషన్ కూడా విజయవంతం అవుతుందని ఆకాంక్షిస్తున్నాను. ఏది ఏమైనా చంద్రయాన్–3 అంతరిక్ష చరిత్రలో ఒక సరి కొత్త అధ్యాయం.

– జి. పాండురంగారావు, ఫిజిక్స్ లెక్చరర్, పీబీ సిద్ధార్థ కాలేజీ, విజయవాడ

వైజ్ఞానిక సాహస యాత్ర



వైజ్ఞానిక సాహస యాత్ర చంద్రయాన్–3 విజయంతో ప్రపంచ వైజ్ఞానిక సాంకేతిక రంగంలో భారత దేశం అతికీలకమైన భూమిక వహించబోతుంది. చంద్రమండల దక్షిణ ధ్రువంపైకి ఎటువంటి సాంకేతిక సమస్యలు లేకుండా అతి తక్కువ ఖర్చుతో అధునాతన సాంకేతిక పరికరాలతో చంద్రుడి దక్షిణ ధ్రువంపై దిగడం ద్వారా బలమైన ఆర్థిక వ్యవస్థగా అవతరించబోతున్నాం. ఈ విజయంతో యువత ఎక్కువగా ప్రభావితులై రాకెట్ టెక్నాలజీ, ఇంధన శాస్త్రాలు, సెన్సార్లు, శాటిలైట్ టెక్నాలజీలో ఎన్నో ఉపాధి అవకాశాలు పెరగబోతున్నాయి. శాస్త్రవేత్తల మేధో సంపత్తికి ప్రత్యక్ష నిదర్శనం ఈ చంద్రయాన్–3 అఖండ విజయం.

– ఉపద్రష్ట లక్ష్మణ సూరి, ఫిజిక్స్ లెక్చరర్, అకడమిక్ ప్యానల్ మెంబర్ అప్‌కాస్ట్

టంగుటూరి సేవలు ఎనలేనివి

ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఢిల్లీరావు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): ఆంధ్రరాష్ట్ర రాష్ట్ర తొలి ముఖ్యమంత్రిగా ఆంధ్ర కేసరి టంగుటూరి ప్రకాశం పంతులు అందించిన సేవలు నేటి తరానికి స్ఫూర్తిదాయకమని జిల్లా కలెక్టర్ ఎస్. ఢిల్లీరావు అన్నారు. వీడియో కాన్ఫరెన్స్ హాల్లో టంగుటూరి ప్రకాశం పంతులు జయంతి బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ ఢిల్లీ రావు, జాయింట్ కలెక్టర్ పి. సంపత్ కుమార్, జిల్లా రెవెన్యూ అధికారి కె. మోహన్ కుమార్ టంగుటూరి చిత్రపటానికి పూల మాల వేసి నివాళులర్పించారు. ఢిల్లీరావు మాట్లాడుతూ టంగుటూరి సేవలు ఎనలేనివని కొనియాడారు. అయన సేవలను చిరకాలం గుర్తించుకునేలా ప్రభుత్వం ఒక జిల్లాకు అయన పెట్టిందని చెప్పారు. స్వాతంత్ర్య ఉద్యమ సమయంలో అయన చురుకై న పాత్ర పోషించారని పేర్కొన్నారు. ఆంధ్ర రాష్ట్రం ఏర్పడిన రోజుల్లో తొలి ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టడం గొప్ప విషయమన్నారు. జాయింట్ కలెక్టర్ పి. సంపత్ కుమార్ మాట్లాడుతూ ప్రకాశం పంతుల ఆశయాలను ప్రతి ఒక్కరూ స్ఫూర్తిగా తీసుకోవాలని సూచించారు. జిల్లాను అభివృద్ధి బాటలో నడిపేందుకు అధికార యంత్రాంగం అంతా సమష్టి కృషి చేద్దామని తెలిపారు. కార్యక్రమంలో డ్వామా ప్రాజెక్ట్ డైరెక్టర్ జె. సునీత, హౌసింగ్ ప్రాజెక్ట్ డైరెక్టర్ రజనీ కుమారి, ఐసిడిఎస్ ప్రాజెక్ట్ డైరెక్టర్ జి. ఉమాదేవి, కో ఆర్డినేషన్ విభాగం సూపరింటెండెంట్ సి.హెచ్. దుర్గా ప్రసాద్, కలెక్టరేట్ అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.



టంగుటూరి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న జిల్లా కలెక్టర్ ఢిల్లీరావు

నూజవీడులో సీఆర్డీఏ స్మార్ట్ టౌన్‌షిప్

సాక్షి, అమరావతి: నూజివీడులో ఎంఐజీ జగనన్న స్మార్ట్ టౌన్‌షిప్ ఏర్పాటు చేసినట్టు సీఆర్డీఏ కమిషనర్ వివేక్ యాదవ్ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. చదరపు గజం రూ.8,500 ధర నిర్ణయించామని, సులభ వాయిదాల పద్ధతిలో నగదు చెల్లించుకునే అవకాశాన్ని కల్పించినట్టు పేర్కొన్నారు. మధ్య తరగతి ప్రజలు సౌకర్యవంతంగా స్థిర నివాసాలు ఏర్పాటు చేసుకునేందుకు వీలుగా ప్లాట్లు అభివృద్ధి చేశామన్నారు. ఏలూరు జిల్లా నూజివీడు పట్టణంలోని ఎంఆర్ అప్పారావు కాలనీలో మ్యాంగో గార్డెన్ రీసెర్చ్ సెంటర్‌ను ఆనుకొని 40.78 ఎకరాల విస్తీర్ణంలో 150, 200, 250 చ.గ. వైశాల్యంలో 393 ప్లాట్లను అభివృద్ధి చేశామన్నారు. ప్లాట్లకు అధిక డిమాండ్ ఉండడంతో పాటు ప్రజల అభ్యర్థన మేరకు ఈ నెల 31 దరఖాస్తులు చేసుకునే గడువు పొడిగించినట్టు ఆయన తెలిపారు.

గృహ ప్రవేశాలకు సిద్ధం చేయాలి

ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఎస్.ఢిల్లీరావు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): ఎన్టీఆర్ జిల్లాలో సామూహిక గృహ ప్రవేశాలకు 15,127 ఇళ్లను సిద్ధం చేయాలని జిల్లా కలెక్టర్ ఎస్. ఢిల్లీరావు అధికారులను ఆదేశించారు. వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఇళ్ల నిర్మాణాల ప్రగతిపై బుధవారం కలెక్టర్ ఎస్.ఢిల్లీరావు, జాయింట్ కలెక్టర్ పి. సంపత్ కుమార్‌లు ఎంపీడీఓలు, తహసీల్దార్లు, మునిసిపల్ కమిషనర్‌లు, గృహ నిర్మాణ శాఖ ఇంజినీరింగ్ అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఈ నెల 30వ తేదీ నాటికి ఇళ్ల నిర్మాణాలను పూర్తి చేసి గృహ ప్రవేశాలకు సిద్ధం చేసే లక్ష్యాన్ని నిర్దేశించామని తెలిపారు. ఇప్పటికే 15,016 ఇళ్లను పూర్తి చేసి గృహ ప్రవేశాలకు సిద్ధం చేయగా తుది దశలో ఉన్న మిగిలిన గృహాలను రెండు రోజుల్లో పూర్తి చేయాలని ఆదేశించారు. నవరత్నాలు, పేదలందరికీ ఇళ్ల కార్యక్రమంలో భాగంగా రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ ద్వారా జగనన్న కాలనీల్లో నిర్మించిన గృహాలకు విద్యుత్, నీటి సౌకర్యం కల్పించాలని చెప్పారు. కాలనీల వద్ద స్వాగత ద్వారాలను ఏర్పాటు చేయాలని సూచించారు. ఇప్పటికే గృహ ప్రవేశాలకు తిరువూరు డివిజన్ లో 1076 ఇళ్లు, నందిగామ డివిజన్‌లో 6073, విజయవాడ డివిజన్ లో 7978 గృహాలు మొత్తంగా 15,127 ఇళ్లు జగనన్న కాలనీల్లో అన్ని మౌలిక సదుపాయాలు కల్పించామని వెల్లడించారు. డీఆర్వో కె. మోహన్‌కుమార్, హౌసింగ్ ప్రాజెక్ట్ డైరెక్టర్ రజనీ కుమారి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ ఎస్.ఢిల్లీరావు



• విజయవాడ గడ్డ.. వైఎస్సార్ సీపీ అడ్డా..

విజయవాడ గడ్డ వైఎస్సార్ సీపీ అడ్డా... వైనాట్ 175 సీట్లు నినాదంతో ఆ పార్టీ ఆధ్వర్యంలో బుధవారం నగరంలో భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. పాతబస్తీ రథం సెంటర్ నుంచి ర్యాలీ ప్రారంభమై బెంజిసర్కిల్ వరకు కొనసాగింది. పశ్చిమ, సెంట్రల్, తూర్పు నియోజకవర్గాల పరిధిలో సాగిన ర్యాలీలో వేలాది మంది పార్టీ శ్రేణులు పాల్గొన్నారు. వైఎస్సార్ సీపీ ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షుడు వెలంపల్లి శ్రీనివాసరావు, ఎమ్మెల్సీ రుహుల్లా, ఎమ్మెల్యే మల్లాది విష్ణు, తూర్పు నియోజకవర్గ ఇన్‌చార్జి దేవినేని అవినాష్ తదితరులు హాజరైన చిత్రాలివి.

– సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ



మహిళా సాధికారతకు ప్రభుత్వం పెద్దపీట

- జెడ్పీ చైర్‌పర్సన్ ఉప్పాల హారిక
- గౌడపాలెంలో రూ.20 లక్షలతో నిర్మించిన రహదారి ప్రారంభం
- ఎమ్మెల్యే అనిల్‌కుమార్, చైర్‌పర్సన్ హారికకు అపూర్వ స్వాగతం

పమిడిముక్కల(పామర్రు): మహిళా సాధికారతకు ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ ఉప్పాల హారిక అన్నారు. సీఎం జగన్ మహిళా పక్షపాతి అని అన్నారు. మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందేందుకు వైఎస్సార్ ఆసరా, వైఎస్సార్ చేయూత, సున్నా వడ్డీ, జగనన్న అమ్మ ఒడి పథకాలను గత నాలుగేళ్లుగా అమలు చేస్తున్నారన్నారు. కృష్ణాపురం పంచాయతీ పరిధిలోని గౌడపాలెంలో రూ.20 లక్షల వ్యయంతో నిర్మించిన సిమెంట్ రోడ్డును ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్‌తో కలిసి ఆమె ప్రారంభించారు. అనంతరం శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా చైర్‌పర్సన్ హారిక మాట్లాడుతూ రాజకీయాల్లో మహిళలకు సముచిత స్థానం కల్పించిన ఘనత సీఎం జగన్‌కే దక్కుతుందన్నారు. గడిచిన నాలుగేళ్లలో మహిళా సంఘాలు తమ రుణాలపై బ్యాంకులకు కట్టాల్సిన వడ్డీని ప్రభుత్వమే భరించిందన్నారు. గత ప్రభుత్వ హయాంలో రుణాలు సక్రమంగా కట్టక సీ,డీ గ్రూపుల్లోకి దిగజారిన సంఘాలు సున్నావడ్డీ, ఆసరా, చేయూత పథకాలతో తిరిగి ఏ, బీ గ్రూపుల్లోకి చేరాయన్నారు. ఎన్నికల ముందు హామీలిచ్చి, అధికారంలోకి వచ్చాక పైసా విదల్చకుండా మహిళలను మోసగించిన చంద్రబాబు మహిళా వ్యతిరేకిగా చరిత్రలో మిగిలిపోతారన్నారు. ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్ మాట్లాడుతూ డ్వాక్రా రుణాల రికవరీలో దేశంలోనే మన రాష్ట్రం ప్రథమ స్థానంలో నిలిచిందన్నారు. రాష్ట్రంలోని పేద మహిళలపై ఒక్క పైసా భారం పడకుండా ప్రభుత్వమే పూర్తిగా చెల్లిస్తోందన్నారు.

చైర్‌పర్సన్, ఎమ్మెల్యేకు గ్రామస్తుల ఘనస్వాగతం

గౌడపాలెం పర్యటనకు వచ్చిన జెడ్పీ చైర్‌పర్సన్ ఉప్పాల హారిక, ఎమ్మెల్యే కై లే అనిల్‌కుమార్‌కు గ్రామస్తులు, పార్టీ శ్రేణులు ఘన స్వాగతం పలికారు. పూలమాలలతో, బొకేలతో ముంచెత్తారు. భారీ ర్యాలీ, డప్పు వాయిద్యాలతో గౌడపాలెం తోడ్కొని వెళ్లారు. దారిపొడవునా పూలవర్షం కురిపించారు. చైర్‌పర్సన్‌తో సెల్ఫీలు దిగేందుకు మహిళలు పోటీ పడ్డారు. కార్యక్రమంలో డీఈ శ్రీనివాసరావు, జెడ్పీటీసీలు రాజులపాటి పార్వతి, జొన్నల రామ్మోహనరెడ్డి, సర్పంచ్ వీరంకి బలుసులమ్మ, వైస్ ఎంపీపీలు గంజాల సీతారామయ్య, కొడమంచిలి మహేష్, మండల సచివాలయాల కన్వీనర్ పరసా జగన్, మాజీ ఎంపీపీ శొంఠి వెంకటేశ్వరరావు, మాజీ ఎంపీటీసీ వీరంకి చిరంజీవి, వైఎస్సార్ సీపీ నాయకులు ఉప్పాల రాము, యేనుగ మస్తాన్ రావు, మారపాక మహేష్, కొడాలి రాంబాబు, యార్లగడ్డ శివ, కళ్యాణ్ తదితరులు పాల్గొన్నారు.



గౌడపాలెం రహదారిని ప్రారంభిస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ ఉప్పాల హారిక, ఎమ్మెల్యే అనిల్‌కుమార్

యార్డుకు 33,805 బస్తాల మిర్చి రాక

కొరిటిపాడు(గుంటూరు): గుంటూరు మార్కెట్ యార్డుకు బుధవారం 33,805 మిర్చి బస్తాలు రాగా, గత నిల్వలతో కలిపి ఈ–నామ్ విధానం ద్వారా 33,299 బస్తాల అమ్మకాలు జరిగాయి. నాన్ ఏసీ కామన్ రకం 334, నంబర్–5, 273, 341, 4884, సూపర్–10 రకాల మిర్చి సగటు ధర రూ.10,000 నుంచి రూ.24,000 వరకు పలికింది. నాన్ ఏసీ ప్రత్యేక రకం తేజ, బాడిగ, దేవనూరు డీలక్స్ రకాల మిర్చి సగటు ధర రూ.9,800 నుంచి 26,000 వరకు లభించింది. ఏసీ కామన్ రకం క్వింటాలుకు రూ.12,000 నుంచి రూ.23,000 వరకు పలికింది. ఏసీ ప్రత్యేక రకాల మిర్చికి రూ.9,000 నుంచి 25,000 వరకు లభించింది. తాలు రకం మిర్చికి రూ.5,000 నుంచి రూ.14,500 వరకు ధర పలికింది. అమ్మకాలు ముగిసే సమయానికి యార్డులో ఇంకా 13,971 బస్తాల మిర్చి నిల్వ ఉన్నట్లు యార్డు ఉన్నత శ్రేణి కార్యదర్శి ఐ.వెంకటేశ్వరరెడ్డి తెలిపారు.

క్లుప్తంగా

నిత్యాన్నదానానికి పలువురి విరాళం



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఇంద్రకీలాద్రిపై కొలువై ఉన్న దుర్గమ్మ సన్నిధిలో జరుగుతున్న నిత్యాన్నదానానికి బుధవారం పలువురు భక్తులు విరాళాలను సమర్పించారు. విజయవాడ కానూరు ఉమాశంకర్ నగర్‌కు చెందిన వీరుభొట్ల కన్యాకుమారి కుటుంబం ఆలయ ఈవో భ్రమరాంబను కలిసి రూ.1,00,116 విరాళాన్ని అందజేసింది. పటమటలంకకు చెందిన యార్లగడ్డ వెంకటలక్ష్మి, నాగమణి రూ.1,00,116 విరాళాన్ని అందజేశారు.

వెలగలూరు వాసుల విరాళం

కృష్ణాజిల్లా వెలగలూరుకు చెందిన తోట శివయ్య, రమణ దంపతులు బుధవారం ఆలయ ఈవో భ్రమరాంబను కలిసి రూ. 1,00,116 విరాళాన్ని అందజేశారు. అనంతరం దాతలకు ఆలయ మర్యాదలతో అమ్మవారి దర్శనం కల్పించి, ప్రసాదాలు, శేషవస్త్రాలను అందజేశారు.

మెరైన్ కానిస్టేబుల్‌పై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు

కోనేరుసెంటర్(మచిలీపట్నం): స్థలం వివాదంలో ఓ కుటుంబాన్ని కులం పేరుతో దూషించిన ఓ మెరైన్ కానిస్టేబుల్‌తో పాటు అతని బంధువులపై మచిలీపట్నం పోలీస్‌స్టేషన్‌లో బుధవారం ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదైంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం మచిలీపట్నం బందరుకోటకు చెందిన కుక్కల ఇందిర కుటుంబం కొన్నేళ్లుగా వేరే వ్యక్తికి చెందిన స్థలంలో ఉంటున్నారు. ఆ స్థలానికి సరిహద్దున కొక్కిలిగడ్డ సత్యనారాయణ ఉంటున్నారు. ఇందిర కుటుంబం ఉంటున్న స్థలాన్ని తాము కొనుగోలు చేశామని, ఆ స్థలాన్ని ఖాళీ చేసి వెళ్లాలంటూ సత్యనారాయణ కుటుంబం ఆదేశించగా ఇందిర అందుకు అంగీకరించలేదు. ఈ విషయం కోర్టులో నడుస్తోంది. ఇదిలా ఉండగా బుధవారం రెండు కుటుంబాల మధ్య మరలా వివాదం రేగింది. ఈ నేపథ్యంలో సత్యనారాయణ, అతని కుమారుడు రాజ్‌కుమార్ (మెరైన్ కానిస్టేబుల్) మరి కొంతమంది కలిసి ఇందిర కుటుంబంపై దాడి చేశారు. ఆమె కుటుంబాన్ని కులం పేరుతో దూషించారు. ఈ ఘర్షణలో ఇందిర చేతులకు గాయాలయ్యాయి. ఇందిర మచిలీపట్నం పోలీసులకు ఫిర్యాదు చేసి, చికిత్స నిమిత్తం బందరు ప్రభుత్వాసుపత్రిలో చేరింది. బాధితురాలి ఫిర్యాదు మేరకు కానిస్టేబుల్ రాజ్‌కుమార్, అతని తండ్రి, మరికొందరిపై కొట్లాట, కులం పేరుతో దూషించినందుకు ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

కాకినాడ సెక్షన్‌లో డీఆర్‌ఎం విస్తృత తనిఖీలు



స్టేషన్ మాస్టర్ కార్యాలయంలో తనిఖీలు చేపట్టిన డీఆర్‌ఎం నరేంద్ర ఏ పాటిల్

రైల్వేస్టేషన్(విజయవాడపశ్చిమ): దక్షిణ మధ్య రైల్వే విజయవాడ డివిజన్ డీఆర్‌ఎమ్ నరేంద్ర ఏ పాటిల్ బుధవారం విజయవాడ డివిజన్‌లోని కాకినాడ సెక్షన్‌లో విస్తృతంగా తనిఖీలు చేపట్టారు. ముందుగా కాకినాడ స్టేషన్‌లోని వీఐపీ లాంజ్‌లో ఎంపీ వంగా గీతతో సమావేశమై కాకినాడ జిల్లాకు సంబంధించిన పలు రైల్వే అభివృద్ధి పనులపై చర్చించారు. అనంతరం స్టేషన్‌లో పర్యటించి ఎఫ్‌ఓబీలు, సర్క్యులేటింగ్ ప్రాంతం, ప్రయాణికుల సౌకర్యాలు, క్యాటరింగ్ స్టాల్స్‌ను తనిఖీ చేసి అధికారులకు పలు సూచనలు చేశారు. స్టేషన్ మాస్టర్ కార్యాలయం, టీటీఈ విశ్రాంతి హాలు, ఇతర డిపోలను తనిఖీలు చేశారు. స్టేషన్ మాస్టర్ కార్యాలయం, ఇతర డిపోలలో అవసరమైన భద్రత పరికరాలను పరిశీలించారు. అనంతరం రన్నింగ్ రూమ్, మెకనైజ్డ్ లాండ్రీ, కోచింగ్ డిపోలను పరిశీలించి పర్యావరణ పరిరక్షణలో భాగంగా అధికారులతో కలసి మొక్కలు నాటారు. మధ్యాహ్నం కాకినాడ పోర్టు స్టేషన్‌లో తనిఖీలు చేపట్టి అక్కడ జరుగుతున్న యార్డు మోడలింగ్ పనుల పురోగతిపై అధికారులతో సమీక్షించారు. న్యూ గూడ్స్ కాంప్లెక్స్, డాన్–1, డాన్–2, ఎల్‌సీ–2 లైన్‌లను తనిఖీ చేశారు. అనంతరం నాగార్జున ఫెర్టిలైజర్స్ సైడింగ్, కాకినాడ సీ పోర్ట్ లిమిటెడ్ అధికారులతో సమావేశం నిర్వహించి, డిమాండ్‌కు తగినట్లుగా ర్యాక్‌లను సరఫరా చేయడంలో పూర్తి స్థాయి సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు. లోడింగ్ సమయంలో భద్రత నియమాలు కచ్చితంగా పాటించి, అవాంఛనీయ ఘటనలు జరగకుండా జాగ్రత్త వహించాల్సిందిగా అధికారులను ఆదేశించారు. అనంతరం రోడ్డు మార్గంలో రాజమహేంద్రవరం చేరుకుని అక్కడ నుంచి విజయవాడకు రియర్ విండో తనిఖీ చేపట్టారు. ఈ పర్యటనలో సీనియర్ డీపీఎం వావిళ్లపల్లి రాంబాబు, సీనియర్ డీఈఎన్ ఎస్.వరుణ్‌బాబు, సీనియర్ డీఓఎం డి.నరేంద్ర వర్మ, సీనియర్ డీఈఈలు కె.శ్రీనివాసరావు, టి.సురేష్‌బాబు, ఇతర బ్రాంచ్ అధికారులు పాల్గొన్నారు.

ఒలింపియాడ్ విజేత తేజేశ్వర్ విద్యార్థులకు ఆదర్శం

- దేశం గర్వపడే శాస్త్రవేత్తగా రాణించాలి
- ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఢిల్లీ రావు



ఒలింపియాడ్‌లో బంగారు పతకం సాధించిన తేజేశ్వర్‌ను సత్కరిస్తున్న కలెక్టర్ ఢిల్లీరావు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): ఖగోళ శాస్త్రంపై పోలండ్‌లో నిర్వహించిన అంతర్జాతీయ ఒలింపియాడ్‌లో బంగారు పతకం సాధించిన కోడూరు తేజేశ్వర్‌ను విద్యార్థులు ఆదర్శంగా తీసుకోవాలని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఎస్.ఢిల్లీరావు సూచించారు. ఇటీవల పోలండ్‌లో నిర్వహించిన అంతర్జాతీయ ఒలింపియాడ్‌లో ఆస్ట్రానమీ, ఆస్ట్రో ఫిజిక్స్‌లో బంగారు పతకం సాధించిన తేజేశ్వర్‌ను బుధవారం బందరు రోడ్డులోని ఫిట్జీ జూనియర్ కళాశాలలో కలెక్టర్ ఢిల్లీరావు ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తేజేశ్వర్ భవిష్యత్తులో ఇంకా ఉన్నత స్థానాలకు ఎదిగి, దేశం గర్వపడే శాస్త్రవేత్తగా రాణించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఫిట్జీ కళాశాల డైరెక్టర్ పి.రమేష్ బాబు, ప్రిన్సిపాల్ సంపత్, హెచ్‌ఓడీలు ఎల్.పవన్, సీహెచ్ సాయి రామ్, గోపీ కృష్ణ, శివరామ కృష్ణ, కర్నూలుకు చెందిన తేజేశ్వర్ తల్లిదండ్రులు కె.శేఖర్, కె.కృష్ణవేణి పాల్గొన్నారు.

రైలు ఢీకొని వ్యక్తి మృతి



రైల్వేస్టేషన్(విజయవాడపశ్చిమ): రైలు ఢీకొని వ్యక్తి మృతి చెందిన ఘటనపై ప్రభుత్వ రైల్వే పోలీసులు (జీఆర్‌పీ) కేసు నమోదు చేశారు. వారు తెలిపిన వివరాల ప్రకారం బుధవారం ఉదయం 6 గంటల సమయంలో విశాఖపట్నం మార్గంలోని సింగ్‌నగర్–దేవినగర్ మధ్యలో గుర్తు తెలియని వ్యక్తి రైలు పట్టాల వద్ద మృతిచెంది ఉండటాన్ని గుర్తించిన సిబ్బంది పోలీసులకు సమాచారం అందించారు. దీంతో ఘటనాస్థలానికి చేరుకున్న వారు వివరాలు సేకరించారు. మృతుని వయస్సు సుమారు 30–35 మధ్య ఉంటుందని ఒంటిపై నీలం రంగు ప్యాంటు, పసుపు, నీలం రంగు ఫుల్‌హ్యాండ్ చొక్కా ధరించి ఉన్నాడన్నారు. ఇతర వివరాలేమీ లభ్యం కాలేదని తెలిపారు. రైలు పట్టాలు దాటుతున్న క్రమంలో గుర్తు తెలియని రైలు ఢీకొని మృతిచెంది ఉండవచ్చని పోలీసులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. మృతదేహాన్ని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేశారు. మృతుని ఆచూకీ తెలిసిన వారు విజయవాడ జీఆర్‌పీ వారికి సమాచారం అందించాల్సిందిగా కోరుతున్నారు.

నకిలీ స్టాంప్ పేపర్ల తయారీ కేసులో ఏడాది జైలు

విజయవాడస్పోర్ట్స్: నాన్ జ్యుడీషియల్ నకిలీ స్టాంప్ పేపర్లు తయారు చేసిన వ్యక్తికి ఒక సంవత్సరం జైలు శిక్ష విధిస్తూ విజయవాడ చీఫ్ మెట్రో పాలిటన్ మేజిస్ట్రేట్ కోర్టు న్యాయమూర్తి వై.శ్రీనివాసరావు బుధవారం తీర్పు చెప్పారు. విజయవాడ కేదారేశ్వరపేటకు చెందిన వక్కలగడ్డ విఠల్‌రావు స్టాంప్ వెండర్ లైసెన్స్ రద్దు చేసిన పేరు గల స్టాంప్‌లను, ఎటువంటి కోడ్ నంబర్ ప్రింట్ కాని నాన్ జ్యుడీషియల్ స్టాంప్‌లను, చనిపోయిన స్టాంప్ వెండర్ల స్టాంప్‌లతో ముద్రించి సంతకం చేసిన వాటిని స్టాంప్‌లపై ఉన్న అంకెలను మార్చి చట్టవిరుద్ధంగా పాత తేదీలతో అమ్ముతున్నట్లు గాంధీనగర్ జిల్లా సబ్ రిజిస్ట్రార్ కార్యాలయ జాయింట్ సబ్ రిజిస్ట్రార్‌లు జె.యుగంధరరావు, జి.శ్రీనివాసరావు, విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డీఎస్పీ విజయపాల్, సీఐ పి.వెంకటేశ్వర్లు విచారణలో వెల్లడైంది. దీనిపై వారు విఠల్‌రావుపై 2017 అక్టోబర్ 26వ తేదీన సింగ్‌నగర్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. వెంటనే విఠల్‌రావును పోలీసులు అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపర్చారు. ప్రాసిక్యూషన్ తరపున ఏపీపీ బి.కృష్ణకిషోర్ కోర్టుకు వాదనలు వినిపించారు. 10 మంది సాక్షులను విచారించిన అనంతరం నేరం రుజువు కావడంతో నిందితుడు విఠల్‌రావుకు జైలుశిక్షతో పాటు రూ.3 వేలు జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పు చెప్పారు.

రెండు కార్లు, లారీ ఢీ : ఇద్దరు మృతి



ప్రమాదంలో ధ్వంసమైన కారు



ఘటనలో కారులోనే మృతి చెందిన అన్నామణి (ఇన్‌సెట్) లో తీవ్ర గాయాల పాలయిన నాగబసవయ్య

- మరో 9 మందికి గాయాలు
- జాతీయ రహదారిపై ఘోర రోడ్డు ప్రమాదం
- మృతులు కోనసీమ అంబేడ్కర్ జిల్లా వాసులు

కృత్తివెన్ను(పెడన): రెండు కార్లు, లారీ ఢీకొన్న ప్రమాదంలో ఇద్దరు మృతి చెందడంతో పాటు మరో తొమ్మి ది మంది తీవ్ర గాయాల పాలయ్యారు. ఈ ఘోర రోడ్డు ప్రమాదం కృష్ణాజిల్లా కృత్తివెన్ను మండలం సంగమూడి సమీపంలో 216 వ నంబరు జాతీయ రహదారిపై బుధవారం మధ్యాహ్నం 3 గంటల సమయంలో సంభవించింది. ముందు వెళ్తున్న లారీని కారు ఓవర్ టేక్ చేస్తున్న క్రమంలో ఈ ప్రమాదం జరిగినట్లు గుర్తించారు. కృత్తివెన్ను పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కోనసీమ అంబేడ్కర్ జిల్లా అల్లవరం మండలం మొగలమర్రు గ్రామానికి చెందిన ఓ కుటుంబంలోని ఇద్దరు మహిళలు, నలుగురు చిన్నారులు, కారు డ్రైవర్‌తో కలసి మొత్తం ఏడుగురు గుంటూరు జిల్లా పెదకాకానిలో మొక్కులు తీర్చుకునేందుకు బుధవా రం ఉదయం వెళ్లారు. మొక్కులు తీర్చుకుని మధ్యా హ్నం తిరుగు ప్రయాణమయ్యారు. ఇదిలా ఉండగా మరొక కారులో యలవర్తి అఖిలేష్, యలవర్తి రవి, దేవర కొండ నాగబసవయ్య, అజయ్‌కుమార్ నర్సాపురం నుంచి అవనిగడ్డకు వెళుతున్నారు. సంగమూడి సమీపానికి వచ్చేసరికి లారీని తప్పించబోయి రెండు కార్లు ఎదురెదురు ఢీకొన్నాయి. ఈ ఘటనలో గుంటూరు నుంచి మొగలమర్రు వెళుతున్న కారులోని పెన్నేటి అన్నామణి (60) అనే మహిళ ఘటనా స్థలంలోనే మరణించింది. ఆ కారు డ్రైవర్ బాలస్వామి (20) తీవ్ర గాయాలతో ఆస్పత్రిలో చికిత్సపొందుతూ మరణించాడు. ఈ కారులోని మరో మహిళతో పాటు నలుగురు చిన్నారులకు తీవ్ర గాయాలయ్యాయి. మరో కారులో ఉన్న నాగబసవయ్య, రవిలకు తీవ్రగాయాలు కాగా, అఖిలేష్, అజయ్‌కుమార్‌లకు స్వల్ప గాయాలయ్యాయి. క్షతగాత్రులందరినీ 108, ఎన్‌హెచ్ అంబులెన్సుల్లో మచిలీపట్నం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ప్రమాదం జరిగిన వెంటనే స్థానికులతో పాటు కృత్తివెన్ను పోలీసులు సకాలంలో స్పందించారు. ప్రమాద విషయాన్ని తెలుసుకున్న వెంటనే బందరు రూరల్ సీఐ వీరప్రసన్నగౌడ్, బంటుమిల్లి ఎస్‌ఐ పైడిబాబు ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. ప్రమాద ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేయనున్నట్లు సీఐ తెలిపారు.

భక్తుల సౌకర్యాలు, ఆస్తుల పరిరక్షణ మా బాధ్యత

దేవదాయశాఖ కమిషనర్ సత్యనారాయణ



భక్తుల సౌకర్యాలను అడిగి తెలుసుకుంటున్న దేవదాయశాఖ కమిషనర్ సత్యనారాయణ

మోపిదేవి: భక్తుల సౌకర్యాలతో పాటు దేవాలయాల ఆస్తుల పరిరక్షణ తమ బాధ్యత అని రాష్ట్ర దేవదాయ ధర్మదాయశాఖ కమిషనర్ శ్రీరామ సత్యనారాయణ అన్నారు. కృష్ణాజిల్లా మోపిదేవిలోని శ్రీవల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామివారిని బుధవారం సాయంత్రం ఆయన దర్శించుకున్నారు. ఈ సందర్భంగా విలేకరులతో మాట్లాడుతూ మోపిదేవి దేవస్థానంకు శ్రీశైలం, అన్నవరం, శ్రీకాళహస్తి వంటి దేవాలయాల వలే మాస్టర్ ప్లాన్ అమలుకు ప్రణాళిక సిద్ధం చేసినట్లు తెలిపారు. రూ.2 కోట్లతో భక్తుల సౌకర్యార్థం డార్మెటరీ, కేశఖండన శాల, కుట్టు పోగుల శాల వంటివి ఏర్పాటు చేయనున్నట్లు చెప్పారు. దేవాలయ భూములు ఆక్రమణలో ఉంటే వారికి ఆలయ ఈవో నోటీసు ఇచ్చి 7 రోజుల్లో ఖాళీచేయని పక్షంలో వారిని చట్టపరంగా ఖాళీ చేయిస్తామని చెప్పారు. రాష్ట్రంలో దేవస్థానాల కింద 4,65,000 ఎకరాలు ఉన్నాయని, కౌలు రూపంలో రూ.150 కోట్లు వస్తోందన్నారు. పురాతన దేవాలయాల్లో ధూప, దీప నైవేద్యాలకు 4,500 మంది అర్చకులకు రూ.5 వేలు చొప్పున అందిస్తున్నామని తెలిపారు. అనంతరం భక్తుల సౌకర్యాల గురించి అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట ఆలయ ఏసీ ఎన్ఎస్ చక్రధరరావు ఉన్నారు.

యూత్‌ఫెస్ట్‌కు పేర్లు నమోదు చేసుకోండి

విజయవాడస్పోర్ట్స్: ఈ నెల 30న నిర్వహించే ఎన్టీఆర్ జిల్లా స్థాయి యూత్ ఫెస్టివల్ పోటీల్లో పాల్గొనేందుకు ఆసక్తి గల యువతీయువకులు ముందస్తుగా వారి పేర్లను నమోదు చేసుకోవాలని జిల్లా యువజన సంక్షేమ శాఖ ముఖ్య కార్యనిర్వహణ అధికారి యు.శ్రీనివాసరావు బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. విజయవాడలోని ఎస్ఆర్ఆర్ అండ్ సీవీఆర్ ప్రభుత్వ డిగ్రీ కాలేజీలో ఈ ఫెస్టివల్ నిర్వహిస్తున్నామని తెలిపారు. 2023 ఆగస్టు ఒకటో తేదీ నాటికి 15 సంవత్సరాలు నిండి 29 సంవత్సరాల లోపు ఉన్న వారే ఈ పోటీల్లో పాల్గొనేందుకు అర్హులన్నారు. కాంపిటేటివ్ ఈవెంట్స్ విభాగంలో కల్చర్ కేటగిరిలో ఫోక్ డ్యాన్స్(గ్రూప్, సోలో), ఫోక్ సాంగ్(గ్రూప్, సోలో), లైఫ్ స్కిల్ కేటగిరీలో స్టోరీ రైటింగ్, పోస్టర్ మేకింగ్, ఉపన్యాసం, ఫొటోగ్రఫీ, నాన్ కాంపిటేటివ్ ఈవెంట్స్‌లో డిజిటల్ ఇండియా గ్రూప్ విభాగంలో ఇ–గవర్నెన్స్ అందరికీ అందుబాటులోకి రావడానికి ప్రభుత్వం చేపట్టిన చర్యలు, వ్యక్తిగత విభాగంలో విలువలు పెంపొందించే వినూత్న యాప్‌లు, లైఫ్ మిషన్ విభాగంలో పర్యావరణ పరిరక్షణ, చేతి వృత్తి కళాకారుల ప్రదర్శన పోటీలను నిర్వహిస్తామని వివరించారు. ఈ పోటీల్లో పాల్గొనే ఆసక్తి ఉన్న వారు ఆ రోజు ఉదయం తొమ్మిది గంటలకు వేదిక వద్ద పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. ప్రదర్శనకు సంబంధించి ఎవరి వస్తువులను వారే తెచ్చుకోవాలన్నారు. ఈ పోటీల్లో విజేతలు త్వరలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీలకు జిల్లా నుంచి ప్రాతినిధ్యం వహిస్తారని, మరిన్ని వివరాలకు 80747 40182, 88866 11786ను సంప్రదించాలని సూచించారు.

క్లుప్తంగా

జనసేన నేతలకు ఓటమి భయం


వెంకట సత్యనారాయణ

గుణదల(విజయవాడ తూర్పు): ఎన్నికలు దగ్గర పడుతున్న కొద్దీ జనసేన నేతలకు ఓటమి భయం కలవర పెడుతోందని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఫ్లోర్‌లీడర్ వెంకట సత్యనారాయణ విమర్శించారు. గుణదలలోని వైఎస్సార్ సీపీ తూర్పు కార్యాలయంలో బుధవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జనసేన నాయకుడు పోతిన మహేష్ మతిభ్రమించి మాట్లాడుతున్నాడని ఆగ్రహం వ్యక్తం చేశారు. నగరంలో ఏ గొడవలు జరిగినా దానిని తమ నాయకుడు దేవినేని అవినాష్‌పై ఆపాదించడం సరికాదన్నారు. ఇటీవల ఏలూరు రోడ్డుపై జరిగిన ఘర్షణకు కారణం అవినాష్ అనుచరులేనంటూ ఆరోపించారన్నారు. సంబంధం లేని వివాదాల్లో తమను లాగొద్దని హితవు పలికారు. పోతిన మహేష్ నోరు అదుపులోకి పెట్టుకోకపోతే ప్రజలే తగిన బుద్ధి చెబుతారని హెచ్చరించారు.

జయసూర్య కుటుంబ సభ్యులకు పరామర్శ

పెనమలూరు: ఫిలిప్పీన్స్‌లో మూడు రోజుల క్రితం మృతి చెందిన మెడిసిన్ విద్యార్థి అయోధ్య జయసూర్య కుటుంబ సభ్యులను వైఎస్సార్ సీపీ తూర్పు నియోజకవర్గ ఇన్‌చార్జ్ దేవినేని అవినాష్ పరామర్శించారు. యనమలకుదురులో ఉంటున్న మృతి చెందిన విద్యార్థి తండ్రి డాక్టర్ అయోధ్య సత్యనారాయణ ఇంటికి దేవినేని అవినాష్ బుధవారం వచ్చారు. మెడిసిన్ పూర్తి చేసే సమయంలో రోడ్డు ప్రమాదానికి గురై జయసూర్య మృతి చెందటం చాలా బాధాకరమని అవినాష్ అన్నారు. ఆయన కుటుంబ సభ్యులను ఓదార్చి అండగా ఉంటామని తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నేత గుమ్మడి విజయ్‌కుమార్ పలువురు పాల్గొన్నారు.

నేటి నుంచి సచివాలయాల్లో ఆధార్ స్పెషల్ క్యాంప్‌లు

భవానీపురం(విజయవాడపశ్చిమ): నగరంలో ప్రజలకు ఆధార్ డాక్యుమెంట్ అప్‌డేట్ సర్వీసును గ్రామ/వార్డ్ సచివాలయాల్లో ఈ నెల 24, 25 తేదీల్లో స్పెషల్ క్యాంప్‌లు నిర్వహిస్తున్నట్లు మున్సిపల్ అధికారులు తెలిపారు. నగరంలోని 286 సచివాలయాల్లో ఈ క్యాంప్‌లను ఏర్పాటు చేశామన్నారు. వీఎంసీ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, ఏసీ యూసీడీ ప్రాజెక్ట్ ఆఫీసర్ శకుంతల ఆధ్వర్యంలో నిర్వహించబడుతున్న ఈ ఆధార్ అప్‌డేట్ సేవలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

రాజరాజ నరేంద్ర పట్టాభిషేక సహస్రాబ్ది ఉత్సవం

మధురానగర్(విజయవాడసెంట్రల్): మాచవరం ఎస్ఆర్ఆర్ ప్రభుత్వ కళాశాలలోని గురుకుల సాంఘిక సంక్షేమ ప్రభుత్వ కళాశాలలో బుధవారం మహాభారత రచనకు ప్రేరకుడు, తెలుగుజాతికి ఆరాధ్యుడు రాజరాజ నరేంద్ర మహారాజు పట్టాభిషేక దినోత్సవం సందర్భంగా ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ వల్లూరు నీరజ అధ్యక్షతన అతిథి ఉపన్యాస కార్యక్రమం జరిగింది. హైదరాబాద్ విశ్వవిద్యాలయ భాషా శాస్త్రశాఖ విశ్రాంత ఆచార్యుడు డాక్టర్ జి. ఉమామహేశ్వరరావు, ఆంధ్ర లయోల కళాశాల చరిత్ర విభాగాధిపతి డాక్టర్ మొవ్వ శ్రీనివాసరెడ్డి ప్రసంగించారు. అనంతరం ఆంధ్రరాష్ట్ర తొలి ముఖ్యమంత్రి, ఆంధ్రకేసరి టంగుటూరి ప్రకాశం పంతులు జయంతి సందర్భంగా నివాళులు అర్పించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ బాలకృష్ణ, కళాశాల సిబ్బంది అధ్యాపకులు విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యా సామగ్రి వితరణ

మధురానగర్(విజయవాడసెంట్రల్): ముత్యాలపాడు గొట్టుముక్కల సూర్యనారాయణరాజు నగరపాలకసంస్థ పాఠశాలలో బుధవారం హెల్పింగ్ టుగెదర్ 2009 గ్రూప్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యాన విద్యార్థులకు జామెంట్రీ బాక్సులు, నోటు పుస్తకాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ట్రస్ట్ సభ్యులు షఫీవుల్లా, మల్లికా మాట్లాడుతూ తమ వంతు బాధ్యతగా విద్యార్థులకు ట్రస్ట్ సభ్యుల సహకారంతో జామెంట్రీ బాక్సులు, నోటు పుస్తకాలు అందజేస్తున్నామన్నారు. 100 మంది విద్యార్థులకు పుస్తకాలు, జామెంట్రీ బాక్సులు అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది ట్రస్ట్ సభ్యులు అవినాష్, ఆదిత్య, మహేష్ పాల్గొన్నారు.

'తూర్పు'లో ఉత్సాహంగా బైక్ ర్యాలీ

- వర్షాన్ని సైతం లెక్కచేయకుండా ముందుకు సాగిన పార్టీ శ్రేణులు


బైక్ ర్యాలీలో పాల్గొన్న దేవినేని అవినాష్, నాయకులు


ప్రజలకు అభివాదం చేస్తున్న అవినాష్, ఎమ్మెల్యే వెలంపల్లి


ర్యాలీలో పాల్గొన్న పార్టీ శ్రేణులు


పోలీస్ కంట్రోల్ రూమ్ వద్ద పార్టీ నాయకుల బైక్ ర్యాలీ

మొగల్రాజపురం(విజయవాడతూర్పు): వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో నగరంలో బుధవారం మధ్యాహ్నం చేపట్టిన బెజవాడ గడ్డ వైఎస్సార్ సీపీ అడ్డా.. వై నాట్ 175 పేరుతో నిర్వహించిన బైక్ ర్యాలీ ఉత్సాహంగా సాగింది. చుట్టుగుంట సర్కిల్ పరిసరాలంతా జగనన్న నినాదాలతో మారుమోగాయి. మూడు నియోజకవర్గాల నుంచి బయలుదేరిన బైక్‌లు చుట్టుగుంట సర్కిల్‌లో కలుసుకుని అక్కడ నుంచి ముందుకు సాగాయి. వైఎస్సార్ సీపీ ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షుడు, పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు, సెంట్రల్ నియోజకవర్గ ఎమ్మెల్యే మల్లాది విష్ణు, మేయర్ రాయన భాగ్యలక్ష్మి, ఎమ్మెల్సీ రుహుల్లా, వైఎస్సార్ సీపీ తూర్పు నియోజకవర్గ ఇన్‌చార్జి దేవినేని అవినాష్‌తో పాటు పార్టీ కార్పొరేటర్లు, కార్పొరేషన్ల చైర్మన్లు, పార్టీ డివిజన్ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

175 సీట్లు మావే : అవినాష్

మారుతీనగర్‌లోని శ్రీచైతన్య స్కూల్ నుంచి దేవినేని అవినాష్ పార్టీ అనుచరులతో బైక్‌లతో ర్యాలీగా బయలు దేరి చుట్టుగుంట సర్కిల్‌కు చేరుకున్నారు. ఈ సందర్భంగా అవినాష్ మాట్లాడుతూ.. రాష్ట్రంలో ఎన్నికలు ఎప్పుడు జరిగినా 175 నియోజకవర్గాల్లో వైఎస్సార్‌సీపీ అభ్యర్థులదే విజయమన్నారు. ఎన్నికల్లో ఒంటరిగా పోటీ చేసి గెలిచే దమ్ములేక టీడీపీ పొత్తుల కోసం వెంపర్లాడుతోందని చెప్పారు. లోకేష్ విజయవాడలో ఏమీ మాట్లాడలేక గన్నవరం వెళ్లి మాట్లాడారని ఎద్దేవా చేశారు.

వర్షంలోనూ కొనసాగిన ర్యాలీ

తూర్పు నియోజకవర్గ పరిధిలోని విశాలాంధ్ర రోడ్డులోకి బైక్ ర్యాలీ చేరుకున్న 15 నిమిషాల తర్వాత వర్షం మొదలైంది. వర్షాన్ని సైతం లెక్క చేయకుండా వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు, యువత బైక్ ర్యాలీ ముందుకు సాగారు. విశాలాంధ్ర రోడ్డు, నిమ్మతోట సెంటర్, నైస్‌బార్ సెంటర్, శిఖామణి సెంటర్, స్టేడియం రోడ్డు మీదుగా బందరురోడ్డులో నుంచి డీవీ మేనర్ హోటల్ నుంచి మదర్ థెరిస్సా జంక్షన్ వరకు బైక్ ర్యాలీ సాగింది. వెయ్యికి పైగా బైక్‌లతో యువత ర్యాలీలో పాల్గొన్నారు. పోలీసులు ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు.

17వ డివిజన్‌లో..

కృష్ణలంక(విజయవాడతూర్పు): 17వ డివిజన్ కార్పొరేటర్ తంగిరాల రామిరెడ్డి ఆధ్వర్యంలో బుధవారం భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. వైఎస్సార్ సీపీ తూర్పు ఇన్‌చార్జి దేవినేని అవినాష్ పిలుపు మేరకు రామిరెడ్డి ఆధ్వర్యంలో 250 మంది పార్టీ శ్రేణులు డివిజన్‌లో బైక్ ర్యాలీ నిర్వహించి, వై నాట్ 175 ర్యాలీలో పాలొన్నారు.

నగర వ్యాప్తంగా ర్యాలీ

నగరంలోని మూడు నియోజకవర్గాల్లో బుధవారం సాయంత్రం బైక్ ర్యాలీ జరిగింది. సెంట్రల్ ఎమ్మెల్యే విష్ణు, పశ్చిమ ఎమ్మెల్యే వెలంపల్లి, తూర్పు ఇన్‌చార్జి దేవినేని అవినాష్ ఆధ్వర్యంలో స్థానిక పార్టీ కార్యాలయాల నుంచి ప్రారంభమైన బైక్ ర్యాలీల్లో కార్పొరేటర్లు, వివిధ కార్పొరేషన్ల చైర్మన్లు, పార్టీ శ్రేణులు పాల్గొన్నారు. రథం సెంటర్ నుంచి ప్రారంభమైన ర్యాలీ లో బ్రిడ్జి, పోలీస్ కంట్రోల్ రూమ్, బందరు రోడ్డు మీదుగా బెంజిసర్కిల్‌కు చేరుకుంది.

టీడీపీ నాయకులకు ప్రజలే బుద్ధి చెబుతారు

- ఎన్నికల్లో గెలుపు, ఓటములతో సంబంధం లేకుండా అభివృద్ధి పనులు
- 8వ డివిజన్‌లో గడప గడపకు మన ప్రభుత్వంలో దేవినేని అవినాష్


వృద్ధురాలిని ఆప్యాయంగా పలకరిస్తున్న దేవినేని అవినాష్, నాయకులు

మొగల్రాజపురం(విజయవాడతూర్పు): తెలుగుదేశం పార్టీకి చెందిన నాయకులు మాట్లాడే తీరు, వారి ప్రవర్తనను చూసి వచ్చే ఎన్నికల్లో ప్రజలే ఆ పార్టీ నాయకులకు బుద్ధి చెబుతారని వైఎస్సార్ సీపీ తూర్పు నియోజకవర్గ ఇన్‌చార్జి దేవినేని అవినాష్ అన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం బుధవారం 8వ డివిజన్ 272వ వార్డు సచివాలయం పరిధిలోని అశోక్‌నగర్‌లో నిర్వహించారు. ప్రతి ఇంటికి వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందుతున్నది లేనిది అవినాష్ అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా అవినాష్ మాట్లాడుతూ.. నారా లోకేష్ పాదయాత్రకు పక్క జిల్లాల నుంచి డబ్బులు, మద్యం ఇచ్చి ప్రజలను తరలిస్తున్నారే కాని స్థానికంగా ఉండే టీడీపీ నాయకులు, కార్యకర్తలు కూడా పాల్గొనడం లేదన్నారు. నారా లోకేష్ చేసేది పాదయాత్ర కాదని ఈవెనింగ్ వాక్ అని టీడీపీకి చెందిన నాయకులే అంటున్నారని అవినాష్ అన్నారు. లోకేష్ ప్రజలను కలిసి వారి సమస్యలు తెలుసుకునే ప్రయత్నం పాదయాత్రలో ఎక్కడా చేయడం లేదన్నారు. ఆ పార్టీ నాయకులు ఎన్ని ప్రయత్నాలు చేసినా లోకేష్ ఎమ్మెల్యేగా కూడా గెలవలేడన్నారు. గన్నవరంలో టీడీపీ నాయకులు నిర్వహించిన సభలో మాట్లాడిన తీరు సభ్య సమాజం తలదించుకునేలా ఉందన్నారు. మైక్ ఉందని ఏది పడితే అది మాట్లాడితే ప్రజలు హర్షించరని చెప్పారు. విజయవాడ నగర అభివృద్ధిపై తాము చర్చకు సిద్ధమని టైమ్, స్థలం మీరే చెప్పాలని టీడీపీ నాయకులకు అవినాష్ సవాల్ విసిరారు.

రూ.6 కోట్లతో అభివృద్ధి పనులు

8వ డివిజన్‌లో అత్యధికంగా టీడీపీ మద్దతుదారులే నివాసం ఉంటారని, గత ఎన్నికల్లో ఈ డివిజన్లో టీడీపీకి చెందిన అభ్యర్థే కార్పొరేటర్‌గా గెలిచారని అవినాష్ చెప్పారు. అయినా ఎన్నికల్లో గెలుపు ఓటములతో సంబంధం లేకుండా ఇప్పటికే 6 కోట్ల రూపాయాలతో ఈ డివిజన్‌లో వివిధ అభివృద్ధి పనులు చేపట్టామన్నారు. ఇది వైఎస్సార్ సీపీ ప్రభుత్వం పనితీరుకు, ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి మాటకు నిదర్శమని చెప్పారు. గడప గడపకు మన ప్రభుత్వంలో భాగంగా ఇంటింటికీ వెళ్తుంటే గతంలో ఎన్నడూ లేని విధంగా మా ప్రాంతంలో అభివృద్ధి జరిగిందని కాలనీ వాసులు చెబుతుంటే చాలా సంతోషంగా ఉందన్నారు. స్థానిక సమస్యలను తెలుసుకుని వాటి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని అవినాష్ సూచించారు.

వైఎస్సార్ సీపీ 8వ డివిజన్ ఇన్‌చార్జి యలమంచిలి జయప్రకాష్, నాయకులు కేదార్, మొహబూబ్, పోట్లూరి రవి, కొల్లి అజయ్, నామాల వెంకటేశ్వర రావు, జైహింద్‌రావు, రవి, గురువిందపల్లి రవి, కొల్లి రవి, రాణి, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

కొండ ప్రాంతాల్లో ఇళ్ల రెగ్యులరైజేషన్


ఇళ్ల రెగ్యులరైజేషన్‌పై చర్చిస్తున్న జేసీ సంపత్‌కుమార్, ఎమ్మెల్యే వెలంపల్లి, మేయర్ భాగ్యలక్ష్మి

పటమట(విజయవాడతూర్పు): వైఎస్సార్ సీపీ ప్రభుత్వం కొండ ప్రాంతాల్లోని ప్రజల సమస్యలను పరిష్కరించేందుకు ప్రణాళికబద్ధంగా వ్యవహరిస్తోందని మేయర్ రాయన భాగ్యలక్ష్మి అన్నారు. జాయింట్ కలెక్టర్ డాక్టర్ పి.సంపత్‌కుమార్, పశ్చిమ ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాస్‌తో కలిసి ఆమె 46వ డివిజన్‌లోని కొండ ప్రాంతాల్లో పర్యటించారు. చిట్టినగర్ పరిధిలోని సయ్యద్ అప్పలస్వామి కళాశాల వెనుక భాగం, కేఎల్ రావు పార్కు, కుమ్మరిపాలెం సెంటర్ తదితర కొండ ప్రాంతాల్లో జరుగుతున్న ఇళ్ల క్రమబద్ధీకరణను ఆమె పరిశీలించారు. వసతులు కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. నగరంలో పారిశుద్ధ్య నిర్వహణను మరింత మెరుగుపర్చాలని, ఖాళీ స్థలాల్లో చెత్త, వ్యర్థాలు వేయవద్దని స్థానికులకు సూచించారు. వైఎస్సార్ సీపీ ప్రధాన కార్యదర్శి రాయన నరేంద్ర కుమార్, నాయకులు పాల్గొన్నారు.

ఓటర్ల సర్వే ప్రక్రియ పరిశీలన


బీఎల్‌ఓలకు సూచనలిస్తున్న కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

భవానీపురం(విజయవాడపశ్చిమ): రాష్ట్ర ఎన్నికల సంఘం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన స్పెషల్ సమ్మరీ రివిజన్ -2024 కార్యక్రమంలో భాగంగా సెంట్రల్ నియోజకవర్గంలోని అజిత్‌సింగ్‌నగర్‌లో బుధవారం నిర్వహించిన డోర్ టు డోర్ సర్వే ప్రక్రియను మున్సిపల్ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ పర్యవేక్షించారు. కార్యక్రమంలో భాగంగా బీఎల్‌ఓలు వారి పోలింగ్ స్టేషన్ పరిధిలోని ఇంటింటికీ వెళ్లి ఓటర్ల జాబితాను పరిశీలించారు. కొత్త ఓటర్ల నమోదు, మార్పులు - చేర్పులు లేదా చనిపోయిన ఓటర్ల తొలగింపు వంటి వాటికి ఫారం-6, 6ఎ, 7, 8 ఫారంలను అందించి దరఖాస్తు చేయించారు. అనంతరం వాటిని మొబైల్ యాప్‌లో అప్‌లోడ్ చేశారు. ముఖ్యంగా ఒకే డోర్ నెంబర్‌లో ఎక్కువ ఓట్లు ఉంటే వాటిని, జీరో నెంబర్ ఉన్న వాటిని ప్రత్యేకంగా పరిశీలించారు. అలాగే 100 ఏళ్లపైబడిన ఓటర్ల వయసు ధ్రువీకరణ పత్రాలను పరిశీలించారు. కాగా సర్వే చేసిన అనంతరం సెంట్రల్ నియోజకవర్గం చీఫ్ ఎలక్టోరల్ ఆఫీసర్, కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్‌తో సమీక్షించారు.

ఘనంగా టంగుటూరి, గిడుగు జయంతి

- నగర మేయర్ రాయన భాగ్యలక్ష్మి


టంగుటూరి, గిడుగు చిత్రపటాలకు పుష్పాంజలి ఘటిస్తున్న మేయర్ భాగ్యలక్ష్మి, అధికారులు


టంగుటూరి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న డీఎంహెచ్‌ఓ డాక్టర్ సుహాసిని, వైద్యులు

పటమట(విజయవాడతూర్పు): ఆంధ్రకేసరి టంగుటూరి ప్రకాశం పంతులు, తెలుగు భాషా ఉద్యమ పితామహుడు గిడుగు రామ్మూర్తి ఆదర్శప్రాయులని నగర మేయర్ రాయన భాగ్యలక్ష్మి అన్నారు. టంగుటూరి ప్రకాశం పంతులు, గిడుగు రామ్మూర్తి జయంతిని పురస్కరించుకుని తెలుగు భాషా వారోత్సవాలను బుధవారం మేయర్ ప్రారంభించారు. విజయవాడ నగరపాలక సంస్థ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో మేయర్ మాట్లాడుతూ.. టంగుటూరి ధైర్యసాహసాలు నేటి తరానికి స్ఫూర్తిదాయకమన్నారు. ఆయన జీవితం అందరికీ ఆదర్శనీయమని చెప్పారు. టంగుటూరి ఆశయ సాధనకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. నిరుపేద కుటుంబంలో పుట్టి, ఎన్నో ఇబ్బందులను ఎదుర్కొని ఆంధ్ర రాష్ట్ర మొదటి ముఖ్యమంత్రి అయిన గొప్ప వ్యక్తి టంగుటూరి ప్రకాశం పంతులు అని మేయర్ కొనియాడారు. వివిధ రంగాల్లో ఆయన సేవలను గుర్తించి విజయవాడలోని ప్రకాశం బ్యారేజీకు ప్రకాశం పంతులు పేరు పెట్టారని తెలిపారు.

తెలుగు భాషా వారోత్సవాలు ప్రారంభం..

తెలుగులో వాడుక భాషా ఉద్యమ పితామహుడు, తెలుగు భాషోద్యమానికి మూల పురుషుడు గిడుగు వెంకట రామ్మూర్తి అని పేర్కొన్నారు. ఆయన చేసిన సేవలు ఎనలేనివన్నారు. రాష్ట్ర ప్రభుత్వం గిడుగు రామ్మూర్తి జయంతిని ఈ నెల 29వ జరుగుతున్న సందర్భంగా వారోత్సవాలను నిర్వహిస్తోందన్నారు. తెలుగు వారందరూ ఈ భాషోద్యమ వారోత్సవాల్లో పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో అదనపు కమిషనర్(ప్రాజెక్ట్స్) కె.వి.సత్యవతి, అదనపు కమిషనర్(జనరల్) యూసీడీ ప్రాజెక్ట్ ఆఫీసర్ శకుంతల, డెప్యూటీ కమిషనర్(రెవెన్యూ) డి.వెంకటలక్ష్మి, నగరపాలక సంస్థ సెక్రటరీ కె.వసంత లక్ష్మి, మేనేజర్ బి.శ్రీనివాస్‌రావు, ఇతర అధికారులు, నగరపాలక సంస్థ సిబ్బంది పాల్గొన్నారు.

చిరస్మరణీయుడు టంగుటూరి

లబ్బీపేట(విజయవాడతూర్పు): స్వాతంత్ర్య సమర యోధుడు, మాజీ ముఖ్యమంత్రి టంగుటూరి ప్రకాశం పంతులు చిరస్మరణీయుడని జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ మాచర్ల సుహాసిని అన్నారు. నగరంలోని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో బుధవారం టంగుటూరి జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం డీఎంహెచ్‌ఓ మాట్లాడుతూ.. ఆంధ్రప్రదేశ్ తొలి ముఖ్యమంత్రిగా, మద్రాసు ప్రెసిడెన్సీలో ముఖ్యమంత్రిగా పనిచేసిన టంగుటూరి మహోన్నత ఆశయాలు కలిగిన వారని పేర్కొన్నారు. కార్యక్రమంలో జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డాక్టర్ అమృత, డెప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ ఇందుమతి, టీబీ అధికారి డాక్టర్ పద్మావతి, డీపీఓ మహేష్, ఏపీడిమక్ విభాగానికి చెందిన రామకృష్ణ, రాజశేఖర్, ప్రసూనాంబ, సతా కళ్యాణి, రాణి, ఆనందరావు తదితరులు పాల్గొన్నారు.

జీజీహెచ్ సీఎస్ ఆర్ఎంఓగా డాక్టర్ పద్మావతి

లబ్బీపేట(విజయవాడతూర్పు): విజయవాడ ప్రభుత్వాస్పత్రి సివిల్ సర్జన్ రెసిడెంట్ మెడికల్ ఆఫీసర్‌గా డాక్టర్ వై.పద్మావతి నియమితులయ్యారు. ఈ మేరకు రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ ముఖ్య కార్యదర్శి ఎంటీ కృష్ణబాబు బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. ప్రస్తుతం రాష్ట్ర సచివాలయంలోని డిస్పెన్సరీలో పనిచేస్తున్న డాక్టర్ పద్మావతి పదోన్నతిపై సీఎస్ ఆర్ఎంఓగా నియమితులయ్యారు. కాగా జీజీహెచ్ సీఎస్ ఆర్ఎంఓ పోస్టు 14 నెలలుగా ఖాళీగా ఉంది. ఇక్కడ పనిచేస్తున్న డాక్టర్ హనుమంతరావును గతేడాది మే నెలలో బదిలీ చేశారు. అప్పటి నుంచి డెప్యూటీ ఆర్ఎంఓ డాక్టర్ యు.శోభ ఇన్‌చార్జి సివిల్‌సర్జన్ ఆర్ఎంఓగా వ్యవహరిస్తున్నారు. ప్రస్తుతం డెప్యూటీ సివిల్‌సర్జన్స్‌కు సివిల్‌సర్జన్స్‌గా ప్రభుత్వం పదోన్నతులు కల్పించడంతో డాక్టర్ వై.పద్మావతిని సీఎస్ ఆర్ఎంఓగా నియమించారు.

తిరుమల నిత్యాన్నదానానికి 10 టన్నుల కూరగాయల వితరణ



మొగల్రాజపురం(విజయవాడతూర్పు): తిరుమలలో జరిగే నిత్యాన్నదానానికి కూరగాయలను పంపించడం తమ అదృష్టంగా భావిస్తున్నామని దాత మండవ నాగేశ్వరరావు చెప్పారు. తిరుమల పంపే కూరగాయల లారీకి పటమట ప్రధాన రహదారిలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ప్రముఖ వ్యాపారవేత్త కంకణాల రమేష్, మండవ వెంకటరత్నంలు లారీకి జెండా ఊపి తిరుమలకు పంపించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 2006వ సంవత్సరంలో విజయవాడ నుంచి తిరుమలకు కూరగాయలను పంపించడాన్ని సామాజికవేత్త మండవ కుటుంబరావు ప్రారంభించారన్నారు. ఈ ఏడాది మే 29న మండవ కుటుంబరావు ఆకస్మికంగా మరణించారని, ఆయన లేకపోయినా టీటీడీకి కూరగాయల పంపిణీని ఆగకూడదనే ఉద్దేశంతో ప్రతి నెలా కూరగాయల లారీని పంపుతున్నామని చెప్పారు. ప్రతి నెలా విజయవాడ నుంచే కూరగాయల లారీని దాతల సహకారంతో పంపుతామని చెప్పారు. మండవ కుటుంబసభ్యులు సస్య, అరవపల్లి ఆదిత్య, కె.శ్రీహరిరావు, ధనేకుల వెంకట సత్యనారాయణ, మండవ శ్రీనివాస్, బీఏ.నాగు పాల్గొన్నారు.

30న విజయవాడలో మహాధర్నా

కృష్ణలంక(విజయవాడతూర్పు): ఎస్సీ, ఎస్టీ ఉద్యోగులకు ప్రమోషన్లలో రిజర్వేషన్లను యథావిధిగా కొనసాగించాలని కోరుతూ ఈ నెల 30వ తేదీన ఛలో విజయవాడ, ధర్నా చౌక్‌లో మహాధర్నా నిర్వహిస్తున్నట్లు ఎస్సీ, ఎస్టీ ఉద్యోగ, ఉపాధ్యాయ, అధికారుల జేఏసీ గౌరవ కన్వీనర్ పట్టపు శీనయ్య బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రమోషన్లలో రిజర్వేషన్‌ను ఎత్తివేసే ప్రక్రియను ప్రభుత్వం చేపట్టడంతో ఉద్యోగులు పోరుబాట పట్టామన్నారు. ఎస్సీ, ఎస్టీ ఉద్యోగ, ఉపాధ్యాయ, అధికారులందరూ మహాధర్నాలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.



ఆచంద్ర తారార్కం ఈ మహిళల కీర్తి

'ఇస్రో'లో పనిచేసిన తొలి తరం మహిళా శాస్త్రవేత్తల మాటల్లో తరచు వినిపించే మాట... 'ఆరోజుల్లో ఇస్రోలో చా...లా తక్కువ మంది మహిళలు ఉండేవారు' చంద్రయాన్-3కి సంబంధించి నిన్నటి ప్రత్యక్ష ప్రసారాన్ని గమనిస్తే... ఆ ప్రాజెక్ట్‌లో భాగమైన ఎంతోమంది మహిళా శాస్త్రవేత్తలు ఉత్సాహంగా కనిపిస్తారు. మార్పు స్పష్టంగా కనిపిస్తుంది. అది సంఖ్యాబలమే కాదు సామర్థ్య బలం కూడా. 'ఇస్రో' సాధించిన ఎన్నో విజయాలలో మహిళా శాస్త్రవేత్తలు భాగం అయ్యారు. ముఖ్యంగా 'చంద్రయాన్-3' ప్రాజెక్ట్‌లో రీతూ కరిధాల్ నుంచి కల్పనా కాళహస్తి వరకు ఎంతోమంది మహిళా శాస్త్రవేత్తలు మేధోశ్రమ చేశారు. చారిత్రక విజయాన్ని సొంతం చేసుకున్నారు. 'ఇస్రో సైంటిస్ట్ కావాలనుకుంటున్నాను' అని కలలు కనే ఎంతోమంది అమ్మాయిలకు స్ఫూర్తినిచ్చే అసాధారణ విజయ గాథలు ఇవి.

రాకెట్ ఉమన్: రీతూ కరిధాల్



అన్ని దశలను పూర్తి చేసుకొని విక్రమ్ ల్యాండర్ చంద్రుడి దక్షిణ ధ్రువంపై అడుగు పెట్టిన క్షణం ఒక చారిత్రక సందర్భం. ఎంత కృషి చేస్తే ఒక విజయం సొంతం అవుతుందో చెప్పిన సందర్భం.

అమోఘమైన చారిత్రక విజయాన్ని దేశానికి అందించిన 'చంద్రయాన్-3'లో భాగమైన అనేకమంది మహిళలలో రీతు కరిధాల్ ఒకరు.

గత నెలలో...

మూడు దశలను పూర్తి చేసుకొని చంద్రయాన్-3 విజయవంతంగా నిర్దేశిత కక్ష్యలోకి దూసుకెళ్లిన తరువాత ఉత్తర్‌ప్రదేశ్‌లో లక్నోలోని ఒక ఇంట్లో ఆనందం అంబరాన్ని తాకింది. వారు ఆనందంతో బాణాసంచా కాల్చారు. మిఠాయిలను చుట్టుపక్కల వారికి పంచారు. ఇక నిన్నటి రోజు ఆ ఆనందం స్థాయి ఎల్లలు దాటి ఉండవచ్చు. ఇది కోట్లాదిమంది భారతీయుల ఇంట్లో కనిపించే సాధారణ దృశ్యమే కావచ్చు.

కాని ఆ ఇంటికి ఒక ప్రత్యేకత ఉంది.

ఆ ఇంట్లో పుట్టిన రీతూ కరిధాల్ ప్రసిద్ధ చంద్రయాన్-3 మిషన్ డైరెక్టర్.

మధ్యతరగతి కుటుంబంలో పుట్టిన రీతుకు ఆకాశం అంటే అంతులేని ఆసక్తి. అదేపనిగా నింగిలోకి చూసేది. ఏవేవో ఊహించుకునేది. అప్పటికి అవి శాస్త్రీయతకు నిలవని ఊహలు కావచ్చు. అయితే రీతూ కరిధాల్ శాస్త్రీయ రంగంలో దిగ్గజంగా వెలగడానికి ఉపకరించిన ఊహలు.

కట్ చేస్తే....

1997... భారత అంతరిక్ష పరిశోధన సంస్థ (ఇస్రో)లోకి అడుగు పెట్టింది రీతు. చంద్రుడిపై అడుగు పెట్టినంత ఆనందంగా అనిపించింది. 'ఇస్రో' గురించి వింటూ, చదువుతూ పెరిగిన రీతు అదే 'ఇస్రో'లో 'మిషన్ ఎనాలసిస్ డివిజన్'లో ఉద్యోగిగా చేరింది. అప్పట్లో 'ఇస్రో'లో తక్కువ మంది మహిళలు పనిచేసేవారు.

ఎక్కడికి వెళ్లినా ఒంటరిగానే వెళ్లేది. ఉదయం నుంచి రాత్రి వరకు పనిచేయాల్సి వచ్చేది.

అయినా సరే, ఎప్పుడూ భయపడేది కాదు.

అసలు సిసలు భయం మాత్రం తొలి టాస్క్ రూపంలో ఎదురైంది.

'నేను చేయగలనా?' అని మొదట ఆందోళన పడింది రీతు.

చేతులెత్తేయడం తేలిక. 'చేయగలను' అనుకోవడం కష్టం. అయితే కష్టపడే వారే విజేతలవుతారు. 'యస్ నేను చేయగలను' అంటూ తొలి టాస్క్‌ను విజయవంతంగా పూర్తి చేసి 'భేష్' అనిపించుకుంది.

'నాకు అప్పగించిన టాస్క్‌ను సీనియర్‌లు చేసే అవకాశం ఉన్నప్పటికీ నన్ను వెదుక్కుంటూ వచ్చింది. ఇది నన్ను పరీక్షించడానికి వచ్చిందా? అదృష్టవశాత్తు వచ్చిందా? అనేది తెలియదుగానీ నా విజయానికి కారణం... ఫిజిక్స్, మ్యాథమేటిక్స్ చదువుకున్నాననే ధైర్యం కంటే నాపై నాకు ఉన్న ఆత్మవిశ్వాసం' అంటూ గతాన్ని గుర్తు చేసుకుంటుంది రీతు.

ఆ ఆత్మవిశ్వాసం అప్పుడే కాదు ఇప్పటికీ రీతు వెన్నంటే ఉంది. ఆ ఆత్మవిశ్వాసమే ప్రతిష్ఠాత్మకమైన 'మంగళయాన్ మిషన్'లో డిప్యూటీ ఆపరేషన్స్ డైరెక్టర్‌గా, చంద్రయాన్-2 మిషన్ డైరెక్టర్‌గా పనిచేయడానికి ఇంధనంగా మారింది. చంద్రయాన్-3తో రీతూ కరిధాల్ ఒక చారిత్రక విజయంలో భాగం అయింది.

శాస్త్రవేత్తలు కావాలనుకునే కలలు కనే అమ్మాయిలకు రీతు కరిధాల్ స్ఫూర్తి ఇస్తుంది.

'నా విజయ మంత్రం ఇది' అని ఆమె ఎప్పుడూ ప్రత్యేకంగా చెప్పలేదుగానీ పరోక్షంగా వినిపించే మాట...టైమ్ మేనేజ్‌మెంట్.

కాలం విలువ తెలిసిన వారే 'టైమ్ మేనేజ్‌మెంట్'ను ఇష్టంగా ఆచరిస్తారు. ఆ ఆచరణే ఎన్నో విజయాలను బహుమానంగా ఇస్తుంది.

స్ఫూర్తిదాయక శక్తిమంతులు



● మహిళా శాస్త్రవేత్తలు, సిబ్బంది వేడుక

స్పేస్ మిషన్‌లలో భాగమైన మహిళా శాస్త్రవేత్తల గురించి మిన్నీ వేద్ 'దోజ్ మాగ్నిఫిసియెంట్ ఉమెన్ అండ్ దెయిర్ స్టోరీస్' అనే స్ఫూర్తిదాయకమైన పుస్తకాన్ని రాసింది. ఈ పుస్తకంలో 'రాకెట్ ఉమెన్'గా పేరు గాంచిన రీతూ కరిధాల్ సక్సెస్ స్టోరీ కూడా ఉంది. 'కుటుంబ జీవితం, వ్యక్తిగత జీవితాన్ని సమన్వయం చేసుకుంటూ ముందుకు వెళ్లాను. వృత్తిపరమైన విజయాలకు కుటుంబమే పెద్ద బలం' అంటుంది రీతు.

'ఇస్రో'లో రీతులాగే ఎంతోమంది మహిళా శాస్త్రవేత్తలు ఉన్నతస్థానాల్లో ఉన్నారు. అయితే ఇది రాత్రికి రాత్రి వచ్చిన విజయం కాదని వారి ప్రయాణాన్ని పరిశీలిస్తే అర్థమవుతుంది. 'ఇస్రో'లో పనిచేయాలని అనుకోవడానికి కారణం నుంచి... ఎదుర్కొన్న ఒత్తిళ్ల వరకు వారి మాటల్లో కనిపిస్తాయి.

ఇస్రో స్పేస్ సైన్స్ ప్రోగ్రామ్ డైరెక్టర్‌గా పని చేసిన సీతా సోమసుందరం ఇలా అంటోంది...

'నేను ఇస్రోలో చేరిన కాలంలో ఇంజనీరింగ్, సైన్స్‌లలో మహిళలు చాలా తక్కువ మంది ఉండేవాళ్లు. కొందరు సీనియర్‌లకు కొన్ని అభిప్రాయాలు ఉండేవి. అందులో ఒకటి... మహిళలు ఎక్కువగా కష్టపడలేరు. పరిమిత పని గంటల్లోనే పనిచేయగలరు. ఇంటికి ఎక్కువ ప్రాధాన్యత ఇస్తారు. అంకితభావం ఉండదు. అయితే ఇది తప్పుడు భావన అని ఇస్రోలో ఎంతోమంది మహిళా శాస్త్రవేత్తలు నిరూపించారు'. 'ఏదో ఉద్యోగం చేస్తున్నాను అనే భావన కాకుండా విజయంలో భాగం కావాలనే సంకల్ప బలం మహిళా శాస్త్రవేత్తలలో కనిపిస్తుంది. ఎన్నో విజయాలలో నిర్ణయాత్మకమైన పాత్ర పోషించారు. డెడ్ లైన్‌లను సవాలుగా తీసుకోవడం నుంచి మిషన్, నేవిగేషన్, కమ్యూనికేషన్, కంట్రోల్ సిస్టమ్, స్పేస్ క్రాఫ్ట్ డిజైన్, ట్రాకింగ్ లాంటి మేజర్ ఏరియాలలో కీలక పాత్ర పోషించి తమ సత్తా చాటారు' అంటుంది మంగళ్‌యాన్ ప్రాజెక్ట్ డైరెక్టర్‌గా పని చేసిన ఎస్.అరుణ. స్పేస్ సైంటిస్ట్‌లు అనగానే ఏవో గంభీరమై ఊహలు తారసపడతాయి. అయితే ఈ ఉమెన్ స్పేస్ సైంటిస్ట్‌ల మాటలు విన్న తరువాత 'అందరిలాగే సాధారణ జీవితం... కానీ అసాధారణ సంకల్ప బలం' అనే సత్యం ఆవిష్కారం అవుతుంది. 'ఇస్రోకు ఛైర్ ఉమన్ (ఛైర్ పర్సన్) ఎప్పుడూ?' అనే ప్రశ్న వస్తుంటుంది. 'ఇస్రో' విజయాలలో భాగం అవుతున్న మహిళల అంకితభావాన్ని చూస్తే ఆ ప్రశ్నకు సమాధానం చెప్పే రోజు ఎంతో దూరంలో లేదు' అనిపిస్తుంది. 'ఇస్రో'లో జెండర్-న్యూట్రల్ ప్రొఫెషనల్ ఎన్విరాన్‌మెంట్ ఉంటుందనే మంచి మాటలు కూడా దీనికి కారణం.

కొన్నిసార్లు లోతైన భావాలు పలకడానికి పదాలు, పుస్తకాలు తెల్లముఖం వేస్తాయి. కళ్లు మాత్రమే నిశ్శబ్దంగా చెబుతాయి. చంద్రయాన్-3 ల్యాండింగ్‌కు సంబంధించి నిన్నటి టీవీ ప్రత్యక్ష ప్రసారంలో మహిళా శాస్త్రవేత్తల కళ్లలో కనిపించిన ఉత్సాహాన్ని, అంకితభావాన్ని గమనిస్తే ఇంకా ఎన్నో విజయాలు వారి కోసం ఎదురు చూస్తున్నాయని అనిపిస్తుంది.

సంతోష క్షణాలు: కల్పనా కాళహస్తి



కల్పనా కాళహస్తిది ఆంధ్రప్రదేశ్‌లోని చిత్తూరు జిల్లా. చెన్నైలో బి.టెక్ (ఈసీఈ) చదివారు. తండ్రి మద్రాసు హైకోర్టులో ఉద్యోగి. తల్లి గృహిణి. ఇస్రోలో పనిచేయాలని తన చిన్ననాటి నుంచి కలలు కనేది. అనుకున్నట్టుగానే 2000 సంవత్సరంలో ఇస్రోలో చేరారు. తొలుత శ్రీహరికోటలో ఐదేళ్లు పనిచేశాక బెంగళూరులోని శాటిలైట్ సెంటర్‌కు ట్రాన్స్‌ఫర్ అయ్యారు. కరోనా పాండమిక్ సమయంలో అనేక అవాంతరాలు వచ్చినప్పటికీ వాటిని సమర్థంగా ఎదుర్కొంటూ 'చంద్రయాన్-3' మిషన్‌లో అసోసియేట్ ప్రాజెక్ట్ డైరెక్టర్‌గా ఉన్నారు. ఈమె గతంలో చంద్రయాన్-2, మంగళయాన్ ప్రాజెక్టుల్లోనూ కీలక బాధ్యతల్ని నెరవేర్చారు. ఆమె నైపుణ్యం, అంకితభావం, దూరదృష్టి వంటివి మిషన్ విజయవంతం కావడంతో గణనీయంగా తోడ్పడ్డాయి. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... ఇవి చాలా సంతోషభరితమైన క్షణాలుగా ఎప్పటికీ ఉండిపోతాయి. చంద్రయాన్ 2 కాలం నుంచి లభ్యమైన ఎన్నో అనుభవాలతో ఈ మిషన్‌ను లోప రహితంగా రూపొందించాం అని చెప్పారు.

వినిపించే గొంతుక: పి.మాధురి



శ్రీహరికోట రాకెట్ లాంచింగ్ స్టేషన్ నుంచి ప్రజలకు బయటికి కనపడే అక్కడి సిబ్బంది/ సైంటిస్టుల్లో పిల్లల మాధురి ఒకరు. ఈమె షార్‌లోని సతీష్ ధావన్ స్పేస్ సెంటర్‌లో డిప్యూటీ మేనేజర్‌గా పని చేస్తున్నారు. రాకెట్ లాంచింగ్ సమయంలో వినిపించే వ్యాఖ్యానాలు, ప్రజలకు వివరించే అంశాల గొంతుక ఆమెదే.

వీళ్లే కాకుండా చంద్రయాన్-3 మిషన్‌లో మొత్తం 54 మంది మహిళా సైంటిస్టులు / ఉద్యోగులు / సిబ్బంది ఉన్నారు. వీళ్లలో చాలా మంది మహిళలు ఎంతో కీలకమైన బాధ్యతలు నెరవేర్చే డిప్యూటీ డైరెక్టర్ స్థాయి నుంచి ప్రాజెక్ట్ డైరెక్టర్ స్థాయి నుంచి అనేక స్థాయుల్లో పనిచేస్తూ... కీలకమైన, భారత్‌కు గర్వకారణమైన ఈ ప్రాజెక్టును విజయవంతం చేశారు.

సౌమ్యంగా సాధించింది

సౌమ్య ఈ తరం టెకీ. సాంకేతికతను ఆరోగ్యానికి అద్దింది. ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్‌తో వైద్యరంగంలో కొత్త ఒరవడి తెచ్చింది.



వైద్యరంగం, ఔషధాల తయారీ రంగాలు సాంకేతికతను అందుకోవాల్సినంత వేగంగా అందుకోవడం లేదనుకుంది సౌమ్య. 'మల్టిప్‌లెయిర్ ఏఐ' పేరుతో హెల్త్‌కేర్ రంగంలో ప్రవేశించింది. ఇంత సునిశితమైన, సంక్లిష్టమైన పరిశ్రమను నిర్వహించడం మగవాళ్లకే సాధ్యం అనే అభిప్రాయాన్ని చెరిపేసిందామె. 'మగవాళ్ల ప్రపంచం అనే భావన మహిళలు ప్రవేశించేటంత వరకే. ఒకసారి మహిళలు ప్రవేశిస్తే ఇక అది అపోహ మాత్రమేనని నిర్ధారణకు వచ్చేస్తాం. మా టీమ్ లో సగానికి పైగా మహిళలే. సేల్స్ విభాగంలో కూడా మహిళలు సమర్థంగా పని చేస్తున్నార'ని చెప్పింది. ఒక టెకీ హెల్త్‌కేర్ ఇండస్ట్రీలోకి అడుగుపెట్టడానికి దారితీసిన పరిస్థితులను, హైదరాబాద్‌లో సంస్థ స్థాపించి సక్సెస్ అందుకున్న వైనాన్ని సాక్షితో పంచుకున్నారు సౌమ్య.



● సౌమ్య

భారీ మూల్యం చెల్లించాం

''నన్ను హెల్త్‌కేర్ ఇండస్ట్రీలోకి రప్పించిన కారణాలు అత్యంత బాధాకరమైనవి. మాది ఉత్తరప్రదేశ్, ప్రయాగరాజ్ (అలహాబాద్). నాన్న రవిప్రకాశ్ శ్రీవాస్తవ ఐఏఎస్ ఆఫీసర్. నాన్న డయాబెటిస్‌తో బాధపడుతుండేవారు. రొటీన్ టెస్టులు, మెడికేషన్ ఇవ్వడంలో ఎక్కడో పొరపాటు జరిగిపోయింది. మా జీవితాలు భారీ మూల్యం చెల్లించుకున్న పొరపాటు అది. వైద్యుల నిర్లక్ష్యం, రాంగ్ మెడికేషన్ కారణంగా ఆయన హటాత్తుగా ప్రాణాలు వదిలారు. నేనప్పుడు బీటెక్ సెకండియర్‌లో ఉన్నాను. ఆ తర్వాత కొద్దిసంవత్సరాల్లోనే అమ్మకు ఒవేరియన్ క్యాన్సర్ ఉన్నట్లు తెలిసింది. మేము తెలుసుకునేటప్పటికే వ్యాధి మూడవ దశకు చేరింది. చికిత్స మొదలు పెట్టినప్పటికీ ఆరు నెలలకే అమ్మను కూడా కోల్పోయాను. అలాంటి దయనీయమైన పరిస్థితుల్లోనే బిట్స్ పిలానీలో గ్రాడ్యుయేషన్ పూర్తి చేసి హైదరాబాద్‌లోని ట్రిపుల్ ఐటీలో బయోటెక్నాలజీలో మాస్టర్స్ చేశాను. సాంకేతికత వేగంగా అభివృద్ధి చెందుతోంది. కానీ వైద్యరంగం ఆ వేగాన్ని అందిపుచ్చుకోవడంలో వెనకబడుతోంది. ఆ వెనుకబాటు తెచ్చిన నష్టంలో మా అమ్మానాన్నల మరణాలు కూడా భాగమేననిపించింది. ఈ రెండు రంగాల మధ్య ఉన్న అంతరాన్ని భర్తీ చేయాలనే సంకల్పం కలిగింది, చేయగలననే నమ్మకం కూడా. సమాచారలోపం తలెత్తని విధంగా మెడికల్ డాటాను పరిరక్షించగలిగే పరిజ్ఞానాన్ని అభివృద్ధి చేయడానికి పూనుకున్నాను. మల్టిప్‌లెయిర్ ఏఐ స్థాపించి ఆర్టిఫీషియల్ ఇంటలిజెన్స్ ఆధారంగా డాటా అనలైజేషన్, డాటా మెయింటెయిన్ చేస్తున్నాం. మా సంస్థకు 'ఐఎస్ఓ 27001' సర్టిఫికెట్ వచ్చింది. మా సర్వీస్‌ను దేశవిదేశాల్లో పెద్ద ఆరోగ్య సంస్థలు తీసుకుంటున్నాయి. పేషెంట్ కేర్‌లో మొదటిది పేషెంట్ ఆరోగ్య చరిత్ర, క్రమం తప్పని పరీక్షల ద్వారా వ్యాధులను తొలిదశలోనే గుర్తించడం, పరీక్షల నివేదికల నిర్వహణ ప్రధానమైనవి. ఇక్కడ పొరపాటు జరిగితే ప్రాణాలు దక్కవని చెప్పడానికి మా పేరెంట్సే ఉదాహరణ.

ఫాలో అప్ సర్వీస్

వ్యాధి నిర్ధారణ ఆధారంగా వైద్యం అందించిన తర్వాత తదనంతర పరీక్షలను, వైద్యాన్ని అందించాల్సిన సమయానికి ఫాలో అప్ చేయడం కూడా మా సర్వీస్‌లో భాగంగా ఉంది. అలాగే భవిష్యత్తులో టెలిమెడిసిన్ విస్తరించాల్సిన అవసరం ఉంది. వైద్యచికిత్సను కుగ్రామాలకు చేరడానికి చక్కటి మాధ్యమం ఇది. పేషెంట్‌ను ఉన్న చోటనే ఉంచి ఆరోగ్యపరిస్థితిని మానిటర్ చేయడం సాధ్యమవుతుంది. నేను చదివిన టెక్, బయోటెక్ పరిజ్ఞానం ఇందుకు దోహదం చేసింది. నాకు సవాళ్లు ఎదురయ్యాయా అంటే సవాళ్లు లేని ప్రొఫెషన్ అంటూ ఏదైనా ఉంటుందా? డిజిటల్ బ్రాండింగ్, మార్కెటింగ్‌లో అవరోధాలు వచ్చాయి. మా క్లయింట్ల సందేహాలను తీరుస్తూ, వాళ్లు సమాధానపడే వరకు సహనంగా వివరించాం. సవాళ్లకు సమాధానాలు వెతుక్కుంటూ ముందుకు పోవడమే సక్సెస్‌కు దారి తీస్తుంది. వైద్యుల నిర్లక్ష్యం కారణంగా మా నాన్నను కోల్పోవడమే నన్ను ఈ రంగం వైపు నడిపించింది. ప్రతి విజయంలో మా అమ్మా నాన్న కనిపిస్తున్నారు'' అని వివరించారు సౌమ్య.

– **వాకా మంజులారెడ్డి**, సాక్షి ఫీచర్స్ ప్రతినిధి

అందంగా పెంచుకుందాం!

బ్యూటిప్స్



గోళ్లు ..పొడవుగా అందంగా ఉండే ఉండాలని ప్రతి అమ్మాయి కోరుకుంటుంది. కానీ కొందరిలో కొద్దిగా పెరగగానే విరిగిపోతుంటాయి. కొంతమందికి అసలు పెరగవు. దీంతో నెయిల్ పెయింట్ వేసుకోవాలంటే ఇబ్బంది. గోళ్లను చక్కగా పెంచే ఈ ఐదు చిట్కాలు పాటించి చూడండి మీ కోరిక తీరుతుంది..



- గోళ్ల పెరుగుదలను ప్రోత్సహించడంలో ఆలివ్ ఆయిల్ ముందుంటుంది. దీనిలోని విటమిన్ ఇ గోళ్లకు పోషణ అందించి చక్కగా పెరిగేలా చేస్తుంది. రాత్రి పడుకోబోయే ముందు కొద్దిగా ఆలివ్ ఆయిల్‌ను గోళ్లమీద రాసి మర్దన చేయాలి. రోజూ ఇలా చేయడం వల్ల గోళ్లకు రక్తప్రసరణ చక్కగా జరిగి గోళ్లలో పెరుగుదల కనిపిస్తుంది.
- టీస్పూను యాపిల్ సైడర్ వెనిగర్‌లో టీస్పూను వెల్లుల్లి తరుగు వేసి చక్కగా కలపాలి. ఈ మిశ్రమాన్ని గోళ్లపై రాసి పదినిమిషాల తరువాత కడిగేయాలి. క్రమం తప్పకుండా ఇలా చేస్తే గోళ్లు విరగకుండా చక్కగా పెరుగుతాయి.
- వెల్లుల్లి రెబ్బను రెండు ముక్కలు చేసి గోళ్లపై పదినిమిషాలపాటు రుద్దాలి. కొద్దిరోజుల్లోనే గోళ్ల పెరుగుదల కనిపిస్తుంది.
- ఆరెంజ్ జ్యూస్‌ను గోళ్లకు పూతలా అప్లైచేసి పదినిమిషాలు ఆరనివ్వాలి. తరువాత గోరువెచ్చని నీటితో కడిగేయాలి. ఇది గోళ్లను అందంగా పెరిగేలా చేస్తుంది.
- ఇవన్నీ చేయలేకపోతే కొబ్బరినూనెను గోళ్లపై రాసి రోజూ మర్దన చేయాలి. కొబ్బరినూనెలోని ఫ్యాటీ ఆమ్లాలు, ఇతర పోషకాలు గోళ్ల పెరుగుదలకు దోహదపడతాయి.

ఇంటిప్స్



- ఒక్కో నిమ్మకాయను అల్యూమినియం ఫాయిల్‌లో చుట్టి రిఫ్రిజిరేటర్‌లో పెడితే ఎక్కువ రోజులపాటు తాజాగా ఉంటాయి.



- శాండ్ విచ్ మరీ మెత్తగా కాకుండా చక్కగా రావాలంటే... శాండ్ విచ్‌లో పెట్టే కూరగాయలు, బ్రెడ్ మయనేజ్, చీజ్ గది ఉష్ణోగ్రతలో ఉండేలా చూసుకోవాలి. ఇంతకు మించి వేడిగా ఉండే తేమ చేరి శాండ్ విచ్ మెత్తగా మారిపోతుంది.



- కొన్నిసార్లు పన్నీర్ ముక్కలు ఫ్రై చేసిన తరువాత గట్టిగా మారుతుంటాయి. ఇలాంటప్పుడు పన్నీర్ ముక్కలు ఫ్రై చేసిన తరువాత చల్లని నీటిలో ఐదు నుంచి పదినిమిషాలు ఉంచాలి. తరువాత కూరలో వేస్తే పన్నీర్ ముక్క మృదువుగా, మెత్తగా ఉంటుంది.

అబద్ధాలను నమ్ముతున్నారా?!



నిజం నిలబడి ఉండగానే అబద్ధం ఊరంతా చుట్టి వస్తుందంటారు.. ఈ సామెత సోషల్ మీడియాలో కుప్పలు తెప్పలుగా పుట్టుకువచ్చే ఫేక్‌న్యూస్ విషయంలో సరిగ్గా సరిపోలుతుంది. ఈ ఫేక్ న్యూస్ వల్ల నిజమేదో తెలుసుకోవడం కష్టంగా మారింది. అబద్ధాన్ని నిజం అనుకునే ప్రమాదమూ ఉంటోంది. అలాగే.. ఫొటోలు, వీడియోలు కూడా ఫేక్‌వి పుట్టుకొస్తున్నాయి. లైవ్ వీడియోలోనూ ఇటీవల ఏఐ టెక్నాలజీ ద్వారా అబద్ధం కొత్తగా సోషల్‌మీడియాను ఏలుతోంది. నిజమేంటో తెలుసుకోవడానికి మనం చాలా ప్రయత్నాలు చేయాల్సి ఉంటోంది. ఎందుకంటే, అబద్ధాల వల్ల కలిగే మోసాలు ఎన్నో. వాటి బారిన పడకుండా జాగ్రత్త పడాలంటే ముందుగా నిజాలేమిటో తెలుసుకుందాం...

వార్తలకు సంబంధించిన సమాచారం, డేటా, నివేదికలు పూర్తిగా నిజమైనవి కానివి ప్రజల ముందుకు వస్తున్నాయి. అందుకని, మూలాధారాలు లేకుండా వచ్చిన సమాచారం అవాస్తవం అని గ్రహించాలి. అబద్ధపు వార్తలు విస్తృతంగా షేర్ అవుతుంటాయి. వీటికి ఎలాంటి సెన్సార్‌షిప్ ఉండదు.

నకిలీ వార్తల పుట్టుకకు..

తమకు తెలిసిన విషయాన్ని నలుగురికి తెలియజేయాలనే ఆత్రుత. స్వీయ లాభం, రాజకీయ ప్రభావం వల్ల ఇలాంటివి జరుగుతుంటాయి. కేవలం తమకు తెలిసినవి మరికొందరికి తెలియజేద్దామని నిజానిజాలు తెలుసుకోకుండా కొందరు అదేపనిగా షేర్ చేస్తుంటారు. సమాచారం అబద్ధమే కావచ్చు కానీ, దానిని షేర్ చేసే వ్యక్తి అది నిజమని నమ్ముతారు. తప్పుడు సమాచారం అని తెలిసీ ఉద్దేశపూర్వకంగానే షేర్ చేస్తారు. ఏదైనా సమస్యకు లేదా వ్యక్తికి సంబంధించిన కంటెంట్ అబద్ధమైతే మనల్ని ఆ వార్త తప్పుదారి పట్టించవచ్చు. ముఖ్యాంశాలు, విజువల్స్, క్యాప్షన్‌లు కంటెంట్‌కు సరిపోని విధంగా ఉంటాయి. మోసగించడానికి ఫొటోలు, కంటెంట్‌ను తారుమారు చేస్తుంటారు.

తనిఖీ చేసే విధానం..

- వీడియో మూలం ఎక్కడ ఉందో చెక్ చేయాలి. అది విశ్వసనీయమైనదే అని నిర్ధారించుకోవడానికి ప్రయత్నించాలి.
- సమాచారం నిజమైనదైనా ప్రత్యామ్నాయంగా ఇతర మూలాధారాల కోసం వెతకాలి.
- వీడియోలో అసహజమైన కదలికలు ఉన్నాయేమో గమనించాలి.
- డీప్ ఫేక్స్ గుర్తించడానికి 'డీప్ ఫేక్ డిటెక్షన్ మోడల్' వంటి స్పెషల్ సాఫ్ట్‌వేర్ అందుబాటులో ఉంది.
- వీడియోలోని సంఘటనలు నమ్మదగినవేనా? ఆ వీడియో ఏ సందర్భాన్ని బట్టి తీశారో ఆ పరిస్థితులను పరిగణనలోకి తీసుకోవాలి.
- వీడియోలో ఉన్న వ్యక్తిని మెయిల్, ఫోన్ ద్వారా సంప్రదించి, ప్రామాణికతను ధృవీకరించుకోవడానికి ప్రయత్నించవచ్చు.

వాస్తవం తెలుసుకోవాలంటే..

- గూగుల్ రివర్స్ ఇమేజ్ చెక్ చేయాలి. లేదా ఫొటో వెరిఫికేషన్ కోసం www.tineye.comని ఉపయోగించాలి.
- ఫొటో లేదా వీడియో (https://www.invid-project.eu/tools-and-services/invid-verification-plugin/) కోసం ఇన్‌విడ్ టూల్‌కిట్ ఎక్స్‌టెన్షన్‌ని ఇన్‌స్టాల్ చేయాలి.
- ఫార్వర్డ్ చేసే ముందు ఏదైనా ఒక అంతర్జాతీయ ఫాక్ట్-చెకింగ్ నెట్‌వర్క్ ఆర్గనైజేషన్‌తో www.factly.in వాస్తవాన్ని చెక్ చేయాలి.

ఇలా గుర్తించాలి...

డీప్ ఫేక్ వీడియో లేదా ఆడియోలో ఏవైనా లోపాలు ఉన్నాయేమో జాగ్రత్తగా పరిశీలించడం, వినడం చేయాలి.

● డీప్ ఫేక్ వీడియో లేదా ఫొటోలలో లైటింగ్ నీడలను చెక్ చేయాలి. కొన్నింటిలో నీడలు కచ్చితంగా కనిపించకపోవచ్చు. ఇవే కాకుండా ఇంకేమైనా లోపాలు ఉన్నాయేమో చెక్ చేయాలి. ● వీడియోలలోని బ్యాక్‌గ్రౌండ్ చెక్ చేయాలి. సబ్జెక్ట్‌కు వీడియోలోని వ్యక్తుల కదలికల సరిపోలకపోవచ్చు. అంటే, ఏఐ టెక్నాలజీ ద్వారా నకిలీ వ్యక్తుల సృష్టి అయి ఉండవచ్చు. ● వీడియోలో వ్యక్తి కనురెప్పలు ఆర్పుతున్నారో లేదో పరిశీలించాలి. ● లైవ్ వీడియోలో మాట్లాడుతున్నప్పుడు ముఖాన్ని ఎడమ లేదా కుడికి కదిలించమని సదరు వ్యక్తిని ఉద్దేశించి అడగాలి.



ఇన్‌పుట్స్:
అనీల్ రాచమల్ల,
డిజిటల్ వెల్‌బీయింగ్ ఎక్స్‌పర్ట్, ఎండ్ నౌ ఫౌండేషన్